ఆంధ్రసచిత్రవారపత్రిక

23-29, ఆగస్టు, '85
రూ. 2-50




కాంగ్రెసు వారికి గుర్తువస్తున్న నాయకుడు

కాశీ హిందూ విశ్వవిద్యాలయం

బిడ్డ ఆరోగ్య రక్షణలో తల్లి పాత్ర



సన్‌రైజ్ ఫ్లాస్క్ సదుపాయం!
ఉచితం!
ఈ ప్రత్యేకమైన సన్‌రైజ్ ఫ్లాస్క్ 6 ఖాళీ సన్‌రైజ్ 200 గ్రా. రీఫిల్ ప్యాక్‌లకు బదులుగా లభిస్తుంది.
ఇప్పుడు! మీకు ఎంతో ప్రీతికరమైన సన్‌రైజ్‌ని, యీ ఆకర్షణీయమైన ఫ్లాస్కులో మీతో బాటు ఎక్కడికి కావలిస్తే అక్కడికి తీసుకువెళ్ళండి. మీరు చేయవలసిందల్లా, 6 ఖాళీ సన్‌రైజ్ 200 గ్రా* రీఫిల్ ప్యాక్‌లను సేకరించి, వాటిని మీ డీలర్‌కి అందజేయడం. వారం లోపున మీ సొంత సన్‌రైజ్ ఫ్లాస్క్ ఆయన దుకాణంలో మీ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. మళ్ళీసారి అక్కడకు వెళ్ళినప్పుడు దానిని తెచ్చుకోండి. చాలా తేలిక, అవును కదా? అందుచేత ఈ రోజే మీ సేకరణ ప్రారంభించండి.
వెనక వైపున ★ బొమ్మగల ప్యాక్‌ల పైనే ఈ సదుపాయం
త్వరపడండి! ఫ్లాస్క్ స్టాకులు ఉన్నంత వరకే యీ సదుపాయం లభిస్తుంది.
Nestlé sunrise
Nestlé sunrise
instant a coffee chicory blend
Refill Pack
Nestlé
సన్‌రైజ్
ఇన్‌స్టెంట్ కాఫీ-చికోరి బ్లెండ్
అమ్మ యిచ్చే ఆ మొదటి కప్పు కాఫీ తాజాదనం, సువాసనలతో.
FSL-8682 Tel


గోగినేని ప్రసాద్ సమర్పించు
సాయికిరణ్ మూవీస్
మణివణ్ణన్
సూరపనేని భావన్నారాయణ
ఇళయరాజా కె.సభాపతి
VAMSEE KRISHNA PUBS

ముఖచిత్రం

నా అభిమాన తార, అందాల నటి జయప్రద ముఖ చిత్రంతో వెలువడిన 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక' చాలా అందముగా ఉన్నది.

ఎస్. భారతి, విజయవాడ

సీరియల్స్

నేను "ఆంధ్ర సచిత్ర వార పత్రిక"లో మీరు ప్రచురించే "సీరియల్స్" చదువుతూ ఉన్నాను. "మౌనవిపంచి" చాలా బాగుండినది. "రాగసంధ్య" సమాప్తము ఇంకా కొంచెం బాగుండివుంటే బాగుండేది. "పడమట సంధ్యారాగం" చాలా బాగుండినది. ముగింపు చాలా బాగా వుంది.

సర్వేపల్లి సుశీలారావు, న్యూఢిల్లీ

కథలు

అనూరాధ ముఖ చిత్రంతో వెలువడిన 12-18 జూలై 85 సంచికలో మిర్రర్‌గారి 'వ్యర్థజీవి' కథ చదివాను. కాంతారావువంటి నిస్వార్థపరులను బ్రతికుండగా వినియోగించుకోలేకపోతోంది నేటి మన సమాజం. చనిపోయిన తరువాత మాత్రమే పైసలుగా మార్చుకొని తాత్కాలికంగా తృప్తిపడుతున్న మన వ్యవస్థ అజ్ఞానానికి జాలి కలుగుతోంది. యం. ఉమా మహేశ్వరరావుగారి 'వేరు పురుగులు' కథ బాగుంది. అన్నపూర్ణలాంటి వ్యవస్థను తమ విషపు కోరలతో సమూలంగా పెళ్ళగించటానికి ప్రయత్నించే చీడ పురుగులు సమాజంలో ఉన్నంతకాలం ప్రభాకరంవంటి నిజాయితీపరుడు తన విధిని సమర్థవంతంగా నిర్వహించలేడు.

పాట్నూడి చక్రరావు, విశాఖపట్నం

★ ★ ★

5-11 జూలై 85 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో చందక రాజా రామ మోహనరావుగారు రచించిన 'నీతి నీ చిరునామా ఎక్కడ?' అనే కథ చాలా బాగుంది.

మొండి రామసత్యం, తాళ్ళపూడి



★ ★ ★

రాధ ముఖ చిత్రంతో వెలువడిన మీ మా పత్రిక చాలా అందముగా వున్నది. సీరియల్స్ ఎంతో వుత్తేజపరచుచున్నవి. కథలు కూడా చాలా బాగుంటున్నవి. 'తిరిగి వచ్చిన వసంతం', 'ఇది జీవితం' అను కథలు నిజంగా జీవితములో జరిగే కథలు.

యస్. నాగలక్ష్మిరావు, తెనాలి

అన్నమయ్య

శ్రీ వేంకట రమణుని పద కవితలతో అభిషేకించిన అన్నమయ్య గారిని గూర్చి ఫోటోలతో సహా చక్కని వ్యాసాన్ని రచించిన శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం గారికి అభినందనలు

ఆకెళ్ళ సుబ్బారావు, కందికుప్ప

★ ★ ★

శ్రీ వేంకటరమణుని పదకవితా ముత్యాలతో అలరించిన ధన్యులు శ్రీ అన్నమయ్య. కొండలలో నెలకొన్న ఆ కోనేటి రాయుని ఎన్నో విధాలైన రాగాలతో భక్తి, శృంగార, తత్వ నీతులతో స్తుతించారు. సాళువ నరసింహరాయలు కారాగారంలో బంధించినపుడు ముఖారి రాగంలో "సంకెలలిడు వేళ, చంపెడు వేళ" అని కీర్తన హృదయ విదారకంగా పాడారు కారణజన్ములు గనుకే పద్నాలుగవ శతాబ్దములో రచించిన కీర్తనలను ఈనాటికి గాయకులు పాడుతున్నారు. శ్రోతలు ఆదరిస్తున్నారు పాయసం సుబ్రహ్మణ్యం గారికి ధన్యవాదాలు.

కె.నాగేశ్వరి, పటమట (విజయవాడ) □

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు - (1938-1972)

శుక్రవారం : 23-29 ఆగస్టు, 1985

శ్రీ క్రోధన నామ సం. ని. శ్రావణ. శు. అష్టమి

సంపుటము 77 : సంచిక 51

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు.	2-50
పోస్టులో 6 నెలల చందా	రు.	71-50
పోస్టులో 12 నెలల చందా	రు.	143-00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధినగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి మహాలక్ష్మి
(ఫోటో : జి. కె. నరసింహం)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

నలభై సంవత్సరాల కిందట ఆగస్టు 6, 1945 లో హిరోషిమా మీద అణుబాంబు పడటంతో మన పరమాణుయుగం ప్రారంభం అయింది. అప్పటికి మనలో చాలామంది చిన్నవయసులో ఉండి ఉంటాము. ఆ బాంబు పేలుడు ప్రపంచాన్ని ఊహించలేనంతగా మార్చి వేసింది. మమ్మల్ని, మాకు తెలిసిన విజ్ఞాన శాస్త్రవేత్తలని, అంతవరకూ ఆ రంగంలో కృషి చేస్తున్న భౌతిక శాస్త్రవేత్తలని కూడా మార్చి వేసింది. మంచి కోసం వాళ్ళంతా బాంబుల అభివృద్ధి కృషిని వదలి పెట్టి వాటికి సంబంధించిన ప్రయోగాలని భవిష్యత్తులో చేపట్టడానికి విముఖులని చేసింది ఆ బాంబు ప్రయోగం జపాన్ లాంటి దేశాలని కూడా మార్చింది. తెల్లవారి చేతుల్లో ఘోర పరాజయం చవి చూసిన ఆ దేశం 40 సంవత్సరాలైనా కాకుండానే తిరిగి ఇప్పుడు అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకటిగా రూపుదిద్దుకున్నది అంతేకాక ఆ బాంబు భారతదేశాన్ని కూడా మార్చింది. ప్రాచ్యదేశాలలో సామ్రాజ్యాన్ని విస్తరించాలనే కాంక్షని వదులుకుని

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

బ్రిటిష్ వారు వీలైనంత త్వరగా తిరిగి వెళ్ళి పోయేలా చేసింది. ఆ బాంబే కనక లేకపోతే బ్రిటిష్ వాళ్ళని బయటికి నెట్టడానికి మనకి మరొకతరం పట్టి ఉండేది.

హిరోషిమాపై బాంబు పడ్డప్పుడు నేను ఎక్కడ ఉన్నదీ, ఎప్పుడు ఆ వార్త చదివింది నాకు గుర్తు లేదు. అప్పటికి మాకు అసలు అణుబాంబు అంటే ఏమిటో, మిగతా బాంబులకి దానికి తేడా ఏమిటో తెలియదు. కొన్ని నెలల తర్వాత నేను ఇంగ్లాండు వెళ్ళాను. ఆ తర్వాత గానీ నాకు ఆ సంఘటన తాలూకు విపరీత ప్రభావం అర్థం కాలేదు హిరోషిమాపై జాన్‌హెర్సే పుస్తకాన్ని పెంగ్విన్ ప్రచురించింది. ఆ పుస్తకం బాంబు పడిన ఒక సంవత్సరం తర్వాత వెలువడింది దానిని ఒక షిల్లింగ్, అప్పుడు మన లెక్కలో 10 అణాలు, పెట్టి నేను కొన్నట్టు గుర్తు. ఆ పుస్తకాన్ని ఏకబిగిన ఒక గంటలో చదివేశాను అప్పుడే నేను హిరోషిమాని తప్పకుండా చూడాలని [illegible]యించుకున్నాను. అక్కడికి వెళ్ళే ముందు ఆ బాంబుతో సంబంధం ఉన్న కేంబ్రిడ్జ్‌లోని షాడ్విక్ ప్రయోగశాల నించి చికాగోలో డా. ఎన్రికో ఫెర్మి ఆడిన టెన్నిస్ కోర్టు దాకా ప్రతి ప్రదేశాన్ని సందర్శించాలనుకున్నాను.

నేను 1968 లో హిరోషిమా వెళ్ళాను. కొద్ది రోజులు అంతకుముందు ఒసాకాలో ఉన్నాను అక్కడి నించి చిన్నరైలు ఒకటి కొన్ని గంటల కొకసారి హిరోషిమా మీదుగా ఇంకా పైకి ఎక్కడికో వెళ్ళి వస్తుందని తెలిసింది. హిరోషిమా వెళ్ళి అక్కడ బాంబు దాడి నించి ప్రాణాలతో బయటపడిన వ్యక్తులని, అధికారులని కలుసుకోవాలనే ఆసక్తి ఉంటే ఒక గైడ్‌ని వెంటబెట్టుకుని వెళ్ళడం మంచిదని ఒక మిత్రుడు నాకు సలహా యిచ్చాడు. కాని అలా కాకుండా ఒంటరిగానే వెళ్ళి ఆ ఊళ్ళో కొంత కాలం గడిపి, నాకు చేతనైనట్టుగా అక్కడి వారితో మాట్లాడాలనుకుంటున్నట్టు అతనికి చెప్పాను.

హిరోషిమా ఒక చిన్న పట్టణం. పూనా, బరోడాల కంటే చిన్నది కానీ మైసూర్, చండీఘర్‌ల లాగా అందమైన ఊరు అక్కడ తోటలు, పార్కులు, అంతా చిన్నపిల్లలు కనిపించారు. హిరోషిమాలో నేను చూసినంత మంది పిల్లలు మరెక్కడా, చివరికి బొంబాయిలో కూడా నాకు కనిపించలేదు. నేను అక్కడికి వెళ్ళిన రోజు సాయంత్రం ఒక టాక్సీ తీసుకుని ఇప్పుడు శాంతి పార్కుగా పిలువబడుతున్న పార్కుకి వెళ్ళాను. ఆ బాంబు పడ్డది అక్కడే జాగ్రత్త చేయబడిన శిధిలాల మధ్య రాత్రింబవళ్ళు ఎప్పుడూ ఒక జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. ఆ శిధిలాలలో చాలా భాగం పార్కుగా రూపొందించబడినవి వాటిలో పెద్ద పెద్ద పూలు పూస్తూ ఉంటాయి బాంబు తాకిడికి గురైన చర్చిని ఏమాత్రం మార్చకుండా, మరమ్మత్తులు చెయ్యకుండా అలాగే ఉంచారు ఆ చర్చి పైభాగం అప్పుడే ఒక పిడుగు తాకిడికి గురైనట్టు కనిపించింది ఆ చర్చికి మరీ అంత దగ్గరగా వెళ్ళవచ్చని, రేడియేషన్ ప్రభావం ఇంకా ఉండి ఉంటుందని కొందరు నాతో అన్నారు కానీ దాని చుట్టూ పిల్లలు ఆడుకుంటూ ఉండటం, వాళ్ళ ఉపాధ్యాయిని బాంబు గురించి, అది పడిన తీరుని గురించి వాళ్ళకి వివరిస్తూ ఉండటం చూసిన నాకు అలా అనిపించలేదు.

ఆ పార్కుకి కొద్ది దూరంలో ఉన్న ఒక నర్సింగ్‌హోమ్‌లో కొన్ని ఏళ్ళుగా, కొందరు 1945 నించీ ఉన్న రోగులని చూశాను అందులో చాలా భాగం బాంబు పడిన తర్వాత వారి ఇళ్ళలో నించి, వీధులలో నించి కొన ఊపిరితో ఉండగా తీసుకురాబడిన వారు. వారిలో నయం కావడం అన్నది లేనివారు ఉన్నారు వృద్ధాప్యం వల్ల వచ్చిన అస్వస్థతలతో తీసుకుంటున్న వారు ఉన్నారు. కొంతమంది చాలా చిన్నవయసులో ఉన్నవారు ఉన్నారు. ఆ భయంకరమైన ప్రేలుడు జరిగినప్పుడు వాళ్ళు తప్పటడుగులు వేసే వయసులో ఉండి ఉంటారు. జపాన్, అమెరికాలకి చెందిన డాక్టర్లు వాళ్ళకి చికిత్స చేస్తున్నారు. కాని అమెరికన్ డాక్టర్లకి మాత్రం చికిత్స కన్నా పరిశోధన మీదే ఎక్కువ ఆసక్తి ఉన్నట్టు కనిపించింది ఆ బాంబు అమెరికాది దానికి బలైపోయిన వారు జపాన్ వారు కానీ వాళ్ళ ఇద్దరి మధ్యా సంబంధాలు మామూలుగానే ఉన్నట్టు నాకనిపించింది కొద్ది మంది అమెరికన్‌లు జపాన్ అమ్మాయిలని పెళ్ళి చేసుకున్నారు నేను ఉన్న హోటల్ మేనేజర్ తన తల్లిదండ్రులో, సోదరులో నాకు సరిగా గుర్తు లేదు కానీ ఆ బాంబు ప్రేలుడులో చనిపోయారని చెప్పాడు. కాని ఆయన గతాన్ని పూర్తిగా విస్మరించాడు. అతని దృష్టిలో హిరోషిమా ఒక పీడకల మాత్రమే అలానే ఆ దేశంలో చాలామంది. చివరికి ప్రధానమంత్రులుగా ఉన్న వారు కూడా యుద్ధాన్ని తేలికగానే తీసుకున్నారు వారి స్వీయచరిత్రలలో కూడా అలాగే రాసుకున్నారు.

ఏది ఏమైనా జపాన్ వారు లోతైన మనుషులు వాళ్ళు చెప్పిన దానిని బట్టి మనం వాళ్ళని అర్థం చేసుకోలేము. తిరిగి పదేళ్ళ తర్వాత నేను మళ్ళీ టోక్యో వెళ్ళాను. అప్పటికి జపాన్ వారు హిరోషిమా గురించి మాట్లాడటం మొదలు పెట్టారు అంతకుముందెప్పుడూ వారలా మాట్లాడలేదు అసలు ఆ బాంబు తమని ఉద్దేశించినది కాదని, రష్యన్‌ల కోసమేనని. వాళ్ళని బెదిరించేందుకే దాన్ని పేల్చారని ఒక ప్రొఫెసర్ నాతో అన్నారు మేము తక్కువ జాతికి చెందిన వాళ్ళం కావడం వల్ల ఏమైపోయినా ఫర్వాలేదనే భావంతో ఆ బాంబు

ప్రపంచాన్ని మార్చివేసిన బాంబు!

వెయ్యడం జరిగిందని ఆయన అన్నారు. వాళ్ళకే గనక బాంబు ఉంటే దాన్ని హిట్లర్ జర్మనీ మీద వేసేవాళ్ళని ఆయన అన్నారు మరి వాళ్ళలా ఎందుకు చెయ్యలేదు? మొదటిది ఆ బాంబు తయారీలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు అందరూ యూరోపియన్‌లు వారిలో చాలా మంది జర్మనీకి చెందిన యూదులు వాళ్ళెంత వలస వెళ్ళినా ఒకప్పటి తమ మాతృదేశం అయిన జర్మనీ మీద అభిమానం ఉండకపోదు. కొద్దిమంది రష్యాకి చెందిన యూదులు కూడా వారిలో ఉన్నారు. వాళ్ళు స్టాలిన్ రష్యాపై బాంబు పేల్చడానికి అంగీకరించరు జపాన్ అనువుగా దొరికింది. కానీ ఆ బాంబుని వియత్నాం మీద వాళ్ళు వెయ్యకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. 1945 లో జపాన్ లాగే వియత్నాం కూడా బాంబు ప్రయోగానికి అనుకూలంగానే ఉంది. కానీ వియత్నాం విషయంలో వాళ్ళెందుకో వెనక్కి తగ్గారు' అన్నారు ఆ ప్రొఫెసర్.

బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో నిక్సన్ ఆ బాంబుని ఉపయోగించాలనుకున్నట్టు ఈ మధ్యే మనం చదివాము. అలాగే కొరియా, వియత్నాంలపై కూడా వాడాలనుకున్నట్టు విన్నాము. ఇవన్నీ ఆసియాకి చెందిన ప్రాంతాలే. ప్రపంచంలో మిగతా చోట్ల కన్నా యూరోప్, అమెరికాలలో ఎక్కువ అణుబాంబులు ఉన్నాయి. మళ్ళీ రెండవ హిరోషిమా ఏదైనా ఉంటే అది ఆసియాలో నే అవుతుంది. □

కాంగ్రెసువారికి గుర్తువస్తున్న నాయకుడు

ఈ మధ్యనే ఢిల్లీలో కీ. శే. కామరాజనాడారు విగ్రహం ఒకటి వెలిసింది ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ విగ్రహం ఆవిష్కరణలో పాలుగొన్నారు. ఆయనే మదరాసు వెళ్ళి అక్కడ 'కాంగ్రెసు శత జయంతి' ఉత్సవాలలో కూడా పాలుగొన్నారు

ఇది ఒక పెద్ద వింత

కాంగ్రెసు అనేది ఇంగ్లీషు మాట కాంగ్రెసుని ఇంగ్లీషువారే మదరాసులో నెలకొల్పారు. (ఒక విప్లవాత్మకమయిన రాజకీయ పక్షాన్ని స్థాపించాలని వారు అనుకుని ఉండరు').

గాంధీగారు వచ్చేదాకా కాంగ్రెసు చాలావరకు దొర టోపీలూ, దొర కోట్లూ ధరించేవారి పార్టీ." అన్నారు పండిత నెహ్రూ. గాంధీగారు జాతియోద్యమంలోకి దిగటంతో అంతా మారిపోయింది

కామరాజనాడారు ఈ మార్పుకి ఒక చిహ్నం ఆయన ఒక అభిజాత్యపు రాజకీయవాది కాదు - సమాజంలో "కింది వర్గానికి చెందిన వ్యక్తి. పండిత నెహ్రూయే ఒకసారి అన్నట్టు కామరాజనాడారు ఇంగ్లీషు కులం మనిషి కారు

ఈ ఇంగ్లీషు రాని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే నేటి తమిళనాడు చాలా అభివృద్ధి సాధించింది ఆయన మంత్రివర్గంలో పదిమందికన్నా తక్కువ మంత్రులు ఉండేవారు కాని పేచీలుఉండేవే కావు ఆయన విరోధులు సయితంకామరాజనాడారు ధనం విషయంలో అవినీతికి పాల్పడ్డారని ఎప్పుడూ అనలేదు ఇంతకన్నా పెద్ద ప్రశంస ఉండబోదని ఇప్పటి పరిస్థితులని బట్టి అనుకోవాలి!

దేశంలో తక్కిన చోట్ల కాంగ్రెసు వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్నట్లు తోచినప్పుడు తమిళనాడు కాంగ్రెసు యంత్రం చాలా మెత్తగా నడిచేది కామరాజనాడారు హయాములో

అయినా, మేధావి వర్గం అనతగిన దానిలో - దాసోహం అనే మేధావి వర్గంలో కాదు, అధికారాన్ని విమర్శించే మేధావి వర్గంలో - కామరాజనాడారు పట్ల అసంతృప్తి, వ్యతిరేకతా రెండూ కలిగాయి.

ఈ అసంతృప్తి, వ్యతిరేకతా వెనుక రెండు ముఖ్యమయిన కారణాలు ఉన్నాయనిపిస్తుంది

పండిత జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెసుపార్టీలో



తమ బలాన్ని పెంచుకునేందుకు వామపక్ష వాదులుగా చెలామణి అయ్యేవారిని చక్కగా వాడుకున్నారు తాము ఒక్కరే అభ్యుదయ భావాలు కలవారుగానూ తక్కినవారు తిరోగమన వాదులుగానూ (ఈ వామపక్ష వాదులుగా చెలామణి అయ్యేవారి ప్రచారం ద్వారా) చిత్రించగలిగారు

కామరాజనాడారు కూడా తమకి ఇష్టంలేని వారి మీద ఈ రకం ప్రచారం చెయించేవారు. ఈ ఉపాయం కనీసం కొందరికయినా చాలా లోతుగా కలవరపాటు కలిగించేది. పార్లమెంటరీ

ప్రజాస్వామ్యం మీద విశ్వాసం లేనివారి దూషణ ఆ వ్యవస్థ మీద నమ్మకం కలవారిలో ఆందోళన కలిగించేది. కాంగ్రెసుపార్టీ అనుసరించే 'సోషలిస్టు' విధానాలూ, కమ్యూనిస్టుల ప్రచారమూ చక్రవర్తి రాజగోపాలాచారి వంటి వారిని కదిలించివేశాయి. స్వతంత్ర పార్టీ ఉద్భవించింది.

(ఇప్పుడు స్వతంత్రపార్టీ ఏది? కమ్యూనిస్టులు కాంగ్రెసు (ఐ)ని వదిలి అకాలీల్ని, తెలుగుదేశం వారినీ ఆశ్రయిస్తున్నారు కదా?)

పండిత నెహ్రూ, కామరాజనాడారు ఇంకా కొందరు అనుసరిస్తూ వచ్చిన కొన్ని విధానాలకి అడ్డుగా స్వతంత్రపార్టీ ఉద్భవించిందనుకోవచ్చు. చక్రవర్తి రాజగోపాలాచారిగారిని, మరికొందరినీ మినహాయిస్తే ఇది పూర్తిగా అభిజాత్యపువారి రాజకీయ పక్షం" ఈ అభిజాత్యం మేధస్సుకి, త్యాగబుద్ధికి, నైతిక విలువలకి సంబంధించినది కాదు. ఎక్కువగా వ్యాపారంలో, వృత్తులలో బాగా పేరు తెచ్చుకున్నవారూ, ఇతరులూ - వీరి అభిజాత్యం అభిజాత్యం బదులు ఆధిక్యం అనాలా?'

భారతదేశంలో బ్రాహ్మణ వ్యతిరేకత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు మహారాష్ట్ర, తమిళనాడులుగా గుర్తించబడుతున్నాయి మహారాష్ట్రలో ఈ భావం ఇంచుమించు కాలగర్భంలో కలిసిపోయినట్లే. (శివసేన మొదట్లో బ్రాహ్మణ వ్యతిరేక పక్షంగా ఉండేది మహాత్మా ఫూలె స్థాపించిన సత్య సమాజ్ పేరు ఇప్పుడు అంతగా వినపడటంలేదు)

తమిళనాడు సంగతి వేరు ఇక్కడ బ్రాహ్మణ వ్యతిరేకత జస్టిస్ పార్టీగా, ద్రావిడ కళగమ్‌గా రూపొందింది ప్రస్తుతం తమిళనాడులో ద్రావిడకళగమ్ - సినిమా మోజు సహాయంతో అధికారంలో ఉండి ద్రావిడ సిద్ధాంతాలని ప్రచారం చేసే రాజకీయపక్షాలు కాంగ్రెసుకి వ్యతిరేకంగా ఉంటూ వచ్చాయి (అ. ద్రా ము. క. మాత్రం కాంగ్రెసు (ఐ) తో స్నేహంగా ఉంటోంది!)

కామరాజనాడారు పరోక్షంగా ద్రావిడ కళగమ్ విధానాలనే అమలుచేస్తున్నారన్న ఆరోపణ అప్పటిలో తరచు వినపడేది ఒక పక్క కమ్యూనిస్టులతో సావాసం, మరొక పక్క ద్రా క

తమిళనాడులో కాంగ్రెసుని నాశనం చేసింది ఎవరు?

ఇన్ని ఏళ్ల తర్వాత కామరాజనాడారు కొందరికి మళ్లీ గుర్తుకివస్తున్నాడు, ఎందుకు?

వారితో స్నేహం – కామరాజనాడారు ఈ రెండూ చేసేవారు కనుక ఆయన ఎన్నో రకాల విమర్శలకి గురికావలసి వచ్చింది. అదికాకుండా ఆయన పార్టీలో అసమ్మతి అనేది ఇంచుమించు ఉండేదికాదు! కామరాజనాడారు నిరంకుశంగా ప్రవర్తించే నాయకుడు. అనటానికి ఈ పరిస్థితి బాగా తోడ్పడింది. బహుశ భారతదేశంలో చాలామందికి 'ఎక్కువ క్రమశిక్షణ' ఇష్టం ఉండదేమో! ఏమయితేనేమి. 1967కి ముందు కొంత కాలం నుంచి కాంగ్రెసు వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తం అవుతూ ఉండేది. హిందీ వ్యతిరేకత దీనికి బాగా సహాయపడి ఉండాలి.

ఒక జీవిత కాలం పాటు గాంధీగారి కాంగ్రెసులో ఉన్న చక్రవర్తి రాజగోపాలాచారి తమిళనాడులో కాంగ్రెసుపార్టీని ఓడించటమే తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రతిపక్షాలవారిని అందరినీ కలిపారు.

స్వతంత్రపార్టీ, కమ్యూనిస్టు పార్టీలూ, ద్రావిడ మున్నేట్ర కళగమూ కలిసి కాంగ్రెసుతో తలపడ్డాయి. అందరూ కలవటం వల్లనే కాంగ్రెసు ఓడిపోయింది.

కామరాజనాడారు స్వయంగా తమ ఎన్నిక లో ఒక తెలుగు యువకుడి చేత ఓడించబడ్డారు. ఆయన పార్టీ కూడా అపజయం పొందింది.

అయినా అఖిలభారత స్థాయి మీద కామరాజనాడారు పేరు అంతగా దెబ్బతినలేదు. ఎందుకంటే, ఆయన ఇద్దరు ప్రధానమంత్రుల ఎన్నికలలో కీలక పాత్ర వహించారు కాబట్టి. శ్రీమతి ఇందిరాగాంధీ మొదట్లో కామరాజనాడారుకి ఋణపడి ఉన్నట్లే ప్రవర్తించేవారు. మొదట్లో మాత్రమే. ఆ తరువాత పరిస్థితులు మారిపోయాయి.

1969లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలో శ్రీమతి ఇందిరాగాంధీ తాము సంతకం పెట్టి నామినేషన్ కాగితాలు దాఖలు చేసిన శ్రీ నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా పనిచేసి వి. వి. వరాహగిరి వెంకటగిరిని గెలిపించారు. ఇది ఆమె రాజకీయ మోసాలు ఎటువంటివో తెలిపే ఒక ఉదంతం. అదే సంవత్సరంలో కాంగ్రెసు చీలిపోయింది. పాత కాంగ్రెసు నాయకులలో కామరాజనాడారు అగ్రగణ్యులు.

శ్రీమతి ఇందిరాగాంధీ కొంచెం కూడా సంకోచం లేకుండా ద్రావిడ మున్నేట్ర కళగమ్‌ని వాడుకున్నారు. పండిత జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె తమిళనాడులో భారతదేశం నుంచి విడిపోవాలనే వారితో పొత్తు కుదుర్చుకుని ఆ తరువాత జరిగిన ఎన్నికలలో కామరాజనాడారు పార్టీని ఓడించారు. 1967లో ద్రా. ము. క. కి ఓటు వేసి పొరపాటు చేశామనుకున్నవారు ఎందరో కాంగ్రెసు వయిపుకి మారారు కాని శ్రీమతి ఇందిరాగాంధీ అటు ఉండటంచేత కాంగ్రెసు గెలవలేకపోయింది.

కామరాజనాడారు కాని, కాంగ్రెసు కాని ఈ దెబ్బనుంచి కోలుకోలేదు. ఆయన నాయకత్వం స్వీకరించిన కాంగ్రెసు క్రమంగా క్షీణించుకు పోయింది. శ్రీమతి ఇందిరా గాంధీ యొక్క కాంగ్రెసు ద్ర. ము. క., అన్నా ద్రా. ము. క. పార్టీలని ఆశ్రయించి తమిళనాడులో కొన్ని స్థానాలని నిలబెట్టుకోగలుగుతూ వచ్చింది.

శ్రీమతి ఇందిరా గాంధీ, శ్రీ చరణ్‌సింగ్, ఇతరులూ చేసిన పనులతో పోల్చి చూసినట్లయితే కామరాజు రాజకీయ జీవితం అంత నిందార్హమయినదిగా కనపడదు. అంతేకాదు, కామరాజనాడారు చివరిదాకా తలవంచలేదు. శ్రీయుతులు చవాన్, చరణ్‌సింగ్ వంటివారు స్థిరంగా నిలవలేకపోయారు కాని కామరాజనాడారు చివరిదాకా గట్టిగా నిలబడ్డారు.

ఆయనని అన్ని విధాలుగానూ ప్రతిఘటించిన వారి పార్టీ ఈనాడు ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించ చెయ్యటం చరిత్రలో కనపడే వింతలలో ఒకటి.

సర్దార్ వల్లభభాయి పటేల్, లోకమాన్య బాలగంగాధర తిలక్‌ల విగ్రహాలని కొందరు మాలలు వేస్తున్నప్పుడు కూడా వింతగానే ఉంటుంది.


గాంధీగారిని అవహేళన చేసినవారు ఆయనని గాంధీజీ అని వర్ణించినా, పండిత నెహ్రూని సామ్రాజ్యవాదుల వెటకుక్క అని అన్నవారు ఆయనని స్తుతించినా వింతగానే ఉంటుంది.

'గాంధేయ సోషలిజమ్'ని గురించి కొందరు మాట్లాడినా వింతగానే ఉంటుంది.


కామరాజనాడారుని ఇంద్రుడు, చంద్రుడు అని పొగడనక్కరలేదు. ఎన్ని తప్పులు చేసినా ఆయనని తమ పార్టీకి ద్రోహం చెయ్యని కాంగ్రెసువాదిగా జ్ఞాపకం చేసుకోవచ్చు. ఆయన ఎంత మహోన్నతుడో కూడా ఈనాటి నాయకులని చూసి గుర్తు చేసుకోవచ్చు.

—సూరి

సీరియల్



ప్రతిభ



డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

(గత సంచిక తరువాయి)

3

బెంగుళూరు నుంచి హైదరాబాదు తిరిగి వచ్చిన తరవాత భవభూతి అక్కడ జరిగిన విశేషాలను వాత్స్యాయనశర్మతో చెప్పాడు.

వాత్స్యాయన శర్మ మంచి నటుడుగా సమాజంలో పేరు పొందాడు. కాగా, భవభూతికి ఏదో దూరపు చుట్టరికం కూడా ఉంది. వాత్స్యాయనశర్మ పెద్దగా అందగాడు కాదు. సన్నగా పొడుగ్గా గేదికొంగలా ఉంటాడు. కాని మేకప్ చేసుకుని వేదికపై నిలబడినప్పుడు ఏ గంధర్వుడో దిగి వచ్చినట్టు ఉంటుంది. వాత్స్యాయన శర్మపై సమాజానికి పెద్ద గౌరవం లేదు. నటుడుగా అతన్ని అందరూ సన్మానిస్తారు. వేదికపై పూలదండలు వేసి ప్రశంసా పత్రాలు సమర్పిస్తారు. కాని వ్యక్తిగతంగా అతన్ని చాటున చులకనగా మాట్లాడుకోవటం అందరికీ తెలుసు. అయితే వాత్స్యాయన శర్మ దానినేం పట్టించుకోడు. హైదరాబాదులో వాత్స్యాయనశర్మకు ఒక నాటక సమాజం ఉంది. దానికి నామమాత్రంగా భవభూతి అధ్యక్షుడు. కాని నిజానికి నిర్వాహణ అంతా వాత్స్యాయనశర్మదే. వాత్స్యాయనశర్మ మీద భవభూతికి చాల సానుభూతి: అందుకు కారణం, వాత్స్యాయనశర్మ లోకమంతా అనుకునేటంత చెడ్డవాడు కాదని భవభూతికి తెలుసు. వాత్స్యాయన శర్మకు కేవలం నోటి దురద మాత్రమేనని, దానిని తీర్చుకోవటం ద్వారా అతను మానసికమైన ఉపశాంతిని పొందుతాడని భవభూతి గ్రహించాడు. ఇందుకు కారణం వాత్స్యాయన శర్మ జీవితంలో కొన్ని పరాజయాలు పొందాడు. వాత్స్యాయన శర్మ మొదటి భార్య ఎవరితోనో లేచిపోయింది.

అయితే అతడు అందుకు బాధ పడకుండా రెండవ పెళ్లి చేసుకున్నాడు. ఆ రెండవ భార్య కొన్నాళ్లకు బావిలో దూకి చచ్చిపోయింది. పట్టువిడవని విక్రమార్కునిలా వాత్స్యాయన శర్మ మూడవ పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమెకు పిచ్చెక్కి ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరింది. వాత్స్యాయన శర్మ యొక్క రాక్షసరతికి స్త్రీలంతా యిలా తట్టుకోలేక పోతున్నారని లోకం కోడై కూసింది.

"అలా కాదు. వాత్స్యాయన శర్మ నపుంసకుడు. అతని బలహీనతను సహించలేక, అతనితో కలసి జీవించలేక స్త్రీలంతా యిలా అయిపోతున్నారు" అని మరికొంత మంది ఉవాచ. నిత్య జీవితంలో ఎలా ఉన్నప్పటికీ వాత్స్యాయన శర్మ మాత్రం తన నాటక జీవితాన్ని వదిలిపెట్టలేదు. అతనొక వృత్తి నటుడు. తన సొంత సమాజంలో నాటకాలు నిర్వహించటమే కాకుండా, కిరాయి నాటకాల్లో వేరే కంపెనీ వారు అద్దెకిస్తే వెళ్లి వేషాలు వేస్తుంటాడు. పౌరాణిక, చారిత్రక సాంఘిక నాటకాలన్నిటిలోను అతను వేషాలు వేస్తుంటాడు.

అతడు రెండు చేతులా డబ్బులు సంపాదిస్తాడు. నాలుగు చేతులా ఖర్చు పెడతాడు. డబ్బున్నప్పుడు నగరంలోని ఫైవ్‌స్టార్ హోటలులో షడ్రసోపేతమైన భోయనం చేసి టాక్సీ ఎక్కి యింటికి వస్తాడు. లేనినాడు చిక్కడపల్లిలో వీధినల్లా కింద మంచినీళ్లు తాగి ఒక దుకాణం అరుగు మీద తలకింద చేయి పెట్టుకుని పడుకుని నిద్రిస్తాడు.

భవభూతికి వాత్స్యాయన శర్మ అంటే సానుభూతి. భవభూతి దృష్టిలో వాత్స్యాయన శర్మ ఒక సంయమనం లేని ఋషి. అతనికే గనక నిత్యజీవితంలో ఏకాగ్రత ఉండి ఉన్నట్లయితే అతడు మరొక భరతాచార్యుడంతటి వాడు అయి ఉండే వాడని భవభూతి ఉద్దేశం. భవభూతికి శీలం లేని వ్యక్తులంటే అసహ్యం. వాత్స్యాయన శర్మకు నైశీల్యం లేదని ఎవరన్నా అంటే దాన్ని భవభూతి నమ్మడు. అయితే అది మూఢనమ్మకం కాదు. వాత్స్యాయన శర్మ డబ్బు ఎలా సంపాదిస్తాడో అలా ఖర్చు పెడతాడు. ఆ డబ్బు మొత్తం వ్యసనాలకే ఖర్చు పెడుతున్నాడనే కొందరి వాదన. అతడలా ఖర్చు చేసే మనిషి కాదని ఒక్క భవభూతికి మాత్రమే తెలుసు. డబ్బు బాగా చేతిలో ఉన్నప్పుడు కష్టంలో ఉన్న తోటి కళాకారుల్ని వాత్స్యాయన శర్మ ఆదుకుంటాడు. వృద్ధ, పేద కళాకారుల కుటుంబాలకు తోచినంత సహాయం చేస్తుంటాడు. ఒకనాడు ముఖానికి రంగు వేసుకుని రంగస్థలాన్ని మకుటం గల రాజుగా రాణిగా పరిపాలించిన వారు వృద్ధాప్యంలో అలనా పాలనా లేకుండా కన్నీళ్లే తమకు స్నేహితులుగా, నిట్టూర్పులే తమ సానుభూతి పరులుగా చెట్టు మీద పక్షులు, గదిలోని క్రిమికీటకాదులే తమ ప్రేక్షకులుగా, రోగాలతో రొప్పులతో, ఏ ప్రేక్షక సంఘాల సానుభూతి, ప్రభుత్వరంగాల ఆర్థిక సహాయమూ లేకుండా తమ జీవిత రంగంలో తెర పడిపోయి దైన్యంగా బ్రతుకు నీడుస్తున్నప్పుడు వారికి గోరంత వాత్స్యాయన శర్మ సహాయం కొండంతగా

జరిగిన కథ–2: ప్రతిభ హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఆమె నృత్యం చూసిన భవభూతి ఆమెకు తన అభినందనలు తెలిపాడు. బెంగుళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో ప్రసంగించిన భవభూతిని తమ కళా మందిరానికి రమ్మని ప్రతిభ ఆహ్వానించింది. కళా మందిరంలో ప్రతిభ నాట్యం తిలకించిన భవభూతి నిర్ఘాంతపోయాడు.

కన్పిస్తుంటుంది. ఈ గుప్త దానాల రహస్యం తెలిసిన వాడు భవభూతి. అందుకే వాత్స్యాయన శర్మను గూర్చి ఎవరైనా చాటు మాటుగా చాడీలు చెప్తే భవభూతి పట్టించుకోడు. వాత్స్యాయన శర్మకు కూడా భవభూతి మీద అలాంటి గౌరవమే ఉంది. వాత్స్యాయనుడి దృష్టిలో భవభూతి మానవుడు కాదు. ఎవరో విద్యాధర చక్రవర్తి శాపవశాత్తు భువిపై జన్మించి యిలా తన కర్మశేషాన్ని జరుపుకుంటూ ఉన్నాడు. ఇది వాత్స్యాయన శర్మ భావం.

వాత్స్యాయన శర్మ భవభూతి చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు.

"ఒరే తమ్ముడూ, నీవు చెప్పిందంతా వింటూ ఉంటే నీవు చెప్పిన ఆ ప్రతిభ అనే నర్తకీమణికి హిస్టీరియా వంటి రోగం ఏదో ఉండి ఉంటుంది. లేకపోతే ఇలా ఒళ్ళు తెలియకుండా గెంతటం కూడా ఒక కళేనంటావా?" అన్నాడు వాత్స్యాయన శర్మ కొంటిగా నవ్వుతూ.

భవభూతి వాత్స్యాయన శర్మ వైపు చిరు కోపంతో చూచాడు. నిజానికి, భవభూతి వాత్స్యాయనుని వైపు మామూలుగానే చూచాడు. ఆ చూపుల వెనుక అంతరాంతరాలలో కోపరేఖ దాగి ఉన్నదనే సత్యం నటుడైన వాత్స్యాయన శర్మకే స్ఫురించింది.

"భవభూతీ! నేనిలా వ్యాఖ్యానించినందుకు నీకు కోపం నిజానికి రాకూడదు. ఎందుకంటే సంయమనం ప్రతి కళాకారునికీ మౌలిక లక్షణం అని నీకు నేను చెప్పనక్కర లేదు. ఆమె అలాగే రాగతాళములను, రంగస్థలాన్నీ ప్రేక్షకులను మర్చిపోయి శరీర స్పృహను కోల్పోయి, ప్రదర్శన యిస్తున్నదనుకుందాం అప్పుడేమవుతుంది? రసాభాసమవుతుంది"

భవభూతి శర్మ కళ్ళలోకి చూచాడు. ఆ చూపులు సూటిగా, సాలోచనగా లోచనాల నుండి విసర్గమించినట్లు శర్మ గ్రహించాడు.

"శర్మా! నీవు చెప్పింది లౌకిక మానవుల విషయంలో యదార్థమే. కాని దేవతల కిది వర్తించదు" అన్నాడు. ప్రతిభ ఒక అపూర్వ కళాకారిణి అనీ కాకుంటే ఆమెలో దివ్యత్వాన్ని భవభూతి చూచి ఉండడనీ శర్మ కర్థమయింది.

"అరే నాయనా! భవభూతీ! ఈ రోజుల్లో ఎవరు కళాకారిణులో ఎవరు గులాకారిణులో చెప్పడం కష్టంగా ఉంది. మొహం మీద రంగు వేసుకుని తైతక్కలాడి దురద తీర్చుకునే వాడొకడు, సాంస్కృతిక సంఘం పేర విదేశాలకు వెళ్ళి ఏకాంత సేవలు, మందు సేవలు నిర్వహించి పేపర్లో ఫోటో వేయించుకుని కళాకారిణిగా చెలామణీ అయ్యేవారు మరొకరు. వీళ్ళే తప్ప యీనాడు నాకెవ్వరూ దేవతలు కనిపించటం లేదు. నేడు భారత దేశంలోని కళా కారుల చరిత్ర తీసుకో. కళనొక తపస్సుగా, ఉపాసనగా భావిస్తున్న వారు ఎవరైనా సజీవంగా ఉన్నారంటావా? ప్రతి కళాకారిణి వెనుక పలుకుబడికల ఒక రాజకీయ నాయకుడు సూర్యుని చుట్టు భూమి తిరుగుతున్నట్లు ఒక్కొక్క రాజకీయ నాయకుణ్ణాశ్రయించుకుని పరిభ్రమణం చేసే కళాకారిణి, వీళ్ళకు సన్మానాలూ, సంతర్పణలూ, బిరుదులూ, గండపెండేరాలూ, పద్మ ముఖ బిరుద ప్రధానాలూ లభిస్తూ ఉంటాయి. పద్మం అంటే తామర . వీళ్ళకి వొళ్ళంతా తామర గజ్జి లేచిందా ఏమిటి? పద్మ ప్రశంసల కోసం యిట్లా పంచెలు పైకి దోపుకుని, పంట్లాం గుండీలు పగుల గొట్టుకుని, చీరల ఎగబట్టుకుని పరుగెత్తుతున్నారు జనాలు. అరే నాయనా! ఈ యాంత్రిక యుగంలో, మాంత్రిక యుగంలో యింకా దేవతల లాంటి కళా కారిణులూ, కళోపాసకులూ ఉన్నారంటావా?"

"ఉన్నారు శర్మా! తప్పకుండా ఉన్నారు. మాట వరసకు నా దృష్టిలో నీవు కూడ ఒక ఉపాసకుడి వైన కళాకారుడివే. కళ కేవలం జనాకర్షణకూ, జనరంజకానికీ మాత్రమే కాదనీ అది ఒక తపస్సనీ జీవన తరుణోపాయమనీ, ఆ సాధనలోనే బ్రతుకును త్యాగం చేయటం ఒక యోగమనీ గ్రహించిన వారి జాబితాలో నీవు కూడా వస్తావు. కాకుంటే నీ వొక యోగ భ్రష్టుడివి. అందుకే సకల కళా పరిపూర్ణుడ వైనప్పటికీ ఒక వికట కవిగా మారావు. శర్మా! నిన్నొక సారి నేను త్యాగరాజ గానసభలో రాయబారం లోని శ్రీకృష్ణ పాత్రలో చూచాను. చూచినప్పుడు యిలా అనుకున్నాను. 'శ్రీకృష్ణుడంటే యీనాటి నటులకూ,



రచయితలకూ, ప్రేక్షకులకూ ఏమి తెలియదు. అతన్ని దశావతారాల్లో ఒక దేవునిగా చేర్చి గుడులు కట్టి కొబ్బరికాయలు కొట్టి చిందులు వేసే వర్గం ఒకటైతే, అతణ్ణి జారునిగా, చోరునిగా, చీరెల దొంగగా, వెన్నల కన్నెల వేటగానిగా చిత్రించే అసహ్యమైన వర్గం మరొకటి తయారయింది. శ్రీకృష్ణుడు గొప్ప రాజకీయ వేత్త. సామాజిక దృక్పథం కలవాడు. జాతిని రక్షిద్దామని కంకణం కట్టుకున్న వాడు. ఒక చేతో శాంతినీ ఒక చేతో సమరాన్ని నడపిన మహా మనీషి. ఆదర్శ పురుషుడు. అతనిలోని సంఘర్షణనూ- మానవతా భావాన్నీ, జాతీయ దృక్పథాన్ని, ధర్మ తత్పరతనూ ఈ చెక్క భజన పరులూ నీలం రంగు బనీన్ల పెద్ద మనుషులూ వెలికి తీసికుని రాలేక పోయారు. కానీ శర్మా! నీవాపని

ప్రతిభ

చేసావు! నిన్ను శ్రీకృష్ణుని పాత్రలో చూచినప్పుడు నాకు రెండు చేతులు ఎత్తి మొక్కాలనిపించింది. అంతటి ఉదాత్త శిల్పంతో దాన్ని పోషించావు. అందుకే నీవంటే నాకంత గౌరవం."

"ఒరే నాయనా! నీ ప్రశంసకు నా ధన్యవాదాలు. నన్ను నేను కించ పరుచుకోవలసిన అవసరం లేదు. నన్ను ఒక గొప్ప కళాకారుని వంటే నాకూ గర్వ కారణమే. నాలో నీవు దేవుని చూడగలిగావంటే ముందుగా నీవు దేవుని వైనావని తాత్పర్యం కాబట్టి నా కంటే వయసులో చిన్నవాడివైనా నీ కెప్పుడూ పాదాభివందనం చేయాలని పిస్తుంటుంది. నిన్ను మించిన కవీ, విమర్శకుడూ, సహృదయుడూ యీ యుగంలో లేడని నా అభిప్రాయం నేనీమాట ధైర్యంగా నగరంలోని కవి పండితులందరి ముందూ అనేస్తాను. కాదని ఎవడైనా అంటే వాడిని ఒక గడ్డిపరకగా పరిగణిస్తాను యింకా మట్టుగా చెప్పాలంటే ఒక ఫలిత కేశంతో సమానం అలాంటిది యింత గొప్పవాడివి నీవు అమెను యింతగా ప్రశంసిస్తున్నావూ అంటే తప్పకుండా ఆ ప్రతిభలో ఏదో ఒక దేవతాభావం ఉండే వుండాలి పత్రికలలోని ఫోటోలు, ప్రచార సాధనాల ప్రశంసలు ప్రభుత్వ బిరుదులూ యివేవీ నాకు ప్రమాణాలు కావు. వేదం వలె నీ మాటయే స్వతహ ప్రమాణం. నేనొకసారి ప్రతిభ నృత్యాన్ని చూడాలి."

"తప్పకుండా."

"భవభూతీ! నేను నీకొక శుభవార్త చెప్పాలను కుంటున్నాను."

"ఏమిటది?"

"నేను కవుల కాలేజీ పెడదామనుకుంటున్నాను. దానికి ప్రిన్సిపాలుగా నీ పేరే ఉంటుంది. తక్కిన తతంగమంతా నేనే చూచుకుంటుంటాను. మన ఆర్థిక వ్యవస్థ బొత్తిగా అధ్వాన్నంగా ఉంది. మేకప్ వెంకటాచార్యులు పాత బాకీలు తీర్చకపోతే యీసారి రంగులు, దుస్తులూ అద్దెకివ్వనన్నాడు ఈ నాటకాల వ్యవహారం ఒక గాలివాటుగా ఉంది. అందుకని ఉభయ తారకంగా నేనొక ప్లాను ఆలోచించాను. సమాజానికి యిప్పుడు కవుల అవసరం చాలా ఉంది. దీనివల్ల వాళ్ళకి భుక్తి, కీర్తి రెండూ లభిస్తున్నవి. అందువల్ల భుక్తి కవులకూ, భక్తి కవులకూ అందరికి మనం ట్రయినింగ్ సెంటర్ లాటి కాలేజీ ఒకటి పెడదాం. అందులో ఎవరికి కావలసిన కోర్సులు వాళ్ళు నేర్చుకుంటారు. ఎలా ఉంది నా అయిడియా?"


భవభూతి వాత్సాయన శర్మ వైపు విచిత్రంగా చూచాడు. కనుబొమ్మలు కదిలించాడు. కవులకు కాలేజీ ఏమిటి? కళాశాలలో కవులు సృష్టింప బడతారా? యిలాంటి సంస్థలకు విద్యార్థులుగా వచ్చేవా రెవరుంటారు. యిదంతా జరిగే పనేనా? అన్నట్లు ఉన్నదా చూపు.


"అయితే నిన్ను ప్రిన్సిపాల్‌గా ప్రకటించ వచ్చా? కరపత్రాలు వేస్తున్నాను," అన్నాడు వాత్సాయన శర్మ.

"నేనేమిటి? ప్రిన్సిపాలేమిటి? కవుల కాలేజీ ఏమిటి? యిదంతా ఏదో గొడవలా ఉంది. నువ్వు ఏదో అనవసరమైన పద్మవ్యూహం పన్నుతున్నావు. కావాలంటే నీవు నటనాలయా న్నే పెట్టుకో. ఎటు తిరిగి మన నాటక సమాజం ఉండనే ఉన్నది. కాబట్టి దానికనుబంధంగా స్త్రీలు, పురుషులను నటీనటులుగా తయారు చేసే శిక్షణా తరగతులు ప్రారంభించు. అది ఉభయ తారకంగా ఉంటుంది. యీ నటులకు సినిమా ఛాన్సులు లభిస్తాయి. ఆశ కూడా ఉంటుంది. అందువల్ల నీకు గిరాకీలు తగుల వచ్చు. సంస్థ కూడా ప్రయోజనాత్మకంగా ఉంటుంది."

"అరే బాబూ! ఆ మాత్రం నేనాలోచించలేదనుకున్నావా? అందుకు కూడా బ్లూప్రింటు తయారు చేసి పెట్టే ఉంచాను. బంజారా హిల్సులోని అరంగేట్రాల ఆండాళమ్మ యీ విషయంలో నాతో సహకరిస్తానన్నది. ఆమె పేరనే నేను నటనాలయానికి ప్రచారం యిస్తాను."

"భేష్! ఇంకేం మరి. ఈ కవుల కాలేజీకి కూడా ఆమెనే ప్రిన్సిపాల్‌గా





పెట్టుకుంటే సరి! చూడు శర్మా నేనొక విషయం చెబుతాను కవులకు కాలేజీ అనే నీ ఊహయే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ప్రతిభావంతుడైన కవి సహజంగా పుట్టుకొస్తాడు. అతడు కొంత విద్వాంసుడై అభ్యాసం చేత రాణిస్తాడు. అంతేకాని కవులకిలా కళాశాల పెట్టటం, అందులో నుండి ఫ్యాక్టరీలలో బిస్కట్లను ఉత్పత్తి చేసినట్లు కవులనుత్పత్తి చేయటం నేనెప్పుడూ చూచి ఉండలేదు. అయినా నీ యిష్టాన్ని కాదనే శక్తి నాకు లేదు. నీ కళాశాలకు నియంతృత్వం వహించగల సామర్థ్యం కూడా నాలో ఉన్నదని నేననుకోను. అందువల్ల నీ ప్రయత్నాలు నీవు చేస్తుండు. నా సహాయ, సహకార, సానుభూతులు నీ వడగకుండానే నీకు లభిస్తాయి," అన్నాడు భవభూతి.

"ఇవన్నీ రొల్లుగొల్లు పదాలు. నీ గోతులో నీవు దూకు. ఒడ్డున నిలబడి నేను చూస్తూ సానుభూతి అందిస్తాను అన్నట్లు ఉంది."

"అంతమాట అనకు, శర్మా! ప్రిన్సిపాల్‌గా నా పేరు వద్దన్నానే గాని, నరనారాయణుల వలె మనిద్దరికీ ఉన్న ఆత్మీయత ఎక్కడికి పోతుంది. అంతగా అవసరమైతే నీతో పాటు నేను కూడా ఆండాళమ్మ దగ్గరకి వస్తాను. ఇద్దరం కలసి మాట్లాడదాం."

"అలా అన్నావు బాగుంది. పోదాం పద!"

ఆ తరవాత వీలు చూసుకుని యిరువురూ బంజారా హిల్సుకు వెళ్లారు. అరంగేట్రాల ఆండాళ్ వీరిరువురినీ సాదరంగా లోనికి ఆహ్వానించింది.

ఆమె నాట్యశాల చాలా ఖరీదయినదిగా తొలిచూపులోనే భవభూతి గ్రహించాడు.

"ఏమిటి శర్మగారూ! ఇలా అకస్మాత్తుగా తోకచుక్కలాగా ఊడి పడ్డారు," అని పరామర్శించింది ఆండాళ్.

"ఎవరైనా మహాపురుషుడు జన్మించినపుడు, ఏదైనా మహాద్భుతం జరుగ బోయేప్పుడో తోక చుక్క కనిపిస్తుం దంటారు. నేను కవుల కళాశాల పెట్ట దల్చుకున్నాను. మన నటనాలయం సరే ఉండనే ఉన్నది...."

శర్మ వాక్యం పూర్తి కాలేదు. ఈ లోపల ఆండాళ్‌కు ఫోను వచ్చింది.

"ఎక్స్క్యూజ్‌మి. ఒక్క నిమిషం. ఇప్పుడే వస్తాను," అని ఆండాళ్లు ఫోను తీసికుని....

"ఆఁ. నేను ఆండాళ్‌ను మాట్లాడుతున్నాను. ఎవరూ రంగనాథంగారా? నమస్కారం! మద్రాసులో మీ అమ్మాయి కళ్యాణం సందర్భంలో డాన్సు ప్రోగ్రాం యివ్వాలంటారా? తప్పకుండా. ప్రోగ్రాం కనఫర్మ్ చేయండి. పార్టీ మొత్తానికి ప్లేన్ టిక్కట్స్ రిజర్వ్ చేయండి.... అలాగే, అలాగే. మీరు అంతగా చెప్పాలా? ఉంటానండి!" అని చెప్పి ఫోను పెట్టేసి మళ్లీ వచ్చి కూర్చున్నది.

"ఆఁ– ఏమంటారు శర్మగారూ, అర్జంటుగా మదరాసు నుంచి ట్రంకాల్ వచ్చింది. ఆఁ– ఇక చెప్పండి."

"ఈయన మా తమ్ముడు భవభూతి. అతను గొప్ప కవి, నాటక కర్త, విమర్శకుడు, సహృదయుడు. యింతకూ మే మొచ్చిన పనేమంటే, నేను కవుల కాలేజీ పెట్టాలను కుంటున్నాను. నటనాలయం ఎటు తిరిగి ఉండనే ఉంది. కవుల కాలేజీ అంటే...."

ఇంతలో ఫోను మోగింది.

"ఎక్స్క్యూజ్‌మి. ఇప్పుడే వస్తాను. ఒక్క నిమిషం!, అని ఆండాళమ్మ లేచి వెళ్లి ఫోను తీసికుని, "హలో, హలో నేను ఆండాళ్‌ను మాట్లాడు తున్నాను. ఎవరూ? రాకేందు వదనగారా? నమస్తే మేడమ్! ఏమిటి విశేషాల్.... (చిన్నగా నవ్వి) తీరుబాటా–- దాని దేముంది లెండి. ఎప్పుడూ తీరుబాటే ఎప్పుడూ బిజీయే. అమ్మాయి అరంగేట్రం గురించా? అలాగే రేపు ఫోను చేసి రండి మాట్లాడుకుందాం! ఆఁ– దానిదేముంది లెండి నలుగురిలాగే చేయవచ్చు. తులం బంగారం, పట్టు చీర, పదివేల రూపాయలు గురువుగారి కట్నం కింద చదివించాలి. యిక రవీంద్ర భారతి ఖర్చులు, వగైరా సరేసరి... కొత్త ఏమీ లేదు. అంతా మామూలే. ఫిక్స్‌డ్ రేట్సు... అలాగే... రేపు వస్తామన్నారు కదా?"

"ఆఁ– ఏమన్నారు?" అంటూ వచ్చి కూర్చుంది.

శర్మ మళ్లీ మొదలుపెట్టాడు.

"మా భవభూతి గొప్ప భావుకుడు. కళాకారుడే గాని ఒక సంస్థకు పరిపాలనా సామర్థ్యం కలవాడు కాడని తాననుకుంటూ ఉన్నాడు. మన యిద్దరికీ ఉన్న స్నేహాన్ని పురస్కరించుకుని నేను పెట్టాలనుకునే కవుల కాలేజీకి మీ సహాయ సహకార సానుభూతులు అందించాలి. ఇంతకూ కవుల కళాశాల అంటే ఏమిటంటే...."

అవతల ఫోను మోగింది.

"ఎక్స్క్యూజ్‌మి. ఒక్క నిమిషం. ఇప్పుడే వస్తాను," అని లేచి వెళ్లి "హలో! ఆఁ– నేను ఆండాళ్‌ను మాట్లాడు తున్నాను. ఎవరూ? వెంకటేశ్వరరావుగారా? నమస్కార మండీ! ఏమిటీ యిలా అకస్మాత్తుగా ఫోను చేసారు?– రాజకీయాలా? వద్దు బాబూ! నాకా కోరిక లేదు. నన్నిలా కళాకారిణిగానే బతక నివ్వండి. ఊపిరి పీల్చుకునే తీరిక కూడా లేకుందిప్పుడు. ఇంకా ఆ ఫీల్డులోకి వెడితే ఎలా బతక గలను చెప్పండి?– ఏమిటీ మంత్రి పదవా? నా కెందుకండి మంత్రి పదవి? కళాకారులకు రాజకీయ వేత్తలకు సహకారాలుండాలి. వాళ్లని వీళ్లు వీళ్లని వాళ్లు పైకి తీసికు వస్తుండాలి. అంతవరకే గానీ, నేరుగా నేను రాజకీయ రంగ మెక్కితే అదోలా ఉంటుంది– ఛరవా లేదంటారా? ఏదో మీరు అభిమానం కొద్దీ యిలా అంటున్నారు గానీ, నాకేం అనుభవం ఉంది చెప్పండి– మంచిది... రేపు ఫోను చేసిరండి. అన్నీ మాట్లాడు కుందాం!" ఫోను పెట్టేసి వచ్చి, "ఆఁ– ఏమిటన్నారు? ఏదోపనిమీద వచ్చినట్లు చెప్పారు?"

శర్మ, "ఏమీ లేదు. మా భవభూతి మంచి మంచి డాన్స్ బాలేలు రాయగలడు. వాటికి రూపకల్పన చేయవలసిన బాధ్యత మీవంటి వారిపై ఉంది. ఇంతకూ నేను వచ్చిన పనేమిటంటే నేను మన నటనాలయంతో పాటు ఒక కవుల కళాశాల

ఛాదర్‌ఘాట్ వంతెన కింద

మూసీ వొడ్డును మింగేసిన 'మురికివాడ"
టిన్నుషెడ్ల గుడిసెల మీద
బురదగుంటల నిలిచిన నీటి పైన
విస్తరించిన ట్యూబ్‌లైట్ల వెన్నెల.
ఇక్కడే "గజిబిజి మురికి జీవితాల" ఆశ్రయం
నిజాం నుంచి ఇప్పటి దాకా మిగిలిన కనీస "శరీరం"
అక్కడే ఆ తలలపై వెక్కిరింతగా–
అందుకోలేని "ఆకాశహర్మ్యాలు కట్టిస్తా"నని
పోలీసుల కాపలా పక్క
జిలమిల మెరిసే సిమెంటు కంపెనీ సైన్‌బోర్డు!
తరతరాలుగా ఈ మూసీ వొడ్డే
రోజూ రోడ్డు ఎక్కే రిక్షాపేగుల ప్రాణం
రోడ్డు దిగితే ఎంతకూ పారని జీవనయానం.
పైనుంచి ఆత్మహత్యకైనా నీళ్ళులేని లోతు
పాతుకపోయి వెక్కిరిస్తున్న బండబారిన బతుకు
మరోవైపు అన్నివేళలా
నిర్దయగా నిర్లజ్జగా సాగే నగరయంత్రవేగం!

–నిఖిలేశ్వర్

ప్రతిభ

పెట్టాలను కుంటున్నాను. కవుల కాలేజీ అంటే...."

అవతల ఫోను మోగింది.

"ఎక్స్‌క్యూజ్‌మి! ఒక్క నిమిషం! ఇప్పుడే వస్తాను," అని అండాళ్ వెళ్ళి,

"ఎవరూ? ఓహో పద్మప్రియగారా? నమస్కారం! ఏమిటి విశేషాలు? – ఏమిటీ– మీ వారు ప్రొడ్యూసర్ అవుతున్నారా' కంగ్రాచ్యులేషన్స్. ఎంత మంచి వార్త చెప్పారు. –ఏమంటారూ–నేనందులో డాన్సు చేయాలా? ఎక్కడండి? మా స్కూలు నిర్వహణకే సమయం చాలడం లేదు. ఇవి కాక బయట నేషనల్ అండ్ యింటర్ నేషనల్ ప్రోగ్రామ్స్ ఇవ్వవలసి వస్తున్నది. సినిమాలకు నేనెక్కడ వెళ్ళ గలను చెప్పండి?– – – అలాగే – చూద్దాం– రేపు ఫోను చేసి నేనే వస్తాలెండి! పెట్టేస్తాను".

"ఆс–చెప్పండి! ఏదో పని మీద వచ్చామన్నారు".

"ఇంతకూ కవుల కాలేజీ అంటే–––"

అవతల ఫోను మోగింది.

"ఎక్స్‌క్యూజ్‌మి! ఒక్క నిమిషం – – –"

"హలో ! నేను అండాళ్‌ను– ఆс– – –"

భవభూతి శర్మ వైపు చూచి కనుసైగ చేసి, "యిక వెడదాం పద అన్నాడు."

"అమ్మమ్మ అలా అనరాదు. ఈ మాత్రానికే అంత నిరుత్సాహ పడితే ఎలా? నగరంలో పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఈమె సహకార, సానుభూతులు ఉంటే మన సంస్థ మూడు పూవులు ఆరు కాయలు."

"ఏడు ఫోన్లు –"

"అంత తొందర పడకు మరి."

ఈ లోపల అండాళ్ మళ్ళీ వచ్చింది.

"ఆс– ఏదో కాలేజీ అంటున్నారు."

భవభూతి కలుగ చేసికుని, "ఏమి లేదు. మీరింత బిజీగా ఉంటారని తెలియక పొరపాటున వచ్చాం. క్షమించండి. మరోసారి వస్తాం", అంటూ లేచి నిలబడ్డాడు.

అండాళ్, భవభూతి వైపు కిందినుంచి పైకి, పైనుంచి కిందికి ఒక మారు ఓర చూపు చూచింది.

"ఫరవాలేదు. భవభూతి గారూ కూర్చోండి. ఇది మామూలే . ఇంతకూ మీరు చెప్పవచ్చిందే మిటి? ఏదో కాలేజీ పెట్టాలను కుంటున్నారు. దానికి నా సహాయ సహకారాలు కావాలంటున్నారు. అంతే కదా? శర్మ గారడిగితే నేను కాదంటానా? నన్ను మీరు ఎలా కావాలంటే, అలా ఉపయోగించుకోవచ్చు. నేను మీదాన్నే, ఏమంటారు? " అండాళ్ నవ్వింది.

వాత్సాయన శర్మకూడా చిన్నగా, గుర్రంలా సకిలిస్తూ, ఆమె నవ్వుతో శ్రుతి కలిపాడు.

ఇంతలో వాకిట్లో ఎవరో కారు తీసికుని వచ్చారు.

"క్షమించండి. అర్జంటుగా నేను ఓ చోటికి వెళ్ళ వలసి ఉంది" , అంది అండాళ్.

శర్మ, భవభూతి కూడా లేచారు.

అండాళ్ వెళ్ళి కారులో కూర్చుంది.

కారు వెళ్ళి పోయింది.

శర్మ, భవభూతి రోడ్డు మీదకి వచ్చారు.

"నన్నిక్కడికి నువ్వెందుకు తీసికొచ్చినట్లు?" భవభూతి శర్మను ప్రశ్నించాడు.

"అరే నాయనా! ప్రతిదానికి అంత తొందర పాటు పనికి రాదు. అరంగేట్రం అండాళ్ అంటే బస్తీమే సవాల్. ఆమె పేరు చెప్తే చాలు కనక వర్షం కురుస్తుంది. అలాంటిది అమె మన కాలేజీకి ప్రిన్సిపాల్‌గా ఉన్నదంటే యిక చెప్ప వలసిన పని లేదు."

"చూడు శర్మా! నీవు కూడా యిలా డబ్బు పిచ్చిలో పడటం మంచిది కాదు. ఈ అండాళ్ విద్యార్థినులను శిక్షితులనుగా చేస్తానని ఆశపెట్టి యిలా అరంగేట్రాలు ఏర్పాటు చేయించి బంగారమూ, పట్టు చీరలూ గుంజుతున్నట్లు కనపడుతున్నది. ఈమె సినిమా గిరాకీలూ, రాజకీయ పలుకుబడులూ చూస్తుంటే ఈమె పిల్లలకు ఏం చదువు చెబుతుందో నాకు నమ్మకం కలగటం లేదు."

"చూడు బ్రదర్! అంతా నీలాగే ముక్కుమూసుకుని భరతుడులా కూర్చుంటారనుకోవద్దు. దేశ కాల పరిస్థితులు మారాయి. ఇప్పుడు కళ పేరు చెబితే కనక వర్షం కురుస్తున్నది. వీణ నేర్పే విద్వాంసులు , బంగారు చెంబులూ పట్టు పీతాంబరాలు, ఫారిన్ టేపు రికార్డరులూ, స్కూటర్లూ బహుమానాల కింద పుచ్చుకుంటున్నారు. అవి తీసికోకపోతే ఆ భక్తులంతా కూడా పాపం తమకు మోక్షం రాలేదని తల్లడిల్లి పోతారు. అందుకని వారినలా అనుగ్రహించ వలసిందే. ఈ అండాళ్ కూడా అంతే. ఈమె వచ్చిన వారందరితోనూ తీరిగ్గా కూర్చుని మాట్లాడుతుందనుకో, అప్పుడు నగరంలో ఈమె మొఖం చూచే వాళ్ళే ఉండరు. ఈమె ఎంత బిజీగా ఉన్నట్లభినయిస్తుంటే, అంత పెద్ద యింటర్నేషనల్ ఆర్టిస్టు కింద లెక్క. అందుకే మన సంస్థలకు ఈమె సహాయం చాలా అవసరం. మరొక రహస్య మేమిటంటే, ఈనాడు రాజకీయ వేత్తలకూ, కళాకారులకూ పాలకూ పంచదారకూ ఉన్న సంబంధం. ప్రతి గొప్ప ఆర్టిస్ట్ వెనుక ఒక రాజకీయ వేత్త ఉన్నాడన్న విషయం మరిచి పోవద్దు. అందుకని కాస్త లౌక్యం కావాలి".

"వ్యాసునికీ, వాల్మీకికీ, భాసునికీ, భరతాచార్యునికీ యిలాంటి లౌక్యాలు తెలిసినట్లు నేను వినలేదు. కానీ వారే మనకు ద్రష్టలుగా, స్రష్టలుగా, మహర్షులుగా, కళాకారులకు ఆదర్శ గురువులుగా చరిత్రలో మిగిలారు.

ధర్మపథం



అంతులేని కోరికలు

మానవజన్మ ఎత్తిన వానికి కోరికలు ఉండడం, అవి తీరడానికి ప్రయత్నించడం సహజం. "కోరికలు చంపుకుంటేనేగాని తరణోపాయం లే"దని కొందరు నీతులు చెప్తారే కాని, "అయ్యా! యధార్థం చెప్పండి. మీకు ఎటువంటి కోరికా లేనే లేదా?" అని ప్రశ్నిస్తే - ఆ చెప్పేవాడు తెల్ల మొగం వేయక తప్పదు. అయితే కోరికలు ఉండవచ్చునే గాని, వాటికి అవధి ఉండాలి. తన జీవితానికి అత్యవసరమైనవి ఉండవలసినదే!

కాని, ఒకదానిపై ఒకటి పెరిగితే మనస్సుకు శాంతీ ఉండదు. సుఖమూ ఉండవు.

ఇంటి స్వంతదారుని మూలంగా శ్రమపడుతున్న అద్దెకున్న వ్యక్తి ఎంతో కష్టం మీద స్థలం సంపాదించి చిన్న కుటీరం నిర్మించుకొని, అందులో నివసిస్తూ ఉన్నా, దానిని గట్టి గోడలతో మిద్దెటిల్లుగా మార్చేవరకూ మనస్సుకు శాంతీ, సుఖమూ కలగలేదు. ఎంతో శ్రమపడి డబ్బు సంపాదించి, ఆ కోరికను నెరవేర్చుకున్నా, విద్యుద్దీపాలు, పంకాలు మొదలైన సౌకర్యాల కోసం తిరిగి తాపత్రయ పడవలసి వచ్చింది. ఆ తర్వాత కూడా అతనికి మరో కోరిక కలిగింది. కుటుంబం పెరుగుతున్నందు వల్ల, ఆ ఇల్లు చాలదనీ, మిద్దెపైని కూడా కొన్ని గదులు కట్టాలనీ సంకల్పం కలిగింది. ఈవిధంగా ఒకదాని తర్వాత మరొక కోరిక కలుగుతూనే ఉన్నది కాని, కోరికలకు అంతు కానరాలేదు. "ఇక చాలును" అనేది లేనందువల్ల మనశ్శాంతి లేదు. ఇక సుఖం ఎలా కలుగుతుంది? కోరికలకు అవధి ఉన్నప్పుడే మానవ జీవితంలో సుఖ శాంతు లేర్పడతాయి.

మనస్సు కోతివలె చంచలమైనది. ఆశకు అది అంకిత మౌతుంది. దానిని విడవడం సాధ్యం కానప్పుడు కోతి బాధపడినట్లు కష్టానికి లోబడవలసి వస్తుంది

ఒకడొక కోతిని పట్టుకొనుటకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వాడు బాగా ఆలోచించి, అది తిరిగే చోట, చెయ్యి మాత్రం దూరే సన్నని మూతిగల కుండను, పీకవరకూ నేలలో పాతి, కుండలో కొన్ని పండ్ల ముక్కలు, పప్పులు అడుగు భాగంలో పోశాడు. ఆ కుండ పాతిన చోటునుంచి కొంతవరకూ పప్పులు, పండ్ల ముక్కలూ చల్లి, తాను అక్కడున్న ఒక చెట్టు ఎక్కి ఏమి జరిగేదీ చూడసాగాడు. కోతి వచ్చి, ఆ పండ్ల ముక్కలనూ, పప్పులనూ తింటూ ఈ కుండ వద్దకు వచ్చి, దాని లోపల పండ్ల ముక్కలూ, అవీ ఉండడం చూచి, చేతిని దాని లోనికి దూర్చింది. అప్పుడు ఆ వ్యక్తి తట్టాలున కిందికి దిగి దానివద్దకు వచ్చాడు. కోతి పండ్ల ముక్కలను చేతితో పట్టుకొని ఉన్నందున, చేతిని బయటికి తీయలేక పోయింది. పండ్ల ముక్కలను విడిచి పెడితే ఉత్త చేతిని బయటికి తియ్యగలదు. కాని, వాటిని విడవడం దానికి ఇష్టం లేదు. అది కదలలేకపోగా, ఆ మనిషి దానిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నాడు. పండ్ల ముక్కలపై కోరికగల ఆ కోతి అతడికి లొంగిపోవలసి వచ్చింది.

("గురువాణి"ని చదివాక)

—బులుసు వేంకట రమణయ్య

త్యాగరాజు, రామదాసు, అన్నమాచార్యులు యిలాంటి లెక్కాల మీద ఆధారపడ్డట్టు నేను వినలేదు. కేవలం పార లౌకిక దర్శనం మీదనే తమ కళ స్వరూపాన్ని నిర్మించుకుని, రసానందాన్ని అనుభవించి, అనుభవింప చేశారు. 'రసమ'నేది ఒక ప్రత్యేకమైన అనుభవం! అది యింద్రియానుభవానికి చివరి దశ. ఆత్మానందానికి మొదటి దశ. దీన్ని ఈ అరంగేట్రాల అండాళు వంటి కళాకారులు సమాజానికి ఎంతవరకు యివ్వగలరు? తులమెత్తు బంగారం మీద ఆశ గల

నాట్య మహాలక్ష్ములూ, టేప్‌రికార్డర్లూ, ఫారిన్ స్మగుల్డ్ ఆర్టికల్స్ కానుకలు పుచ్చుకునే వీణాచార్యులూ వీరందరూ భారతీయ కళా స్వరూపాన్ని ఎలా ప్రతిబింబించ గలరు. ఆత్మ శుద్ధి లేని వానికి కళాశుద్ధి ఎలా కలుగుతుంది? పదార్థం మీద వ్యామోహం గల వాడు పరార్థాన్ని పరమార్థాన్ని ప్రబోధించే కళా శిఖరాలను ఎలా అధిరోహించ గలడు. వాత్సాయన శర్మా! నీ ధోరణి వేరు, నా ధోరణి వేరు. నేనీ రకం ధోరణులను హర్షింపలేను."

"హర్షింప వద్దు. విమర్శింపవద్దు. నేను చేసేదేదో నేను చేసి చూపిస్తాను. వ్రాసేదేదో నీవు వ్రాసి చూపించు. సమాజంలో అందరూ పండితులే కారు. పామరులు కూడా ఉన్నారు. వారికి కళాకారిణులతో పాటు గులాకారిణులు కూడా కావాలి. కళను ఒక తపస్సుగా, జీవన ధ్యేయంగా, యోగంగా నీవు భావించుకో. కళనొక విలాసంగా, వినోదంగా, విశ్రాంతిగా వాళ్ళు భావించు కుంటారు. అదొక దారి, ఇదొక దారి. రెండూ ఉండనీ."

భవభూతి యింకేం మాట్లాడ లేదు.

వాత్సాయన శర్మ చెప్పినదంతా సాధించాడు. అరంగేట్రం అండాళ్‌ను ప్రిన్సిపాల్‌గా ఒప్పించి నటనాలయంతో పాటు కవుల కాలేజీ ప్రారంభించాడు!

(ఇంకా ఉంది)

"నిన్న మన యింటికి, ఒక పేదరాలు వచ్చిందండి! పాపం! కట్టుకునే గుడ్డకు కూడా హీనపడుతోందట! ఒకే ఒక్క కొడుకు స్కూలులో ఏదో చదువుతున్నాడట! వాడి జీతానికి డబ్బు లేదని యాచనకు వచ్చింది" అంది, సుహాసిని, భర్తతో. "ఏదయినా ఇచ్చి పంపివేయలేకపోయావా!" అన్నాడు అచ్యుతం. అచ్యుతం మొదట్లో అంత ఉన్నవాడు కాకపోయినా, లాయరుగా దోసిళ్ళతో సంపాదిస్తున్నవాడు. ఉపకారబుద్ధి కలవాడు.

"ఏదో ఏదిపితే ఆమె కేమవుతుంది, పాపం! అందుకని, మనకూ వంట మనిషి అవసరమే కదా అని, వంటకు కుదురుతావా?" అని అడిగాను. "మొగుడెప్పుడుంటాడా?" "మొగుడెక్కడున్నాడు మొద్దులు! సొమ్ము ముండలకు పెట్టి, జూదమాడి, త్రాగి, తందనా లాడి, చచ్చి వూరుకున్నాడు. పురుషుడు సరియైనవాడు కాకపోతే ఆడదానికేగా అవస్థ! గడప దాటని మనిషి, వీధిలో ముష్టెత్తుకోవలసి వచ్చింది" "సరే! నీకేమని సమాధానం చెప్పింది?" మేము బ్రతికి చెడ్డవాళ్ళం! ఇంతవర కెప్పుడూ పరాయి యింట గరిట త్రిప్పలేదు. ఆలోచించి, చెబుతానంది." "సరిసరి! ఇంకా ఆలోచనా భాగంలోనే ఉంది కదా! ఆమె చెప్పిన తర్వాతకదా-మన ఆలోచన!

"అసలు ఆలోచనలో పడిందంటే అంగిక రించినట్లేనండి! హఠాత్తుగా వేసిన ప్రశ్నకు, తనను తాను సంబాళించు కోవడానికి కొంత సమయ మవసర మయింది. అంతే!

"చూడు! ఇందులో ఒక పాయింటు ఉంది." సుహాసిని పకపకా నవ్వింది. పేరుకు తగ్గట్టు ఆమె నవ్వు మనోహరంగా ఉంటుంది. ఆ నవ్వులో అందాన్నిచూసే, అచ్యుతం, ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అంతకు ముందు సంబంధాలకు, పెళ్ళి చూపులకు వెళ్ళక తండ్రిమీదనే భారం ఉంచినా, ఈ సంబంధానికి మాత్రం వెళ్లాడు.

"మీ లాయరు పాయింట్లన్నీ జడ్జీల దగ్గఱ! ఇక్కడ పాయింటేమిటండీ!" అంది, సుహాసిని.

"పాయింటనేది, ఎక్కడయినా ఉంటుంది. పాయింటు ఉన్నది అని అంటే, జడ్జీ వ్రాసే కలాన్ని అయినా ఆపేసి, ముందు అది వింటాడు. నువ్వు లక్ష్యపెట్టవేమిటి?"

"చెప్పండి!"

"కొందరు వంటకత్తెలు, మేము వంట చేసి అక్కడ పడవేస్తాం కాని, వడ్డించడం మా పని కాదంటారు. కొందఱు, తామే ఇంటి యజమాను రాల్లే వ్యవహరించి, అసలు యజమానురాలిని, అన్నీ అందించమంటారు. భోజనం చేసిన తర్వాత విస్తళ్ళు వారు ఎత్తి వేయరు. అల్లా ఎత్తడం వాళ్ళకు నామోషి! వాళ్ళతో ఈ పాట్లు పడేకన్నా స్వయంగా వంట చేసుకోవడమే మంచిదిగా కన్పిస్తుంది. కొందఱు, ఎడ్డే మడ్డి వాళ్ళూ, నోటివాపిరి వాళ్ళూ ఉంటారు. ఎవ్వరూ చూడకుండా, ఒకప్రక్క వంట చేస్తూనే, ఒక ప్రక్క నోట్లో వేసుకుని రుచి చూస్తూ ఉంటారు. ఆచారం పాటించరు. మనకు దేవుడు నైవేద్యం ఉండె! మఱికొందరు ఇంటికి వెళ్ళేటప్పుడు, కనిపెట్టి ఉండకపోతే, ఉప్పులో ఉప్పు, పప్పులో పప్పు కాజేసి, ఇంటికి చేఱవేస్తూ ఉంటారు. చూడు! వంటమనిషిని ఏర్పాటు చేయడంలో ఎన్ని పాయింట్లు ఆలోచించాలో!

"ఆవిడ అల్లాంటి మనిషి కాదండీ! చెప్పినట్లు వినేదే! ముఖం చూసి ఇట్టే పసికట్టి వచ్చు! జుట్టులేని విధవ! జుట్టే ఉంటే, ఎంత అందకత్తె అనుకున్నారు!" "అంత అందకత్తె మన కవసరంలేదు కాని, వికారమయిన వాళ్ళను కుదుర్చు!" సుహాసిని, నవ్వులో మఱల రత్నాలు క్రుమ్మరించింది. ఆమెను చేసుకున్న తర్వాతనే, అచ్యుతానికి అదృష్టం కలిసివచ్చి, పెద్ద లాయరయాడు.

వంట మనిషి రాగానే ఆమెను అయ్యగారితో మాట్లాడమంది సుహాసిని. అచ్యుతం, ఆమె పుట్టింటి వారిని గూర్చి, అత్తింటివారిని గూర్చి తెలుసుకొని, సాంప్రదాయకమైన కుటుంబమేనని తేల్చుకున్నాడు. పుట్టింటివారి గ్రామాన్ని గూర్చి చెప్పినప్పుడేదో విషయం స్ఫురించినట్లుంది కాని, ఏమి ప్రశ్నించలేదు. "బాబుగారూ! నా కెవ్వరూ 'నా' అన్నవాళ్ళు లేరు. సిగ్గు లేకుండా, యాచనకు ప్రతి గుమ్మం ఎక్కి దిగేకన్నా, ఇలాంటి మంచిచోట పడి ఉండడమే మంచిదనే నిర్ణయానికి వచ్చాను. రెండు నిద్రాళ్ళపాకలో ఒక గది పెట్టులో, పాతిక రూపాయలకు అద్దెకుంటున్నాను. నా కొడుకుతో. వాడు బ్రతికి బట్టకట్టి పెద్దవాడయి, సంపాదించే దాకా నాకీ కష్టాలు తప్పవు. నా తిండి ఇక్కడే గడచిపోతుందికదా! పిల్లవాడి చదువుకూ, పోషణకూ ఎంత అవసరమని మీకు తోస్తే, అంత జీతం ఇవ్వండి. అమ్మగారిని కనిపెట్టుకొని ఉండి, ఆమె చెప్పిన పనులన్నీ చేసి, ఒళ్ళు దాచుకోకుండా, నా శక్తిని ధారపోస్తాను" అని ఆమె రుద్ధ కంఠంతో అంది.

రెండు కన్నీటిబొట్లు కూడా రాలేటప్పటికి అచ్యుతం కళ్ళు చెమర్చినై.

"సరే! నీకు ఏడాదికి జత బట్టలిస్తాను.... నెలకు వంద రూపాయలిస్తాను. అందులో, నీ ఇంటి అద్దె, పిల్లవాడి ఖర్చులూ, సరిపెట్టుకో!" అన్నాడు.

"మీరెంత ఇస్తున్నారనే విషయంకన్న, నన్నూ, నా పిల్లవాడినీ కనిపెట్టడం ముఖ్యం" అని ఆమె చేతులు జోడించింది.

* * * *

వంట మనిషి చేసే వంట రుచ్యంగా ఉండడమే కాక, ఆమె సుహాసిని చెప్పిన పనులు చేసేది. కుడి, ఎడమా లేకుండా ఎంగిళ్ళన్నీ ఎత్తేది. తలలో నాల్కలా మెలగేది. నమ్మకం బాగా కుదరడంచేత సుహాసిని, ఆమెను ఆప్యాయతతో చూస్తూ, బజారులో చీరలు కొనుక్కునేటప్పుడు కూడా తీసుకువెళ్ళి ఆమె సలహాలను పాటించేది. ఇంట్లోకి పచారి సామానులు కొనడం, కూరలు కొనడం వగైరా భారాలన్నీ ఆమె మీదనే పెట్టేసింది. పండుగలు వచ్చినప్పుడు ఆమె కొడుకును కూడా ఇంటికి తీసుకొని రమ్మని, తన పిల్లలతో పాటు దుస్తులు కుట్టించి, భోజనం పెట్టి పంపేది. సుహాసిని పిల్లలు, వంట మనిషి దగ్గఱ మాలిమియ్యి పోయారు. సుహాసిని చుట్టాలు కూడా ఆమెను వంటకత్తెగా కాక, ఆ యింట్లో ఒక కుటుంబ సభ్యురాలుగానే భావించేవారు. ఎవరిని ఎల్లా మర్యాదచేసి వడ్డించాలో అల్లా చేసేది ఆ వంట మనిషి. అంత మంచి మనిషి అచ్యుతం సంపాదించగలిగినందుకు అతని బంధువు లతనిని గూర్చి అసూయ పడేవారు.

ఒక రోజున "బాబుగారూ!" అని వచ్చి వంట మనిషి అచ్యుతం ఆఫీసు గుమ్మం దగ్గర నిలబడింది. "పిల్లవాడి వడుగు చేయాలనుకుంటున్నాను. పది క్లాసులవఱకూ చెప్పించానుకదా! ఆ పయిన నావల్ల కాదు. చెప్పించడం ఇష్టం కూడా లేదు. వడుగుచేసి, వేదపాఠశాలలో ప్రవేశ పెడితే, వాళ్ళు అన్నం పెట్టి, వేదం చెబుతూ, ప్రక్కనే స్మార్తం ముక్కలు కూడా చెబుతారట! అవి నేర్చుకుంటే వాడి బ్రదుకువాడు బ్రదుకగలడు. మీరుభయులూ పీటలమీద కూర్చొని, ఆ కార్యక్రమాన్ని నాలుగు రోజులూ, లఘువుగా నిర్వహిస్తే, నాకు సంతోషంగా ఉంటుంది" అంది.

"ఇంతేకదా!" అన్నాడు అచ్యుతం. కార్యక్రమం పూర్తి అయింది. వటువు నివాసం, భోజనం, వేదపాఠశాలలోనే కావడంచేత వంట మనిషికి వేరే యిల్లు అవసరంలేక, లాయరుగారింటనే ఉండి పోయింది. ఆమె కొడుకు ఎప్పుడయినా వచ్చి తల్లిని చూచి పోతూ ఉండేవాడు. లాయరుకు ఏ ద్వాదశికో బ్రాహ్మణుడికి పెట్టుకోవలసివస్తే వచ్చేవాడు. వంట మనిషి తనకు వచ్చే జీతం, లాయరుగారి దగ్గఱనే ఉంచమంది. ఆమె కొడుకు వేదం పూర్తి చేశాడు.

* * * *

అచ్యుతం పాత డైరీలు వెదకుతూఉంటే, అందులో ఒక ఫోటో కన్పించింది. పరిశీలనగా చూస్తే, అది యీ వంట మనిషినే పోలి ఉంది. ఆశ్చర్యపడ్డాడు. తనకు వంట మనిషిని తొలిగా కలిసినప్పుడు మనస్సులో కలిగిన సందేహం నివృత్తి అయింది. తాను పెళ్ళి చూపులకయితే ఆ గ్రామం వెళ్ళలేదు కాని, ఆ పిల్ల ఫోటోనుచూచి తాను చేసుకోవడాని కంగీకరించాడు. అప్పటికి తనది కొద్ది స్థితి. తన తల్లి తండ్రులు వెళ్ళి నిశ్చయ తాంబూలం తీసుకున్న తర్వాత, ఆమె తల్లి దండ్రులు ఒక లక్షాధికారి సంబంధంవారు చేసుకోవడానికి ముందుకువస్తే ఆ నిశ్చయాన్ని

వంటమనిషి

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

త్రో సిపుచ్చారు. ఆమెకే యీ గతి పట్టిందని తెలిసిన తర్వాత అచ్యుతం ఆమె వంక చూడలేక పోతున్నాడు.

భార్య పుట్టింటికి వెళ్ళిన సందర్భంలో, వంటమనిషి టిఫిన్, కాఫీ తెచ్చి యిచ్చింది "మీకు వివాహం కాకముందు ఏవయినా సంబంధాలు చూశారా?లేక-" అని ఆగాడు అచ్యుతం.

"ఏవో చాలా చూశారండీ'ఎప్పటిమాట! పాతికేళ్ళవుతుందేమో! నాకేమి జ్ఞాపకం! కాని ఒక సందర్భం మాత్రం జ్ఞాపకం ఉంది. ఒక సంబంధం నిశ్చయమయినట్లే అయి తృళ్ళి పోయింది." అన్నది వంటమనిషి


"అదెల్లా! వారు అనుకున్నదానికంటె కట్నం ఎక్కువ కావాలని కోరారా?"

"అబ్బే! అదేం లేదు బాబుగారూ! ఆ పిల్లవాడు నన్ను వచ్చి చూసుకోనుకూడా లేదు. తల్లి దండ్రుల యిష్టం అన్నాడట! వారే వచ్చి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు."

"అందాకా వచ్చింది?"

"వచ్చింది బాబూ! వచ్చింది. కాని, లిఖితం ఉండవద్దూ? లేదు కనుకనే తృళ్ళి పోయింది. నాకు చిన్నతనం! వారెవరో కూడా గుర్తు లేదు. నా నుదుటను వైధవ్యం ఉన్నది కనుకనే,ఆ పిల్లవాడికి సంబంధం తప్పిపోయింది. అదృష్టవంతుడు.





వంట మనిషి

ఎక్కడో మహాలక్ష్మివంటి పిల్లను చేసుకొని సుఖంగా ఉండి ఉంటాడు."

"అల్లా ఎల్లా జరిగింది?"

"కర్మ! బాబూ! కర్మ! నా శ్రేయస్సుకోరి, మా వాళ్ళు, అంతకంటి చాలా మంచి సంబంధమని ఆ మహాపాపాని కొడిగట్టారు. నాకు మేలు చేయబోయి కీడు చేశారు. మా వాళ్ళు పిల్ల నివ్వమని మాట తప్పితే, ఆ పిల్లవాడి తండ్రి ఉసూరుమని కంట తడిపెట్టి వెళ్ళిపోవడం మాత్రం నా కిప్పటికీ గుర్తు ఉంది. అదే, నాకు శాపం! క్రొత్త సంబంధం అస్థి పోవడం, వైధవ్యం రావడం! ఇంతకంటి ఏమి కావాలి?" అంది వంట మనిషి.

"పెళ్ళి కాకముందు వ్యవహారం కదా!" అని, అని చూశాడు అచ్యుతం.

వంటమనిషి అతని వంక తీక్షణంగా చూచింది. అల్లా ఎప్పుడూ చూడగా అచ్యుతం చూడలేదు. "బాబుగారూ! అన్నీ తెలిసిన మీరు కూడా అల్లా మాట్లాడుతున్నారా? పెళ్ళి అనే సంస్కారమంటూ కాలేదు కాని, నిశ్చయతాంబూలం తీసుకుంటే పెళ్ళి అయినట్లే లెక్క. వాగ్దానం కూడా ఒక దానమేకదా! అది కన్యాదానం నిమిత్తం అయిన వాగ్దానం. దాని విలువ గొప్పది. పిల్లనిస్తామని ఆశ కల్పించి, అసత్యమాడడం దోషం కదా! అంతకంటి వేరొక నరకం ఉన్నదా? మన పల్లెల్లో, "మాటా? మారు మనువా?" అనే సామెత ఉంది. మారు మనువు ఎంత దోషమో, మాట తప్పడం కూడా అంత దోషమనే దాని అర్థం. ఇంకొక విషయంగా ఆలోచిస్తే, కన్య నిస్తామని మాట తప్పి మరొకరికిస్తే మారు మనువు చేసినట్లే! అందుచేతనే మా పుట్టింటివారు పురుగునాకి పోయారు. నాకీ గతి పట్టింది!" అని వలవలా ఏడ్చింది. ఆమె వివేకానికీ, ధర్మ నిష్ఠకూ, అచ్యుతం, ఆశ్చర్యపోయాడు. ఆమె తనకు వాగ్దానమైన జీవి కనుక, ఏదో మహోపకారం చేయాలని మనస్సులో నిశ్చయించుకున్నాడు. ఆమె దరిద్రురాలుగా ఉండకూడదనుకున్నాడు.

ఎంత కాలం నుంచో, లక్షవర్తి వ్రతం చేసుకుందామని సుహాసిని పోరుతోంది. దానికి వెంటనే అంగీకరించాడు. ఆ వ్రత సందర్భంలో, తన యింటి ఎదురుగా నున్న తన స్థలాన్ని, భూదానం క్రింద వంట మనిషి పుత్రుడు, వేదపండితుడికి దానం చేశాడు. సుహాసిని చాలా సంతోషించింది. "గృహం కట్టిస్తే ఆమె ఋణం మనం తీర్చుకోగలుగుతాం. ఆమె కేవలం మన యింట్లో జీతానికే ఉన్నట్లుగా లేదు. అస్థి చర్మం మనకోసం అరగ తీస్తోంది." అన్నది సుహాసిని. తర్వాత గృహనిర్మాణం కూడా పూర్తి అయింది. ఆ యింట్లో, వారిని ప్రవేశపెట్టాడు.

సుహాసిని కడసారి తమ్ముడికి ఒక కూతురు ఉంది. వారు పేదవారే! తన కూతురును వంటమనిషి కొడుకు, వేద పండితుడు కనుక ఇవ్వదలచాననీ, కట్నం ఇవ్వలేననీ, సంబంధం కుదర్చమనీ, అక్కగారిని ప్రాధేయ పడ్డాడు సుహాసిని, భర్త చెవిని వేసింది.

"మనం దానం చేశాము కనుక, మనం చెప్పినట్లు ఆమె వినాలనే అహంకారం పనికిరాదు. అప్పుడు దానం ఫలితం ఉండదు. నీవు నేర్పుగా ఆ పిల్లను, ఆమెకు చూపి, నచ్చినట్లయితే, తర్వాత కార్యక్రమం సంగతి ఆలోచించవచ్చును" అన్నాడు అచ్యుతం. ఏదో మిష మీద పిల్లను రప్పించి, ఆమెకు చూపి, పిల్ల బాగుందా-అని, అడిగి, నీ కొడుకుకు చేసుకుంటావా? అని, అడిగింది, పిల్ల బాగుందన్న తర్వాత.

"అంతా, బాబు గారి ఇష్టం! మీ యింట్లోనే నా జీవితం చాలాభాగం గడచింది. మీరేనన్ను కనిపెట్టారు. ఒక యిల్లు ఇచ్చారు. వారు, నా కొడుకును ఒక ఇంటివాణ్ణి చేస్తానంటే, నాకు అంతకంటి, కావలసినదేమున్నది? కాని, మీ బంధువులకే, ఒక వంట మనిషి కొడుక్కు పిల్ల నివ్వడం, అవమానకరంగా ఉంటుందేమో!" అన్నది, వంటమనిషి.

"అమ్మా! నీవు వంటమనిషి వయినా, వంట మనిషిగా మాత్రమే మాయింట్లో లేవు. గౌరవంగానే మసలావు. వారికిష్టమే!" అన్నది సుహాసిని.

అచ్యుతం, సుహాసిని, పెళ్ళి పీటల మీద కూర్చొని, వేద పండితుడి వివాహం జరిపించారు. వంట మనిషి సంతోషానికి అంతులేదు. అచ్యుతానికి తప్ప, వంటమనిషికి కాని, సుహాసినికి గాని, నిశ్చయతాంబూలం తర్వాత అచ్యుతం తిరస్కరింప బడిన వరుడని తెలియదు. □


ప్రథమ చికిత్సతాలుకు వార్త!

గుండ్రానివీ, పట్టీలూ


కేవలం బ్యాండ్-ఎయిడ్
మాత్రమే వీలైన యీ ఆకారాల్లో వస్తుంది



గుండ్రటి డ్రెసింగ్,
మరేదీ సరిపడదు దీనికి



చదరపు డ్రెసింగ్,
మరేదీ పట్టుకోదు అలా



బ్యాండ్-ఎయిడ్

మరింతగా కాపాడేది, మరింత త్వరగా మాన్పేది.

Johnson & Johnson

OBM/4669/TEL


కాశీ హిందూ విశ్వవిద్యాలయం

కాశీ హిందూ విశ్వవిద్యాలయము ఆసియాలో కెల్లా పెద్దది అర్థ వృత్తాకారంలో పవిత్ర గంగానదికి సమీపాన కాశీ నగరికి దక్షిణాన 2000 ఎకరముల విస్తీర్ణంలో వర్చుకొని ఉంది వైదిక సంస్కృతిని, భారతీయ విద్యా విధానాన్ని పునరుద్ధరించే నిమిత్తం మహామాన్యుడు పండిత మదన మోహన మాలవీయ 1916–17 సం లో దీనిని స్థాపించాడు భారతీయ శాస్త్ర అధ్యయనంతో పాటు కళ, సాహిత్య, వైజ్ఞానిక రంగాలలో కూడ విశేష కృషి చేయాలని మాలవీయ సంకల్పం. అంతేకాదు ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతులకు సమన్వయ రూపం రూపొందించాలని అయన భావించారు. దేశం నలు మూలల నుండి విరాళాలు అందాయి. కావలసిన భూమిని కాశీరాజు దానం చేశారు. .

స్వాతంత్ర్యం సిద్ధించాక విశ్వ విద్యాలయం కొత్త రూపులు దిద్దుకో సాగింది. ప్రభుత్వం దీనిని కేంద్రియ విశ్వ విద్యాలయంగ గుర్తించింది శతాధికమైన విద్యాశాఖలు విద్యార్థుల వసతి గృహాలు ఉద్యోగుల క్వార్టర్సు ఒకే ఆవరణలో కలిగి అందాల భవనాలు, ఆనంద పరిమళాలు వెదజల్లే వివిధ వృక్షజాతులు సువిశాలమైన రహదారులు – అన్నింటికీ రక్షణ యిస్తూ కైలాసనాథుడు (బిర్లా మందిర్) గల లౌకిక అలౌకిక సమన్వయానికి సరియైన చిహ్నము ఈ విశ్వ విద్యాలయము.

వివిధ విభాగాలు.

వ్యవసాయము, కళ, వాణిజ్యము, శిక్షణ, చికిత్స, విధి, ప్రాచ్యవిద్య– ధర్మ విజ్ఞానము, సంగీతము–నాట్యకళ, విజ్ఞానము, సామాజిక విజ్ఞానము, దృశ్యకళ, సాంధ్య మున్నగు విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగము ఒక కళాశాలగ గుర్తించటం జరిగింది. మహిళా కళాశాలతో సహా మొత్తం 14 కళాశాల లున్నయి. తిరిగి ఉపశాఖలున్నయి. ప్రతి ఉపశాఖ (ఉప విభాగము)కు ఒక బవనం ఉంది మొత్తం అన్ని డిపార్ట్‌మెంటులు కలిపి 100 ఉన్నయి ఈ విభాగములలో అధ్యయనం చేసే విద్యార్థులకు గాను 40 వసతి గృహాలు (హాస్టల్స్) ఉన్నయి అందులో 34 ఆవరణ లోపల, 6 వెలుపల ఉన్నయి అన్నీ కలిపి దాదాపు 200 బవనాలతో దివ్యాంగ సుందరంగ ఉంటుంది విశ్వ విద్యాలయము



విశ్వ విద్యాలయం ముఖద్వారము   స్థాపకులు : శ్రీ మదన మోహన మాలవీయ విగ్రహము

దర్శనీయ భవనాలు.

భారత్ కళాభవనము మొదటగా దర్శింప తగినది. ఇందులో వివిధ ప్రాచీన చిత్రపటములు, శిల్పములు, నాణెములు, ముహరులు, లిపులు, వస్త్రములు, లోహ సామగ్రి – అన్నీ కలిపి లక్షకు పైగా ప్రాచీన వస్తువులు యాత్రికులు దర్శించుకొన వచ్చును. భారత సంప్రదాయానికి సంబంధించిన వివిధ ఉపన్యాసములు, గోష్ఠులు యిక్కడ జరుగు తుంటయి. తత్సంబంధమైన ఫిల్ము ప్రదర్శన కూడ

ఉంటుంది. వీని ద్వార వాస్తుకళ, ఇతిహాసము, సంస్కృతి మున్నగు విభాగముల విద్యార్థులకు చక్కని విషయం లభ్యమవుతుంది. ఆ తర్వాత యాత్రికులు భవ్యమైన విశ్వనాథమందిర్ (బిర్లా మందిర్) దర్శిస్తారు. దాని ఎదురుగుండ కేంద్రీయ గ్రంథాలయం ఉంది. ఇందులో ఆరు లక్షలకు పైగా అమూల్య గ్రంథా లున్నాయి. దేశ విదేశాల నుండి 2000 పత్రికలు వస్తుంటాయి. ఇదికాక వివిధ కళాశాలలలో మరో 50 గ్రంథాలయాలు ఉన్నాయి. విమ్మట దర్శించ తగినది మాలవీయ భవన్. ఒకప్పుడు యిది మాలవీయుని నివాసం. ప్రస్తుతం శాస్త్రీయ సంగీతము, భజన,గీతా రామాయణ ప్రవచనాలు జరుగుతుంటాయి. మాలవీయ జయంతి, గాంధీ జయంతి, శ్రీకృష్ణ జయంతి మున్నగు పర్వదినములనాడు పై కార్యక్రమాలు విధిగా జరుపుతారు. ఇటీవల యోగశాస్త్ర అధ్యయన కేంద్రం తెరిచారు. యోగాసన శిక్షణతోపాటు దార్శనిక అధ్యయనము, యోగము-ఆరోగ్య సూత్రముల మిద విశేష అన్వేషణ జరుగుతుంది

1930లో మాలవీయ హింది గ్రంథ అకాడెమి స్థాపించారు దీని ద్వార వైజ్ఞానిక దార్శనిక గ్రంథములు హిందిలో ప్రసార మవుతాయి వివిధ బాషలలో ప్రసారమయ్యే గ్రంథాలు అచ్చు వేసే నిమిత్తం పెద్ద ముద్రణాలయం ఉన్నది

అంతర్జాతీయ ఖ్యాతి


దేశ విదేశముల నుండి ఎందరో విజిటింగ్ ప్రొఫెసర్లు వస్తుంటారు ప్యారిస్‌లోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్శిటీస్‌లోను ఈ విశ్వ విద్యాలయం సభ్యత్వం కలిగి ఉంది అనేక అంతర్జాతీయ సమ్మేళనములు, గోష్ఠులు, చర్చలలో ఇక్కడి అధ్యాపకులు అధిక సంఖ్యలలో పాల్గొంటుంటారు

మూడు వేలమంది విద్యార్థులు వివిధ శాఖలలో అనుసంధానము చేస్తుంటారు ప్రతి సంవత్సరము నాలుగు వందల మందికి డాక్టరేటు ఉపాధి లభిస్తుంది. వీరందరికి రు. 250 నుండి రు. 400 వరకు లభించేటట్లు 353 రకాల స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్పులు అమలులో ఉన్నాయి.

విశ్వ విద్యాలయ చిహ్నము.

"ఓం"కార మండిత హంస వాహినియైన వీణాపాణిని భగవతీ సరస్వతి, కమలముపై అధిష్ఠించిన రూపము విశ్వ విద్యాలయ చిహ్నంగ రూపొందించ బడినది. సరస్వతీదేవి ప్రభా మండలముపై "విద్యా అమృత మశ్నుతే" అన్న ఉపనిషత్ వాక్యం వ్రాయబడి ఉంటుంది.

సరస్వతీదేవి వైదికనామము "భారతి"– తేజస్సుకు వ్యక్త స్వరూపం. ఈమె వాక్కుకు కూడ అధిదేవతయై యున్నది. జైన, బౌద్ధ ధర్మాల్లో కూడ సరస్వతి ఆరాధన ఉన్నది. సమస్త జ్ఞాన, విజ్ఞాన,



కేంద్రీయ గ్రంథాలయము

విద్యా సంస్కృతుల సమన్వయ స్వరూపం ఈమె సరస్వతి శబ్దానికి అర్థం– సరోవరము నుండి ఉత్పన్నమైన దేవి అనగా బ్రహ్మ సరోవరము నుండి ఉద్భవించిన తేజస్సుకు సంకేతం

సృష్టియొక్క జలమునుండి జరిగిన సృజన ప్రక్రియ యొక్క దృశ్యమాన రూపమే కమలము సూర్యుని బృహత్ కమలంగాను మనస్సును సహస్రదళ కమలంగాను కుండలిని అష్ట కమలంగాను భావిస్తారు యోగులు ఇంకా శరీరంలోని స్నాయు మండలములన్నీ కూడ కమల స్వరూపాలేనంటారు అన్ని కమలములలో బ్రహ్మ తేజస్సు ప్రస్ఫుటమౌతుంది


బ్రహ్మ సరస్వతుల వాహనంగ చెప్పబడే హంస సత్వగుణానికి సంకేతం సంస్కార వివేకత్వము బుద్ధి కుశలతకు భావన హంస మానస సరోవరంలో విహరించటమే జ్ఞానం ఆరాధనే–

> అసతో మా సద్గమయ!
> తమసో మా జ్యోతిర్గమయ!
> మృత్యోర్మా అమృతం గమయ!

అని ఉపనిషత్తు వివరిస్తుంది ఆత్మ (హంస) పరమాత్మతో ఏకాకారం పొందటమే పరమ హంస తత్త్వం దానినే పూర్ణ ఆత్మ అంటారు

వేదసారతత్త్వమె ప్రణవ నాదము (ఓం కారము) ఇది అక్షరము త్రిగుణాత్మక ప్రతీకము మానవ శరీరాన్ని వీణ గాను నాడులు తీగలుగాను భావించి

భారత్ కళా భవనము



వానిలో సతతము ధ్వనించు లయబద్ధ ప్రణవనాదమును సంగితంగా చెప్పారు జ్ఞానులు.

పైతత్వాలను ఆరాధించటమే విద్యార్జన, వానిని అనుష్ఠించిన వాడు అమృతసిద్ధి పొందుతాడు. అందుకే 'విద్యా అమృత మశ్నుతే!' అని సరస్వతిని ప్రార్థించుట.

ప్రముఖుల భావన.

'కాశీ' శబ్దానికి వెలుగు, జ్ఞానం అని అర్థం విద్యార్థులు శారీరిక, మానసిక, భావాత్మక ప్రగతి సాధించి దేశసేవకు పాటు పడాలని" భావించారు స్థాపకులు శ్రీ మాలవీయ. ప్రథమ దీక్షాంత సమారోహములో మైసూర్ మహారాజా ప్రసంగిస్తూ భారత దేశంలోని అన్ని మతాల విద్యార్థులకు ఈ




విశ్వ విద్యాలయ ప్రాంగణంలోని
విశ్వనాథ మందిరము

విశ్వవిద్యాలయం జ్ఞాన మందిరం కావాలి!" అన్నారు. "వివిధ నదులు పవిత్ర గంగానదిలో కలిసి ఏకాకారమై పూజ్యమైనట్లు, భారతీయులందరు ఏకాత్మలై భారత సంస్కృతిని విశ్వ మంతా ప్రసరింప చేయాలని విశ్వ విద్యాలయ రజతోత్సవ సందర్భంలో ఉద్ఘాటించారు మహాత్మాగాంధీ. ఎప్పటికైనా అఖిల భారతీయ విశ్వవిద్యాలయం ఒకటి ఏర్పడితే, అది ఈ విశ్వ విద్యాలయం మాత్రమే!' అన్నారు హరకోర్ట్ బటలర్.

డాక్టరు ఇకబాల్ నారాయణ ప్రస్తుతం కులపతి పదవి నిర్వహిస్తున్నారు. "శ్రీ మదనమోహన మాలవియ ఏ భావాలతో, ఆశయాలతో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించారో, వానికి బద్ధులయి త్యాగశీలతతో విశ్వవిద్యాలయ ప్రగతికి మనమంతా పాటుపడాలి" అంటారు ఆయన

వ్యాసం, ఫోటోలు:
— కోప్పెన్ షేక్ మౌలాలీ.

నాకు నచ్చిన నా కార్టూన్




నేను చాలా కార్టూన్‌లు వేశాను. బాలీ కార్టూన్‌లనే శీర్షిక నడిపాను. అయితే అవన్నీ కలిపి ఓ పుస్తకంగా వేద్దామనే ఆలోచన వచ్చేసరికి చాల కార్టూన్‌లు దొరకలేదు. అప్పటికీ 256 కార్టూన్‌లకు కొంచెం అటూ ఇటూగా ఓ పుస్తకం విడుదల చేశాను. మరో 250 కార్టూన్‌లతో రెండో పుస్తకం సిద్ధమవుతోంది. ఇన్ని చేసినా, మొత్తంమీద నాకు ఓ పది కార్టూన్‌లు నచ్చినా నావరకూ నాకు ఇష్టమైనదీ. మరోమారు చూసుకున్నా చటుక్కున నవ్వు వచ్చేదీ ఈ దిగువ ఇచ్చిన కార్టూన్ మాత్రమే. ఇందులో హ్యూమరూ -బొమ్మ సరిగ్గాఅతుక్కుపోయాయి.

అసలు ఈ ఐడియా ఎలా తట్టిందో నాకే తెలీదు. నవ్వుకొన్న తరువాత ఈ ఐడియా ఎలా తట్టిందా అని చాలాసార్లు ఆలోచించాను. సంతృప్తికరమైన సమాధానం మాత్రం దొరకలేదు.

మళ్ళీ మామూలే. ఏది ఏమైనా ఒక్కోమారు కొన్ని ఆలోచనలు మెరుపులా మెరుస్తుంటాయి. వెంటనే కాయితంమీద పెట్టడంలో నే ఉంది గొప్పంతా!

–బాలి



సీరియల్

శుశ్రుత నర్సింగ్ హోమ్

డాక్టర్ కె. రవీంద్రబాబు

(గత సంచిక తరువాయి)

సరోజ గొంతు ఫోనులో ఆదుర్దాగా పలికింది, "డాక్టర్ రఘు పరిస్థితి ఏం బాగు `సు! మీరు వెంటనే రండి" అందామె.

బేసిన్ దగ్గర చేయి కడుక్కుని నర్సింగ్‌హోమ్ వైపు పరుగులాంటి నడక బయల్దేరి వెళ్ళింది.

"అయ్యో! కంచంలో అన్నం వదలి వెళ్తున్నావేమే?" అని వెనక తల్లి అంటున్న మాటలకు సమాధానం కూడా చెప్పలేదు.

మంజు వెళ్ళేసరికి రఘు పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుంది. వూపిరితిత్తుల నుండి మరలా విపరీతంగా నురగవచ్చి ముక్కులు, నోరు దాదాపు పూడి-పోయాయి.

వూపిరి చాలా ఆలస్యంగా లాగుతున్నాడు. కఫం చిక్కబడి ట్రకియాలో నిలబడి పోయింది లాగుంది, శ్వాస ఆడడం కష్టతరమైంది.

"సిస్టర్! ట్రకియాస్టమి ట్యూబ్ వున్నదా?" అని అడిగింది నర్సు సరోజను.

"వుందమ్మా!" అంది సరోజ.

వెంటనే బోయిల్ చేసి ట్రకియాస్టమికి రెడిచేయి అంది.

ఆమె ఇన్‌స్ట్రుమెంట్లు సిద్ధం చేసేసరికి రఘు బట్టలు మార్పించి వెల్లికితలా పడుకోబెట్టి మెడమిద స్పిరిట్‌తో శుభ్రం చేసింది ఇంతలో సరోజ ఇన్‌స్ట్రుమెంట్లు రెడిచేసి, తెచ్చింది.

మెడమిద సరిగా మధ్యలో స్కాల్‌పెల్‌తో ఇన్‌సిషన్ యిచ్చింది. డీప్‌ఫేషియాను నిలువగా కోసి మెడమిది కండరాలను అటు యిటు నెట్టి థైరాయిడ్ గ్లాండ్ కిందుగా ట్రకియారింగులను తాకి చూచి స్కాల్‌పెల్‌తో ఇన్‌సిషన్ యిచ్చింది. ట్రకియాలో అడ్డుపడవున్న కఫం పైకి వచ్చింది సక్షన్ ఏపరేటస్‌తో బయటకు వస్తున్న కఫాన్ని లాగి వేసింది. ట్రకియాలో ఏర్పరచిన చిల్లులో ట్రకియాటమి ట్యూబ్ అమర్చింది మంజు సక్షన్ కేథెటర్



జరిగిన కథ–9: రచయిత, సర్జన్ అయిన రవితో రచయిత్రి, లెక్చరర్ అయిన ఇందువదనకు హైదరాబాద్‌లో పరిచయం అయ్యింది. విజయవాడలో తన ఇంటికి వచ్చిన ఇందూకి చంద్రహాస్ నుంచి వచ్చిన ఉత్తరం సాక్షాత్కరించింది. తనకి కడుపు నెప్పి ఎక్కువగా ఉందని, అందు మూలంగా గుంటూరులోని రవిగారి శుశ్రుతా నర్సింగ్ హోమ్‌లో చేరానని రాసాడు. ఇందుకి చంద్ర మొదట తనని ఎలా అల్లరి పెట్టింది తుదకు ఏవిధంగా ఆప్త మిత్రుడైనది గుర్తుకు వస్తుంది. చంద్రను చూడటానికి గుంటూరు వస్తుంది ఇందువదన రవి ఇంట్లో దిగుతుంది. అక్కడి నుండి ఆ రాత్రే చంద్రను చూడను నర్సింగ్ హోమ్‌కి వెళుతుంది. చంద్ర ఆమెను చూసి ధైర్యం తెచ్చుకుంటాడు. చంద్ర, రాకేష్ ఇందువదన పేరు కలవరించటం విన్న రవి మనసు కల్లోలం చెందుతుంది. రవికి మేనకోడలు గీతను పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు రవి క్లాసుమేటు మంజు అమెరికా నుండి వచ్చింది. చంద్రహాస్‌కి అల్సర్ ఆపరేషన్ జరిగింది. ఇందు, మంజు అక్క చెల్లెళ్ల పిల్లలని తెలుసుకుంటాడు రవి. ఇందు మంజు పినతల్లి కూతురని తెలియగానే రవి అమ్మమ్మకు ఇందుపై అభిమానం పెరిగింది. రవి అమ్మమ్మకు పక్షవాతం వచ్చి పడిపోయింది. రవి స్నేహితుడు రఘు లిల్లీతో తన ప్రేమ విఫలం కావడంతో నిద్ర మాత్రలు మింగాడు. మంజుల, రవి సన్నిహితంగా ఉండటం చూచిన ఇందు మనసు వ్యాకులం చెందుతుంది. రవికి జ్వరం రావడంతో రవి నర్సింగ్ హోమ్‌లోని రఘుని, ఇతర పేషంట్లని మంజు చూసుకోవాల్సి వచ్చింది.

ట్రకియాలో నికి పొనిచ్చి లోపల నిలవవున్న నురుగు ద్రవం పూర్తిగా లాగి వేసింది.

రఘు మరలా వూపిరి తీసుకో గలుగుతుండటం చూసాక మంజు ముఖంలో తృప్తి వెల్లి విరిసింది. కొంతసేపు సక్షన్ కేథెటర్‌తో ట్రకియాలోని ద్రవాలు లాగివేయటం కొంతసేపు ట్రకియాటమి ట్యూబ్ ద్వారా ప్రాణవాయువు పంపటం ఇలా మార్చి మార్చి చేస్తుంటే కొంతసేపటికి నల్లబడ్డ అతని దేహం మామూలు



రంగుకు వచ్చింది. నీలం రంగులో వున్న గోళ్ళు గులాబివర్ణం దాల్చాయి! బి. పి., పల్సు మామూలు స్థాయిలోకి వచ్చాయి!

రఘు పరిస్థితి సంతృప్తికరంగా వుందనుకున్నాక మంజు మనసు కుదుట పడింది.

"నరసమ్మగారు సొమ్మసిల్లి పడిపోయారు. పొద్దుటి నుంచి ఆమె పచ్చి గంగ ముట్టలేదు. ఏడ్చి ఏడ్చి నీరసించి పోయారు" అంది సరోజ.

మంజు లేచి నరసమ్మగారి వద్దకు వెళ్ళింది. నేలమీద పడి వెక్కుతున్నదామె!

"ఆంటీ! నీ బిడ్డ ప్రాణాలు నిలిపే బాధ్యత నాది! కాని నువ్వు నేను చెప్పినట్లు వినాలి."

నమ్మలేనట్లు చూసింది నరసమ్మగారు.

"అవునమ్మా! డాక్టరు రఘు పరిస్థితి బాగా మెరుగయింది! మీరు ధైర్యంగా వుండండి" అంది సరోజ.

నమ్మలేనట్లు వెళ్ళి రఘును చూచి వచ్చింది నరసమ్మగారు. కొడుకు ముఖం కళకళలాడుతుండటంతో ఆమెకు ధైర్యం వచ్చింది. వెనక్కి తిరిగివచ్చి బల్లమీద చతికిలబడిందామె. సరోజ ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి తెచ్చి యిస్తే మంజు కప్పును నరసమ్మగారి కందించింది

మాట్లాడకుండా కాఫీ తాగింది నరసమ్మగారు. విస్తుపోయి చూస్తున్న మంజుతో –

"అమ్మా మంజూ! నా బిడ్డకు ప్రాణదానం చేసావు. నీ చేతులతో ఇచ్చినది నాకు అమృతంతో సమానం!

అయినా ఆచారాలను పట్టుకు వేలాడి చెట్టంత కొడుకును పొట్టను పెట్టుకో బోయాను! ఇక జన్మలో మళ్ళీ పొరపాటు చేయను" అని మంజును కౌగలించుకుని బావురుమని ఏడ్చింది.

"డాక్టరుగారూ! ట్రకియాటమి ట్యూబ్ బ్లాకయింది" అంటూ వచ్చింది సరోజ.

మంజు వెళ్ళి ట్యూబు తీసి క్లీన్‌చేసి మరలా అమర్చి సక్షన్ కేథెటర్‌తో లోపలవున్న కఫాన్ని లాగివేసింది. రఘు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మరలా మామూలుకు వచ్చాయి!

తను భోం చేయలేదని గుర్తొచ్చినా ఇక ఇంటికి వెళ్ళాలనిపించలేదు మంజుకు. రఘుకు ఏ నిముషంలో ప్రమాదం చేస్తుందో తెలియదు. చేతిన వున్న గాజులు మెడలో వున్న గొలుసు తీసి డ్రాయరు సొరుగులో వేద్దామని తాళం తీసి సొరుగు లాగింది. లోపల రఘు దస్తూరితో వ్రాసిన వుత్తరం వున్నది. రఘు విషయం తెలవాలంటే ఆ వుత్తరంలో వివరాలుంటాయేమోనని తీసి చదివింది మంజు

ఉత్తరం చదివాక ఆమెకు రఘు మీద విపరీతమైన జాలి కలిగింది! ఉత్తరం డ్రాయరు సొరుగులో వుంచి తాళం వేసి సోఫా మీద నడుం వాల్చింది మంజు.

తెల్లవారే లోపల రఘు కోసమై అరడజను సార్లు లేవవలసి వచ్చిందామె లిల్లీ సంగతి తెలిసిన దగ్గర్నుండీ ఆమెకు బాధ కలిగింది ఒక అమాయక యువకుణ్ణి ప్రేమ వ్యామోహంలో ముంచెత్తి చివరకు డబ్బు కోసమై అతన్ని అర్థాంతరంగా వదలి వేరొకరిని వివాహమాడిందామె!

రఘు చాల సున్నిత మనుస్కుడు ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా

శుశ్రుత నర్సింగ్ హోమ్

అలోచించేవాడు.

పెండ్లి చేసుకుంటాననే ఆశ కల్పించి చివరకు మోసం చేసాడనే దిగులుతో ఆడపిల్లలు ఆఘాయిత్యం చేసుకుంటారు! కాని ఇక్కడ తద్విరుద్ధంగా భ్రమలు కల్పించిన భామ మోసం చేసిందని రఘు అఘాయిత్యానికి పాల్పడ్డాడు!

తెల్లవారుతుండగా "ఇక లాభం లేదు! ఇంటికి వెళ్ళి పడుకుంటా" అనుకుని బయల్దేరబోయింది మంజు. రాకేష్ తల్లి సుందరమ్మ వచ్చింది.

"ఏమ్మా! రాకేష్ ఎలా వున్నాడు?" అంది మంజు.

"అబ్బాయి బాగానే వున్నాడు! మీతో కొంచెం మాట్లాడాలి" అందామె.

"రండి! కూర్చోండి"

"ఇక్కడ కాదమ్మా! మీరు ఇంటికి వెళుతున్నారు. నేను కూడా మీ వెంట వచ్చి యింటి దగ్గర చెబుతా"

"సరే!" అంటూ ఇంటి వైపుగా బయల్దేరింది. వెంట సుందరమ్మ గారూ వచ్చారు.

ఇంటికి వెళ్ళగానే ముందు సావిత్రమ్మగారి దగ్గరకు వెళ్ళింది మంజు. ఆమె గుర్తు పట్టినట్టుగా నవ్వింది. నవ్వుతున్నప్పుడు ముఖం కొద్దిగా పక్కకు పోయింది.'పరవాలేదు! పరిస్థితి మెరుగవుతున్నది' అనుకుని ఆ తర్వాత రవి గదిలోకి వెళ్ళింది. అతని వళ్ళు కాలిపోతూ వున్నది. మనిషి మగతగా వున్నాడు. పిలిచినా పలకలేదు. బలవంతంగా అతన్ని కూర్చోపెట్టి ముఖం కడిగించి కాప్స్యూలు వేయించి కొంచెం కాఫీ తాగించింది.

తిరిగి వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుంటూ "రండమ్మా! ఇలా వచ్చి కూర్చోండి" అంటూ సుందరమ్మ గారిని కేకేసింది.

ఆమె వచ్చి కూర్చుంటూ "మీ వృత్తి ఎంత కష్టమమ్మా. రాత్రంతా నర్సింగ్‌హోమ్‌లో శ్రమపడ్డావు. ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకోవాలసిన సమయంలో నేను ఇలా వచ్చి నిన్ను బాధ పెడుతున్నాను! ఏమీ అనుకోకు!

మాకు వొక్కడే కొడుకు. వాడిని చిన్నప్పట్నుంచి ఎంతో గారాబంగా పెంచాము! కొండ మీద కోతి కావాలంటే మరునిముషంలో వచ్చే ఏర్పాటు చేసాము. అందుకని వాడికి మంకుపట్టు ఎక్కువై కావాలనుకున్నది సాధించక పోతే పిచ్చి కోపం వచ్చేది. అలా కోపం వచ్చినపుడు వాడికి యుక్తాయుక్త విచక్షణ వుండేదిగాదు.

తనకు దొరకని వస్తువు వేరెవరి దగ్గరన్నా వుంటే భగ్నమనేవాడు! తను కావాలనుకున్న వస్తువు వేరెవరి దగ్గరా వుండ కూడదు అని అనుకునే వాడు.

వాడు ఆరేళ్ళ వయసుతో వుండగా వొక సంఘటన జరిగింది. మా యింటి పక్కన పంజాబీ దంపతులుండేవాళ్ళు. వాళ్ళకు వొక ఆడపిల్ల వుండేది. ఆ పిల్ల పేరు షాలిని. ఆ అమ్మాయికి మా వాడి వయసే వుండేది. ఒకసారి ఆ అమ్మాయికి వాళ్ళ మామయ్య సింగపూరు నుండి మాట్లాడే బొమ్మ తెచ్చి యిచ్చాడు. ఆ అమ్మాయి బొమ్మ చూడటానికి అందరితో పాటు వీడూ వెళ్ళాడు.

ఇంటికి తిరిగి వచ్చిన దగ్గర్నుండి వొకటే ఏడుపు, తనకు అలాంటి బొమ్మ కావాలని. వూరంతా గాలించాం గాని అలాటి బొమ్మ దొరకలేదు. వాడిని మరిపించటానికి ఎన్నో రకాల బొమ్మలు తెప్పించాము.

'ససేమిరా నాకలాంటి బొమ్మే కావాలి' అని గోల పెట్టాడు. వ్యాపారస్తులు కొంతమంది సింగపూరు వెళుతుంటే అలాంటి బొమ్మ తెమ్మన్నాం.

వాళ్ళు వారం రోజులలో తిరిగి వచ్చారు. వాళ్ళకు అక్కడ అలాంటి బొమ్మ దొరకలేదు. వేరే బొమ్మలు తెచ్చారు. అవి వాడిని తృప్తిపరుచలేదు.

ఆ సాయంత్రం వాడు పక్కింటికి వెళ్ళాడు. పక్కింటి వాళ్ళమ్మాయి మాట్లాడే బొమ్మతో ఆడుకుంటున్నది. వీడు పోయి ఆ అమ్మాయి చేతిలో బొమ్మను లాక్కుని వీధిలోకి గిరవాటెట్టాడు. వీధిలో వెళుతున్న లారి కింద పడి బొమ్మ ముక్కలయిపోయింది.

పక్కింటమ్మాయి ఏడ్చి గోలెడుతుంటే వీడు సంతోషంగా తిరిగి వచ్చాడు.'

ఆశ్చర్యంగా చూస్తూ వున్న మంజుతో మరలా ఇలా అంది సుందరమ్మ-

"రాకేష్ చిన్నప్పటి సంగతులెందుకు చెబుతున్నానని అనుకుంటున్నావు గదూ!

వయసు వచ్చినా వాడి బుద్ధి మారలేదు. కాలేజీలో చదివేప్పుడు ఇందువదన అనే అమ్మాయిని మా వాడు ప్రేమించాడు. ఆ అమ్మాయి మీ చెల్లెలని నిన్ననే తెలిసింది!

మా వాడు ఆ అమ్మాయిని ప్రేమించినవాడు ప్రేమించినట్లు వుండక ఆమె వెంటబడి తన ప్రేమను బహిర్గతం చేయటానికి ప్రయత్నించాడు.

మీ ఇందుకు మా వాడుగాని వాడి పద్ధతులు గాని నచ్చలేదు గాబోలు వీడిని ఆమడ దూరంలో చూడగానే తప్పుకునేది.

ఇందు తనను తిరస్కరిస్తున్నదని తెలుసుకుని రాకేష్ తెగ బాధ పడ్డాడు. బాధ కోపంగా మారింది. కోపం నుండి ప్రతికార వాంఛ కలిగింది ఆ అమ్మాయిని ఎలాగైనా అవమానించాలని విశ్వప్రయత్నం చేసాడు సర్వశక్తియుక్తులూ ధారపోసాడు! కాని వాడి ప్రయత్నం ఫలించలేదు.

రాకేష్ తన ప్రతీకారం తీర్చుకోటానికి డబ్బు ఎరజూపి చంద్రను వుపయోగించుకున్నాడు. కాని చంద్ర ఇందును పరాభవింపబోయి పరాజయం పొంది ఆమె అభిమాని అయిపోయాడు.

జరిగిన విషయాలు మా వాడి అహాన్ని దెబ్బ తీసాయి. మా వాడు ఆ కాలేజీ నుంచి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తీసుకుని వచ్చేసాడు.

కాని వాడు ఇందును మర్చిపోలేకపోయాడు ఆవేటి కావేడు వాడికి ఆమె మీద ప్రేమ ఎక్కువయింది గాని తగ్గిపోలేదు. అందాల బొమ్మల్లాంటి పిల్లలను చూపించాము. వారిలో ఎవరిని వివాహం చేసుకోవటానికి వాడు వొప్పుకోలేదు.

కొంత కాలం వుంటే వాడు ఇందును మర్చిపోతాడేమోనని చూచాము. కాని సంవత్సరాలు గడిచినా వాడామెను మర్చిపోలేకపోయాడు! మనసులోని మంటను చల్లార్చటానికి మందు పుచ్చుకోవటానికి అలవాటు పడ్డాడు.

ఒక్కగానొక్క బిడ్డ జీవితంలో స్థిరపడకుండా ఇలా తెగిన గాలిపటంలా మారిపోవటం మాకిద్దరకూ మనస్తాపం కలిగించింది.

ఇంతలో కారు ఏక్సిడెంటయి ప్రమాదం పాలయాడు. డాక్టరు రవి గారి చలువన బతికి బయటపడ్డాడు. పక్క రూమ్‌లో చంద్ర దగ్గర ఇందును చూసిన దగ్గర్నుండి మావాడు కుతకుతలాడి పోతున్నాడు.

మానుతున్న గాయం మళ్ళీ రేగినట్లున్నది' నిన్న నాకు మాటల సందర్భంలో నర్సు సరోజ మీరు ఇందు అక్క అని చెప్పింది. అందుకని యీ విషయం మీ చెవిన వేసి వెళదాం అని వచ్చాను" అంది సుందరమ్మ.

"నేను ఇందుతో మాట్లాడి ఆమె మనసులో ఏముందో తెలుసుకుంటాను" అంది మంజు.

"మావాడికి ప్రాణభిక్ష పెట్టాడు డాక్టరు రవి. ఆయన్నొకసారి చూచి వెడతానమ్మా!" అని డాక్టరు రవి గదిలోకి వెళ్ళి చూచి వెళ్ళిపోయింది సుందరమ్మ.

ఆమె అలా వెళ్ళగానే తల రెండు చేతులలోకి తీసుకుని కూర్చుంది మంజు

శుశ్రుత నర్సింగ్‌హోమ్‌లో ఒకో పేషెంటు బాధ వెనకా ఇంత గాధలున్నాయి! కాస్త కాళీ దొరికతే ఇందును యీ విషయమై కదపాలి అనుకుంటూ నిద్ర ముంచుకు రాగా సోఫా మీదే పడుకుని నిద్రపోయింది మంజు.

మంజు నిద్ర లేచేసరికి పది గంటలయి పోయింది. గీత కాఫీ తెచ్చి యిస్తే తాగి స్నానం చేసి వచ్చింది. సావిత్రమ్మ గారికి ఇంజక్షన్ చేసి బిళ్ళలు మింగించి రవి ఎలా వున్నాడో చూద్దామని అతని రూమ్ దగ్గరకు వెళ్ళింది జ్వరం తగ్గుముఖం పట్టిన సూచనలు లేవు' మూసిన కన్ను తెరువకుండా పడి వున్నాడు. అతనిక ఇవ్వవలసన మందులు మింగించి హాస్పటల్‌కు బయల్దేరింది.

రఘు పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది. స్పృహలేదని తప్ప అతను అన్నివిధాలా మామూలుగా వున్నాడు వూపిరితిత్తులలో కఫం చాలా వరకూ తగ్గిపోయింది మూత్రం ఇన్‌డ్వెలింగ్ కాథెటర్ నుండి తగు పరిమాణంలో

వస్తూనే వున్నది రక్తపోటు, నాడిస్పందన సంతృప్తికరంగా వున్నాయి

మల్లిక ఆరోగ్యం చాలా బాగా వున్నది కాని ఆమె పులి అరుపు విన్న మేకపిల్లలా గడగడ వణికిపోతున్నది

"ఏమిటమ్మా? అలా వున్నావు?" అని అడిగితే సమాధానంగా కళ్ళ వెంట నీళ్ళు పెట్టుకుంది.

ఇంతలో వీరయ్య ఆస్పత్రికి వచ్చి నానాఅల్లరి చేసాడు.

"నువ్విట్టా ప్రాణాలు తీసుకొని పోయావని మా వాళ్ళు వూరంతా అల్లరి మొదలెట్టారు.

అదేంలేదు మల్లికకు పురుగు ముట్టిందని చెప్పినా ఎవరూ వినటంలా! ఇప్పుడు నీకు వంట్లో బాగానే వుంది గదా! ఇక ఇంటికిరా! వూళ్ళో పుకార్లణిగిపోతాయి' అన్నాడు వీరయ్య.

అతన్ని చూస్తూనే మల్లి గడగడ వణికిపోయింది. 'అమ్మాయి ఆరోగ్యం ఇంకా బాగుపడలేదు! ఇంకా కొన్నాళ్ళు మందు తినాలి" అని నేనన్నా వినిపించుకోలేదు. బలవంతానయినా మల్లిని తీసుకెళ్ళాలని చూచాడు.

ఇంతలో ఆయా వచ్చి "అట్టా అరవగాక అమెరికా డాక్టరమ్మ వత్తున్నారు' అంది. మిమ్మల్ని వీధి చివర చూడగానే పరిగెత్తుకు వెళ్ళిపోయాడు.

మీ విషయమై సుబ్బులు వాడిని బాగా భయపెట్టినట్టుంది!' అంది సరోజ.

సరోజ మాటలకు నవ్వు వచ్చింది మంజుకు

"కాని మీరు ఇక్కడ లేనప్పుడు వచ్చి ఏం అఘాయిత్యం చేస్తాడో అని భయంగా వుందమ్మా" అంది మల్లిక తల్లి

అలాగయితే మల్లికను డాక్టరు రవి గారింట్లో వుంచండి సావిత్రమ్మ గారిని కనిపెట్టుకుని వుంటుంది! మీకు వీరయ్య బెడద తప్పుతుంది అంది మంజు.

'అలాగేనమ్మా! ఇప్పుడు వీరయ్య వెంట మల్లికను పంపిస్తే దాన్ని చిత్రవధ చేస్తాడు కొన్నాళ్ళు పని నేర్పించి ఇక్కడే నర్సుగా అట్టి పెట్టుకుంటాం అని రవి డాక్టరు గారు అన్నారు అంది సరోజ

'సరే అలా అయితే మధ్యాహ్నం నేను వెళ్ళేప్పుడు మల్లికను నా వెంట తీసుకు వెళతాను అంటూ మిగిలిన రోగులను చూడటానికి వెళ్ళింది మంజు

రప్చర్ యుటిరస్ కేస్ సుశీల ఆరోగ్య పరిస్థితి బాగా వుంది గాని 'ఇక జన్మలో తల్లిని గాలేను' అనే వాస్తవం ఆమెను మానసికంగా కుంగదీసివేస్తున్నదిలా వుంది. మనిషి దిగులుగా వున్నది.

"ఈమె దిగులు పోగెట్టేదెలాగో?' అనుకుంటూ అవతలకు వెళ్ళింది మంజు.

కాలు విరిగిన అతను బాగా కోలుకున్నాడు అతనికి పత్యం పెట్టమని చెప్పింది మంజు

చంద్ర పరిస్థితి బాగా మెరుగయింది. హార్లిక్సు గాని పండ్లు గాని ఇవ్వమని చెప్పింది ఇందుతో.

"మాడక్కా! పొద్దున నేను కాసేపు లేకపోతే వార్డుబోయ్‌తో సిగరెట్ పెట్టె తెప్పించుకొన్నాడు నేను వచ్చేసరికి మంచం చుట్టూతా సిగరెట్ పీకలున్నాయి అని కంప్లెయింట్ చేసింది ఇందు.

"ఏమయ్యా చంద్రా! నిజమేనా?"

"లేదండీ! పొద్దున నా స్నేహితుడొకడు వచ్చి కాసేపుండి వెళ్ళాడు. అతను కాల్చి పడేసినవి ఈ సిగరెట్ పీకలు

"చంద్రా! అబద్ధాలాడడం నాకు బాగా చేతగాదు. ఇదిగో దిండు కింద సిగరెట్ పెట్టె!'

"నువ్వు సిగరెట్ తాగావంటే మళ్ళ అల్సరు వస్తుంది ఇక ఆపైన నీ యిష్టం" అంది మంజు.

"అమ్మో! అలాగయితే చస్తే సిగరెట్ తాగను. ఇదివరకే ఈ జన్మకు సరిపడా అల్సరుతో బాధపడ్డాను! ఇంకా బాధ వోర్చుకునే శక్తి లేదు నాకు!"

"ఆ! అలా దారికి రా!' అంటూ పక్కనున్న రాకేష్ రూమ్‌లోకి వెళ్ళింది మంజు.

అతని పరిస్థితి సంతృప్తికరంగా వున్నది. తల మీద బాండేజి మార్పించింది మంజు. ఇన్[illegible]ంట్సును చూచాక వెళ్ళి వో. పి చూడటానికి కన్సల్టింగ్ రూమ్‌లో కూ[illegible] మంజు.

డాక్టరు రవి లేడని లోపలకు రావటానికి సందేహిస్తున్న పేషెంట్సుతో ఆయా 'ఈమె ఎవరనుకున్నారు' అమెరికా డాక్టరమ్మ! పొద్దున ఆమె డాక్టరు రఘుబాబుకి ఆపరేషన్ చేసారు' అని చెబుతుంటే-

"అలాగా!" అంటూ వచ్చి మంజుకి చూపించుకోసాగారు మధ్యాహ్నం రెండింటికి వో. పి అయిపోయారు. ఇంటికి వెళ్ళాం అని బయల్దేరుతుంటే సరోజ వచ్చి-

"నరసమ్మ గారు మంచినీళ్ళయినా తాగలేదు పొద్దుట్నుంచి! హోటల్ నుండి పాలు తెప్పించి అట్టిపెట్టాను. కాని ఆమె వాటిని తీసుకోలేదు అంది.

పాలగ్లాసు, బల్ల మీద వున్న పండ్లు తీసుకుని నరసమ్మగారి దగ్గరకు వెళ్ళింది మంజు ఆమెను చూడగానే-

"సరోజ నా మీద చాడీలు చెప్పినట్టుంది' అంది నరసమ్మ మారు మాట లేకుండా మంజు ఇచ్చిన పండ్లు తీసుకుని పాలు తాగిందామె'

రాము పరిస్థితి సంతృప్తికరంగా వున్నది మంజు ఇంటికి వెళ్ళింది. ఆమె వెంట మల్లిక వచ్చింది!

సావిత్రమ్మగారు పూర్తిగా బాహ్యస్మృతిలోకి వచ్చారు. మాట తిరిగి చెప్పలేదు గాని జరిగే విషయాలన్ని తెలుస్తున్నాయామెకు.

రవి మంచం దగ్గరకు వెళ్ళింది మంజు ఎంత సేపు పిలిచినా తిరుగు జవాబు చెప్పలేదతను. టెంపరేచర్ చూస్తే నూట నాలుగు డిగ్రీల పైన వున్నది వాంతి చేసుకున్న పక్కంతా దుర్గంధంతో నిండిపోయి వున్నది చేతులు కాళ్ళూ బిగుసుకు వున్నాయి మంజుకు అతన్నాస్థితిలో చూడగానే భయం పుట్టింది! ఇదేం ఎన్‌కెఫలైటిస్ కాదు గదా" అనే ఆలోచన రాంగానే వణికిపోయింది

మెడిసిన్ ప్రొఫెసర్ రామారావు గారికి ఫోన్ చేసింది మంజు 'సార్! ప్లీజ్ కమ్ అండ్ సి డాక్టర్ రవి వన్స్' అందామె ఫోన్‌లో. తెలుగులో మాట్లాడితే సావిత్రమ్మగారు మల్లిక. భూదేవి వింటారనే భయంతో

'అయామ్ కమింగ్' ఐవిల్ బి దేర్ ఇన్ హాఫియాన్ అవర్ అని ఆయన అన్నాడు ఆ మాట విన్నాకగాని ఆమెకు మనసు కుదుటబడలేదు

(ఇంకా ఉంది)

రాష్ట్రపతి భవన్‌లో భగవద్గీత


తిరుమలశ్రీవెంకటేశ్వరస్వామివారి దేవాలయం మొదలగు దేవాలయములందలి గోడల మీద ఆయా దైవానికి సంబంధించిన పురాణగాధ, మరియు ధ్యాన శ్లోకాలు చిత్రాలతో సహ వ్రాసి యుండడం మనకు తెలిసిందే.

తంజావూరు దగ్గర తిరువైయ్యారులో యుండు, కర్నాటకసంగీత పితామహులైన శ్రీ త్యాగరాజస్వామి వారి సమాధిమందిరంగోడల మీద శ్రీ స్వామివారి కృతులు వ్రాయబడి యున్నాయి

శ్రీ రామకృష్ణమఠం లాంటి మఠాలలో ఆయా మహాత్ముల ఉపదేశాలు వ్రాయబడి యుండవచ్చు. ఇందులో ఆశ్చర్యపడవలసినదేమి లేదు – గాని ఢిల్లీలో యుండు మన భారత రాష్ట్రపతి భవన్‌లో ఒక భాగంలోని పైకప్పు లోపలి భాగంలోనూ, కప్పుకు దగ్గరగా యుండు గోడల పైభాగంలోనూ శ్రీమద్భగవద్గీత (అక్కడక్కడ కొంత భాగం) దేవనాగరి లిపిలో బంగారు వర్ణంలో వ్రాయబడి యుండుట చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది కదా!

చాలా కొద్ది వ్యవధిలో రాష్ట్రపతి భవనాన్ని చూడవలసి వచ్చినందు వలన ఈ భవనంలో గీతను వ్రాయించడంలో గల ఔచిత్యం, అక్కడక్కడ భాగాలను మాత్రమే వ్రాయించడంలోను గల అంతర్యం గ్రహించడానికి అవకాశం చాలకపోయినది తీరికగా వెళ్ళి విస్తృతాధ్యయనం చేస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడి కావడానికి అవకాశముండగలదు.

– ఆయుర్వేద శిరోమణి రాజరాజేశ్వరశర్మ



సోలిడైర్ CTS 919 & CTS 605

అత్యున్నత సాంకేతిజ్ఞత ఉత్పాదనలు వాటి నిర్దిష్ట ప్రత్యేక జన్మస్థానం— పశ్చిమ జర్మనీ


సోలిడైర్ రంగుల టీవీలు. అవి ప్రపంచ క్లాసు రంగుల టీవీలు. సాంకేతిజ్ఞతలో అత్యద్భుతం. రూపకల్పనలో ప్రవీణ్యత. ప్రపంచ వ్యాపిత సాంకేతిజ్ఞత సాంప్రదాయిం చిరకాలం మన్నే సరకులను మాత్రమే మీ కివ్వడానికి పేరొందినది.

పారేసే పనికిరానివాటిని ఎన్నడూ యివ్వదు. అత్యధికమైన యితర టీవీలలాగా కాదు—

సోలిడైర్ లోని సర్క్యూట్ మన తీవ్ర వాతావరణ పరిస్థితులను తట్టుకోగలది. అంతేకాదు సోలిడైర్‌లో వుపయోగించే విడిభాగాలు లోపాలు అనలే లేనివి, ప్రపపచంలో అత్యున్నతస్థాయికి చెందినవి, అవి ఐటిటి నుంచి పశ్చిమ జర్మనీ ప్రెహ్‌నుంచి వచ్చినవి.

ప్రపంచ క్లాసు విశిష్టతలు:

- తక్షణం స్టార్ట్ అవుతుంది. కళ్ళు మిరుమిట్లు గొలిపే రంగుల ప్రత్యక్షానికి 90 డిగ్రీల ఇన్‌లైన్. బ్లాక్‌స్ట్రైప్ పిక్చరు ట్యూబ్
- అతితీవ్రమైన వోల్టేజి పరిస్థితులను తట్టుకుని నిల్వగల SMPS



ట్రాన్సియంట్ వోల్టేజి ఎగుడు దిగుళ్ళ నుంచి
రక్షణకు OVT స్పెషల్ డిజైన్.
LOT ఎలక్ట్రానిక్ ట్యూనర్, కలర్ ఐసిలు
MOSFET పరికరాలలో అతినవ్యతరం
విసిఆర్, విడియో గేమ్‌లు హోం కంప్యూటర్,
టెలిటెక్స్ట్ సౌకర్యాలు.
20 రకాల పనులు నిర్వర్తించే కార్డ్‌లెస్
రిమోట్ కంట్రోలు- అందులో ప్రతి పనికీ
వేర్వేరు కంట్రోలు
బటన్ తాకితే చాలు రిమోట్ పవర్ ఆఫ్

Solidaire
AUTHORISED SERVICE CENTRE FOR
ITT
COLOUR TVs

Solidaire COLOUR
-that seldom fails!

Insight DE 243


వేళ్ల మధ్య చుట్ట ఆరిపోయిందని శర్మగారు గుర్తించనేలేదు. పడకకుర్చీలో కూచుని ఆలోచిస్తున్నారు గజిబిజిగా ఆలోచనలు వస్తున్నాయి.... మనిషి అసలు ఇంతకాలం బ్రతక కూడదేమో!

కాని చావుబ్రతుకులు మనిషి చేతిలో లేవుగా! మనిషి ఇక్కడికి రావడమూ, ఇక్కడ ఉండడమూ- ఇక్కడ నుంచి పోవడమూ అన్నీ నిశ్శబ్దంగా భరించవలసిందే.

–సమస్యలు రావడం వేరు. మనసు కలత చెందడం వేరు. సమస్యలు తనకు కొత్తకాదు. కాని కలత.... దీనికి పరిష్కారం ఎలా?

బుగతగా బ్రతికినన్నాళ్ళు మనసులో కలత రాలేదు

–భూములు పోయాయి. మేస్టరు గిరిక కుదిరి



పింఛను పుచ్చేసుకోవటమూ జరిగింది. .

ఆదాయం పుష్కలంగా వచ్చిన రోజులూ ఉన్నాయి... రెండో వాడు కాలేజీలో చేరే సమయానికి డబ్బు ఇబ్బందులు ఎదురయ్యాయి.. ముసలితల్లి ఆరోగ్యం దెబ్బతినడం – రెండో పిల్ల పెళ్ళి . చాపచిరిగి మిగిలిన చదరా అయిపోయింది ఆ రోజున కూడా మనసులో కలత కలగలేదు. గుండెలో ముల్లు గుచ్చుకున్న బారేల్‌మనే బాధా కలగలేదు.

మార్పు సహజం... కాలం అంతా ఒక్కలా వెళ్లదు అన్నమాట ఎదురులేని నిజం.

మార్పుకి అతీతమైన విలువలు శిలాక్షరాలుగా – శిథిలం లేకుండా మిగిలిపోతాయి.

–తల్లి తన చేతిలోనే ఐదేళ్ల క్రిందట కళ్ళు మూసింది. దిన వారాలకి మునసబు దగ్గర రెండువేలు అప్పుచెయ్యాల్సి వచ్చింది. తనదగ్గర కొన్ని వందలసార్లు అప్పు తీసుకున్న మనిషి దగ్గర అప్పు తీసుకున్నప్పుడు కూడా మనసుకి కలతకలగలేదు.

రెండవవాడి చదువయిపోయి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. మారాజు పట్నం ...

పిల్లలు ఇంటికి వచ్చి పాఠాలు చెప్పించుకుని పదిపాతికా ఇస్తూనే ఉన్నారు.

కాలక్షేపం జరిగిపోతోంది.

డబ్బువల్ల ఆనందంరాదు.... ఆనందం మనసులో ఉంది. గంజినీళ్ళు త్రాగయినా తృప్తిగా జీవితం గడపగలిగితే అంతకంటె వేరే ఆనందం ఉండబోదు.

–ఇటీవలనే మనసులో కలత కలుగుతోంది –"ఆఁ! చేసెరు నిర్వాకం! నలభై తులాల బంగారం.... మా వాళ్ళు బాల తొడుగుగా పెట్టిన వో పది తులాలు .. అంతా పోయింది. ఈ సంసారానికే పెట్టాను . నేను మాత్రం ఏమడిగానూ? కట్టు కాసులపేరు కావాలన్నానా? వడ్డాణం చెయించుకుంటానన్నానా?. . పిప్పి పిసరూ ఈ నలుసులకే పెట్టాను... నాదని ఒక్క వెయ్యి రూపాయలు కావాలనుకోడం తప్పా?.. పశువుకి తిన్నదిపుష్టి.... మనిషికి ఉన్నది పుష్టి అన్నారు.

శర్మగారు తరచు ఈ మధ్య ఈ మాటలు – సణుగుడు వింటూనే ఉన్నారు.

బంగారం అమ్మినమాట నిజమే.. తనే అమ్మాడు.... కాని అమ్మడం దేనికి?.... ఇద్దరు పిల్లల చదువూ పెద్ద కొంప వచ్చేవాళ్ళూ, వెళ్ళేవాళ్ళూ.. పెళ్ళిళ్ళూ పేరంటాలు.... పురుళ్ళూ, పుణ్యాలు.... జబ్బులూ, చావులూ... ఏదయినా మానెయ్యగలిగింది ఉందా?

భూములున్న రోజుల్లో గాదెల నిండా ధాన్యం . ఏదీ కొనుక్కోనక్కరలేని పరిస్థితి .. చూస్తుండగానే భూములన్న 'హుష్! కాకి' అయిపోయాయి.

బియ్యం కొనుక్కోవడమంటే తల తీసేసినట్టుండేది.

మార్పు! కాల సహజం!

పెద్దాడు దూరంగా వెళ్ళినా ... మా రాజుపట్నంలోనే దొరికింది చిన్నాడికి ఉద్యోగం .. అదెంత కాదు .. అద్దె యిర్ర తీరిపోయింది.

– వెధవ ఆస్తులు ... ఏది శాశ్వతం ... వెళ్లేటప్పుడు ఏది తీసుకుని వెళ్లలేం . బ్రతికినన్నాళ్ళు భుక్తికి లోపం లేకుండా ఉంటే అంతే చాలు . ఆస్తి పోయిందన్న చింత తనకు ఏనాడూ లేదు. చింత ఉంటే మాత్రం ఆస్తి పోయిందని పోగలమా? ఇదంతే!

చిన్నవాడి భార్య కాంతం ఉద్యోగం చేస్తానని ఒకటే గోల!

'నాన్నా' రోజులు మారాయి .. మీ ఎదుట మాటాడుతున్నానని మరోలా అనుకోకండి ... ఈ కాలం బ్రతుకులే వేరు .. లోగిలిలో వాలు కుర్చీమీద కూచుంటే రైతులు ఇంటికి తెచ్చి గింజలు కొలిచె రోజులు పోయాయి . ఇతరుల శ్రమ మీద బ్రతకడం కంటే మన తిండి మనం సంపాదించుకోవడం మెలు కదూ! అది మేలనుకుంటే మనం ఒళ్ళు వంచి పని చేసుకోవాలి ::: ఇంతకీ కోరి చదువుకున్న పిల్లని కట్నం లేకుండా చేసుకున్నారు మీ కోడలిగా .. మనలాగే చితికిపోయిన వాళ్లే వాళ్ళూ ... మీకు ఎంత అవగాహన ఉందో నాకు తెలుసు నాన్నా! ... దాని సంపాదన మీద ఆశ అని కాదు ... ధరలు మండిపోతున్నాయి రోజలూ అలాగే ఉన్నాయి...

ఎవరినని ఏం లాభం? ఒక్క చేతి మీద సంపాదన .. మన తిళ్లకి చాలదు . మీరూ ఆలోచించండి .. మీకు కష్టం కలిగించకూడదనే ఇన్నాళ్ళూ ఊరుకున్నాను . అమ్మ ససేమిరా వీలులేదంటోంది .. ఆ బడిలో నాలుగు వందలిస్తామని మరి మరి నన్ను బ్రతిమాలాడు ఆయన బ్యాంకుకు వచ్చి మరి .. మనమంటె ఆ గురి ఉండబట్టే అడిగాడాయన ... మీకూ ఆయన తెలుసట .. మన ఇంట్లో వారాలు చెసుకుని చదువుకున్నాడని అమ్మ చెప్పింది.. "

శర్మగారికి చివరి విషయం వినగానే విసుగు కలిగింది . మహలక్ష్మి సంగతే అంత మరిచిపోవాల్సినవి జ్ఞాపకం ఉంచుకుంటుంది. జ్ఞాపకం ఉంచుకోవాల్సిన సంగతి మరిచిపోతుంది.

'ఏదో పాతకాలం మనిషి లేరా! మన ఇంటిలో ఆడపిల్ల ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఈ రోజే వచ్చింది. నేను మీ అమ్మతో చెబుతాను కాని నువ్ కోడలి చేత ఓ దరఖాస్తు పడేయించు!"

– కోడలు ఉద్యోగానికి వెళుతూ వచ్చి చెప్పింది .. రెండు రోజులు మహలక్ష్మమ్మ మాటాడలేదు.

తుఫాను ముందుండే ప్రశాంతత అది.

– పెద్దాడి దగ్గర నుంచి మనీ ఆర్డరు వచ్చింది. అబ్బాయి బాంకికి, కోడలు బడికి వెళ్లారు. ఆవిడే



కలత

వి.వి.బి.రామారావు

మనీ ఆర్డరు అందుకుంది.

"ఇది నా పేర బ్యాంకిలో వేసుకుంటా!" గదిలోకి వచ్చి రెండు మూడుసార్లు తచ్చాడి చివరకి అంది.

"ఆఁ!"

శర్మగారు పరధ్యానంగా ఉన్నారు

"పెద్దవాడు డబ్బు పంపించాడు ... ప్రతి నెలా అనుకుంటూనే ఉన్నా ... ఏ నెల కానెల అలా పులుసులో పడిపోతూనే ఉంది. నెలనెలా ఇహనుంచి ఇవో బ్యాంకిలో పడేస్తే రెండేళ్ళు తిరిగేసరికి ఓ నాలుగయిదు వేలయినా కంటబడతాయి ..."

కలత రేగిన మనసులో జ్ఞాపకాలు సుడులు తిరుగుతున్నాయి.

శర్మగారికి ఆయన తల్లి కళ్ళ ముందు మెదిలింది.

తండ్రి పోయిన కొత్త రోజులు. ఇంట్లో ఏదో వెలితి... చీకటి ... నిరుత్సాహం ... దివవు దివవు మంటూ ఉన్న ఇల్లు.

పెద్ద పొలం రైతు డబ్బు తీసుకొచ్చాడు.

"అమ్మా! ఈసారికి గింజలక్కరలేదు ... అమ్మి డబ్బు తీసుకురమ్మన్నా! రైతు డబ్బు తెచ్చాడు ... ఇదిగో ..." దొంతెడు నోట్లు ఆమెకు అందించబోయాడు.

"నాకెందుకురా ఇది?"

"అది కాదమ్మా! డబ్బు నీ దగ్గరే వుంచు ..."

"వద్దురా! ... మీ నాన్నగారు నాకెప్పుడూ డబ్బు విషయాలు చెప్పనూ లేదు ... అథవా చెప్పినా నేనెప్పుడూ పట్టించుకోనూ లేదు. ఆయనకేం పుణ్యాత్ములు ... ఆయన చేతుల మీదుగా వెళ్ళే అదృష్టం నాకు లేకపోయింది ... డబ్బు మాట నాకు చెప్పకు .. అభిషేకం చేయాల్సినా ఆయనే ఇచ్చేవారు ... అడదాన్ని ఇంత వండి పడెయ్యడం తప్ప నాకు మరేం తెలియదూ ..."

– తల్లి మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి శర్మగారికి. అత్తగారు నాడు లేని తెలివితేటలూ, గడుసుతనమూ, ఈ వయసులో మహలక్ష్మికి ఎలా వచ్చాయి? కోడలు జీతం కంటికి చూపడంలేదన్న అక్కసా?

కొడుకు – ఉన్నంతలో తమకి ఏం లోటు

కలత

చేస్తున్నాడు? కొడలుపిల్ల మాణిక్యం - దాని ననుకుంటే పాపం కూడాను - మరెందుకి డబ్బు యావ?

- తన సంగతా? - ఈ రోజు తను అశక్తుడు. తను ఇవ్వాలనుకున్నా భార్యకు ఏమి ఇవ్వలేడు.

బడిపిల్లలు పాఠానికి వచ్చారు.

"పెద బాబుగారూ! .. నాన్న ఇయ్యమన్నాడు" పది రూపాయల కాగితం అందించాడు కుర్రాడు

శర్మగారు లేచి సాలో చనగా లో పలకెళ్లారు.

"మహాలక్ష్మి ... ఇదిగో ఈ పది ఉంచు .. ఇలా ఇచ్చినవన్ని బ్యాంకులో వేసుకుందువుగాని ...'

ఆయన గొంతు వణుకుతోంది

"బావుంది. సంబరం' .. ఈ పది, ఐదూ ఎందుకు? కాలంనాటి పిల్లలున్నారు నాకు .. డబ్బు గడుసుతనం తెలిస్తే ఇప్పుడు పుస్తెలోక పూసలేకుండా ఉండేదాన్నా' ... నాకక్కరలేదు.

ఆవిడ రుస రుసలాడింది

అక్కడే వదిలేసిన పది కాగితం గాలికి రెప రెపలాడింది.

- కొడలు స్కూలు నుంచి వచ్చి అత్తగారి మాటలు విందేమో రాత్రి భర్తతో చెప్పింది

- 'చూడు కాంతం' అమ్మలో ఏదో అసంతృప్తి ... ఏదో మార్పు నువ్ ఉద్యోగం చెయ్యడం అమ్మకిష్టంలేదు .. పోనీ మానేస్తే? .. చేసినా నీ జీతం అమ్మకి ఇచ్చేస్తే?"

"అదేమిటండి? ఇవిడకు నా జీతం కావాలా? ... నా జీతం ఏమాత్రం ... నాదైతే మాత్రం నేనే తినేస్తున్నానా? ... మిరూ అలా అంటే ఏం చెయ్యనండి' మిదైనా, నాదైనా, మన సంసారం కొసమె కదా . మి ఒక్కరి జీతంతో ఏం లాగగలం ఈ రథం? .. మరొక మాట! .. నాకు మాత్రం ఇంటి పట్టున ఉండాలని లేదంటారా? ... నేను చీర కట్టుకుంటుంటే బయటకు వెళతానని తెలిసి గుక్కపట్టేస్తోంది పెద్దది . చంటి వెధవ సరేసరి . . నేనేం చెయ్యను ... బడి వదలి రాగలనా? మిరు చెప్పండి ... మిరు మానెయ్యమంటే మానేస్తా!"

- ఆమె కళ్లు తుడిచాడు శాస్త్రి

అమ్మ ఇలా గయిపోతుందేమిటి? ఈ సమస్యకి పరిష్కారం ఎలా? ఎప్పుడూ తనని వెనకవేసుకువచ్చే అమ్మ - తనకి శత్రువైపోయిందా? ఇదంతా డబ్బు మహామెనా?

- గబగబా రెండు ముద్దలు మింగి మాటాడకుండా ఆఫీసుకు వెళ్లిపోయాడు

- సాయంకాలం అడిగాడు మిత్రుడు ఎంట్రా అలా ఉన్నావ్! అని ..

"ఏదో కలితలేద్రూ! ఏం చెస్తాం...పెద్దవాళ్లకి కూడా ఈ రోజుల్లో- ఎప్పుడూ లేనివాళ్లకు కూడా - డబ్బు యావ పెరిగిపోతుంది. డబ్బు బాగా ఉన్న రోజుల్లో డబ్బు జోలికి వెళ్లని అమ్మకి ఇప్పుడు దాచుకోవాలనిపిస్తోంది ఎలా? మనకి ఎంత డబ్బూ తిళ్లకే చాలదు ఇప్పుడు దాచుకోవాలంటే ఎలా?"

"అసలేమయిందిరా?"- శాస్త్రి వివరంగా చెప్పాడు.

"సరే! ఒక్క పని చెయ్యి ." మిత్రుడు చెప్పిన మాటలు శాస్త్రికి నచ్చాయి

మొదటి తెది వచ్చింది. ఇంటికి రాగానె అడిగాడు కాంతాన్ని జీతం వచ్చిందా అని.

"ఆ !" అంది కాంతం.

"ఇదిగో కాంతం నా జీతం... నీది, నాదీ కలిపి అమ్మకిచ్చెయ్' ఆవిడకు పెత్తనం ఇచ్చెయ్'ఖర్చులు పోను మిగిలినది బ్యాంకులో వేసుకోమను ...?

"బ్యాంకులో నా? ఖర్చులు పోను మిగిలితేగా?"

'నా మాట విను "

"మి మాట కాదాననండి!.. ఇదిగో మొత్తం, మిరే ఇచ్చెయ్యండి.. నేనెలాగయినా ఫైదానినే. మిరే చెప్పండి అత్తయ్య గారితో నా జీతం ఆవిడకు ఇయ్యడానికి నాకు అభ్యంతరం ఏ మాత్రం లేదు కాని ఆవిడ నన్ను ప్రేమగా చూసుకోవాలని మాత్రమె ఉంది.. కాని డబ్బు మిగలదె..."

"ఇలాతే!"

డబ్బు తీసుకుని తల్లి దగ్గరకు వెళ్లాడు శాస్త్రి.

"ఏంరా?" ఒత్తులు చెసుకుంటున్న మహాలక్ష్మమ్మ అడిగింది.

"ఇదిగొనమ్మా. . ఇది నా జీతం... ఇది నీ కొడలి జీతం... నీ దగ్గరె ఉంచు . ఇంటి ఖర్చులూ అవి నువ్వె యజమాయిషి చెయ్యి. . ఇద్దరం ఇంట్లో ఉండం కదా... మొత్తం డబ్బు విషయమంతా నువ్వె చూసుకో ఏ మాత్రం మిగిలినా నెలనెలా బ్యాంకులో వేసుకుందువు గాని. . నీ కడుపున పుట్టినవాడిని. నా మిద కొపం తెచ్చుకోకమ్మా"

తల్లి చేతిలో డబ్బు ఉంచేసి తన గదిలోకి వచ్చి కూచున్నాడు శాస్త్రి.

"అమ్మయ్య' ఇప్పుడు మనసు తేలికగా ఉంది' అన్నాడు కాంతం వంక చూస్తూ.

"నిజమె సుమండి' మనసులో కలత లేకపోతే ప్రాణానికి హాయిగా ఉంది' అంటూ మంచం మిద కూచేంది కాంతం.

డబ్బు పుచ్చుకుంది కాని ఆ క్షణం నుంచి మహాలక్ష్మమ్మ మనసు మనసులో లేదు. ఏ నాడూ ఇంట్లో ఇది కావాలి అని చెప్పడమే కాని దాని ఖరీదు - కొనుబడి ఇవేమి తను తెలుసుకోలేదు. నెలకి ఖర్చు ఎంత వుంది? అసలు ఏమేం కొనాలి? ఆలోచించి ఆలోచించి పెన్సిలూ కాగితమూ తెచ్చుకుని ఏవేవో రాస కొట్టేస్తోంది. ఆవిడ మనసులో ఏవేవో ఆలోచనలు. బెంగ.

గంటయినా మహాలక్ష్మమ్మ కంట పడకపోయె సరికి శర్మగారికి ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

పెరట్లో లేదు భార్య. దేవుడి గదిలోనూ లేదు. కంగారు పుట్టింది ఆయనకు. వంటింట్లోకి వెళ్లారు.

కళ్లు చిట్లించుకుని కాగితం మిద ఏవో రాస్తోంది మహాలక్ష్మమ్మ

"ఏం మహాలక్ష్మి ఏం చెస్తునావ్?"


ఆమె దొంగతనం చేస్తూ పట్టుబడినట్టు ఉలిక్కిపడింది. భర్తను చూస్తూనె కళ్లలో నీళ్లు నింపుకుంది.

'ఏం? అబ్బాయి ఏమైనా. .."

"ఛ , ఛ! అదేం కాదు.. వాడు డబ్బు నా చేతిలో నే పోశాడు .. ఏమండి . ఏమి అనకండి.. ఇది మి దగ్గరే ఉంచండి ... ఇదిగో పెద్దాడు పంపింది కూడా!'

ఆవిడ నోట్లు తన కందించబోతూ ఉంటె గోముగా భార్య చెతులు పట్టుకున్నారు శర్మగారు

"కొడలు పిల్ల చూస్తే తల కొట్టేసినట్టుంటుంది!' అంది ఆవిడ కళ్లలో వెలుగు నింపుకుంటూ. □



వారఫలం

23-8-1985 శుక్రవారం మొదలు 29-8-1985 గురువారం వరకు

★ **మేషం:** తరచుగా ప్రయాణాలు చేయవలసి రావచ్చు. వాహన ప్రయాణాలందు జాగ్రత్త అవసరం. వృత్తియందు వికాసమున్నది. పరులకు సాయపడవలసిన సన్నివేశాలుంటాయి. మీ పెద్దరికానికి లోటురాదు. స్త్రీలకు: ఉద్యోగమందు స్వల్పంగా పెంపును ఆశింపవచ్చు.

★ **వృషభం:** ఇతరులకు యివ్వవలసిన ధన విషయంలో వత్తిడి కలుగవచ్చు. అనవసర వ్యవహారాలతో కాలక్షేపం చేయవలసి రావచ్చు. నూతన వ్యాపారమో, గృహ నిర్మాణమో చేయగల అవకాశాలుండవచ్చు. వస్తు సేకరణకై తాపత్రయ పడటం అధికమవుతుంది. స్త్రీలకు: సాటివారి పోటీని ఎదుర్కొనవలసి ఉంటుంది. ఆరోగ్య లోపం.

★ **మిధునం:** వారమంతా శ్రమకరంగా తోస్తుంది. పరులకు యివ్వవలసిన ధన విషయంగా వత్తిడి రావచ్చు. ఉన్నతోద్యోగుల సహాయమున ఒకానొక విషయమందు మేలు చేకూరగలదు. ఒకానొక వ్యవహార విషయంగా ఉద్రేకపూరితులు కానున్నారు. జాగ్రత్త! స్త్రీలకు: రాబడియందు గాని, వృత్తియందు గాని లోటు కనిపించదు.

★ **కర్కాటకం:** సాటివారిలో పేరు ప్రతిష్ఠలు లభించగలవు. నూత్న మార్గాన ఆదాయమున్నది. వైజ్ఞానికంగా మీకు సదవకాశాలు లభ్యం కానున్నవి. ఇరుగు పొరుగువారి నుండి యిబ్బందులు రాకుండా చూచుకోండి. స్త్రీలకు: శుభకార్యాల విషయమై తర్జనభర్జనలుంటాయి.

★ **సింహం:** వ్యాపారం చేసే లాగైతే క్రయవిక్రయాలందు ఆదాయముంటుంది. అధిక లాభార్జనకు మాత్రం తావివ్వకండి, ప్రమాదం. కొందరు దూర దేశ ప్రయాణాలకు ఉద్యుక్తులవుతారు. రాజకీయంగా కూడా పెంపు గల వారమే. యత్నించండి. స్త్రీలకు: అపనిందలు రాకుండా, అధిక శ్రమకు గురికాకుండా, అనవసరమైన ఖర్చులు చేయకుండా చూచుకోండి. గ్రహస్థితి అట్టిది.

★ **కన్య:** ఇతరుల వ్యవహారాలందు జోక్యం చేసికోవటం మేలైన విషయంగాదు. పరులకిచ్చిన డబ్బు రాబట్టుకొనుట యందు కూడా నేర్పుతో మెలగాలే గాని అధిక పట్టుదలకు పోరాదు. జాగ్రత్తగా సంచరించండి. అధిక వ్యయం కూడా బంధువుల, మిత్రుల మూలాన జరుగవచ్చు, గమనించండి. స్త్రీలకు: అనవసరంగా ఖర్చులు తగులుతాయి. గమనించి మెలగండి.

★ **తుల:** అనవసరంగా ఖర్చులు తగులుతాయి. అనవసరంగా తిరుగవలసి రావచ్చు. చేసిన ప్రయత్నాలు ఉద్యోగరీత్యా ఫలింపకపోవచ్చు. కాలం అనుకూలం గాదని గ్రహించాలి. పెద్ద హోదాలో ఉన్న ఉద్యోగులు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. స్త్రీలకు: వైజ్ఞానికంగా సదవకాశాలు లభ్యం కాగలవు. డబ్బు సమయానికి అందుతుంది.

★ **వృశ్చికం:** నూతనాంశాలు గ్రహింపగలరు. వృత్తియందు పెంపు చెప్పదగిన సమయం. అదృష్టవంతమైన దినాలు. వ్యాపారరీత్యా ఉత్తమ కాలం. శ్రమించండి, మేలు పొందండి. సుఖశాంతులకు లోపముండదు. వెనుకటికన్నా ఆదాయమందభివృద్ధి గలదని గ్రహించండి. స్త్రీలకు: వక్కని ధనాదాయమున్నది. శుభం కూడా జరగవచ్చు.

★ **ధనుస్సు:** మాటకు మన్నన, గౌరవమందు వృద్ధి, వృత్తియందభివృద్ధి, గొప్పవారి సహకార సంపత్తులు, లభ్యం కాగలవు. నలుగురిలో మీ మాట చెలామణీ కాగల సమయం. గ్రహించండి. స్త్రీలకు: ధనలబ్ధి, ఉద్యోగమందభివృద్ధి, ప్రయాణాల మూలకంగా ధనలబ్ధి.

★ **మకరం:** ఎవరి కొరకు పాటుపడినారో, ఎవరికి సాయం చేసారో, ఎవరిని ఉత్తేజపరచాలని యత్నించారో, వారు మీకు దూరం కాగలరు. పైగా మీపై అపనిందను రుద్దగలరు. వ్యాపారమందు యిబ్బందులుంటాయి. జాయింటు వ్యాపారమయితే మరి జాగ్రత్తగా ఉండాలి. స్త్రీలకు: ఉద్యోగమందు జాగరూకత ఎంతైనా అవసరం,

★ **కుంభం:** ప్రతి విషయంలో, ప్రతి వ్యవహారంలో మీ ఆలోచనలనే అనుసరించండి. వారి మాట వీరి మాటలను వినకండి. వృత్తియందు జాగరూకత అవసరం. పరుల చేత చిక్కిన మీ డబ్బు రాబట్టుకొనుటకు బాగా శ్రమించవలసి రావచ్చు. గ్రహించండి. స్త్రీలకు: ఉద్యోగమందు అభివృద్ధికి అవకాశమున్నది.

★ **మీనం:** పరుల యభివృద్ధికి బాగా పాటుపడుతారు. కాలం వ్యయమైనది కూడా గమనించరు. పరోపకారం మంచిదే కాని సొంత కార్యాలు కూడా సాధించుకోవలె. దూర ప్రాంతాలకు ప్రయాణించే అవకాశం కొందరకున్నది. గ్రహించండి. ఈ ప్రయాణ యత్నం ఎంత కాలంగానో ఆలోచనయందున్నదే. స్త్రీలకు: అప్రయత్న ధనలబ్ధి, కొందరకు నూతనోద్యోగ ప్రాప్తి, ఉత్తమ ఫలదాయక వారమే.

—విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

వ్యక్తిగతం



అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌కి అనుకోకుండా ఇటీవల పెద్ద శస్త్రచికిత్స జరిగింది. 1984 లో ఆయన వైద్య పరీక్ష చేయించుకున్నప్పుడు పెద్ద పేగులలో ఒక చిన్న గడ్డ లాంటిది ఉన్నట్లు వైద్యులు తెలుసుకున్నారు. మామూలుగా 50 సం. పైబడిన వారికి అంత్రములలో ఈ గడ్డలు ఏర్పడటం జరుగుతుంది. శ్రీ రీగన్ విషయంలో కూడా అలాగే అనుకున్నారు. ఈ ఏడాది మార్చిలో తిరిగి వైద్య పరీక్ష చేసినపుడు ఆ గడ్డని తొలగించడం మంచిదని, లేకపోతే అది ఇంకా పెద్దదై కాన్సర్‌కి దారితీసే అవకాశం ఉందని వైద్యులు భావించారు. శస్త్ర చికిత్స అవసరం లేకుండా ఆ చిన్న గడ్డని తీసి వేయగలిగారు. కాని చిన్న పేగు పెద్ద పేగు కలిసేచోట ఎపెండిక్స్‌కి దగ్గరగా మరొక పెద్ద గడ్డ ఉన్నట్లు డాక్టర్లు కనుక్కున్నారు. దానిని తొలగించడానికి పెద్ద శస్త్ర చికిత్స తప్పని సరైంది. తమకి పూర్తిగా మత్తు మందు ఇచ్చిన తర్వాత తిరిగి స్పృహలోకి వచ్చేవరకు అధ్యక్షపదవి బాధ్యతలని ఉపాధ్యక్షుడు జార్జి బుష్‌కి అధికారికంగా బదిలీ చేశారు శ్రీ రీగన్. ఇలాంటిది జరగటం అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో ఇదే మొదటి సారి. జూలై 13 న శ్రీ రీగన్‌కి శస్త్ర చికిత్స చేసి ఆ పెద్ద గడ్డని తీసి వేశారు. తర్వాత శ్రీ రీగన్ పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. కాని ఇకముందు శ్రీ రీగన్ ఈ గడ్డల విషయంలో జాగ్రత్తగా ఉండాలని గడ్డలు ఏర్పడినప్పుడు వాటిని తీయించుకోవాల్సి ఉంటుందని సలహా యిచ్చారు. నిర్లక్ష్యం చేస్తే అవి కాన్సర్‌గా మారే అవకాశం ఉందని వైద్యులు అన్నారు. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనివారు హెచ్చరించారు. □

శబ్దం లేకుండా తలుపు తెరుచుకుంది. బెడ్‌రూములోకి అడుగుపెట్టిన శ్రీధర్ ఒక్క నిముషం అలాగే నిలబడిపోయాడు. అతని చూపులు తెల్లని పడకపైన, ఒక చెయ్యి మడిచి తలక్రింద ఆధారంగా పెట్టుకునీ, రసమయ భంగిమలో వార పత్రిక చదువుకుంటూ పడుకున్న విజయమీద నిలిచిపోయాయి.

పల్చటి ఆర్గండి చీరలో, అమె అందం మరింత ఇనుమడిస్తుంది.

శ్రీధర్ మనస్సు బాధగా మూలిగింది. వారం రోజులక్రితం వరకూ అతన్ని చూడగానే, అమె చూపులు మత్తుగా ఆహ్వానం పలికేవి. అమె అధరాలు రాగ రంజితమయి తళుకులీనేవి.

భార్యా భర్తల మధ్య పరస్పరానుకూలత, అవగాహనం ఉంటేనే దాంపత్య జీవితం సాఫీగా సాగిపోయేది. ఎంత అన్యోన్యంగా ఉండే భార్యా భర్తలమధ్య అయినా, ఒక్కోసారి అభిప్రాయ భేదాలు రావటం సహజం.

శ్రీధర్‌కూ, విజయకూ పెళ్ళి జరిగి సంవత్సర మయింది. సుఖంగా, సంతోషంగా గడిపేవాళ్ళ మధ్య వారం రోజులక్రితం చిన్న విషయంమీద, తగువొచ్చింది. శ్రీధర్ ఆ విషయాన్ని సాయంత్రానికల్లా మరిచిపోయి, ఆఫీసునుంచి వస్తూ విజయకు మల్లెపూలు కొని తెచ్చాడు.

కోపం తగ్గని విజయ, ఆర్తాత్రి ఎంతో ప్రేమగా, అనురాగంగా మల్లెలమాలను తలలో తురమబోతున్న శ్రీధర్ చేతుల్లోనుంచి, ఆ మాలను విసురుగా లాక్కుని, అతని ముఖంమీద విసిరికొట్టి అతనికి దూరంగా చాప పరుచుకుని పడుకుంది.

సున్నితమయిన శ్రీధర్ మనస్సు, విజయ చర్యకు చాలా బాధపడింది. అమెగా, తనకు చేరువయ్యే వరకూ విజయతో మాట్లాడకూడ దనుకున్నాడు. వారం రోజులు గడిచిపోయాయి. వాళ్ళమధ్య రాజీ కుదరలేదు–

శ్రీధర్‌వైపు చూసిన విజయ ముఖం తిప్పుకుంది. అమె నిర్లక్ష్యాన్ని భరించలేకపోయాడు. బయట కొచ్చి పూల మొక్కలమధ్య గార్డెన్ ఛెయిర్‌లో కూర్చున్నాడు. వారం రోజుల క్రితం జరిగిన విషయం అతని మనస్సులో మెదిలింది.


★ ★ ★ ★

ఆఫీసు కెళ్ళబోతున్న శ్రీధర్ దగ్గరకొచ్చి, "నాకో రెండొందలు కావాలి". అంది విజయ.

"రెండొందలా? ఎందుకు?"

"కారణం చెప్పంది ఇవ్వరా? నేను కాపురానికొచ్చిన ఈ సంవత్సరంలో, కారణం అడగకుండా నాకెప్పుడయినా డబ్బిచ్చారా?" అంది విజయ కోపంగా.

"ఎందుకలా ఆవేశపడతావు? నెలాఖరుకదా. నా దగ్గరంత డబ్బు లేదు. అర్జంటుగా కావాలేమో అనుకుని కారణం అడిగాను."



"మీ సంగతి నాకు తెల్సు. నెలంతా నేను సంపాదించి తెస్తున్న డబ్బు, ఈవితగారు మంచి నీళ్ళలా ఖర్చు చేస్తుందని మీ అభిప్రాయం. అందుకే, నేను పాతిక రూపాయలు కావాలని అడిగినా, వెంటనే ఎందుకు అనడుగుతారు."

"విజయా! నా మనస్సు నర్థం చేసుకోకుండా మాట్లాడతావు. నేను సంపాదించేది ఎవరికోసం. నీ కోసం కాదా?"

"అలా అనుకుని తృప్తి పడాలి నేను అంతే. ఒక చీర కొనుక్కుందామంటే మిమ్మల్నడగాలి. సినిమా కెళ్ళాలంటే మీ పర్మిషన్ తీసుకోవాలి. అంతెందుకు ఇల్లు కదిలి, వీధిలో కెళ్లాలంటే మీ అనుమతి కావాలి. పంజరంలో చిలకలా, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా మీకు బానిసలా ఇలా బ్రతకటంకంటే, గౌరవంగా ఆత్మహత్య చేసుకుని చావటం మంచిది."

"విజయా!" ఖంగుమంది శ్రీధర్ గొంతు.

"ఏం? ఎందుకలా అరుస్తారు? భార్యంటే, మీ దృష్టిలో ఖర్చులేని పని మనిషి. మీకూ, మీ ఇంటికీ, రేపు మీకు పుట్టబోయే పిల్లలకూ చాకిరీ చేస్తుంటే, తిండి పెట్టి పోషిస్తారు. ఆ చాకిరీ చెయ్యని రోజున అది పెట్టరేమో."

"నువ్వేం మాట్లాడుతున్నావో, నీకు తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఏం? నాకు మతి పోయిందనుకుంటున్నారా?"

"నీ భర్తకు వండి పెట్టటం, నీ ఇంటిని నువ్వు చక్కదిద్దుకోవటం చాకిరీ అనుకుని బాధపడుతున్నావంటే నువ్వు చదువుకున్న మూర్ఖురాలివి."

"మూర్ఖురాలిని కాబట్టే, ఇలా పంజరంలోని చిలకలా బ్రతుకుతున్నాను."

విజయ ప్రతిసారి అదే మాటంటుటే, చికాకని పించింది శ్రీధర్‌కు. పళ్ళబిగువున కోపాన్ని అదిమిపడుతూ "ఇలా చిలకలా బ్రతకటం నీ కిష్టం లేకపోతే స్వేచ్ఛగా ఎక్కడికయినా ఎగిరిపోవచ్చు."

"అంటే, నన్ను మా పుట్టింటికి పొమ్మనేగా? అర్థం? మా పుట్టింటివాళ్ళేం నన్ను పోషించలేని స్థితిలో లేరు. నేను వెళ్లాలే గాని, మహారాణిలా చూసుకుంటారు. మీ అజ్ఞలను శిరసావహిస్తూ, మీ శాసనాలకు తలవంచుతూ ఇలా బ్రతికేకంటే వెళ్ళిపోవటమే మంచిది" అంది కోపంగా.

"గెటవుట్. ఐ సే యూ ఫస్ట్ గెటవుట్" అంటూ కోపంగా అరిచాడు శ్రీధర్. తర్వాత, భార్యతో మాట్లాడటం కూడా ఇష్టం లేనట్టుగా బయటకు వెళ్ళిపోయాడు.

ఆఫీసయిపోయి ఇంటికి బయలుదేరే సమయానికి శ్రీధర్ కోపం ఎగిరిపోయింది. మల్లెపూలు కొని తెచ్చి విజయకోపం పోగొట్టాలని, తనే స్వయంగా అమె తలలో తురమబోతే, ఆ పూలమాలను విసురుగా అతని ముఖానికేసి కొట్టింది. అర్థంలేని అమె కోపానికి శ్రీధర్ క్కూడా కోపం వచ్చి అమెతో మాట్లాడటం మానేసాడు.

★ ★ ★ ★

చివరంటా కాలిన సిగరెట్, వేళ్ళను చురుక్కుమని పించటంతో, గతంలో నుంచి తేరుకున్నాడు శ్రీధర్.

ఎంతకీ భర్త బెడ్‌రూమ్‌లోకి రాకపోయేసరికి బయటకొచ్చి చూసింది విజయ. కుర్చీలో వెనక్కు వాలి పడుకున్న శ్రీధర్ కనిపించేసరికి ఒక్కసారిగా అవ్యాజమయిన ప్రేమానురాగాలు పొంగాయి అమె మనస్సులో. ఆ భావనలు ఒక్క నిముషం మాత్రమే. అంతలోనే అతనన్న "గెటవుట్" అన్న మాట గుర్తుకొచ్చి విసురుగా మళ్ళీ బెడ్‌రూమ్‌లోకెళ్ళి పడుకుంది.

ఎదురింట్లోకి కొత్తగా అద్దెకు దిగిన శిరీషా వాళ్ళు గుర్తుకొచ్చారు. శిరీష భర్త రిప్రజెంటేటివ్. శిరీషకు

ఇల్లాలి స్వర్గం

ఎన్. భారతీ దేవి

డిగ్రీ వున్నా, ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక చెయ్యటం లేదంట! చక్కగా ప్రతి సాయంత్రం, వాళ్ళ బాబునూ, పాపనూ తీసుకుని సినిమాకో, షికారుకో వెళుతుంది తరుచుగా షాపింగ్ కెళుతుంది. తనకు కావాలనుకున్నవి కొనుక్కుంటుంది. దేనికీ భర్త పర్మిషన్ అక్కరలేదు పూర్తిగా స్వేచ్ఛాజీవి. తన భర్తకూ శిరీష భర్త కంటె ఎక్కువ జీతం వస్తుంది అయినా, తానామెలా భర్తకు తెలియకుండా ఒక్క రూపాయి ఖర్చు చెయ్యలేదు. ఒక్కచోటకు వెళ్ళలేదు శిరీషను చూసింతర్వాతనే, తను పెళ్ళయిం తర్వాత కోల్పోయిందేమిటో తెలిసొచ్చింది ఏది లేకపోయినా బ్రతకొచ్చు గానీ, స్వేచ్ఛ కరువయితే మాత్రం బ్రతకలేరు. గాఢంగా నిట్టూర్పుతూ నిద్రపోయే ప్రయత్నంలో కళ్ళు మూసుకుంది.

★ ★ ★ ★

సాయంత్రం అయిదు గంట లయింది ఎంత వేడిమికి తలలు వాల్చిన పూల చెట్లు చల్లగాలికి సేద తీర్చుకుంటూ పరిమళాలు వెదజల్లుతున్నాయి పూలచుట్టూ మకరందం కోసం తిరుగుతున్న తుమ్మెదలను చూస్తూ కూర్చుంది విజయ. ఎదురింటి శిరీష రావటం, ఆ సమయంలో విజయ కెంతో సంతోషమనిపించింది ఆప్యాయంగాఆహ్వానించింది శిరీష వద్దన్నా వినకుండా, ఆమెచేత బలవంతంగా టిఫిన్ తినిపించింది. ఇద్దరూ టీ తాగుతూ కబుర్లలో పడ్డారు.

"మిమ్మల్ని చూస్తుంటే, మీ అదృష్టానికి నిజంగా సంతోషమనిపిస్తుంది స్నేహితురాలిగా" నాకు అంది విజయ.

"బావుంది. నన్ను గురించి నేను బాధ పడని రోజంటూ లేదు" అంది శిరీష నవ్వుతూ.



ఇల్లాలి స్వర్గం

"బాధా? మీకా?" అంది విజయ ఆశ్చర్యంగా

'ఎందుకలా ఆశ్చర్యపోతున్నారు?' అంది శిరీష

ముత్యాల్లాంటి చక్కని ఇద్దరు పిల్లలు మీకు తగిన భర్త అన్నిటికీ మించి హాయిగా, సమయాన్ని మీ కిష్టమయిన పద్ధతిలో గడపటానికి తగినంత స్వేచ్ఛ ఇంతకంటె ఆడదానికింకేం కావాలి?

"అంతే కాదండీ పటన్నిటికీ మించి ఆడదానికి ప్రతి రోజూ భర్త అనురాగం, ప్రేమా లాలన కూడా కావాలి ఉదాహరణకు నన్నే తీసుకోండి మా అమ్మా నాన్నకు నే నొక్కతెనే కూతుర్ని దాదాపు నాలుగయిదు లక్షల ఆస్తి ఉంది

అంత ఆస్తి ఉన్నా, ఉద్యోగం పురుషలక్షణం అంటూ మావారు నామాట వినకుండా, రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం చేస్తున్నారు. నెలలో ఆయన ఇరవయ్యి రోజులు క్యాంపులోనే ఉంటారు ఆయనకు దూరంగా ఒంటరిగా ఉండలేక, కాలక్షేపం కోసం బయటకు వెళితే, ఒంటరిగా కనిపించే నన్ను చూసి వెకిలిగా నవ్వేది ఒకరయితే, మాటల బాణాలు విసురుతూ వెర్రిగా చూసేది ఇంకొకరు ఆ బాధ భరించలేక ఎక్కడికీ వెళ్ళటం మానుకున్నాను మరి ఒంటరితనం భరించలేకపోయిన రోజు పిల్లల్ని తీసుకుని సినిమా కెళుతున్నాను మా వారింట్లో ఉంటే, బజారు పనులన్నీ ఆయనే చేస్తారు ఆయన లేకపోతే, ఆ పనులన్నీ కూడా నేనే బయలు దేరాలి. ఇంట్లో నుంచి బయట కెళ్ళాలంటేనే నాకు తగని చిరాకు'

"అదేమిటండీ మీలాంటి స్వేచ్ఛ నాకు లేదని ఈమధ్య మా వారితో కూడా గొడవ పెట్టుకున్నాను నేను" అంది విజయ

'అసలు స్వేచ్ఛ అంటే ఏమిటి మీ దృష్టిలో" మీరే కాదు. చాలామంది ఆడవాళ్ళు మాకు స్వేచ్ఛ లేదంటూ వాపోతుంటారు విజయగారూ! మనకు భర్తలు సంపాదించి తెచ్చి పెడుతుంటే, మనకు ఇష్టమయిన వంటకాలు మనం వండుకుంటున్నాం మనింటని మనిష్టమయిన రీతిగా అలంకరించు కుంటున్నాం నా భర్త, నా పిల్లలు, నా ఇల్లు అనుకుంటూ తృప్తిగా గడపుతున్నాం ఇంతకంటే స్వేచ్ఛ ఆడదానికింకేం కావాలి? భర్త రక్షణ లేకపోతే, ఈ సమాజంలో, ఆడదాన్ని ఒంటరిగా బ్రతకనిస్తారా?"

'మా వార్ని పంచ రూపాయలు కావాలని అడిగితే చాలు ఎందుకు? అని అడగకుండా ఇవ్వరు అదే నాకు చాలా బాధనిపిస్తుంది.

కారణం అడిగితే తప్పేముంది? క్రమబద్ధంగా, వాడకపోతే, జీతం చాలక అప్పులు చెయ్యాల్సి వస్తుంది అందుకే అలా అడుగుంటారు. డబ్బు మీవారు వాడతారేమో అందుకే నెలంతా అప్పుచెయ్యకుండా గడపటానికి, మీరు చెయ్యబోయే ఖర్చు అవసరమా? అనవసరమా? అని తెల్సుకోవ టానికి అలా అడుగుతారేమో? అయినా, ఎందుకు అని అడగకుండా డబ్బివ్వరని మీరు బాధ పడుతున్నానంటుంటే, నాకు చాలా ఆశ్చర్యమని పిస్తుంది మీరు ఖర్చు పెట్టినా మీ డబ్బే. మీరు ఖర్చు చెయ్యకుండా మీ వారి జేబులో దాచినా అది మీ డబ్బేగా?

నెలకు ఎంత సంపాదించే మగాడయినా, చేతికి వాచీ, పదిజతల బట్టలు అంతేగా మగాడికి కావలసింది. అతను సంపాదించేది తన భార్య కోసం, తన పిల్లల కోసం. అలాగే భార్య రోజంతా శ్రమపడేది. తన భర్త కోసం, తన పిల్ల కోసం. భార్యా భర్తల మధ్య సరైన అవగాహన లేకపోతేనే గొడవ లొస్తాయి" అంది శిరీష నవ్వుతూ.

ఇంతలో కాన్వెంటు నుంచి తన పిల్లలు రావటంతో శిరీష వెళ్ళిపోయింది. ఆమె మాటలే, మనసులో మారు మ్రోగుతుంటే, చాలాసేపు ఆలోచించింది విజయ

శిరీష మాటల్లో ఎంతో నిజముందనిపించింది. తనమూలంగా, తనభర్త అప్పుచేసినా ఆ ఆర్థిక ఇబ్బందుల్ని ఇద్దరూ కల్సే అనుభవించాలి. పొదుపుగా ఖర్చు చెయ్యకుండా దాచినా, రేపు మాకు పుట్టబోయే పిల్లలకూ, వాళ్ళ చదువులకూ ఉపయోగపడుతుంది. అమ్మో నాకు స్వేచ్ఛ లేదనుకుని బాధపడుతున్నాను. శిరీష చెబుతుంటే ఆ స్వేచ్ఛకంటే, ఈ రక్షణే నయమనిపిస్తుంది అనుకుంది. మనసులో నుంచి బరువు తొలగి పోయింది.

లేచి స్నానంచేసి, అందంగా ముస్తాబయింది. భర్త కిష్టమయిన ఆరంజికలర్ షిఫాన్ చీర కట్టుకుంది. దొడ్లో పూచిన జాజులు మాలకట్టుకుని తలనిండుగా పెట్టుకుంది. భర్త కోసం ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చుంది విజయ.

శ్రీధర్ ఆ రోజు ఆఫీసు నుంచి రావటమే ఆలస్యంగావచ్చాడు. స్వయంగా దగ్గరుండి అంతకు ముందులా వడ్డించింది విజయ అలంకరణ చూసి, తనలో తను నవ్వుకున్నాడు.

శ్రీధర్ పుస్తకం చదువుకుంటూ పడుకున్నాడు విసురుగా, అతని చేతిలోని పుస్తకాన్నిలాగి టీపాయ్‌మీద పడేసి, అతనికి దగ్గరగా జరిగింది. అతని తలను, ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని సున్నితంగా ముద్దుపెట్టుకుంది.

శ్రీధర్ పసివానిలా, ఆమె గుండెల్లో ఒదిగి పోయాడు.

ఈ వారం రోజుల నుంచి, దాచుకున్న ఊసులన్నీ ప్రేమతో రంగరించి శ్రీధర్‌కు నివేదించింది విజయ. ఆప్యాయతా, అనురాగం, ప్రేమా, లాలన చూపుతూ ఆర్తిగా ఆమెను గుండెల కదుముకున్నాడు శ్రీధర్

అలసిపోయిన విజయ, అతని ఛాతీమీద తలపెట్టుకుని పడుకుంది. ప్రేమగా ఆమె ముంగురులు నిమురుతూ "విజయా! కోపం పోయిందా?" అడిగాడు మృదువుగా.

"ఆ విషయం నాకు గుర్తు చెయొద్దు. జరిగింది తలుచుకుంటేనే, నా మీద నాకే అసహ్యంగా ఉంది' అంది అతని గుండెలకు మరింత గాఢంగా హత్తుకుపోతూ.


"ఒక్కసారిగా, నీలో ఇంతమార్పు ఎలావచ్చింది నీ కోపం పోవటానికి ఇంకో వారమయినా పడుతుందనుకున్నాను." అన్నాడు నవ్వుతూ శ్రీధర్.

"చూడండి. నాకు మీ ప్రేమానురాగాలు తప్ప, ఇంకెలాంటి స్వేచ్ఛ అక్కరలేదు." అంది నిండు మనసుతో విజయ

"నిజంగా?" అన్నాడు శ్రీధర్ ఆనందంగా

"నిజమండీ! స్వర్గం అంటే ఎక్కడో లేదు ఇక్కడే మనమధ్యే ఉన్నట్టుంది నాకు. ఈ స్వర్గం తప్ప మీ నుంచి ఇంకెప్పుడూ ఏమీ కోరను"

విజయ మాటలు వినగానే పన్నీటి జల్లు కురిసినట్టు ఎగసపడింది శ్రీధర్ హృదయం పరవశంతో ... □





అదే శాండక్ లోని అందం!



టానియా 04
బెయిజ్/బ్రౌన్/గ్రే
సైజ్ : 3-7
రూ 24.95

సగర్వంగా అడుగులెయ్యండి
శాండక్ ధరించి.
అనుభూతి చెందండి తేలికదనం.
చూసుకోండి సదురైన రంగుల్ని.
అవి కొత్త పి.వి.సి. కాంపౌండ్‌తో తయారైనాయి.
అన్నిటికన్నా—బాటా రూపొందించిన
రకరకాలలోంచి సందర్భానికి సరిపడిన వాటిని
ఎన్నుకోండి.

Sandak

అన్ని కాలాలలో వాడదగ్గది

Bata / BSC దుకాణాల్లో మాత్రమే లభిస్తున్నాయి.

ACIL/BATA-1/85 TEL

బంగాళదుంపల వ్యాప్తి ఎలా జరిగింది?

బంగాళదుంపల రుచిని చూడని వారు అసలు లేరేమో అనిపిస్తుంది. ఆలుగడ్డలని ఉర్లగడ్డలని కూడా వీటిని పిలుస్తారు. చవుకగా కాకపోయినా బాగా విరివిగా లభ్యమయ్యే రుచికరమైన దుంపలు ఇవి! అంతేకాదు, ఎంతో పుష్టికరమైనవి కూడా! పేదలకి ధనవంతులకి అందరికీ అందుబాటులో ఉండే ఆహారపదార్థంగా ఈ దుంపలని పేర్కొన వచ్చు.

బంగాళదుంపలని బాగా ఎక్కువగా తింటే ఒళ్ళు వస్తుందని కొందరి అనుమానం. చక్కెర వ్యాధి వస్తుందని మరికొందరు అనుకొంటూ ఉంటారు. అయితే ఇవేవీ నిజంకాదు. బంగాళదుంపలలో ఉన్నవి కేవలం పిండి పదార్థాలే! వరి బియ్యంలో మాదిరి! ఈ దుంపలని బాగా తింటూ ఉంటే ఆరోగ్యంగా, చురుకుగా ఉంటారని ఆహార నిపుణులు చెబుతారు. ఈ మొక్క శాస్త్రీయ నామం "సోలనమ్ ట్యూబరోసమ్"!


పై విషయాలు ఏ కొందరికైనా తెలుసేమో కాని బంగాళదుంపల చరిత్ర మాత్రం ఎక్కువ మందికి తెలియదనే చెప్పాలి. ఈ దుంపల చరిత్ర ఈనాటిది కాదు. కొన్ని వేల ఏళ్ల నాటిది! పైగా ఈ దుంపలు మన దేశానికి చెందినవికావు. వేరే దేశాల నుంచి మన దేశాన్ని చేరుకున్న ఈ దుంపల నేపథ్య భాగవతాన్ని హాన్స్ అటకిన్స్ అనే పత్రికా రచయిత (ఈయన బాన్‌కి చెందినవారు) "ది జర్మన్ ట్రిబ్యూన్" అనే పత్రికలో స్థూలంగా వివరించారు!

బంగాళదుంపలకి, "ఇంకా" రాజవంశస్థులకి సంబంధమున్నట్టు తెలుస్తుంది. "ఇంకా" రాజవంశానికి చెందినవారు పెరూ దేశాన్ని స్పెయిన్ దేశస్థులు ఆక్రమించక ముందు పరిపాలించినట్టు చరిత్ర కథనం! స్పెయిన్ దేశీయులు దక్షిణ అమెరికాని చేరుకునే నాటికి "ఇంకా" వంశీయులు అండెస్ ప్రాంతాన్ని (ఇవాళ్టి కొలంబియాకి ఉత్తర చిలీకి మధ్య ఉన్న ప్రాంతం!) పాలిస్తూ ఉండేవారని చరిత్రకారులు అంటారు. వీరి రాజ్యం చాలా చిన్నదిగా – సుమారు తొమ్మిది లక్షల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉండేది. 1200 నాటికి మేంకో క్యాపక్ అనే రాజు "కజ్‌కో" లోయ ప్రాంతాన్ని (ఇదే నేటి పెరూ ప్రాంతం!) పాలించినట్టు చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. తొమ్మిదవ "ఇంకా" చక్రవర్తి పచాకుటిక్ ఇహాంక్వి (1438–1471) కాలంలో సామ్రాజ్య విస్తరణ కూడా జరిగింది కాని, 1533 నాటికి స్పెయిన్ దేశీయులు అతహల్పా అని పిలువబడే "ఇంకా" రాజుని ఓడించి పెరూ ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించుకున్నారు. ఇంతవరకూ స్పెయిన్ రాజులకీ "ఇంకా" వీరులకి జరిగిన యుద్ధతతంగమే చెప్పడం జరిగింది. "ఇంకా" వంశీయులకి బంగాళదుంపల వ్యాప్తికి ఉన్న సంబంధాన్ని గురించి చెప్పుకోవాలి.

బంగాళదుంపలు మోచికా కాలంలోనే ఉన్నట్టు చెబుతారు. అంటే 200 నాటికే బంగాళదుంపలు రంగంలో ఉన్నట్టు తెలుస్తుంది. స్పష్టంగా బంగాళదుంపల వ్యవసాయం ఎప్పటి నుంచి మొదలయిందో చెప్పటానికి తగిన నిర్దిష్టమైన ఆధారం లేదు. ఉత్తర పెరూ తీర ప్రాంతాలలో బంగాళదుంపలని విపరీతంగా పండించేవారు. ఈ పంటకి తగిన నైసర్గిక పరిస్థితి ఈ ప్రాంతంలో బాగా అనువుగా ఉండటంచేత అక్కడ పండినంత విపుగా, త్వరితంగా ఈ బంగాళదుంపల పంట మరి ఎక్కడా పండేది కూడా కాదు! బంగాళదుంపలని బాగా పండించటమే కాదు, నిలువచేసే పద్ధతులని కూడా స్ఫుటంగా రూపొందించటం జరిగింది. పచ్చిదుంపలని వాడటం మొదలుకొని, దుంపలని చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఎండబెట్టి వాడుకోవడం వరకు ఈ కాలంలోనే కనిపించేది. "అండియన్ ఇండియన్"లకి ఎండబెట్టే పద్ధతి తెలిసినట్టు విదితమవుతుంది. దుంపలని ఇలా "డీ హైడ్రేట్" చేసి వాడుకోవటం, శీతల పరిస్థితుల నుంచి రక్షణ కల్పించటం వంటి అంశాలలో వీరిది అందెవేసిన చెయ్యిగా తోస్తుంది. అప్పటికే బాగా ప్రబలంగా ఉన్న మొక్కజొన్న పంటకన్నా, ఈ బంగాళదుంపల పంట మీదే స్పెయిన్ దేశీయులు ఎక్కువ మక్కువ కనపరచటం ఆ పంట శ్రేష్ఠతని వెల్లడిస్తుంది.

"క్రోనికల్స్ ఆఫ్ పెరూ"లో పెడ్రో డి చీజా డి లియోన్ అనే స్పెయిన్ రాజు బంగాళదుంపలని గురించి చెబుతూ వీటిని ఉడకబెట్టినప్పుడు మెత్తగా "చెస్ట్ నట్"లలాగా ఉంటాయని రాసాడు. "చెస్ట్‌నట్"లనేవి స్పెయిన్‌లో విరివిగా పండే

బంగాళదుంప (సోలనమ్ ట్యూబరోసమ్ !)



దుంప (ట్యూబర్ చివరిభాగము)   క్రియాంకురము మొలకెత్తడం!

భానుచందర్‌తో ఎ. మోహన్‌గాంధి దర్శకత్వంలో సి. హెచ్. నరసింహారావు చిత్రం "అంకితం"

"డిస్కో డాన్సర్‌గా పేరు మోసిన ప్రముఖ హాస్యనటుడు నాగేష్ కొడుకు ఆనందబాబు, గ్లామర్ తార రమ్యతో పాటు ఒక కొత్త బొంబాయి నర్తకిని పరిచయం చేస్తున్నాం," అన్నారు పద్మజా పిక్చర్స్ సి. హెచ్. నరసింహారావు. ఈయన "టెర్రర్" అనంతరం నిర్మించే "అంకితం" చిత్రంలో భానుచందర్, భానుప్రియ, చలపతిరావు, రాళ్ళపల్లి, బెనర్జి, మున్నగువారు నటిస్తున్నారు. కె. ప్రత్యగాత్మ కథకు పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు. వేటూరి గీతాలకు నరసింహన్ స్వరకర్త. డి. ప్రసాద్‌బాబు. ఛాయ, గౌతంరాజు కూర్పు, శివసుబ్రహ్మణ్యం నృత్యాలు. సాయి సహదర్శకత్వంతో స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : ఎ. మోహన్‌గాంధి.



"ఖూనీ"లో భానుచందర్.

మూడు చిత్రాలకు



పద్మాలయ స్టూడియోస్ "సింహాసనం" ప్రారంభోత్సవ సందర్భంగా దర్శక, నిర్మాత హీరో కృష్ణ, ఎ.ఎన్.ఆర్.

ది గ్రేట్ షోమాన్ కృష్ణ

కథ, స్క్రీన్‌ప్లే, సంకలనం, దర్శకత్వం, నిర్మాణంలో కన్నుల పండువగా పద్మాలయ స్టూడియోస్ "సింహాసనం" 70 ఎం. ఎం. (స్టీరియో ఫోనిక్)

ద్విభాషా చిత్రం ప్రారంభోత్సవం

"కళాకారుడి ఏలుబడిలో కూడా హైదరాబాద్‌లో తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఏమాత్రం అభివృద్ధి సాధించకపోవటం ఎంతైనా శోచనీయం. ప్రభుత్వపరంగా ఏ విధమైన సహాయ సహకారాలు అందకపోయినా హీరో కృష్ణ ఇక్కడ అత్యాధునికంగా పద్మాలయా స్టూడియోస్‌ను నెలకొల్పడమే కాకుండా ఇక్కడ తెలుగు, హిందీ భాషల్లో కూడా చిత్రాలు తీయడం ముదావహం. ఈయన నటిస్తూ, దర్శకత్వం వహిస్తూ నిర్మించే "సింహాసనం" చిత్రం అఖండ విజయాన్ని సాధిస్తుందని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నా" అని మహారాష్ట్ర గవర్నర్ శ్రీ కోన ప్రభాకరరావు అనగానే పద్మాలయా స్టూడియోస్‌లోని కరతాళలకు, హర్షధ్వానాలకు ఆ చుట్టుపక్కలున్న కొండలు, గుట్టలు ప్రతిధ్వనించాయి.

కోవాడిస్, టెన్ కమాండ్‌మెంట్స్, బెన్‌హర్ స్థాయిలో 70 ఎం. ఎం. (స్టీరియోఫోనిక్) విస్తరణలో కృష్ణ నిర్మించే "సింహాసనం" ద్విభాషా చిత్రానికి ఆగస్టు 1న పద్మాలయ స్టూడియోస్‌లో ప్రారంభోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆహూతులతో, వేలాది కృష్ణ అభిమానులతో ఆ స్టూడియో కిటకిటలాడిపోయింది. నేత్ర పర్వమైనట్టి రాజమహల్ లోపలిభాగం సెట్‌లో తూర్పు వైపున ప్రత్యేకంగా నిర్మించబడిన గేలరీలలో అసంఖ్యాక ఆహూతులు, అభిమానులు ఆసీనులయ్యారు. పది ఎకరాల విస్తీర్ణంలో మద్రాసు నుంచి ప్రత్యేకంగా పిలిపించబడిన దాదాపు 200 మౌల్డర్స్, కార్పెంటర్స్ 45 రోజులలో రూపొందించిన ఆ భారీ సెట్‌కు 17 లక్షలకు పైగా వ్యయమైందని శిల్ప దర్శకుడు భాస్కరరాజు తెలిపారు. ఆ సెట్ తూర్పు వైపున కొద్ది దూరంలో కనిపించే గోల్కొండ కోటకు అనుబంధమైనదా అనే భ్రమ కలిగించే రీతిలో ఉంది.

సినిమా

అనిల్ కుమార్ దర్శకత్వంలో వెంకన్నబాబు చిత్రం "బంగారు చిలక"

ఆగస్ట్ 1 నుండి 15 వరకు తొలి షెడ్యూల్ జరిగింది సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 10 వరకు అరకు వేలిలో జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు మహేశ్వరి మూవీస్ అధినేత ఎస్ ఎ వెంకన్నబాబు ఈయన నిర్మించే బంగారు చిలక చిత్రంలో అర్జున్ భానుప్రియ గుమ్మడి అల్లు రామలింగయ్య గిరిబాబు నూతన్‌ప్రసాద్ కాకరాల రాళ్ళపల్లి, వెలు శుభలేఖ సుధాకర్, క్షేమేశ్వరరావు, ఆనందమోహన్ జగ్గారావు నిర్మల సుకుమారి నవ నటుడు డుంబూ పాల్గొంటున్నారు ఎ వి రమణ కథకు సత్యానంద్ సంభాషణలకర్త వేటూరి గీతాలకు ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం స్వరకర్త శరత్ ఛాయ, సాయికుమార్ శిల్పం రాజు సాహసాలు నాగేశ్వరరావు – జ్యోతి సహకార దర్శకత్వం నాగేశ్వరరావు కూర్పుతో నర్సయ్య ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. దర్శకత్వం అనిల్‌కుమార్



శ్రీ టెంపోరావు మృతి

ప్రముఖ నవలా రచయిత, జర్నలిస్టు శ్రీ టెంపో రావు 24. జూలై '85 న మరణించారు.

తెలుగులో 'డిటెక్టివ్', 'ఫిల్మ్' పత్రికలను, ఆంగ్లంలో 'టెంపో' పత్రికను ఈయన స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌లో డిటెక్టివ్ సాహిత్యాన్ని ఈయన ప్రవేశపెట్టారు. మహాకవి శ్రీశ్రీచే 'సాహితీ సామ్రాట్' బిరుదును అందుకున్నారు.

'సి. ఐ. డి. రాజు', గూఢపుఠాణి' వంటి తెలుగు చిత్రాలకు కథ, మాటలు కూడా రాశారు..



"బొబ్బిలి వేట"లో శివకృష్ణ, స్వప్న



సీరియల్

మల్లిక

యార్లగడ్డ కెమీరా

(గత సంచిక తరువాయి)

11

ఆఫీసు కారిడార్‌లో బులిటన్ బోర్డు చూస్తూ నిలబడింది మల్లిక

రీసెంట్ జాబ్ వేకెన్సీలు, జరగబోయే బోర్డ్ మీటింగులు మొదలగు వాటితో బాటు ఎవరెవరో వుద్యోగుల ఇళ్ళల్లోని అక్కర్లేని పాత ఫర్నిచర్, పాత కార్లకు సంబంధించిన పర్సనల్ సేల్ నోటీసులు కూడా వున్నాయి.

అవన్నీ చూస్తున్న మల్లిక దృష్టిని ఒక నోటీసు ఆకర్షించింది. కంప్యూటర్ ప్రోగ్రామర్స్‌కి చికాగోలో జరగనున్న వర్క్‌షాప్‌కి సంబంధించిన నోటీసు అది!

ఆ రోజే బాస్‌తో మాట్లాడింది. ఆ వర్క్‌షాప్‌కి మల్లిక వెళ్ళటానికి ఒప్పుకున్నాడతను ఇంకొక రెండు వారాల్లో మొదలవుతుందది

పర్సనెల్ ఆఫీసుకి వెళ్ళి తన వెకేషన్ ఎంత మిగిలి వుందో తెలుసుకుంది. వర్క్‌షాప్ టైంతో బాటు వెకేషన్ మూడు వారాలూ తీసేసుకుంది .

ఆ రోజు మధ్యాన్నం లంచ్‌టైం సంభాషణలో మల్లిక వెకేషన్ కూడా దొర్లింది.

"వింటర్ టైంలో వెళ్తున్నావేమిటి మల్లికా? బైటికెళ్ళటానికీ, సైట్ సీయింగ్‌కి ప్లెజంట్‌గా వుండదు కదా?" షెర్లీ అడిగింది.

'చికాగో ఇంతకుముందు చూసిన వూరే' వర్క్‌షాప్‌లో చర్చించే సబ్జక్ట్ మీద ఇంటరెస్ట్ కొద్దీ వెళ్తున్నాను కొత్త టెక్నిక్ కదా?"

'అదిసరే మొత్తం నెల రోజులు వెళ్తున్నావు వర్క్‌షాప్ అవ్వగానే ఇంకెక్కడికైనా వెళ్తున్నారా?" వూన్‌సిక్ ప్రశ్న.

"లేదు లూసీ అని నా బెస్ట్‌ఫ్రెండ్ అక్కడే వుంది. ఆమెను చూసి చాలా కాలమైంది. వెకేషన్ ఆమెతో గడుపుతున్నాను "

'మరి మీ హస్బెండ్?" డయానా అనుమానం అక్కడ అందరికీ తెలుసు ఏ వూరెళ్ళినా ఇద్దరూ కలిసే వెళ్తారని!

"ఇంతకు ముందు చూసిన వూరేగదా? అదిగాక, భార్గవ్‌కి ఇప్పుడు వెకేషన్ తీసుకోవటం కుదరదు

పైకి మామూలుగానే అన్నా మల్లికకు ఈ ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పటం విసుగ్గా వుంది.

"జీ! ఒక్కదానివే వెళ్తున్నావా? జాగ్రత్త డియర్! ఈ మగవాళ్ళను ఒక్క రోజు కూడా ఒంటరిగా నమ్మరాదు! నేనే నువ్వయితే వెళ్ళేముందు ఈ విషయం మరొక్కసారి ఆలోచిస్తాను."

క్రిస్టల్ మాటలకు ఒళ్ళు మండింది నేను నువ్వు కాదుగా? నా మొగుడి మీద నాకా మాత్రం నమ్మకముంది అయినా అటు తిరగ్గానే ఇటు మోసం చేసేవాళ్ళని పట్టుకుని వ్రేళ్ళాడి ప్రయోజనమేమిటి?" నెమ్మదిగా అయినా కరుగ్గా అంది.

ఫిలిప్ వాళ్ళతోనే కూర్చున్నాడు. అయినా మొత్తం సంభాషణలో ఒక్కసారిగా కూడా పెదవి కదపలేదు

"అసలు సంగతేమిటి మల్లికా?" మిగతా అందరూ వెళ్ళిపోయాక అడిగాడు

మల్లిక మాట్లాడలేదు పోయిన సారి సంభాషణతో అతను చాలా దగ్గరయ్యాడు కానీ ఎలా చెప్పాలో మల్లికకు అర్థం కాలేదు.

"కుతూహలం కొద్దీ అడగటం లేదు మల్లికా! నీకేదైనా సహాయం అవసరమైతే చేద్దామని నాకున్న కొద్ది మంది ఫ్రెండ్స్‌లో నువ్వు ముఖ్యమైన దానివి. నువ్వు బాధ పడుతుంటే నాకు కష్టంగా వుంటుంది '

మల్లికలో బెరుకు ఒలిపోయింది. జరిగిందంతా వివరించింది. ఆఖరికి అంది, "భార్గవ్ తనంతట తను నానుండి విడిపోడు ఫిలిప్! అందుకే నేనే దూరమవ్వాలని నిశ్చయించుకున్నాను కొన్నాళ్ళు బాధ పడినా అతనే మర్చిపోతాడు."


ఫిలిప్ కాస్సేపు మాట్లాడలేదు "నీ సంగతేమిటి మరి? అతన్ని విడిచి నువ్వు సంతోషంగా వుండగలవా?'

ఆమె ముఖంలో విషాదం అలుముకుంది. అది కష్టమైన విషయమే! అతను లేకపోతే నాకు జీవితమే వుండదు. అయినా తప్పదు. పిల్లలంటే అతనికున్న ప్రేమ తెలిసీ ఈ మాత్రం చెయ్యక తప్పదు!"

"అలా అయితే నువ్వు చేస్తున్నది తప్పు మల్లికా! నువ్వు చెప్పిందే నిజమైతే, ఒకళ్ళంటే ఒకళ్ళకి గాఢానురాగమే వుంటే పిల్లల కోసం విడిపోవటం సరైన పనికాదు పిల్లల అవసరం లేకుండానే మీ జీవితానికి ఆ ప్రేమ సరిపోయి వుండాలి. అలా సరిపోలేదంటే అది సంపూర్ణ ప్రేమ కాదు! లేదా నువ్వు భార్గవ్ ప్రవర్తనని తప్పుగా అర్థం చేసుకునన్నా వుండాలి. అతను పిల్లలు లేకపోవటం వల్ల అలా ప్రవర్తించటం లేదేమో! నిజంగానే ఈ లోకంలోని దురదృష్టవంతుల మీది దయతో అలా చేస్తున్నాడేమో! ఆలోచించావా? -

"ఆ విషయం నేనూ ఆలోచించాను. భార్గవ్ ఇతరుల కష్టాలకు కరిగిపోయే

జరిగిన కథ–16: భార్గవ్ అమెరికాలో ఒక చిన్న ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు భార్గవ్‌కి మల్లిక పరిచయం అయ్యింది. ఆమె ఉద్యోగంలో చేరినాక వారిద్దరు పెళ్ళి చేసుకున్నారు. వారి జీవితం సాఫీగా సాగిపోతున్నా పిల్లలు మాత్రం కలుగలేదు. అందుకై ఆ దంపతులు డాక్టర్ల చుట్టూ తిరగటం ప్రారంభించారు వారికి పిల్లలు పుట్టక పోవడానికి కారణాన్ని ఏ డాక్టరూ చెప్పలేక పోయాడు. కానీ భార్గవ్‌కి మాత్రం తమకి తప్పక పిల్లలు పుడుతారని నమ్మకం ఒంటరి తనంతో బాధ పడుతున్న మల్లికకి చిన్ననాటి స్నేహితురాలు అంజలి తారస పడటం ఆనందాన్ని కలుగ చేసింది పిల్లల్ని పెంపకం తీసుకునే విషయంలో తమకి ఆసక్తి లేదని డాక్టరుతో చెపుతాడు భార్గవ్ డాక్టరు మాటలు విన్న భార్గవ్‌కి తనింట్లో చిన్నప్పుడు పాలేరుగా ఉన్న చిట్టిగాడు, వాడి పిల్లలు జ్ఞప్తికి వస్తారు చిట్టిగాడి పిల్లలకి ఏదో ఒక దారి చూపించాలనుకుంటాడు. చిట్టిగాడి భార్య చనిపోయిందని. వాడు క్షయతో బాధపడుతున్నాడని తండ్రి ఉత్తరం ద్వారా తెలుసుకున్న భార్గవ్ ఆవేదన చెందుతాడు. డేవిడ్ తన ఇంట్లో కంపెనీ తరపున ఇచ్చే 'క్రిస్మస్' పార్టీకి మల్లిక, భార్గవ్ వెళతారు. భార్గవ్ ఇదివరకటిలా ఉండటం లేదని స్నేహితురాలు అంజలికి చెప్పి బాధపడుతుంది మల్లిక మల్లిక, భార్గవ్ సపోర్ట్ గ్రూపు మీటింగ్‌కి వెళతారు. లావు తగ్గడానికే గాక, లావు పెరగకుండా ఉండటానికి హెల్త్‌స్పాకి వెళ్లాలనుకుంటుంది మల్లిక. మల్లిక, అంజలి కూడా హెల్త్ స్పాకి వెళ్లి వస్తున్నారు. భార్గవ్ ప్రవర్తన మల్లికకు తీరని బాధని కలుగ చేస్తుంది వెడ్డింగ్ యానివర్సిరి నాడు భార్గవ్ తప్పతాగి ఇంటికి రాకుండా జిమ్ అపార్ట్‌మెంటులో పడి ఉండటంతో మల్లికకు మనస్సంతా శూన్యంగా అయ్యింది పిల్లలు లేకపోవడమే దీనికంతా కారణం అనుకుంటుందామె భార్గవ్ కంపెనీ స్టాకులు కొంటానంటే మల్లిక వద్దనిందని ఆమె మనసుని గాయపరిచే మాటంటాడు భార్గవ్. మల్లికకి గతం జ్ఞప్తికి వస్తుంది.



దయార్ద్రహృదయుడే! కాని అతను వేస్తున్న పథకం ఎంత పెద్దదో చూశావా? ఇండియా మొత్తంలో ఆకలి కడుపులు లేకుండా చెయ్యటం! అతని ఆలోచనలూ, వ్యూహలూ అన్నీ ఆ పథకం చుట్టూనే. తనకూ ఒక జీవితం వుందని మర్చిపోతున్నాడు. నా వ్యూహ ప్రకారం మర్చిపోవాలనే అలా చేస్తున్నాడు."

"నువ్వన్నట్లు అది కవచాప్ప అయితే ఎప్పుడో ప్పుడు ఆ షెల్‌లో నుండి బైటికి రాకుండా వుండడు. అంతదాకా నువ్వు ఓపిక పట్టడం మంచిదని నా అభిప్రాయం. అదిగాక నీలో ఏలోపమూ లేదని డాక్టర్లు చెప్పినప్పుడు బ్లేమ్ నీ మీద వేసుకుని వెళ్ళిపోవటం వల్ల ప్రయోజనమేమిటి?"

కాస్సేపు ఆలోచించింది మల్లిక. "లేదు ఫిలిప్! కొంతకాలం భార్గవ్‌కి దూరంగా వెళితే తప్ప కొన్ని ఆలోచనలు క్లియర్ కావు. మా పెళ్ళయిన పదేళ్ళల్లోనూ ఏ ఒక్కసారో, ఒకటి రెండు రోజులు తప్ప మేమిద్దరం దూరంగా వుండలేదు తెలుసా? ప్రయత్నించి చూడనీ, ఏం జరు తుందో!"

మల్లిక ధృడనిశ్చయం చేసుకుందని గ్రహించాడు ఫిలిప్.

"ఫూల్‌లాగా ఇంతలా వాదిస్తున్నానేమిటి? మీరెప్పుడు విడిపోతారా అని ఎదురుచూస్తున్న వాణ్ణి కదూ నేను!" ఎప్పటి చిలిపితనం చోటుచేసుకుంది అతని కళ్ళల్లో.

అతన్ని చూస్తుంటే అంత బాధలోనూ నవ్వొచ్చింది మల్లికకు.

* * * * *

ఆ సంఘటన తర్వాత ముభావంగానే వుంటున్నారు మల్లిక, భార్గవ్. మరి అవసరమైతే తప్ప మాట్లాడుకోవటం లేదు.

అసలు మాట్లాడటానికూడా తీరిక లేనంత బిజీగా వుంటున్నాడు భార్గవ్. ఇంటి లోన్‌కి, కార్లలోన్లకి అప్లయ్ చేశాడు.

అప్లయ్ చెయ్యగానే కార్లలోన్లు శాంక్షన్ చేసేశారు. ఇంటిది మాత్రం అది

మల్లిక

ఇదీ అంటూ కొంచం తతంగం చేశారు. ముందు బాంక్ తాలుకూ అప్రైజర్ వచ్చి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి వెళ్ళాడు. తర్వాత భార్గవ్, మల్లికల వుద్యోగాలు, జీతాలు, అప్పులు తీసుకుని తీరుస్తున్న విధానాలు – అన్నీ పరిశీలించి ఆఖరికి అప్పివ్వటానికి ఒప్పుకున్నారు. ఆ చుట్టుపట్ల ఇళ్ళ ధరలు బాగా పెరగటం వల్ల భార్గవ్ ఆశించిన దానికంటే ఎక్కువే అప్పు పుట్టింది.

వెంటనే ఆ డబ్బంతా పెట్టి కంపెని స్టాకులు కొనేశాడు. ఆ పనంతా పూర్తయ్యి కాస్త స్తిమితం చిక్కేసరికి రెండువారాలు పట్టింది.

మల్లిక చికాగో ప్రయాణం బాగా దగ్గరలోకి వచ్చింది. భార్గవ్‌తో ఇంకా ఆ విషయం చెప్పనేలేదు!

ఆరోజు కాస్త పెందలాడే ఇంటికొచ్చాడు భార్గవ్. డిన్నర్ తింటున్నప్పుడు చెప్పింది మల్లిక, తన ప్రయాణం గురించి.

విని ఆశ్చర్యపోలేదు భార్గవ్. సంవత్సరానికొక మీటింగ్‌కి వెళ్ళటం మల్లికకు మామూలే.

"ఎక్కడ మీటింగ్?" అడిగాడు.

"చికాగో."

"ఎప్పుడు?"

"ఎల్లుండి నుండీ మొదలు. రేపే బైలుదేరాలి."

"అంత తొందరలోనా? సరే. అయితే ఎన్నిరోజులు?"

"మీటింగ్ అయిదు రోజులు. నా వెకేషన్ మూడు వారాలు కూడా తీసేసుకున్నాను. లూసీతో కొంతకాలం గడపాలని వుంది." మామూలుగా అంది.

భార్గవ్ కాస్త ఆశ్చర్యపోయినట్లు కనిపించాడు. అయినా ఏమి అనలేదు.

అతనేమైనా అంటాడేమో నని కాస్సేపు ఎదురుచూసింది. అతను భోజనం ముగించి వెళ్ళి టి. వి. ఆన్ చేశాడు.

నెల రోజులపాటు చికాగోలో వుండాలని నిశ్చయించుకున్నా, అప్పటి వరకూ వున్న ఏదో అంతర్గతమైన ఆశ వూదేసిన దీపం లాగా చప్పున ఆరిపోయింది. ఎక్కడలేని నీర్సమూ ఆవరించింది. లేని ఓపిక తెచ్చుకుని కిచన్ సర్చి పుస్తకం ఒకటి తీసుకుని పైకెళ్ళిపోయింది.


★ ★ ★ ★ ★


"అయితే నీ పట్టు వదలవన్నమాట! నీ జీవితాన్ని నువ్వే చేతులారా ఎందుకు నాశనం చేసుకుంటున్నావో నాకర్థం కావటం లేదు. నువ్వుత్త మొండివని తెలుసుగాని ఇప్పుడు కాస్త మూర్ఖత్వం కూడా జోడైనట్లుంది." కోపంగా అంది అంజలి.

మల్లిక ఏమి మాట్లాడలేదు. మల్లిక చేసుకున్న నిశ్చయం గురించి అప్పటికి ఏ వంద సార్లన్నా మాట్లాడి వుంటారు ఇద్దరూ. ప్రతిసారి మల్లికను ఆ ప్రయత్నం నుండి విరమింప జేయాలనుకోవటం, మల్లిక ససేమిరా అనటం తప్ప లాభం లేకపోయే సరికి అంజలికి అంతులేని కోపం వచ్చింది.

ఆ రాత్రే మల్లిక చికాగో బైలుదేరేది! మల్లిక మనస్సెలా మార్చాలో అంజలికి అర్థం కావటం లేదు.

"భార్యా భర్తల్లో ఒకళ్ళు హెచ్చుగా ప్రవర్తించినప్పుడు ఒకళ్ళు తగ్గుండాలి. మీ ఇద్దరికీ ఒకళ్ళకు మించి ఒకళ్ళకు తలబిరుసులా వుంది. చికాకుల్లో వుండి అతనేదైనా అంటే నువ్వంత సీరియస్‌గా తీసుకోవాలా? ఇంతకాలం నువ్వెంతో తెలివిగలదానివని అనుకునేదాన్ని. కాదు మల్లికా. నువ్వొట్టి ఫూల్‌వి! వచ్చినప్పట్నుండీ చూస్తున్నాను. భార్గవ్ ఏనాడూ నిన్ను తక్కువగా చూడలేదు. పుల్లవిరుపుగా మాట్లాడలేదు. ఒక్కసారి కాస్త విసుగ్గా మాట్లాడినందుకే అలా వెళ్ళిపోతానంటావా? ఆ లెక్కన మా ఆయన నన్ననే మాటలకి కొన్ని వందలసార్లయినా ఇల్లొదిలి పోవాల్సినదాన్ని! నామాట





విను మల్లికా! బాగా ఆలోచించు. " కోపం వల్ల పనిజరగదని అనునయంగా అంది.

"నీకర్థంకాదు అంజలీ! నీ పరిస్థితి వేరు. నా పరిస్థితి వేరు. మీ ఇద్దరికీ లింకుగా మీకు పిల్లలున్నారు. అయినా భార్గవ్ నన్నేదో అన్నాడనికాదు నేను వెళ్ళిపోయేది. ఆ లెక్కన నేనూ అతన్ని అనలేదూ? ఇప్పటికి నేనెన్నిసార్లు చెప్పాను ఎందుకు వెళ్ళాలనుకుంటున్నానో?"

"నువ్వెన్ని సార్లన్నా చెప్పు. నువ్వు చేసేది తప్పనే అంటాను! నీకులేని పిల్లలు నాకున్నారు. నాకులేని చక్కటి సంసార జీవితం నీకుంది. నేను చదువూ సంధ్యాలేని మొద్దుని. నువ్వు చక్కగా చదువుకుని ప్రొఫెషన్‌లో పైకొచ్చిన దానివి. అందరూ అన్నీ పొందలేరు మల్లీ ! లేనివాటికోసం బాధపడటం కంటే వున్నవాటితో తృప్తిపడటం జీవితానికి ఆరోగ్యం!"

"నువ్వు నిజంగా మొద్దువే!" కోపంగా అంది మల్లిక.

"ఎంత చెప్పినా అర్థం చేసుకోవేం? నేను వెళ్ళిపోయేది నా బాధ వల్ల కాదంటే వినిపించుకోవేం? ఒక విషయం చెబుతాను విను. పెళ్ళికాక ముందు ఒక సందర్భంలో పిల్లల గురించి మాటలొచ్చినప్పుడు నేనూ నువ్వు పైన అన్నట్లే అన్నాను. ఒకవేళ పిల్లలు లేకపోతే ఏడుస్తూ కూర్చోనని. నేనిప్పుడు ఏడుస్తూ కూర్చోవటం లేదు కూడా! నా బాధంతా భార్గవ్ గురించే. అతనికి పిల్లలు జీవితంలో ఒక భాగం కాదు. పిల్లలే జీవితం!"

అంజలి చాలా సేపు మల్లిక వంక చూస్తూ కూర్చుంది. ఆమెకేదో అర్థమైనట్లయ్యింది. పిల్లలు లేరని భార్గవ్ ఎంత బాధ పడుతున్నాడో తెలియదు గాని మల్లిక మాత్రం చాలా అప్‌సెట్ అవుతోంది. అది పైకి వెల్లడి చేయటం ఇష్టంలేక భార్గవ్ మీదకు నెడుతోంది!

"సరే. అయితే ఒక్క ఆఖరి ప్రశ్న! నువెళ్ళి పోయినంత మాత్రాన భార్గవ్ మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడని ఏమిటి గ్యారంటీ?"

"పిల్లల కోసం తప్పకుండా చేసుకుంటాడు!"

"ఇప్పటికే నువ్వు చేస్తున్న పని సరైనదిగా తోచటం లేదు మల్లీ! అయినా నేను చెయ్యగలిగింది వున్నట్లు లేదు. మళ్ళీ ఒకసారి జాగ్రత్తగా ఆలోచించమని మాత్రం కోరుతున్నాను. అప్పుడప్పుడూ వుత్తరాలు వ్రాస్తుంటావుగా? మళ్ళీ ఎప్పటికి చూస్తానో నిన్ను!" అంజలి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రాజభూషణంగారి 'సబాటికల్' మీద వచ్చే వారమే యూరప్ వెళుతున్నారు ఫామిలీ అంతా. సంవత్సరం వరకూ తిరిగిరారు.

* * * *

అవసరమనుకున్న బట్టలు, వస్తువులు సర్దుకుంది మల్లిక. భార్గవ్, తనూ తీయించుకున్న ఫోటోలు కొన్ని, స్టెఫనీ ఇచ్చిన ఫోటో పెట్టెలో పెట్టుకుంది.

ఎప్పటిలాగే, శనివారమైనా భార్గవ్ ఆఫీసు కెళ్ళాడు. ఒక్కతే ఇల్లంతా తిరిగింది. గదిగదిలోనూ ఎన్నో జ్ఞాపకాలు! ఎన్ని ఆశలతో తామూ ఇల్లు కొనుక్కున్నారు! పిల్లలు పుట్టినప్పుడు అవసరమౌతుందని తమకు అంతది అక్కరలేకపోయినా పెద్ద ఇల్లు కావాలని తీసుకున్నాడు భార్గవ్!

ఇద్దరూ కలిసి సెలక్ట్ చేసి ఇంటికి కావల్సిన ఫర్నిచర్, మిగతా వస్తువులూ కొన్నారు. ఇద్దరూ కలిసి ఏర్పరచుకున్న ఇంట్లో కలకాలం సంతోషంగా గడపాలని కలలు కన్నారు. భవిష్యత్తు ఇలా వుంటుందని అప్పుడెవరన్నా చెబితే తను నమ్మేదా?

ఆమె బాధను పంచుకుంటున్నట్లుగా ఆ ఇంట్లోని సోఫాలు, టి. వి.లు, మంచాలు, కర్టెన్లు, కార్పెట్లు, గోడలు అన్నీ మౌనంగా ఆమె వంకే చూస్తున్నాయి.

ఆ రాత్రి కెన్నడీ ఎయిర్‌పోర్ట్‌లో ప్లేన్ ఎక్కినప్పుడు కూడా భార్గవ్‌తో పెద్ద మాటలు జరగలేదు.

"అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుండు. నెలరోజులూ అక్కడ వుండటం బోరుగా వుంటే వచ్చేసెయ్."

"ఊఁ."

"హావె సేఫ్ ఫ్లైట్!"

"అలాగే."

సెక్యూరిటీ చెక్ అయినాక టర్మినల్‌లోకి వెళ్ళబోతూ వెనక్కి చూసింది మల్లిక. భార్గవ్ ఇటే చూస్తున్నాడు. పరిగెత్తి అతని దగ్గరకు వెళ్ళిపోవాలనే కోరికను బలంగా అపుకుంటూ గబగబా ముందుకి అడుగులు వేసింది.

ప్లేన్ టేకాఫ్ చేస్తోందనీ, సీట్‌బెల్ట్స్ పెట్టుకోమనీ – ఏవేవో ఎనౌన్స్‌మెంట్ చేస్తూనే వున్నారు. మల్లిక అవేమీ పట్టించుకోకుండా కిటికీ అద్దంలో నుండి బైటికి చూస్తూనే వుంది. ఎయిర్‌పోర్ట్ బిల్డింగ్‌లో నుండి మనుషులు ఇటు చూస్తూ కనిపిస్తున్నారు. వాళ్ళల్లో భార్గవ్ కూడా వున్నాడేమో! అంతమంది జనంలో ఎవరు ఎవరైంది తెలియటం లేదు.

ప్లేన్ రన్‌వే మీద ఒకసారి చక్కర కొట్టి బయ్యిమని పైకి లేచింది. కొంచం కొంచంగా లేస్తూ బాగా పైకెళ్ళిపోయింది. మల్లిక కళ్ళు పెట్టుకుని ఇంకా చూస్తూనే వుంది. భార్గవ్ తనకిక అందనంత దూరంలో వుండిపోయాడు! అనుకోకుండానే ఆమెలో నుండి పెద్ద నిట్టూర్పు వెలువడింది.

పైనుండి చూస్తుంటే వెలిగే దీపాలతో నిండి వున్న నగరం ఒక 'గాలక్సీ' లాగా కనబడుతోంది.

నీళ్ళ మధ్యలో వున్న ద్వీపాలు, ద్వీపాలను కలుపుతూ సస్పెన్షన్ బ్రిడ్జిలు, ఆదేశంలో అడుగు పెట్టే వాళ్ళకు చెయ్యెత్తి స్వాగత మిస్తున్నట్లుగా నిలబడి వున్న స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, ఒకప్పుడు ప్రపంచంలోకెల్లా ఎత్తైనదిగా ప్రసిద్ధి గాంచిన ఎంపైర్‌స్టేట్ బిల్డింగ్, యునైటెడ్ నేషన్స్ బిల్డింగ్ – అన్నీ క్రమంగా మరుగైపోయాయి.

ఎన్నిసార్లు చూసినా థ్రిల్లింగా వుండే వాటన్నిటినీ చూస్తుంటే మల్లికకేమీ



ఇటీవల బెంగుళూరులో ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో శ్రీమతి సరోజిని రత్నం రచించిన శ్రీరామానంద మోక్షమార్గం పుస్తకావిష్కరణ జరిగిన సందర్భంగా వేదిక నలంకరించిన శ్రీయుతులు వెంకట సుబ్బారెడ్డి, ఎ తిరుపతిరావు, నెల్లూరు శ్రీనివాసరావు, ఎ రవచంద్ర, శ్రీమతులు ఎ సరోజిని రత్నం, శోభా శ్రీరాములను ఈ చిత్రంలో చూడవచ్చు

మల్లిక

అనిపించటం లేదు. ఆమె మనస్సంతా భార్గవ్ నిండి వున్నాడు!

* * * *

భార్గవ్ ఎయిర్‌పోర్ట్ నుండి ఇంటి కొచ్చేసరికి బాగా లేటయ్యింది. అయినా అతనికి నిద్ర రావటం లేదు మల్లిక లేని ఇల్లు ఖాళీగా వున్నట్టుంది.

టి. వి. ఆన్ చేశాడు న్యూస్ వస్తున్నట్టుంది అతను న్యూస్ వినటం లేదు. మల్లిక గురించే ఆలోచిస్తున్నాడు. కొంత కాలం అలా వెళ్ళటమే మంచిదని, ఆమె వెళ్తానన్నప్పుడు అతనేమీ అభ్యంతర పెట్టలేదు. తనింత బిజీగా వుంటున్నప్పుడు ఆమె ఒంటరిగా ఇక్కడ గడిపే బదులు స్నేహితురాలితో కొంతకాలం ఎంజాయ్ చెయ్యటం బాగానే వుంటుందనిపించింది.

కానీ, ఇప్పుడా ఆలోచన మంచిదేనా అన్న అనుమానం కలుగుతోంది. నెలరోజుల పాటు మల్లికను చూడకుండా తను వుండగలడా?

టి. వి. కట్టేసి, కోకాకోలా గ్లాసులో పోసుకుని పైకెళ్ళాడు. కోక్ గటగటా తాగేసి, బట్టలు మార్చుకుని బెడ్ మీద వాలాడు అలవాటుగా అవతల పక్కకు చెయ్యేశాడు. తమ బెడ్ ఇంత పెద్దదా అనుకుంటూ కాస్సేపు ఆశ్చర్యపోయాడు. పక్కమీద చాలాసేపు దొర్లాడు ఆఖరికి లేచి టేబుల్ మీదున్న చిన్న టి. వి. ఆన్‌చేసి వచ్చి పడుకున్నాడు.

* * * * *

ఆ తర్వాత క్షణం తీరికలేకుండా గడిపేశాడు భార్గవ్ దాదాపు లాబ్‌నే ఇల్లుగా చేసుకున్నాడు. ఆకలేసినప్పుడు బైట తినటం, నిద్రకాగలేనప్పుడు ఏ రెండుమూడు గంటలో లాబ్‌లోనే కునుకు తియటం– కమ్యూటింగ్‌తో టైం వేస్టవుతుందని బట్టలు కూడా కొన్ని లాబ్‌లో నేపెట్టుకున్నాడు.

ఇంకా ఎవరైనా తయారు చెయ్యకముందే తమ కంపెనీలోనే, తానే, ఆ ప్రాడక్ట్ తయారు చెయ్యాలనే పట్టుదలలో వున్నాడు భార్గవ్. చాలా దీక్షగా పనిచేస్తున్నాడు. ఒకసారి రిజల్ట్ వచ్చినట్లే వచ్చి జారిపోయింది. ఈ సారి ఎలాగైనా సాధించాలని అతని ప్రయత్నం'

డేవిడ్ అతని పనికి ఆటంకం లేకుండా అన్ని వసతులూ కల్పించాడు. పడకకీ, స్నానానికీ ఆఫీసులోని తన ఎక్జిక్యూటివ్ స్వీట్‌ని వాడుకోమన్నాడు.

ఈలోపున కంపెనీ ఎకానమీలో కూడా చాలా మార్పొచ్చింది. ఆ మధ్య పుట్టుకొచ్చిన రూమర్‌ని నిజంచేస్తూ ఒకపెద్ద బయోటెక్నాలజీ కంపెనీ 'మర్జర్' కోసం సంప్రదింపులు జరపసాగింది. డేవిడ్‌కి మొదట్లో ఆ డీల్ ఇష్టం లేకపోయింది. ఎందుకంటే, ఆ ప్రాడక్ట్ విషయమై గట్టిగా ప్రయత్నిస్తున్న ఈ సమయంలో ఆ కంపెనీతో కలియటం తమకంటే అవతలివాళ్ళకే లాభమని అతనికి తెలుసు. బోర్డ్ మీటింగ్స్‌లో చాలా తర్జన భర్జనలు అయ్యాక కలియటానికే ఒప్పందం కుదిరింది. కంపెనీ ఇప్పటికే తలమునకా అప్పుల్లో వుంది. ఆ ప్రాడక్ట్ మీద ఆధారపడి వూరుకుంటే ముందు కంపెనీయే దివాళా తీసేలావుంది.

ఆఖరికి, 'మర్జర్' కై ఇరువైపుల అధికారులూ అగ్రిమెంట్ వ్రాసుకున్నారు. ఇక ఫార్మాలిటీసే తరువాయి. దానితో కంపెనీలో ఒక విధమైన స్థిరత్వం ఏర్పడింది. చాలానాళ్ళ తర్వాత కంపెనీ వుద్యోగులు నిశ్చింతగా వూపిరి పీల్చుకున్నారు.

ఒకరోజు భార్గవ్ కోల్డ్‌రూంలో ఏదో పని చేస్తుండగా ఫోన్‌కాల్ వచ్చింది.

"నాపేరు ఫిలిప్. మల్లిక పని చేసే ఆఫీసులోనే నేనూ పనిచేస్తున్నాను మీతో ఒకసారి మాట్లాడాలి. ఎప్పుడు వీలవుతుంది?"

భార్గవ్ కనుబొమ్మలు ముడుచుకున్నాయి ఎవరీ ఫిలిప్? క్రమంగా గుర్తొచ్చింది. ఒకటి రెండుసార్లు మల్లిక అతని గురించి చెప్పింది కానీ అతనికి తనతో ఏం మాటలు?

"సారీ! చాలా బిజీగా వున్నాను. ఇప్పుడు కుదరదు." లంచ్ బ్రేక్ తీసుకుంటే టైం వేస్టవుతుందని, పని చేస్తూనే ఏదో కతికే భార్గవ్‌కి ముక్కూముఖం తెలియని ఎవరితో నో మాట్లాడే తీరికేదీ?

"ఎప్పుడు కుదురుతుంది?" ఫిలిప్ పట్టు విడువలేదు.

"ఇప్పుడప్పుడే కాదు." విసుగ్గా అని ఫోన్ పెట్టెయ్యబోయాడు.

"ఆగండి! చాలా అర్జంట్! మల్లిక గురించి మాట్లాడాలి."

ఎలర్ట్‌గా అయ్యాడు భార్గవ్. మల్లిక గురించా? అర్జంటా? మల్లిక వెళ్ళినాక ఒకటి రెండుసార్లు ఫోన్ చేశాడు. ఆమె దొరకలేదు. ఆ తర్వాత పనిలో మునిగిపోయి ఆమెను కాంటాక్ట్ చెయ్యలేదు.

"ఏమిటో చెప్పండి." ఆతృతగా అడిగాడు.

"ఫోన్‌లో కుదరదు. ఒక్క పదినిముషాల టైం ఇస్తే చాలు అరగంటకి మీ ఆఫీసులో కలుసుకుంటాను."

"సరే."

ఆ తర్వాత ఫిలిప్ వచ్చేవరకూ భార్గవ్‌కి పని సాగలేదు. అతనికోసమే ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఫిలిప్ రాగానే లాబీలో ఎవరూ లేనిచోటు చూసుకుని కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి, ఏమిటి మాట్లాడాలన్నారు?"

"నిన్ననే మల్లిక రెజిగ్నేషన్ లెటర్ పంపింది." భార్గవ్ వంకే చూస్తూ నిదానంగా అన్నాడు ఫిలిప్.

నెత్తిమీద బాంబ్ పడినట్టు అదిరిపడ్డాడు భార్గవ్.

"రెజిగ్నేషనా?" ముఖం పాలిపోగా అడిగాడు.

"మీకు తెలిసుండదనే అనుకున్నాను." అతని కంఠంలో ధ్వనించిన ఎగతాళికి తలెత్తి చూశాడు భార్గవ్.

"మల్లిక రిజైన్ చేసిందని తెలియగానే నిన్న రాత్రి ఫోన్ చేసి మాట్లాడాను. ఆమె ఇక తిరిగి రావటంలేదు. మా ఆఫీసుకేకాదు మీ జీవితంలో క్కూడా!"

ఒక పర్ఫెక్ట్ స్ట్రేంజర్ తన దగ్గరకొచ్చి నీ భార్య ఇక నీ దగ్గరకి రాదని చెప్పటానికెంత ధైర్యం! చటుక్కున లేచి నిలబడ్డాడు భార్గవ్.

"మిస్టర్! నీ ప్రాంక్స్ వినటానికి నాకు టైం లేదు. ఇంకెక్కడికైనా వెళ్ళి ప్రయత్నించు."

వెళ్ళబోతున్న భార్గవ్‌ని బలవంతంగా చెయ్యిపట్టి ఆపాడు ఫిలిప్.

"దయచేసి ఒక్క నిముషం కూర్చోండి . నేను చెప్పదలుచుకున్నది చెప్పేసి వెళ్ళిపోతాను."

భార్గవ్ కూర్చున్నాడు. అతని ముఖం కోపంతో ఇంకా ఎర్రగానే వుంది.

(ఇంకా ఉంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎ. బి. మద్రాసు

★ పెళ్ళి చేసుకొంటె జీవితం బాగుంటుందా? చేసుకోకపోతే బాగుంటుందా?

● ఇది పిచ్చిలాంటిదే – పెళ్ళి చేసుకున్నాక గాని చెప్పలేం

★ మీకు సినిమా హీరోలలో ఎవరంటే యిష్టం?

● నేనేం కాలేజీ అమ్మాయిననుకుంటున్నారా?!

ఎం. జె. పి. జి. జహీరాబాద్

★ ఈ ప్రపంచంలో అతివిలువైనది ఏది?

● చేతిలో వున్నది – చిల్లిగవ్వేనాసరే!

పి. డి. బి. మిర్యాలగూడ

★ మీతో కలం స్నేహం చేయాలని వుంది. వెంటనే మీ గురించిన విషయాలు లెటర్ రాయగలరు.

● సారీ, నేను రాయను. మీరేం నాకు చుట్టమా? స్నేహితులా?!

జి. ఎస్. డి. భీమవరం

★ అక్కా మీరు దేనికి ప్రాధాన్యత యిస్తారు?

● ఎలా చెప్పడం? ఎవరి జీవితానికి –అవసరమైన –ప్రీయారిటీస్ వారికి వుంటాయి– అవే ప్రధాన్యతని నిర్ణయిస్తూంటాయి

జి. వి. ఆర్. విజయవాడ

★ జీవితంలో ఏదో ఒక దాన్ని సాధించేది ధ్యేయంగా పెట్టుకోవాలి గాని – అన్నిటిలో అనుభవం సాధించాలనుకోవటం – పొరపాటు కదా?

● అనుభవం సాధించక్కరలేదు. క్యూరియాసిటీ వుండడం చాలా పొరపాటు

ఎల్. ఎల్. డి. రాయగడ

★ ఏమండీ రామలక్ష్మిగారూ. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటి– మీ ఫోటో కావాలి పంపేస్తారా?

● నన్ను మొహమాట పెట్టకు లతాదేవీ!ఆడతనం పంపించమంటుంది. జాణతనం వద్దులే అంటుంది.

డి. ఆర్. తిరుపతి

★ మీకు పని పాటా లేదా అని అడిగే వారికి ప్రశ్నావళిలో పనికిరాని పిచ్చి ప్రలాపాలు రాయడం ఎందుకు? అలాంటి వారికి మీరిస్తున్న సమాధానాలు బాగుంటాయి.

● కాని అలా రాసేవాళ్ళు వుంటారని మీలాంటి వారికెలా తెలుస్తుంది – అడపాతడపా నేను వారి నిక్కడ చూపెట్టకపోతే?!

వి. ఎమ్. ఆర్. భోగిరెడ్డిపల్లి

★ ప్రేమా ప్రేమా అని కొట్టుమిట్లాడుతున్న ఈ రోజులలో నేనో అందమైన అబ్బాయిని ప్రేమించాను. మాది కులాంతర ప్రేమ. మా ప్రేమకు తల్లితండ్రులు ఎదురైనారు. ఈ పరిస్థితిలో ఏం చేయాలి?

● మీకు మైనారిటీ తీరిందా? అతగానికి పెళ్ళాన్ని పోషించగల సామర్థ్యముందా? ఉంటే భయందేనికి? పెద్దలని ఒప్పించకపోయినా ధైర్యంగా ముఖ్యంగా పబ్లిక్‌గా పెళ్ళాడవచ్చు. ఆ పెళ్ళి లీగల్‌దై వుండాలి. అంచేత రెలిజియస్‌గాని రిజిస్టర్డ్‌గాని అయి వుండాలి. 'గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం' అంటే కుదరదు!

ఎస్. హెచ్. ఆర్. నౌపాడ

★ భారతీయ సంప్రదాయంలో వివాహానంతరం స్త్రీ యొక్క ఇంటి పేరు మారుతుంది. మీ విషయంలో అలా జరగలేదు. ఇదెలా సాధ్యం?

● మన భారతీయ సంప్రదాయంలో - ఆడదాని ప్రత్యేకత చంపే అనాచారాలు చాలా వున్నాయి. ఇద్దరు వ్యక్తులు పెళ్ళాడుతూంటే – యింటి పేర్లు గొడవదేనికి?

ఎల్. ఎమ్. ఆర్. విశాఖపట్నం

★ నాకు కోపం వస్తే ఒళ్ళు తెలియదు...తరవాత బాధ పడుతాను.

● కోపాన్నొక్క క్షణం అదుపులో వుంచుకుంటే – వంద రోజులు విషాదం తప్పుతుందంటారు అందుకనే.

ఆర్. ఎ. బి. కె. గుంటూరు

★ మీరు ఒక్కొక్కరికి యిస్తున్న సమాధానాలు చూసి భలే ఆశ్చర్యం వేస్తూంటుంది. ఎవరికి తగిన రీతిలో వాళ్ళకి వడ్డిస్తూంటారు.

● కీలెరిగి వాత వెయ్యడం ఆడ వారికి ముఖ్యంగా తెలియ వలసిన విద్య– చిట్టి తల్లీ

జి. వి. ఆర్. హైదరాబాదు


★ కొందరేం ఖర్మ అంతా పోతూనే వుంటారు. కామెంట్?

● నిజమే అంతా.పోతూనే వుంటారు కొందరు – మంచి చేసుకుంటూ పోతారు కొందరు పోతారు అది తేడా.

కె. వి. వి. ఎస్. ఎమ్. భద్రాచలం

★ రా.ల.గారు మీరు చందు సోంబాబుకి ఏం ద్రోహం చేశారు ఎప్పుడూ మిమ్మల్ని తిడుతూ వుంటారు. అవకాశం దొరికనప్పుడల్లా?

● ఎవరూ ఆ ఆంధ్రా హెరాల్డు రాబిన్సా? నేనేం ఆయన్ని అనలేదే! అయినా ఎందుకు తిడుతున్నారు చెప్మా! ఏ యండమూరేనా తెలుసుకు చెప్తే బాగుండును" (తిట్టారన్న బాధ కంటే –ఏం తిట్టారన్న క్యూరియాసిటి ఎక్కువగా వుంది!) □



ప్రియమైన రాధీ!

నీవు వ్రాసిన రెండు ఉత్తరాలు చేరాయి. వెంటనే జవాబు ఇవ్వలేని నా అసమర్థతను మన్నిస్తావు కదూ!

రాధీ! ఈ లోకంలో స్త్రీగా పుట్టడమే మహా పాపమేమో! అందుకే పెద్దలన్నారు 'ఆడదై పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం మేలని" నిజం రాధీ! ఈ మాట ముమ్మాటికీ నిజం. అసలు విషయం చెప్పక ఏమిటిది సోది రాస్తుందను కుంటున్నావు కదూ! అసలు విషయం చెపుతాను విను. కాదు.. కాదు.. రాస్తున్నాను చదువు.

రాధీ! అందంలో మన్మథుని మించిన వాడిని కట్టుకుని సుందర మధుర స్వప్న లోకంలో విహరించే నీకు ఈ చెలి ఎప్పుడైనా గుర్తు వస్తుందా?" అని వ్రాశావు. హు . రాధీ! హృదయ సౌందర్యం లేని బాహ్య సౌందర్యం ఏమిలాభం చెప్పు? నా విషయంలో ఇదే బుజువైంది. ఎంతో అందగాడని పైసా కట్నం కూడా ఆశించకుండా ఆదర్శవంతంగా నన్ను ఈయన వివాహం చేసుకున్నారని నాతో పాటు మీ అందరు కూడా మురిశారు అవునా రాధీ! వీళ్ళు కట్నం వద్దనడం కేవలం నాటకం మాత్రమే. నేనెలాగూ అమ్మా, నాన్నలకు ఒక్క కూతురునే కదా! నాన్న తరువాత పొలమూ మూడు మేడలూ నాకే వస్తాయని వీరి ఐడియా. అందుకే కట్నం వద్దన్నారు. ఒకరోజు మధ్యాహ్నం నేను కళ్ళు మూసుకుని పడుకుని వున్నాను. నేను నిదురపోయాననుకొని మా అత్తా, మామ, ఆయన ఈ విషయాలు మాట్లాడుకున్నారు అది విన్నాక వీళ్ళపై నాకు చెప్పలేనంత అసహ్యం వేసింది. కేవలం అదొక్కటే కాదు నా అసహ్యానికి కారణం. మరొకటి వుంది చెప్తాను. పెళ్ళికి ముందు నాన్నగారు మా సంసారానికి కావలసినవన్నీ ఇస్తామన్నారు కదా! అన్నమాట ప్రకారం నాన్నగారు పంటింటికి కావలసిన స్టీలు సామాన్లు, గ్యాస్‌స్టౌవ్, గ్రైండర్, వాటర్ ఫిల్టర్, డైనింగ్ టేబుల్, ఛైర్స్, గాడ్రెజ్ బీరువా ఇవన్నీ ఇచ్చారు కదా! అవి వీరికి తృప్తి కలిగించలేదు. సంసారానికి అవి ఇస్తే చాలా ఒక టి. వి. ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఎయిర్ కూలర్ కూడా ఇస్తారనుకున్నాము. ఇవి లేకుండానే సరిపుచ్చాలని చూస్తున్నారు మీ వాళ్ళు. కానీ కట్నం కూడా ఆశించలేదు మేము. అలాంటపుడు ఇంటికి ఎంతో అవసరమైన ఆ నాలుగు వస్తువులు కూడా ఇవ్వకపోతే ఎలాగనుకున్నావ్? ఈ మారు పుట్టింటికి వెళితే మీ నాన్నగారిని అడిగి అవి కొనిపించుకునిరా" అంటూ శాసించింది మా అత్తగారు. ఇకపోతే ఆయనగారు "కట్నమే వద్దన్న నాకు మీ నాన్న కనీసం స్కూటరైనా కొనిస్తాడనుకున్నాను. నీవైనా చెప్పవద్దా? ఆ మాట? ఈ మారు వెళ్ళినపుడు మీ నాన్నగారి నడిగి స్కూటర్ కొనిపించు కొనిరా." అన్నారు.

"మీ అమ్మగారు ఫ్రిజ్, టి వి, ఎయిర్ కూలర్, వాషింగ్ మిషన్ అది తెమ్మన్నారు. మీరేమో ఏకంగా స్కూటరే అడుగుతున్నారు. ఇవన్నీ కలిసి యాభైవేల దాకా అవుతాయే అలాంటపుడు కట్నం వద్దనడం ఎందుకు? కట్నం తీసుకోకుండా ఆదర్శవంతంగా వివాహం చేసుకున్నానని పది మందిలో గొప్పలు చెప్పుకోవడానికా?" అన్నాను నేను కోపంగా.

దాంతో ఆయనకు చాలా కోపం వచ్చింది.


"నన్నే ఎత్తి చూపే దానివయ్యావా?" అంటూ చెయ్యి చేసుకున్నారు ఆ రోజు నుండి నేనలా అన్నానని నాపై కోపం చూపుతూ, అడపా, దడపా చేయి చేసుకుంటున్నారు. అంతవరకు ఆయన నాపై చూపిన ప్రేమంతా నటన అని తెలిసిపోయింది నాకు అమ్మా, నాన్నలకు నేనొక్కదాన్నే అని కట్నం అడగలేదు వీళ్ళు. కట్నం వద్దంటే తాము అడిగినవన్నీ కొనిస్తారన్న దురాశ చేత. అమ్మా, నాన్నల తదనంతరం ఆస్తి అంతా వస్తుందన్న పేరాశ చేత కట్నం వద్దన్నారు. ఇప్పుడు చెప్పు రాధీ! ఇదేనా ఆదర్శం?

'ఈ మారు వెళ్ళినపుడు మేమడినవి తీసుకు రాకపోతే నీవే ఇంటి గడప కూడా త్రొక్కడానికి వీల్లేదన్నారు' అత్త, మామ, ఆయన.

"రాధీ! కానీ కట్నమే వద్దన్న వారు ఇవన్నీ అడిగారని తెలిస్తే నాన్న వూరుకుంటారా చెప్పు? నాన్న సంగతి నీకు తెలుసుగా? మంచికి మంచి, చెడుకు చెడు నాన్న కిష్టమైతే అడగకున్నా కొనిస్తారు అది ఎంత ఖరీదుదైనా సరే కానీ... రాధీ! వాళ్ళిలా అడిగారని తెలిస్తే నాన్న మండి పడరూ? చెప్పు రాధీ! ఇప్పుడు నేనేం చేయాలి? పైగా వీళ్ళు తక్కువైన వాళ్ళేమీ కాదు. పైకి మంచితనం ముసుగు వేసుకున్న నరరూప రాక్షసులు. నేను ఇంట్లో చేసే ప్రతి పనికీ ఏదో ఒక వంక పెట్టి నన్ను తిట్టడంతో పాటు చెయ్యి కూడా వేసుకుంటుంది మా అత్త. ఈ దుఃఖాన్నంతా నాలో నేనే దాచుకుని కుమిలి పోతున్నాను. అమ్మా, నాన్నలకు ఈ విషయాలు తెలిస్తే ఎంత బాధ పడతారు? అందుకే వాళ్ళకీ విషయాలేమీ వ్రాయలేదు. నీవు కూడా ఎప్పుడైనా మా ఇంటికి వెళ్ళితే కూడా చెప్పకు ప్రాణ స్నేహితురాలివైన నీకు చెప్పుకున్నాక (వ్రాశాక) నా బాధ ఒకింత తగ్గినట్టుంది.

రాధీ! అమ్మ, నాన్నల సమక్షంలో అల్లారు ముద్దుగా పెరిగిన నేను, క్రిందికి దింపితే చాలు కందిపోతా నన్నట్టుగా పెరిగిన నేను వీరి ఆరళ్ళు భరించలేకున్నాను. తల్లిదండ్రులు ఇంత సుకుమారంగా పెంచడం గూడా తప్పేమో అనిపిస్తుంది. అటు అమ్మా, నాన్నలకు నా బాధ చెప్పుకోలేక ఇటు వీళ్ళ బాధలు భరించలేక కుమిలి పోతున్నాను. వీరి కోర్కెలు తీర్చే తాహతు నాన్నగారి కున్నా, వీళ్ళు అడిగారని తెలిస్తే పూచిక పుల్ల కూడా కొనివ్వరు. అలాంటపుడు నాన్న నడిగే ధైర్యం కూడా లేదు నాకు. అలాగని వీరి బాధలూ భరించే శక్తి లేదు అందుకే నాలాటి దానికి ఆత్మహత్యే శరణ్యమని నిర్ణయించుకున్నా. నాలుగైదు రోజుల్లో నేనక్కడికి వస్తున్నా. నీవీ వుత్తరానికి బదులేమీ ఇవ్వకు. అమ్మా, నాన్నలను ప్రాణ మిత్రురాలివైన నిన్నూ కడసారి చూసుకున్నాక యీ తనువు చాలిస్తాను. ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే నా మీద ఒట్టు. మరి వుంటాను.

ప్రేమతో,
నీ నెచ్చెలి,
అనిత.



ఆ వుత్తరాన్ని ఒకటికి పది మార్లు చదువుకుని గాఢంగా నిట్టూర్చింది రాధిక. స్నేహితురాలి

అమ్మాయిలూ! పిరికితనం మానండి!

బాధలు తెలుసుకున్నాక ఆమె మనసంతా దుఃఖంతో నిండిపోయింది

హు. . . . కట్నం తీసుకోమంటూ ఆదర్శం అనే ముసుగు మాటున వాళ్ళు చేస్తున్న దురంతం ఇదా? అతని అందం చదువు చూసి. కట్నం వద్దన్నా అతని ఆదర్శ భావాలకు పొంగిపోయారు తామంతా. అతన్ని. అతని తల్లిదండ్రుల సంస్కారాన్ని వేనోళ్ళ పొగిడారు ఆ నాడు వారి ఆదర్శం మాటున వున్న వారి అంతర్యం ఇటువంటిదని కలనైనా వూహించలేదే? ఛీ ... ఛీ... ఇటువంటి



కిశోరి

కుసంస్కారులు కూడా వున్నారనుకుంటే ఈ లోకంలో ఎవరిని నమ్మాలి ఇక?"

"అనిత!" దాన్ని తలచుకుంటేనే గుండెల్లో చెయ్యి పెట్టి కెలికినట్లుగా వుంది. తల్లిదండ్రుల మాటున అల్లారు ముద్దుగా పెరిగిన ముద్ద మనోహర మూర్తి అనిత. ఆమె సౌందర్యానికి తోడు చక్కని సంస్కారం, వినయ విధేయతలు మరింత మెరుగులు దిద్దాయి అటువంటి అనిత వైవాహిక జీవితం ఎంతో వైభవంగా వుంటుందని వూహించిన తన వూహలన్నీ కల్లలేనా? చివరికి ఆ అమాయకురాలు, ఆ కుసంస్కారుల దుర్మార్గానికి బలి కావలసిందేనా?

నో ....నో... అలా జరుగడానికి వీల్లేదు. నా అనిత, నా ప్రాణ స్నేహితురాలి బ్రతుకు అంతం కావడానికి వీల్లేదు. దాన్ని ఎలాగైనా ఈ ఆత్మహత్యా ప్రయత్నం నుండి విరమించుకొనే లాగున చెయ్యాలి. అనుకుని మనసులో నే గట్టిగా నిర్ణయించుకొంది రాధిక.

★ ★ ★ ★

ఇంటి ముందు కారాగిన శబ్దం కాగానే వరండాలో పేము కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న రాధిక ఒక్క వుదుటున గేటు వద్దకు వెళ్ళింది. అప్పటికే కారు దిగిన అనిత.....

'సాయంత్రం ఆరు గంటలకు రా మూర్తీ!" అనడంతో అతను కారు వెనక్కు త్రిప్పుకుని వెళ్ళిపోయాడు కారు వెళ్ళగానే వెనుదిరిగిన అనిత గేటు వద్దనే నిలుచుని తనను శల్య పరీక్ష చేస్తున్న రాధికను చూడగానే, ఆమె కళ్ళల్లో నూతన కాంతి వచ్చి చేరుకుంది.

'ఎలావున్నావు రాధీ?" అంటూ నవ్వుతూ స్నేహితురాలి భుజంపై చేయి వేసి నొక్కింది ప్రేమగా

ఆ చెతిని అలాగే ఆప్యాయంగా పట్టుకుని తన నడుం చుట్టు వేసుకుని అనిత భుజంపై చేయివేసి లోనికి నడిపించుకుని వెళ్ళింది ప్రేమగా, మౌనంగా.

'ఏమ్మా అనితా! బాగున్నావా? ఏమిటిది? చాలా చిక్కిపోయావు? ఏమైనా విశేషమా?" నవ్వుతూ ప్రశ్నించింది రాధిక తల్లి సరోజమ్మ.

"చాలా రోజులకు చూసి నందువల్ల మీకలా అనిపిస్తున్నానంతే. అందులో విశేషమేమి లేదు. మీరెలా వున్నారు?" నవ్వుతూనే ప్రశ్నించింది అనిత.

"మాదేముందమ్మా? మామూలే. క్రొత్త పెళ్ళికూతురివి. నీవే చెప్పాలి విశేషాలు."

అబ్బ.....బ్బ ....ఏమిటమ్మా? అది ఇప్పుడేగా వచ్చింది. కాస్త దాన్ని వూపిరి అయినా పీల్చుకోనిస్తావా? లేదా?" నవ్వుతూ తల్లితో అన్నా అందులో కాస్త అసహనం గూడా ధ్వనించడం [..]రోజమ్మ గమనించలేదు గాని, అనిత గమ[..]ంచింది.

[..]రేలేవే తల్లీ! నీతో మాట్లాడ నివ్వనని కోపంగాబోలు నీకు. మేడమీది కెళ్ళి లక్షణంగా భోజనాల వేళవరకూ కబుర్లు చెప్పుకోండి. నే

సుఖాల గనులు

డబ్బు దస్కం
భూమి పుట్ర
చదువు సంధ్య
వున్నా లేకున్నా
ఇంద్ర భోగాలు
చవి చూపించేవి
రెండే రెండు
'రాజకీయం'
'చిత్రసీమ'

—మాధవరపు కృష్ణ

అమ్మాయిలూ! పిరికితనం మానండి!

నచ్చురాను. కాఫీ ఇస్తాను త్రాగి వెళ్ళండి 'అంటూనే కాఫీ కలిపి రెండు గ్లాసులలో పోసి చెరో గ్లాసు అందించింది

స్నేహితురాళ్ళిద్దరూ మౌనంగానే కాఫీ త్రాగి మెడమీద కెళ్ళి బాల్కనీలో సోఫా మీద కూర్చున్నారు ఇద్దరూ మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు చివరికి

"రాధీ! ఏమిటే అంత మౌనం దాల్చావు?" అడిగింది అనిత.

"మౌనం దాల్చక ఏం మాట్లాడమంటావు అనీ! నిన్ను చూస్తుంటే నా కెంత బాధగా వుందో తెలుసునా? ఎటువంటి నీవు ఎలా అయిపోయావు?" అంటూ కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా బాధగా అంది రాధిక.

"ఎందుకే అలా బాధ పడతావు? ఏం చేద్దాం? భగవంతుడు కొందరి నుదుటను అలా బాధలు పడమని లిఖిస్తాడు. దానికి మనం బాధ్యులం కాముగా?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ అనిత.

"అనీ! ఎంత సెంటిమెంట్‌గా ఆలోచిస్తున్నావు? బి. ఎ. వరకు చదివిన నీవు ఇలా మాట్లాడటంలో అర్థంలేదు. చదువు రాని వాళ్ళు మాట్లాడ వలసిన మాటలవి మనుషులు చేజేతులా చేసుకునే దానికి భగవంతు డెలా బాధ్యుడౌతాడు? మనకు పనిచేయడానికి కాళ్ళు, చేతులు, ఆలోచించడానికి మెదడు ఇచ్చాడు భగవంతుడు. అంత కన్నా ఏమివ్వాలి మనం? ఇచ్చిన వాటిని సద్వినియోగం చేసుకో లేక పోతున్నాం మనం". అంది కాస్త కోపంగా రాధిక. ఆ మాటలకు పేలవంగా నవ్వింది అనిత.

"నా విషయ మంతా వివరంగా వ్రాశాను కదా నీకు. అందులో నా చేజేతులా చేసుకొనిందేముంది చెప్పు?"

"చేసుకున్నావని కాదు నేను చెప్పేది చేతగాని నిర్ణయాలు తీసుకున్నావని" అంటూ సూటిగా అనిత ముఖంలోకి చూసింది

"నీకు అది చేతగాని నిర్ణయంగానే అనిపించవచ్చు. అంతకు మించి గత్యంతరం లేదు నాకు. అయినా అనుభవంలోకి వస్తే గాని అర్థంకాదెవరికి?" అంది అనిత తలవంచుకుని.

"పిచ్చి అనీ!" అంటూ నవ్వి తర్జనితో అనిత తల పైకెత్తి—

"కొన్ని కొన్ని విషయాలలో అనుభవమే అక్కరలేదు. కొందరి జీవితాలే గుణపాఠాలు నేర్పుతాయి మనకు మా మేనత్త కూతురు కరుణ తెలుసుగా నీకు. పెళ్ళిలో కట్నం తీసుకుని కూడా అడపా, దడపా డబ్బు తెమ్మని అమ్మగారింటికి తరిమే వాడు దానిభర్త. మా అత్తా వాళ్ళు మాత్రం ఎక్కడి నుండి తేగలరు? ఇచ్చినంత కాలం ఇచ్చారు చివరికి ఓ రోజు

'మేమిక ఇవ్వలేం తల్లీ! ఇచ్చే వాణ్ని చూస్తే చచ్చేవాడైనా లేచి వస్తాడు. అతను అడిగినట్లల్లా ఇస్తూ పోతుంటే దానికి అంతు లేకుండా పోతుంది. ఇప్పటికే మీ నాన్న గారికి బోలెడు అప్పుంది. అది తీర్చే దారి లేక సతమత మౌతున్నారాయన పెళ్ళై ఆరు నెలలైంది కదా! నీ భర్తకు నీవే నచ్చ చెప్పుకోవాలి మాటి మాటికి మేం డబ్బెక్కడి నుండి తేగలం చెప్పు?" అని సున్నితంగా మందలించి పంపింది అత్త. వట్టి చేతులతో తిరిగి వచ్చిందని గొడ్డును బాదినట్లు బాదేవాడు ప్రతి రోజతను. ఆ హింసలు పడలేక చివరికోరోజు వురి పోసుకుని చచ్చి పోయింది." అంటున్న రాధికతో

"ఏమిటి? కరుణ చచ్చిపోయిందా?" ఆశ్చర్యంగా, బాధగా అడిగింది అనిత.

తను, రాధి, బి. ఎ. ఫైనల్ ఇయర్ చదువు తుండగా ఒకసారి వచ్చి నపుడు చూసింది కరుణను. ఎంతో చలా[..]గా, హుషారుగా తమతో తిరిగిన కరుణ రూపం గుర్తురాగానే మనసు కలచి వేసినట్లయింది అనితకు.

"అవును అనీ! చచ్చిపోయింది. కానీ, చచ్చి ఎవరిని సాధించిందో చెప్పు?" అడిగింది రాధిక, అనితను.

"ఎవరినో సాధించడానికి ఛస్తారా? ఆ బాధలు పడలేక చచ్చిపోయుంటుంది గాని"

"బాధలకు చావే పరిష్కారమా?" తీక్షణంగా, ప్రశ్నించింది రాధి.

"చావక ఏం చేయమంటావో చెప్పు?" అయోమయంగా చూసింది అనిత.

"హు..... అవును కదూ! నీవూ దానిలాగే పిరికిగా ఆలోచిస్తున్నావు కనుక దాన్ని సమర్థిస్తున్నావు"

"అది పిరికితన మంటావా?"

"కాక..... ధైర్యమంటావా?" ఎదురు ప్రశ్న వేసింది రాధిక.

"అయితే నేనోమాట అడుగుతాను చెబుతావా రాధీ!"

'అడగవే... .. ."

"రాధీ! నీకే కరుణలాంటి పరిస్థితి గాని, నా లాంటి

పరిస్థితి గాని ఎదురైతే ఏం చేస్తావు చెప్పు?"

"మీలాగా పిరికి దానిలాగా చావుగురించి మాత్రం ఆలోచించను. ఎందుకంటే మధ్యన వచ్చిన అతని కోసం కని, పెంచి పెద్ద చేసిన కన్న వారిని పుట్టెడు దుఃఖంలో ముంచి ఛస్తాననుకున్నావా? నెవ్వర్.... అలా ఎన్నటికీ చేయను. పెళ్ళి అనేది నూరేళ్ళ పంట. భార్యా, భర్తలిరువురూ ఫరస్పర ప్రేమానురాగాలతో పాలు, నీళ్ళలా కలిసిపోతేనే అది నిజమైన దాంపత్యం అనిపించుకుంటుంది. అంతే గాని తాళి కట్టినంత మాత్రాన భార్య పై సర్వ హక్కులున్నాయను కొని ఏమి చేసినా అణిగి మణిగి వుంటుందని ఇష్టాను సారం హింసించి పశువులా ప్రవర్తించే వాడికోసం నా ప్రాణాలను ఎందుకు త్యాగం చేస్తాను?" ఆవేశంగా అంది రాధిక.

"అయితే...... అయితే...... అలాంటి పరిస్థితులలో ఏం చేయాలంటావు ఏ స్త్రీ అయినా?"

"తన కాళ్ళ మీద తాను నిలబడాలి. వుదాహరణకు కరుణ విషయమే తీసుకుందాం. తను చచ్చి పోయింది. చచ్చి ఎవరిని సాధించగలిగింది చెప్పు? భార్య పోయి నెల తిరక్క ముందే పెళ్ళి చేసుకోవాలని ఆలోచిస్తున్నాడా మహానుభావుడు. భార్య పోయిందన్న బాధ ఇసుమంతైనా ఏ కోశానా లేదతనిలో. కానీ.... కానీ.... కన్నందుకు కడుపుకోత తప్ప లేదుగా? అత్తా వాళ్ళకు... భార్య పోయిందని అతను మరో భార్యను తెచ్చుకోగలడు. కానీ... కన్న కూతురుని పోగొట్టుకున్న వాళ్ళు మరో కూతురిని తెచ్చుకోగలరా? చెప్పు. బ్రతికినంత కాలం ఆ దుఃఖం వారిని వదులుతుందంటావా?"

"రాధీ!..." రాధిక మాటలు విన్న అనిత అయోమయంతో పిచ్చిదానిలా అరిచింది.

ఆమె కళ్ళ ముందు తను ఆత్మహత్య చేసుకున్నట్లు, తన శవం ముందు అమ్మా, నాన్న కూర్చుని గుండె లవిసేలా ఏడుస్తున్నట్లు దృశ్యం కదలగానే తల్లడిల్లి పోయిందామె మనసు.

"ఏం అనీ! నేను మాట్లాడిందాంట్లో తప్పేమైనా వుందా?" అనునయంగా అడిగింది రాధిక.

"వూ. – హూ..." తప్పులేనట్లు తల అడ్డంగా తిప్పింది.

"అనీ!..." ఆమె మనసులోని సంచలనాన్ని గ్రహించి ప్రేమగా పిలుస్తూ, అనితను ఒడిలోకి తీసుకుంది రాధిక.

"చూడు అనీ! కరుణ పోయినా అత్తా వాళ్ళకు ఇంకా ఇద్దరు కొడుకు లున్నారు. నీవుపోతే మీ అమ్మావాళ్ళ కెవరున్నారు చెప్పు? వాళ్ళను కడుపు కోతకు గురి చేస్తావా? ఒక్కగా నొక్క కూతురివి నీవుపోతే వాళ్ళు మాత్రం బ్రతుకుతారంటావా? చెప్పు.. ."

"వద్దు రాధీ! ప్లీజ్... ఇక చెప్పకు." ఏడుస్తూ గొంతు జీరబోగా రాధిక బడిలో అసహనంగా తల కదిలించింది.

ఆమె తలను ప్రేమగా, ఆప్యాయంగా నిమురుతూ ఇలా అంది–

"పిచ్చి అనీ! వూహ మాత్రంగానే ఇంతగా కదిలిపోతున్నావే. నిజంగా జరిగితే ఎలా వుంటుంది? ఆత్మహత్య పిరికి వాళ్ళ లక్షణం. నీకేం తక్కువైందని ఆత్మహత్య చేసుకుంటావు? చదువు, సంస్కారం, అందం, ధనం, సున్నిత హృదయం అన్నీ వున్న అపురూపమైన దానివి నీవు. ఇలా ఆలోచించడం తగదు నీకు. వెంటనే అన్ని విషయాలు అమ్మా నాన్నకు చెప్పెయ్యి. నీకు వుద్యోగం చేయవలసిన అవసరం లేదుగానీ "ఐ డిల్ మైండ్ ఈజ్ డెవిల్స్ వర్క్ షాప్" అన్న ఇంగ్లీషు సామెతను గుర్తుంచుకుని ఏదైనా వుద్యోగానికి అప్లై చెయ్యి. ఆ పనిలో పడిన నీకు అనవసరమైన ఆలోచనలు రావు ఇంతకు మించిన మార్గం మరోటి లేదు" అంది

రాధిక అలా ధైర్యం చెప్పగానే ఏడుపు మాని కాసేపు ఆలోచించింది. రాధిక చెప్పినదే సబబుగా తోచిందామెకు.

"రాధీ! నీవు చెప్పినట్లుగానే జాబ్ చేస్తాను." దృఢ నిశ్చయంతో కళ్ళు తుడుచుకుంటూ లేచి కూర్చుంటూ అంది.

"అనీ ఒకవేళ మీ నాన్నగారు వారడిగినవన్నీ కొనివ్వడానికి ఒప్పుకుంటే ఏం చేస్తావు?"

"లేదు రాధీ! నాన్న అలా ఎప్పటికీ చేయరు. మనిషిని మనిషిగా ప్రేమించే వారిని ప్రేమిస్తారు గాని డబ్బును ప్రేమించే మనిషిని నాన్న అసహ్యించు కుంటారు. నాన్న ఎప్పుడూ ఏమంటారో తెలుసా? ప్రేమను మించిన ధనం లేదీ లోకంలో... అని. కానీ రాధీ! మా అత్తింటి వాళ్ళందరికీ ధనాన్ని మించిన స్వర్గం, సంతోషం మరోటి లేదనుకుంటారు. అలాంటి వారికి నాన్న డబ్బు ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా వారి కంతటితో ఆ ధన దాహం తీరదు మళ్ళీ దేనికో ఒకదానికి పేచీ పెట్టకపోరు"

"అయితే అలాటి వారితో పూర్తిగా తెగతెంపులు చేసుకోవడమే వుత్తమం. నీ అందానికి, గుణానికి తగిన వరుడు ఎప్పటికైనా తారస పడక పోడు"

రాధీ! ఏమిటి నీవనేది? నన్ను నన్ను . మళ్ళీ పెళ్ళి చేసుకోమంటావా" అరిచినట్లుగానే అడిగింది

"ఏం అందులో తప్పేముంది అనీ! భార్యను విడిచినవాడు, భార్య పోయినవాడు తిరిగి పెళ్ళిళ్ళు చేసుకోవడంలా? మగవాడు చేసుకుంటున్నప్పుడు ఆడదానికేమి? మగవాడికో రూలూ? ఆడదానికో రూలూనా?" ఆవేశంగా అంటున్న రాధికను బిత్తరపోయి చూసింది అనిత.

"అమ్మో! రాధి కేవలం అమాయకురాలు అనుకున్నాగాని, దీనిలో ఇన్ని అభ్యుదయ భావాలున్నా యనుకో లేదు' అని మనసులోనే ఆశ్చర్యపోయింది అనిత

"ఏం అనీ! ఇలా మాట్లాడుతున్నానని ఆశ్చర్యంగా వుందా?" నవ్వుతూ అడిగింది రాధిక.

'ఇలా మాట్లాడేది నా రాధియేనా? అని ఆశ్చర్యంగావుంది అంది అనిత మనసు తేలికపడగా నవ్వుతూ.

తిరిగి ఇలా అంది–

"అయినా రాధీ! ఇప్పటిక జరిగింది చాల్లే. తిరిగి పెళ్ళి చేసుకొని ఆ వూబిలో ఇరుక్కో లేను నా లైఫ్ ఇలా గడిచిపోతే చాలు" అంది నిట్టూరుస్తూ

"వూబి అని ఎందు కనుకుంటావు అనీ!పురుషులందరూ ఒకే లాగున వుండరు ఈ లోకంలో మంచి, చెడూ సమ్మిళితమై వుంటాయి. నీకు తగిన వరుడు భవిష్యత్తులో తప్పక తారసిల్లుతాడు అని నా నమ్మకం'.

"అబ్బ! నీ నమ్మకానికో నమస్కారం ఇక ఆ టాపిక్ మానెయ్యి. ముందు ఈ వూబి నుండి నన్ను బైటపడి మళ్ళీ స్వేచ్ఛావాయువులు పీల్చుకోనివ్వు ఆ తర్వాత ఆలోచించ వచ్చు.

'నిజమే నీవు చెప్పింది సరేగాని అనీ! ఇంటికి వెళ్ళాక తిరిగి మనసు మార్చుకోవు గదూ?' అనుమానంగా అడిగింది రాధిక


లేదు. ఇక అలా జరుగదు" అంది అనిత స్థిరంగా.

"ప్రామిస్ !" అంటూ చెయ్యి చాపింది.

"గాడ్ ప్రామిస్. .' అంటూ రాధిక చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేసింది

ఆ క్షణాన ఇద్దరి మనసులూ తేలిక పడ్డాయి. ఆత్మహత్యా ప్రయత్నం నుండి స్నేహితురాలిని రక్షించుకున్నందుకు రాధిక మనసంతా సంతోషంతో నిండిపోయింది ఆత్మహత్యా ప్రయత్నం నుండి తనను రక్షించినందుకు రాధిక యెడల కృతజ్ఞతతో నిండివుంది అనిత మనసు.

ఇంతలో సరోజమ్మ క్రింద మేడమెట్ల వద్ద నిలబడి భోజనానికి కేకేయడంతో ఇద్దరూ క్రిందకు వెళ్ళారు తేలికపడ్డ మనసులతో □



బిడ్డ ఆరోగ్య రక్షణలో తల్లి పాత్ర



ఏడవ పంచవర్ష ప్రణాళికలో తల్లి–బిడ్డ ఆరోగ్య రక్షణకై కేటాయించిన 174 కోట్ల రూపాయలతో చివరికి శిశు మరణాలను తగ్గించి భావి పౌరునికి నేడు బ్రతికి బట్ట కట్టగలిగే అవకాశాన్ని కలుగజేయవచ్చు.

భారతదేశంలో ఏటా 230 లక్షలమంది శిశువులు పుడుతున్నప్పటికీ వారిలో 30 లక్షలమంది శిశువులు మాత్రమే నిజానికి ఆరోగ్యంగా ఉంటున్నారు. ప్రతి 1000 మందికి 120 మంది సంవత్సరం లోపే మృత్యువాత పడుతున్నారు. ఐదేళ్ళు రాకముందే ప్రతి ఏడుగురికి ఒకరు మరణిస్తున్నారు. పది మందిలో ఆరుగురు పోషకాహారం లోపంవల్ల బాధపడుతున్నారు. 90 లక్షలమంది క్షుద్బాధతో మానసికంగా, భౌతికంగా సరైన ఎదుగుదల లేకుండానే ఎదుగుతున్నారు.

రోగాలు రాకుండా చెయ్యవచ్చు!

పోషకాహార లోపానికి కారణం దారిద్ర్యం. దారిద్ర్యాన్ని రూపుమాపడం అనుకున్నంత తేలికైన పనికాదు అని కొందరు వాదిస్తారు. నిజమే ఒప్పుకుంటాం. అయితే ప్రతి ఆరుగురిలో ఒక బిడ్డ చొప్పున చనిపోతున్నందుకు మనం ఏ విధంగా న్యాయం చేకూర్చగలుగుతాం? ఇంతకు ముందే పోలియో వాతపడ్డ 70 లక్షల భారతీయ పిల్లలకి న్యాయం చేకూర్చలేం. ఈ సంఖ్యకు ఏటా రెండు లక్షల మంది పోలియో వ్యాధిగ్రస్తులు చేరుతున్నారు. ఇది ప్రపంచంలోని రోగగ్రస్తులైన బాలల సంఖ్యలో 50 శాతం అన్నమాట. ఒక బిడ్డకు డిఫ్తీరియా, కోరింత దగ్గు, పోలియో, టైఫాయిడ్, టి. బి (క్షయ), కలరా వ్యాధులకి నిరోధకంగా వేసే "టీకా" మందుకు బిడ్డకి కేవలం 50 రూపాయలు ఖర్చుపెట్టలేకపోవడానికి కూడా దారిద్ర్యమే కారణం అనగలమా?

దీనికి సమాధానం ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంలోనో, ఉన్నత జాతీయ సగటు ఆదాయం పైనో ఆధారపడి లేదు. అది బిడ్డకు చేతికి అందేంత దూరంలోనే ఉంది. బిడ్డ ఆరోగ్య రక్షణ ముఖ్యంగా తల్లిపైనే ఆధారపడి ఉంది. 2000 సంవత్సరం నాటికి అందరికీ ఆరోగ్యం లక్ష్యంగా 1978లో అల్మాఅటా సదస్సు ప్రకటించింది.

గత సంవత్సరం డిమాండు ననుసరించి సరఫరా అనే విచిత్రమైన ఊపు జరిగింది. బిడ్డ మొత్తం ఆరోగ్యాన్ని తల్లితండ్రుల మీద ముఖ్యంగా తల్లిపై ఉంచడం అన్నమాట. టీకా మందు ఆవశ్యకతను తల్లి గుర్తిస్తే, ఆమె డిమాండు చేస్తుంది. ఈ విధంగా తగిన సరఫరాలు చేయడానికి ప్రభుత్వంపై వత్తిడి తేబడుతుంది.

అయితే ఇది పశ్చిమ దేశాల ఆలోచన అంటూ

దీనిని త్రోసిపుచ్చినవారు దేవాస్ (మధ్యప్రదేశ్), బీదర్ (కర్నాటక), త్రిలోక్‌పురీ (ఢిల్లీ)లలోని మూడు పెద్ద ప్రాజెక్ట్‌ల రికార్డు స్థాయి పనిని చూడాల్సి ఉంది. ఇవి 76 నుంచి 95 శాతం వరకూ టీకా మందు వేసే కార్యక్రమం సాధించాయి. అయితే దీనికి భిన్నంగా 1983లో దేశవ్యాప్తంగా డిఫ్తీరియాకు 38 శాతం, పోలియోకు 17.7 శాతం, బి. సి. జి. కి 8.8 శాతం మాత్రమే కృషి జరిగింది.

తల్లీ బిడ్డ సంబంధం అతీతమైనది. నెలలు నిండకుండా పుట్టడం, పుట్టినపుడు ఉండవలసిన ప్రమాణంలో బరువు ఉండకపోవడం, గర్భస్థ శిశువుకి సరైన ఎదుగుదల లేకపోవడం, తల్లి చాలినంత పోషకాహారాన్ని అందించలేకపోవడం, తల్లి పోషకాహారాన్ని అందించినా శోషణం చేసుకోగల శక్తి శిశువుకి లేకపోవడం, ఒక్కోసారి రెండు విధాల జరగడం, మొదలైన కారణాల వల్ల 69 శాతం శిశు మరణాలు సంభవిస్తున్నాయి.

తల్లి అవిద్య, అజ్ఞానం, సరైన పోషకాహారాన్ని తీసుకోకపోవడం, వయస్సు, రక్తహీనత, బిడ్డకి బిడ్డకి ఎడం లేకపోవడం, తల్లి పాలు ఇవ్వకపోవడం శిశు మరణాలకి కారణాలు. క్లుప్తంగా చెప్పాలంటే స్త్రీ సాంఘిక– ఆర్థిక పరిస్థితి లోపం. అరవై శాతం భారతీయ గర్భిణీ స్త్రీలు ఇనుపధాతువు లోపంతో బాధపడుతూ ఉంటారు.

దగ్గర కాన్పులు, ఎక్కువమందిని కనడం, చిన్న వయస్సులోనే గర్భధారణ వలన జరిగే ప్రమాదాలను దక్షిణభారతం, ఎల్‌సాల్వడార్, అర్జంటీనాలలో యూనిసెఫ్ జరిపిన మూడు పరిశోధనల వలన తెలుసుకోవచ్చు.

అక్షరాస్యత వల్ల మేలు

కేరళలోని స్త్రీలకు ప్రాథమిక ఆరోగ్య రక్షణపై నేర్పిన పరిజ్ఞానం పేర్కొనదగినది. ప్రజలలో దాదాపు 100 శాతం అక్షరాస్యత ఉండటం, శిక్షణ పొందిన వారి సహకారంతో చేసిన కాన్పుల వల్ల కేరళలో శిశు మరణాల రేటు 55కి తగ్గాయి. జాతీయ స్థాయిలో 2000 సంవత్సరం నాటికి ఈ రేటుని 60 చేయాలన్నది మన లక్ష్యం.

ఆరవ పంచవర్ష ప్రణాళికా సమయంలో ఆవిర్భవించిన తల్లి – బిడ్డ ఆరోగ్య పథకం 1978లో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐ. సి. డి. ఎస్) బిడ్డ పట్ల తల్లియొక్క బాధ్యతను గుర్తించి చేసిన కృషికి నిదర్శనం.

ఏడవ పంచవర్ష ప్రణాళికలో దీనికి హెచ్చు ప్రాముఖ్యతను ఇవ్వాలని భావించబడుతున్నది. లక్ష్యాలను పూర్తిచేయడం ఒక ఎత్తు, విజయం సాధించడం వేరొక ఎత్తు. అంగన్‌వాడీ, బాలవాడి కార్యకర్తలు, ముఖియా సేవికలు తగినంత కృషి చేయనట్లయితే సమగ్ర శిశు అభివృద్ధి పథకాల లక్ష్యాలను 3,000కి పెంచగానే ఉపయోగం లేదు.

ప్రపంచంలోని వైద్య పరిజ్ఞానాన్ని అంతా ధార పోసినా తల్లితండ్రులు విద్యావంతులై వైద్యునికి శిశువుకి మధ్య వారధిలా నిలిచి పనిచేయకపోతే శిశువులను చీకట్లలో నుంచి వెలుగులోకి తీసుకు రావడం దుర్లభం. 1990 నాటికి ప్రణాళికలో కేటాయించిన 80 కోట్ల రూపాలతో అవసరమైన పిల్లలకు టీకా మందు వేయగలుగుతుందని ఆశించబడుతున్నది. ఇంకొక 5 కోట్ల రూపాయలను ఈ టీకా మందు తయారైన పిదప అది వేసే కాలం మధ్యలో జాగ్రత్తగా నిలువ చేయడానికి కేటాయించారు.

పిల్లలకు తల్లి పాలంత శ్రేష్ఠమైనవి వేరే ఏదీ లేదు. ఈ పాలలో స్వాభావికమైన పోషక పదార్థాలు ఉంటాయి. బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పోత పాలవలన బిడ్డలకు విరేచనాలు అవుతాయి. తల్లి పాలవల్ల తల్లి బిడ్డ అనుబంధం పెరుగుతుంది. పాలిచ్చే తల్లులు త్వరగా గర్భవతులు కారట. తల్లికి బిడ్డకి కూడా అదో విధమైన మానసిక ఆనందం, తృప్తి లభ్యమవుతాయి. బొగోటాలో నెలలు నిండకుండా పుట్టిన పాపలను ఇంక్యుబేటర్లలో పెట్టకుండా బిడ్డను తల్లి రొమ్ముకు అన్ని 24 గంటలు ఓ బట్టతో చుట్టబెట్టి ఉంచుతారట. అక్కడ వారికి కావలసిన వెచ్చదనం, ఆహారం వారు పొందుతారు. ఇందువల్ల జీవిత ప్రమాణం పదిమందికి 5 నుంచి 9 వరకు పెరిగిందట.


ఐరన్ మాత్రలు, విటమిన్ మాత్రలు లభ్యం కాకపోతే సరైన ఆహార నియమాలు పాటించి వీటిని పొందవచ్చు. బెంగాలీవారి ఆరోగ్యం బాగుంటుంది. ఎందుకంటే వారు ఆకుకూరలు హెచ్చుగా తీసుకుంటారు. హరిత విప్లవం ప్రొటీన్లు సామాన్యునికి అందుబాటులో లేకుండా చేసింది. రైతు పప్పు దినుసులను పండించకుండా సోయాబీన్సు వేసి పశు ఆహారం క్రింద విదేశాలకు ఎగుమతి చేస్తున్నాడు. మినరల్స్, మాంసకృత్తులు సమృద్ధిగాగల వేరు శనగల నుంచి నూనె తీసి, మినరల్స్, మాంసకృత్తులు సమృద్ధిగాగల పిప్పిని పశువులకు ఆహారంగా వాడుతున్నాం. పాలను పల్లెలనుండి పట్టణాలకు ఎగుమతిచేసి పసిపిల్లల నోరు కొడుతున్నాం.

స్త్రీలకు గృహ వైద్యం కూడా కొంత తెలిసి వుండాలి. పిల్లలకు విరేచనాలయి, డీ హైడ్రేషన్ పరిస్థితి వచ్చినప్పుడు రీ హైడ్రేషన్‌కు ఒక లీటరు నీళ్లలో మూడు టీ స్పూన్లు పంచదార, ఒక టీ స్పూను ఉప్పును కలిపి బిడ్డలకు కొద్ది కొద్దిగా స్పూనుతో తాగిస్తే పిల్లలు డీ హైడ్రేషన్ నుంచి తట్టుకుంటారు. ఇలాంటి కొన్ని చిన్న, చిన్న చిట్కా వైద్యాలు తల్లికి తెలిసి ఉంటే కూడా శిశు మరణాలు తగ్గించవచ్చు.

"ఈ రోజే"

పిల్లలు అశక్తులు, పసివారు అయినప్పటికీ వారిపై ఎంతో ఆధారపడి ఉంది. చిలీదేశానికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత గేబ్రియల్ మిస్ట్రల్ అనే కవి అన్నట్లు "మనం చేయాల్సిన ఎన్నో పనులు మనం చేసేవరకూ నిరీక్షిస్తాయి. కాని బిడ్డ విషయంలో అలాకాదు. అతని శరీరంలో ఉన్న ఎముకలు ఈ రోజే ఎదగాల్సినవి. రక్తం ఈ రోజే తయారుకావల్సినది. అతని విషయంలో మనం రేపు అంటే కుదరదు. అందుకే పసివాని విషయంలో ప్రతిదీ రేపుకాదు "ఈ రోజే" అనుకోవాల్సి ఉంటుంది. □

(ది స్టేట్స్‌మన్‌లో పడిన డి. జె. కర్కారియా వ్యాసం ఆధారంగా)



సీరియల్:

జిగి-బిగి

ఎమ్. హరా

(గతసంచిక తరువాయి)

అబ్బాయీ అమ్మడు అతిశయంగా నవ్వుకుంటూ నడుస్తున్నారు. దార్లో కలిశారు చిరంజీవి, సౌభాగ్యం. నలుగురు కలిసి మాట్లాడుకుంటూ నడవసాగారు. గుసగుస లాడారు. నడిరోడ్డు మీదే గూడుపుఠాణీ చేశారు.

"కుటుంబం పిల్లల్ని అనాధలుగా మార్చడం అన్యాయం. యింకేదైనా మార్గం చూడు అబ్బీ–" అంది అమ్మడు.

"వేరే మార్గమా" అంటూ పక్క సందులోకి మళ్ళాడు అబ్బాయి.

"కర్మ... కర్మ..." అంటూ అతన్ని వెనక్కి లాగింది అమ్మడు.

"పెళ్ళికాని ఆ పిల్లలకి ఈ మార్గం చూపిస్తే–" అంటూ పేపరులో వొక ప్రకటన చూపించాడు చిరంజీవి.

"భేషైన మార్గం. మనం వెంటనే పోస్టు ఆఫీసుకి వెళ్ళాలి. జాబులు రాయాలి" అన్నాడు అబ్బాయి.

"మన ఉత్తరం చూసి లంఖిణీ అండ్ సిస్టర్స్ బెజవాడ వెళ్తారా" సౌభాగ్యం అనుమానం.

జరిగిన కథ–11: సీనియర్ క్లర్క్సు పరీక్ష రాయడానికి వెళుతున్న అమ్మాయి, అబ్బాయికి పరిచయం అవుతుంది. "ప్రజాసేవా కంపెనీ" నడిపే బ్రహ్మచారి ఉభయానందం తన పినతల్లి మనుమరాలు సౌభాగ్యవతిని చేరతీసాడు. సౌభాగ్యవతికి పెళ్ళి చేసి ఆమె భర్తని దత్తత చేసుకోవాలని ఉభయం కోరిక. సూర్యనారాయణ మనుమరాలు అమ్మాయి. సౌభాగ్యం, చిరంజీవి ప్రేమించుకున్నారు. అమ్మాయి, అబ్బాయి ప్రేమించు కున్నారు. సౌభాగ్యవతి పేరుతో అబ్బాయి రూముకి వెళ్ళిన అమ్మాయి అతనికి ఉభయానందం ప్లాను వివరించింది అంతా విన్న అబ్బాయి ఇదంతా తన తండ్రి ఆడుతున్న నాటకమేనని తన కథంతా చెప్పసాగాడు. అబ్బాయి తండ్రి ప్రజాపతి దగ్గరకి వెళ్ళి అబ్బాయి తన కోడలు సౌభాగ్యవతిని ప్రేమిస్తున్నాడని చెప్తాడు ఉభయం. ఉభయం పెద్ద ఎత్తులో వ్యూహం పన్నుతున్నాడని పసిగట్టిన ప్రజాపతి తను వచ్చి అబ్బాయి ప్రేమను పరీక్ష చేసి పెళ్ళి చేస్తానని చెప్తాడు. అబ్బాయి, అమ్మాయి, చిరంజీవి, సౌభాగ్యవతి ఏదో ఒక సాకుతో హైదరాబాద్ చెక్కెయ్యాలని ప్లాను వేస్తారు. ప్రజాపతి కొడుకు దగ్గరకి వస్తాడు. ఆయన అమ్మాయినే సౌభాగ్యవతిగా భావిస్తాడు. నాటకం ప్రారంభమవుతుంది మాటలతో బురిడీ కొట్టించి ఉభయం ఆస్తిని తన పేర రాయించుకుంటాడు అబ్బాయి. రెండు ప్రేమ జంటలు హైదరాబాద్ చేరాయి. తన పేర రాయించుకున్న ఆస్తిని అబ్బాయి సత్రకాయకి అమ్మేసాడు. ఉభయం బజారు పాలయ్యాడు. ఉభయంతో దెబ్బలాటకు వచ్చిన ప్రజాపతీ, సాధ్వి అతని సన్యాసి వేషం చూసి పలాయన వాదం స్వీకరిస్తారు. ప్రేమ జంటలు ఉద్యోగాన్వేషణలో పడ్డాయి. అబ్బాయి, అమ్మడు బడుద్ధాయిని బుట్టలో వేసుకోవడానికి నాటకం ప్రారంభిస్తారు.

"మన ప్రయత్నం మనం చేద్దాం. వాళ్ళ అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుంది" అంటూ పోస్టాఫీసు ముందు ఆగాడు చిరంజీవి.

"మరి బడుద్ధాయి సినిమా ముహూర్తం ఎప్పుడు పెట్టావు" అంది అమ్మడు.

"ముందు కుటుంబానికి మంగళం పాడనీ"

"మా ఉభయం బాబయ్య అచూకీ ఏమైనా తెలిసిందా?" జనాంతికంగా అడిగింది సౌభాగ్యం.

29

నలుగురు ప్రేమికులు యింటికి వెళ్ళేసరికి ఆ యిల్లు యిల్లులా లేదు. పెద్ద పోస్ట్ ఆఫీసులా వుంది. చిన్న చిన్న గుట్టలుగా, కొండలుగా, కవర్ల కుప్పలతో ఆ యింటి ఆవరణంతా నిండి వుంది.

అప్పుడే పడమటింటికి వెళ్ళాడు సూర్యుడు. అమావాశ్య చేరువలో వుందని తూర్పుగుమ్మం దాటలేదు చంద్రుడు. చీకటి చిక్కబడిందని దిక్కుగా చూస్తున్నాయి నక్షత్రాలు.

పెరట్లో వున్న తమ కొంపకి చేరుకోవాలని కవర్ల [illegible] దాటుతూ, గెంతుతూ, ఆ చీకట్లో తడుముకుంటూ బహు జాగ్రత్తగా నడుస్తున్నారు నలుగురు ప్రేమికులు.

"ఏమేవ్... ఎక్కడున్నావే" అనే మొగ ఆర్తనాదం ఓ పెద్ద కవర్ల కొండ పక్కనుంచి వినబడింది.

అమ్మడి కాళ్ళకి పెద్ద పార్సిల్ అడ్డు తగిలింది. ఆమె కెవ్వున కేకవేస్తూ క్రిందపడింది. సౌభాగ్యం చేయి తగిలిన కవర్ల కొండ కరిగింది. ఆమె దడుచుకుని హెల్ప్... హెల్ప్... అంటూ అరిచింది.

వాళ్ళని రక్షించాలని చీకట్లో చిందులేసే అబ్బాయీ చిరంజీవి గభాల్న గాఢంగా కౌగలించుకున్నారు. మీసాల రాపిడికి బావురుమని ఏడ్చేశారు.

"ఏమండీ... ఎక్కడున్నారండీ..." అంటూ అరుస్తూ అగ్గిపుల్ల వెలిగించి వస్తున్నది సుందరి. దార్లో కనబడిన పది కవర్లు చింపేసి వంద రూపాయల నోట్లు బొడ్లో దోపుకుంది.

ఏమరుపాటుగా ఆమె విసిరేసిన అగ్గిపుల్ల పెద్ద మానులాంటి పార్సిల్పై పడింది. భగ్గుమని పెద్ద మంట లేచింది. అందరి ప్రాణాలు కుదుటపడ్డాయి. వొకరి నొకరు పోల్చుకున్నారు.

"సుందరీ... ఏమిటే యిదంతా" ప్రశ్నార్థకంగా ఆశ్చర్యపోయింది అమ్మడు.

"నేను చెబుతాను. సావధానంగా వినండి" అన్నాడు సుందరం. అందరూ కవర్ల గుట్టలమీద కూర్చున్నారు. అతను నోరు విప్పాడు.

"సుందరికీ నాకూ మాటా మాట పెరిగింది. కారణం అడగకండి. ఉద్యోగం పురుషలక్షణమన్నారు. మీరు మగవారు కాదని నన్ను గేలిచేసింది సుందరి. ఉద్యోగం సంపాదించడం ఎంత కష్టమో ఆమెకి అనేకసార్లు నచ్చ చెప్పాను. నేనిట్టే ఉద్యోగం సంపాదిస్తానంటూ పేపరులో ప్రకటన యిచ్చింది సుందరి. ప్రకటన చూసిన డబ్బున్న మహారాజులు ముక్కుపై వేలు వేసుకొబోయి కళ్ళు బొడుచుకున్నారు. అందమైన సుందరి పొందుగోరి పోటీలుపడి, వంద రూపాయలతో పంపిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ల కవర్లు యివి. ఆడదాన్ని చూసి చూడగానే యిట్టే ఉద్యోగాలు యిచ్చేస్తారని మీరు కథలు చదివి వుంటారు. సినిమాలు చూసి వుంటారు. మీరిప్పుడు వాస్తవం చూస్తున్నారు. మీ ఫ్రెండ్ చేసిన పని మగవెధవ చేస్తే వొక్క అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా రాదు సరికదా ప్రకటన ఖర్చు ఆముదం చేతికి తగులుతుంది"

"సుందరం మాటలకేంగాని... ఈ కవర్లన్నీ నావికావు. మహావుంటే పన్నెండో లేక రెండు వేల కవర్లో నావి. మిగతావన్నీ సుందరానివే" అంది సుందరి గుప్త గర్వంతో చూస్తూ.

"సుందరంగారివా? వారికి కథవుందా?" చిరు ఆశ్చర్యంగా చిరంజీవి ప్రశ్న.

"సుందరానికి కథకాలేదు. వారే వో పెద్ద కథకులు. కష్టపడుతున్నాడు గాని

ఫలితం దక్కడం లేదు. వివరాలు మీకు అనవసరం. తన కథ ట్రాజెడీగా ముగియకూడదని బిజినెస్ ప్రారంభించాము. త్వరలో తాను ప్రారంభించబోయే నవ తాజా సమాచ పత్రికని యింటింటికి తిరిగి అమ్మగల, డిపాజిట్ కట్టగల ఏజంట్స్‌కావాలని ఈ దేశంలో వెలువడే అన్ని పేపర్లకి ప్రకటనలు యిచ్చాడు. వొక్క ఏజంట్ కూడా కార్డు ముక్క రాయలేదు. పెట్టబోయే పత్రికలో ప్రచురణార్థం నవలలు, నవలికలు, నాటకాలు, నాటికలు, కవితలు, అల్లికలు, పంటలు, ముగ్గులు, బొమ్మలు, వ్యాసాలు, వగైరా వగైరాలు వచ్చాయి. ఈ గుట్టల్లో ముప్పావుభాగం రచనలే" అంటూ హేళనగా నవ్వేసింది సుందరి.

"కర్మ. . కర్మ .. ఈ దేశంలో తెలుగు పత్రికలు కొని చదివేవారుకన్నా కిరాయి ఇంగ్లీషు నవలలు చదివి రాసేవారు ఎక్కువమంది' అంటూ సుందరాన్ని ఉపశమన పరిచాడు అబ్బాయి.

"ఈ కథలకేంగాని. అసలు మీ కథకావాలి" అంటూ హాయిగా నవ్వేసింది అమ్మాయి.

"మా అమ్మా నాన్నా పదిరోజుల్లో వస్తున్నారు. అప్పుడు మా కథ బయటపడుతుంది" అంటూ కిసుక్కున నవ్వేసింది సుందరి. ముఖం వ్రేలాడేశాడు సుందరం

30

తీర్థయాత్రలు పూర్తి చేసుకుని అత్తమామలు తిరిగి వస్తున్నారనే వర్తమానం మోసుకొచ్చిన కార్డు సుందరం చేతిలో నలిగిపోతున్నది. భరింపరాని అవమానంతో అతను కృంగిపోతున్నాడు.

తాను సక్రమంగా ఉద్యోగం నిర్వర్తించలేదని సాక్ష్యం చెబుతుంది భార్య. తనలో ఏదో లోపం వుందని లోకం కాకిలా అరుస్తుంది. భార్యకూడా తాను లోకువై పోతాడు. తానీ యింటిలో యిక గౌరవంగా ఉద్యోగం చేయలేడు. నోరు తెరిచి నలుగురికి చెప్పుకోలేని తన ఉద్యోగపు యిక్కట్లు ఎలా కడతేరుతాయి? కర్మ... కర్మ . యిదేం ఉద్యోగంరా బాబూ.

ఎందుకి వెధవ మగజన్మని అతను విపరీతంగా విలపిస్తూ వుండగా ఆ యింటి తలుపు నెట్టాడు ఉభయం.

మిట్ట మధ్యాహ్నం వేళ, మగవాళ్ళు యింటిపట్టున వుండనివేళ, తన సన్యాసి డ్రెస్ చూపించి, ఆడవారి చేతులు చూసి, నోటికి వచ్చినట్లు వాగి, చిన్న చిన్న దొంగతనాలే గాక, మానభంగాలు కూడా చేస్తూ తన ఆకలి తీర్చుకుంటున్నాడు ఉభయం.

తలుపులు తెరిచిన సుందరం కాషాయి కలర్ నైట్ గౌన్‌ని చూసి చీదరించుకుని ఛో... ఛో. . అంటూ కసిరాడు.

"అర్థమయింది నాన్నా నీ బాధ నీకు ప్రమోషన్ రాలేదని నీ మొఖం చాటి చెబుతున్నది. నీకు త్వరలో ప్రమోషన్ వస్తుంది. ఈ యింటిని ఏలుతావు."

అతని ముఖకవళికలు పరిశీలిస్తూ ఈ శాల్తీ ప్రమోషన్‌రాని బాపతని వూహించాడు ఉభయం.

"నాకు నిజంగా ప్రమోషన్ వస్తుందా? నేను తండ్రినవుతానా? ఈ యింటిని ఏలుతానా"... రండి. రండి' అంటూ అతి తొందరపడి సన్యాసిని ఆహ్వానించాడు సుందరం

ఈ మాత్రం అవకాశం వస్తే చాలు యిట్టే అల్లుకుపోగలడు ఉభయం.



బడ్జెటు సర్దుబాటు

ఎదురు చూసిన మొదటి తారీఖు రానేవచ్చింది
ఎటూ కుదరలేదు బడ్జెటు సర్దుబాటు
కనీసావసరాలకు మైనస్ చేస్తే మిగిలింది
కాలక్షేపానికి మూడు రూపాయలు
పగిలిపోయిన చంటివాడి పాలసీసా
పాతచీర అతుకుల స్థానే కొత్త చీరా
రోగిష్టి తండ్రి మందుల లిస్టు
రోజూ తిట్టేస్తున్న అద్దెయింటి బకాయీ
జేబులో డబ్బు ఖాళీ అయింది
జీవిత చక్రభ్రమణం పూర్తి అయింది
సంప్రదాయంగా వస్తున్న పద్ధతిలో
సరదాలు, ముచ్చట్లు తనకక్కరలేదు
హారతికర్పూరంలో తన జీతం పూర్తి
హాయి అనేది తెలీని జీవితానికి అర్తి!

—డా. ఆర్. అనంతపద్మనాభరావు

జిగిబిగి

"మిమ్మల్ని అతి త్వరలో పుత్రోత్సాహం ఆవరిస్తుంది ఆ టైం చెప్పాలంటే ముందు మీ యిల్లంతా చూడాలి. యింటిని చూశాకా మీ అదృష్టం అంచనా వేస్తాను."

సన్యాసికి యిల్లంతా చూపించి పెరటి తలుపులు తెరిచాడు సుందరం. ఆ యింట్లో సామాన్లు చదివేస్తూ సుందరి అందాన్ని తన చూపుల్తో తూకం వేస్తున్నాడు ఉభయం. తన పనైన తరువాత ఆ యింటి నుంచి బయటపడడానికి సులువైన మార్గాలు కూడా చూసుకుంటున్నాడు

"ఆ రేకుల షెడ్ యింటిని అద్దెకిచ్చాం" అన్నాడు సుందరం.

ఆ యింటి తలుపుకున్న తాళం చూస్తూ పెరట్లో ఆరవేసిన చీరెలూ, ఫాంటులు, షర్ట్‌లు వగైరాలు చూస్తూ, తన గొప్పతనం మరింత బహిరంగపరచాలని గడుసుగా అన్నాడు ఉభయం.

ఆ యింట్లో అమ్మాయి సౌభాగ్యవతి, యిక అబ్బాయి చిరంజీవి, సిటీలోకి వెళ్ళారు. ఏ వూరూ వెళ్ళలేదు సాయంకాలానికి తిరిగి వస్తారు'

"తమ గొప్పతనం పొగడడానికి, ప్రార్థించడానికి నాకు సన్యాసి దండకం రాదని" అంటూ ఉభయం కాళ్ళని కౌగలించుకున్నాడు సుందరం

అద్దెకుంటున్న వాళ్ళందరి పేర్లు సన్యాసి అప్పగించేసరికి, నోరు తెరిచిన సుందరి ఒక ఈగని హత్య చేసింది. అంటే మింగిందని అర్థం!

"నా కాళ్ళపై బడితే నీ కష్టాలు కడతేరవు నాన్నా. యింకా ఎక్కువవుతాయి. నన్ను వదులు. గజ్జి అంటుకుంటే వదలడం కష్టం. అందుకని నా పాదాలు వదిలి, బజారు కెళ్ళి పూజసామాన్లు తీసుకురా. అవి ఏమిటంటే నాలుగు తామరపూలు, అయిదు వెలక్కాయలు, ఆరు తేగలు, ఎనిమిది అరిటి పిలకలు, కొండపల్లి బొమ్మల జంటా, పావు కిలో మామిడి తాండ్ర, రెండు రేగిపళ్ళు. అర్థ లీటర్ గంగాజలం లేదా అయిదు లీటర్ల కృష్ణావాటర్... యిక చాలు. నువ్వెంత వేగంగా ఈ వస్తువులు తెస్తే, అంతకన్నా వేగంగా నేను పుత్రదానకాండ జరిపి మీ శ్రీమతికి పుత్రుణ్ణి ప్రసాదిస్తాను" అంటూ సుందరం జుట్టుపట్టుకుని పైకి లాగాడు ఉభయం

"సన్యాసీ . నేనీ పరీక్షకి తట్టుకోలేను రెండు లారీల కొబ్బరికాయలు, నాలుగు రిక్షాల తమలపాకులు, అయిదు మోపుల అగరొత్తులు తెమ్మంటే తేగలను తామరపూలూ, వెలక్కాయలు, రేగి కాయలు, ఎక్కడని త్రుంచుకు రాగలను? ఇకపోతే గంగావాటర్ ఎవరింట్లో ముంచుకు రాగలను?" అంటూ హృదయం కరిగిపోయేలా కన్నీరు కార్చాడు సుందరం

పట్టుదల వుంటే సాధించలేనిదంటూ ఈ పృథ్విలో లేదు నీ ప్రయత్నం లోపం వల్లనే నీ వింతవరకు తండ్రివి కాలేక పోయావు నాకు వొక్క అవకాశం యిచ్చి చూడు. ఈసారి నీ భార్య తల్లి అవడం ఖాయం. నాన్నా విచారించకు. నీ కష్టం, బాధా తొలగడానికి నీకో యదార్థగాథ చెబుతాను. విను."

"మార్గశిర మాసంలో నేను అయోమయపురం వెళ్ళాను అక్కడ మిలాంటి జంటే నా కాళ్ళపై బడి కన్నీరు కార్చింది నేను వారింటి అన్ని దిక్కులూ చూశాను. లోపం కనిపెట్టాను వెంటనే పూజ చేయడానికి వేపపువ్వూ, మామిడిపూతా, మల్లె మొగ్గలు తెమ్మని యింటాయిన్ని పురమాయించాను. అతను మార్గశిర మాసపు చివరి రోజుల్లో ఇల్లు వదలి వెళ్ళాడు యింటావిడ సేవలు అందుకుంటూ వింటర్‌సీజన్ సంగతి నేను మరిచిపోయాను చైత్రమాసపు తొలి రోజుల్లో ఎడ్లబండిమీద వేపపువ్వూ, మామిడిపూతా, మల్లె మొగ్గల మూటలతో వసంతుడిలా తిరిగి వచ్చాడు యింటాయిన నేను వెంటనే పూజ చేశాను యింటావిడ భళ్ళున వాంతి చేసుకుంది దేవుడికి నివేదన చేసిన చింతపండు ప్రసాదంగా యిచ్చాను యింతకన్నా ఋజువులు యింకేం కావాలి. కాబట్టి నువ్వు వెనక్కి తిరిగిచూడకుండా యింకేమీ మాట్లాడకుండా నేను చెప్పిన సామాన్లు తీసుకురా మనసుంటే మార్గముంటుందని ఇంగ్లీషులో వూరికినే అన్నారా" వెంటనే వెళ్ళు.

నువ్వొచ్చేలోగా మీ ఆవిడ చీరె మార్చి పూజకి సిద్ధంగా వుంటుంది' అంటూ సుందరాన్ని మాటలతో మభ్యపెట్టాడు ఉభయం

తన మగతనం నిరూపించుకోవడానికి అరుదుగా లభించిన అవకాశం వదులుకోలేని అవివేకంతో బజారుకి బయలుదేరాడు సుందరం. మంత్రాలకి చింతకాయలు రాలవు వీడు దొంగ సన్యాసని గొణుగింది సుందరి

ఛట్ నోర్మూసుకో. దొంగ సన్యాసులు వేలకి వేలు ఖరీదు చేసే పూజలు చేస్తారు ఈ సన్యాసి నిజమైన సన్యాసి కాబట్టే అరిటి పిలకలు, కృష్ణా వాటర్ తెమ్మన్నాడు. యిష్టం వచ్చినట్లు వాగకు. సన్యాసి సేవలు చేయమని భార్యని పురమాయించాడు సుందరం

కర్మ కర్మ . అంటూ ఆమె సణుగుతూనే వుంది. వెళ్ళు వెళ్ళు అంటూ ఉభయం అతన్ని తొందర చేస్తూనే వున్నాడు సుందరం డబ్బా, గోనె సంచులు తీసుకుని సన్యాసి పాదాలకి నమస్కరించి బజారు పాలైనాడు

అతను వెళ్ళిన వెంటనే తొందరపడలేదు, ఉభయం అయిదారు నిమిషాలు సుందరితో మాటా మంచీతో కాలక్షేపం చేశాడు. దొంగ చూపులతో కిటికీలోంచి రోడ్డు మీదికి చూడసాగాడు జన సంచారం లేదని పసిగట్టి చివాల్న సుందరి నోటిని కుడిచేత్తో మూసి, ఎడం చేత్తో వీధి తలుపులు వేశాడు

31

కుటుంబం యింటికి వెళ్ళారు నలుగురు ప్రేమికులు రాక్షసుడి నోరులా తెరిచివుంది మైన్ గేటు యింట్లో ఎటువంటి అలికిడి లేదు. ఎలుకలని వేటాడుతున్న పిల్లి తప్ప యింకెవరూ లేనట్లుందా యిల్లు

ఎనిమిది కాళ్ళు చురుగ్గా వరండా దాటి మైన్ హాల్లోకి వెళ్ళాయి. ఆ హాల్లో కూర్చున్న బడుద్ధాయి భార్య అశోకవనంలో సీతలా వుంది ఎవరు కావాలన్నట్లు వాళ్ళవంక చూసింది

కుటుంబంగారు లేరా?' అమ్మడు ప్రశ్న

'లేరు నిన్నటి నుంచి మా నాన్న ఆచూకీ తెలియడం లేదు ఎక్కడి కెళ్ళారో ఏం చేస్తున్నారో అంటూ నిర్లిప్తంగా అంది బ భా

"మీ అమ్మగారిని పిలవండి సౌభాగ్యవతి అభ్యర్థన

'మా నాన్నకోసం వెంగపడి సొమ్మ అడగడానికి గ్రామదేవత గుడి కెళ్ళింది మా

అమ్మ... యింతకీ మీరెవరు. ఎప్పుడో చూసినట్లుందే–" సాలోచనగా అంది బ. భా

"అవును. ఉద్యోగాలకోసం మీ నాన్నని వొకసారి కలిశాం. అప్పుడు మమ్మల్ని చూసి వుంటారు. ఈ యింటి అల్లుడైతే ఉద్యోగాలిస్తానన్నారు మీనాన్న. అందుకేవచ్చాం" అంటూ అందుకున్నాడు చిరంజీవి.

అతనివంకా, అబ్బాయివంకా చూస్తూ చూస్తూ నిస్తేజంగా అంది బ. భా–

"మా చెల్లెళ్ళు దురదృష్టవంతులు. రెండు రోజులు క్రితం యిల్లు వదిలి వెళ్ళారు. యింతవరకు అజాపజా తెలియదు. ఎక్కడున్నారో... ఏం చేస్తున్నారో..."

"మీకేం తెలియదా? పోలీసులకి రిపోర్టు చేయలేదా?" అసలు విషయం కూపీ లాగాలని మామూలుగానే ప్రశ్నించింది సౌభాగ్యం.

"ఫోర్ డేస్ బాక్ వాళ్ళకో రిజిస్టర్ కవరు వచ్చింది యితరుల కళ్ళకి చెవులకి అందకుండా రహస్య సమాలోచనలు చేశారు మా చెల్లెళ్ళు. ఎవరికి ఏమి చెప్పా చేయకుండా కొద్దిపాటి డబ్బూ, నగలు, బట్టలు తీసుకుని అర్ధరాత్రివేళ చెక్కేశారు. పోలీసుస్టేషన్ ఛాయల కెళ్ళడానికి మా నాన్నకే గాదు మా వారికి భయమే."

"యింతకి బడుద్ధాయి గారెక్కడున్నారు?"

"నా చెల్లెళ్ళు వ్యభిచార కొంపల్లో హాయిగా కాపురాలు చేస్తూ వుంటారని అవాకులు చవాకులు పేలుతూ పీకలదాకా తాగి బెడ్‌రూంలో దొర్లుతున్నారు."

భార్య మాటలు పూర్తికాకుండా బులెట్‌లా ఆ హాల్లోకి దూసుకు వచ్చాడు బడుద్ధాయి.

"ఎ. సి. బి.కి మా మావ ఆస్తి వైనం పోస్టుచేసి తిరిగ్గా యిప్పుడు పరామర్శకి వచ్చారా" అంటూ అబ్బాయిపైకి లంఘించాడు.

అతన్ని తన ఇనుప చేతులతో బంధించి, "యిష్టం వచ్చినట్లు వాగకు. అసలు మాకేమి తెలియదు. మాకు ఎరుకపరిచేలా మీ మావ నల్లధనం దాచలేదు" అంటూ గర్జించాడు చిరంజీవి.

"బ్లాక్‌మనీ అడ్రెస్ నేనే అబ్బాయి కిచ్చాను. వీడు నన్ను మోసం చేశాడు" అంటూ గింజుకోసాగాడు బడుద్ధాయి.

"మా యింట్లోనే వుంటూ, తింటూ, మా యింటి వాసాలు లెక్కించి టాం... టాం... వేస్తావా" అంటూ భర్త చెంప ఛెళ్ళుమనిపించింది బ. భా. అతని జుట్టు పట్టుకుని పీకి, ఫుట్‌బాల్‌ని తన్నినట్లు, ఎగిరి బలంగా అతన్ని తన్నింది ఆమె. బడుద్ధాయి దొర్లుకుంటూ హాల్ గుమ్మం దగ్గర ఆగాడు.

"యిదేం చోద్యమే అమ్మాయీ... వేలకి వేలు తగలేసి కొనుకున్న భర్తని యిలా తన్ని తగలేస్తారా" అంటూ రాగాలు తీస్తూ యింట్లోకి వచ్చింది శ్రీమతి కుంటుంబం. ఆవిడ చంకలో చంటిపిల్ల వుంది. కొంగు పట్టుకుని లాస్ట్ బట్ వన్ అమ్మాయి వుంది.

"వీడు నా మొగుడు కాదు. నా పాలిటి యముడు. తాగడానికి డబ్బులులేక నిన్న రాత్రి నా మంగళసూత్రాలు తెంపేసి, అమ్మేసి, పీకలదాకా తాగేసి వచ్చాడు."

భార్య ధోరణికి అలివిగాని ఆవేశంతో ఆమెపైకి వురక బోయాడు బడుద్ధాయి. అంతలో పోలీస్ వాన్ ఆ యింటి ముందు ఆగడం, పోలీసులు అతన్ని అరెస్టు చేయడం క్షణాల్లో జరిగిపోయింది. జైల్లో స్థిరనివాసం చేయడానికి అన్ని అర్హతలున్న అతని అరెస్టు ఆరాలు తెలుసుకోవాలని ఆ యింట్లో వాళ్ళు ఎటువంటి ఆదుర్దా పడలేదు.

"యిదంతా నేను చేజేతులా చేసుకున్న కర్మ. భర్త రోజూ వేలకి వేలు తెస్తూంటే ఎక్కడదీ నల్ల డబ్బని ఆయన్ని నిలదీయ లేదు. ఖుషీగా కాపురం చేస్తూ పిల్లల కోడిలా మారాను. లేనిపోని బేషజాలకి పోయి పిల్లలకి పెళ్ళిళ్ళు చేయలేకపోయాం. వయసులో వున్న ఆడపిల్లలకి మగతోడు అవసరమని చాలా ఆలశ్యంగా గ్రహించాను." అంటూ తనని తాను నిందించుకొసాగింది శ్రీమతి కుటుంబం.

32

బడుద్ధాయి కథని పోలీసుల పాలుచేసి హుషారుగా యింటికి వస్తున్న నలుగురు ప్రేమికుల్ని మైన్ గేటు దగ్గరే ఆపేసి తన కథ గానం చేసింది సుందరి.

"మా చుట్టం సత్రకాయని నా స్వంత పనిమీద బజారుకి పంపాను. మిట్ట మధ్యాహ్నం వేళ మా వారిని బెజవాడ తోలేసి నన్ను బరబరా బెడ్‌రూమ్‌లోకి లాకెళ్ళాడు ఓ సన్యాసి. అదే సమయంలో మన యింటి ముందు ఆగిన ఆటోలోంచి దిగారు తాతయ్యగారు, సత్రకాయ. సందుల్లోంచి వాళ్ళని చూసిన సన్యాసి నన్ను వదిలి తోక ముడిచి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతివేగంగా విషయం ఆకళింపు చేసుకున్న సత్రకాయ ఆ సన్యాసిని పట్టుకున్నాడు."

"నీకి జన్మకి బుద్ధిరాదురా ఉభయం, అంటూ ఆ సన్యాసిని వేడినీళ్ళ కాగులో వుడకేశాడు. కాళ్ళూ చేతులు విరిచేసి వుతికేశాడు. నిన్ను పోలీసులకి అప్పగిస్తే సాక్ష్యం కావాలంటారు. అభిమానంగల ఏ ఆడది కోర్టుచుట్టూ తిరగదు అంటూ ఉభయాన్ని పిండేసి ఏ కీలు ఆ కీలు వూడదీసి, మళ్ళీ వుండలా చుట్టేసి అద్దె సైకిల్ బాక్‌సీట్‌కి కట్టేశాడు సత్రకాయ."

"ఈ పోరంబోకుని చెత్తకుండీలో విసిరేసి వస్తానంటూ సైకిల్ మీద వెళ్ళాడు సత్రకాయ. అతని కోసమే ఎదురు చూస్తున్నాను. సైకిల్‌రెంట్ నిమిష నిమిషానికి పెరగకపోయినా ప్రతీ అరగంటకి పెరుగుతుందిగా."

సుందరి ఎదురు చూసేది అతనికోసంకాదు. అద్దె సైకిల్ కోసమని అవలీలగా వూహించాడు చిరంజీవి. ఉభయం బాబయ్యని తలుచుకుని రెండు నిమిషాలు మౌనం పాటించింది సౌభాగ్యం.


రేకుల షెడ్‌లో కవర్లని దిండుగా అమర్చుకుని కునుకుతీస్తున్న సూర్యనారాయణగారిని చూడగానే "తాతయ్యా" అంటూ చిన్నపిల్లలా ఎగిరి గంతేసింది అమ్మడు.

ముగ్గురు పెద్దల కథ పెద్ద యిబ్బంది లేకుండా ముగిసిందని హాయిగా కవర్లకట్టల సోఫాలో పడుకున్నాడు అబ్బాయి

పూజ వెచ్చాలకోసం వెళ్ళిన సుందరంకోసం నిరీక్షించి, నిరీక్షించి, చివరికి విసుగెత్తి అర్ధరాత్రి దాటిన తరువాత చద్దిఅన్నాలు తిన్నారు ఆ యింటి జనాభా. సుందరికి తోడుగా చెరోవైపు కూర్చున్నారు అమ్మడూ, సౌభాగ్యవతి.


"ఎక్కడికి వెళ్ళారో.. ఏం చేస్తున్నారో... వొక్కక్షణం కూడా నన్ను వదలకుండా వుండేవారు...కాదు నేను కనుమరుగైతే చాలు .. ఏమే ఎక్కడున్నావే.... అంటూ కేకలు వేసేవారు. తన మగతనం నిరూపించుకోవాలని తెగ ఇబ్బంది పడేవారు. యింత చిన్న వయస్సులో తల్లి కావడం యిష్టంలేని నేను రోజు కుటుంబ నియంత్రణ మాత్రలు తింటున్నాను. వొకరోజు మరిచిపోతే నర్సు చెప్పినట్లు మరు రోజు రెండు మాత్రలు మింగేదాన్ని. నా వ్యవహారం పసిగట్టలేదు సుందరం. సన్యాసి పూజలకి పిల్లలు పుడతారని చెప్పగా బజారు పాలైనాడు. కొంపతీసి కృష్ణావాటర్‌కోసం బెజవాడ వెళ్ళారేమో..." అంటూ సన్నసన్నగా రాగాలు తీయసాగింది సుందరి.

ఆమె మాటలకి "ఆఁ" అంటూ నోరు తెరిచి అమాంతం నిద్రపోయారు



సుభాషితాలు


యశ్చ నింబం పరశునా
యశ్చైనం మధుసర్పిషా
యశ్చైనం గంధమాల్యేన
సర్వస్య కటురేవ సః



వేపచెట్టు- తన్ను గొడ్డలితో నరికేవాడికీ చేదుగానే యుంటుంది. తేనే నేతులతో తడుపువాడికీ చేదుగానే యుంటుంది గంధంతోనూ, మాలతోనూ అలంకరించు వాడికీ చేదుగానే యుంటుంది

(దుష్టుడు దుష్టుణ్ణేగాక సజ్జనుణ్ణి గూడా ద్వేషిస్తూంటాడని భావము)

ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః
ప్రారభ్య విఘ్నవిహతా విరమంతి మధ్యాః
విఘ్నైః పునః పునరపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధముత్తమగుణాః న పరిత్యజంతి



విఘ్న మేర్పడుతుందేమోనను భయంతో నీచులు ఏ పనిని ఆరంభించరు, మధ్య తరగతికి చెందినవారు పని నారంభించి విఘ్న మేర్పడిందే దానిని మానివేస్తారు. ఉత్తములేమో మాటి మాటికీ విఘ్నాలేర్పడుతున్నప్పటికీ ప్రారంభించిన పనిని పూర్తియగు వరకు విడవరు

—ఆయుర్వేద శిరోమణి రాజ రాజేశ్వర శర్మ

జిగిబిగి

అమ్మయ్య, సౌభాగ్యం. భళ్ళున తెల్లారింది. పాలు వచ్చాయి. కాఫీ తయారైంది. పేపరు వచ్చింది. సుందరం రాలేదు. ఆసక్తిగా తమకి కావలసిన వార్తల కోసం పేపరు చూడసాగారు ఆ యింటి జనం.

అనేక జిల్లాలకి విస్తరించిన కుటుంబం ఆస్తిపై అవినీతి నిరోధకశాఖ అధికారుల దాడి వైనం విపులంగా చదివారు.

సినిమా కంపెనీ పేరుతో యువతుల మానాలతో ఆటలాడుతున్న బదుద్దాయి అరెస్టు గురించి వివరంగా తెలుసుకున్నారు.

విజయవాడలో జరిగిన సామూహిక స్వయంవర వివాహాల గ్రూప్ ఫోటో లో లంఖిణి అండ్ సిస్టర్స్‌ని పోల్చుకున్నారు. కుటుంబంగారి ఆడసంతానానికి వివాహాలు జరిగినందుకు ఆనందించారు.

విజయవాడలో జరుగుతున్న సామూహిక వివాహాల స్వయంవరంలో పాల్గొని, మీకు నచ్చిన, మీరంటే యిష్టపడే వరులని, కుల, మత, వర్గ ప్రమేయం లేకుండా పెళ్ళాడి, సుఖపడమని, వుసికొలుపుతూ, హితబోధ చేస్తూ, అవివాహితులైన కుటుంబం ఆడసంతానానికి సుదీర్ఘ లేఖ వ్రాశారు అబ్బాయి అండ్ అమ్మాయి వగైరా.

తమ లేఖని మన్నించి, అర్థం చేసుకుని, వివాహాలు చేసుకున్న కుటుంబంగారి పిల్లలకు తమ శుభాకాంక్షలు పత్రికా ముఖంగా పంపించారు అబ్బాయి అండ్ కో.

మాటల కోలాటాలతో ఆ యిల్లు గందరగోళంగా వుంది. యింటావిడ సుందరి మాత్రం మౌనవ్రతంలో నే వుంది. "అంతా భగవదేచ్ఛ" అని మాటి మాటికి అంటూనే వున్నారు సూర్యనారాయణగారు.

"అంతా భగవదేచ్ఛ అంటున్నారు. సన్యాసి పూజ అయిపోయిందా? కొంపతీసి మా ఆవిడ వాంతి చేసుకుందా. నూట ఇరవై తగలేసి బెజవాడ వెళ్ళాను" అంటూ ఇంటికి వస్తూనే అరవసాగాడు సుందరం. ఆటో డ్రైవర్ కదుపుతో వున్న పెద్ద గోని సంచిని, నీళ్ళతో నిండిన పెద్ద కుండని యింట్లో పెట్టాడు.

"కర్మ... కర్మ... బెజవాడతో సరిపుచ్చారు. గంగా వాటర్ కోసం కాశీ వెళ్ళ లేదు–" అంటూ చేతులు త్రిప్పుతూ భర్తని చెరిగి పారేసింది సుందరి.

"అంతా మన కోసమేకదే... ఎందుకలా విరుచుకు పడతావు" అంటూ ఆమె దగ్గరకి రాబోయాడు సుందరం.

"దూరం... దూరం... దిండూ చాపా నా ముఖాన్న కొట్టి రెండు డబ్బాల బియ్యం వుడకేయండి. మీరింత తిని, నా కింత పెట్టి, పాలు తోడేసి సిగరెట్ తాగండి... దూరం... దూరం...." అంటూ అతనికి దూరంగా గది మూలలో నిల్చుంది సుందరి.


"ఎంతకాలమిలా నీకు వండి వడ్డించాలే..." అంటూ హృదయ విదారకంగా విలపిస్తూ నుదుటిని బాదుకోసాగాడు సుందరం.

"ఎందుకు బాబూ... అంత వర్రీ పడతావు. మీ అత్తయ్యా, నేను వచ్చేశాంగా... నేను చెప్పలేదూ... మనం వచ్చే వేళకి అమ్మాయికి నెల తప్పుతుందని... చూలింతకి సేవలు చేయలేక తెగ యిదైపోతున్నాడు అల్లుడు" అంటూ సుందరం మావగారు సుందరి తల్లితో సరసాలు ఆడుతూ యింట్లోకి ప్రవేశించారు.

తలపై రెండు చేతులుంచుకుంది సుందరి. తలని చేతుల్లో బంధించాడు సుందరం.

ఒక్కసారిగా ఫెళ్ళుమని నవ్వేశారు అద్దె యింట్లో తలదాచుకుంటున్న జనం. యికచాలు!


(అయిపోయింది)


A hard day's work
and you are in knots–
Turn lid to unwind
BEEHIVE
BEEHIVE
Very, very French.

"ఏమ్మా శిరిషా! మీ అత్తయ్యను లేచి భోజనం చెయ్యమనక పొయ్యావా"? అన్నారు, చూస్తున్న పేపరు పక్కన పడేసి, తనకు రెండోసారి కాఫీ తీసుకొచ్చిన కోడలితో పుండరీ కాక్షయ్య.

ఇప్పటి కైదారుసార్లు పిల్చాను మామయ్యా! అత్తయ్య లేచి రావడంలేదు. పదే పదే పిలుస్తూంటే నామీద కోప్పడుతున్నారు. ఎన్నాళ్ళిలా భోజనం లేకుండా వుంటారో అర్థం గాకుండా వుంది!" అంది శిరిష.

"గొప్ప చావొచ్చి పడిందమ్మా!.... రామం చూస్తే కట్నం తక్కువైనా ఆ రామనాథం గారమ్మాయినే చేసుకుంటానంటాడు.... ఈవిడకు చూస్తే డబ్బు పిచ్చి!.... మొన్నా వెంకటాపురం వాళ్ళొచ్చి వెళ్ళినప్పట్నుంచీ ఈవిడ పిచ్చి మరి ముదిరిపోయింది. అన్నం తినడం మాని అర్ధాంతరం చావు చావాలనుకుందో ఏమో!.... రామానికి నువ్వు కూడా ఒకసారి చెప్పలేక పోయావటమ్మా!?" అన్నారు బాధగా పుండరీ కాక్షయ్య.



"మన ఇంట్లో ఈ సమస్య తలెత్తిన రోజునే నేను, ఈయనా కూడా రామానికి చిలక్కి చెప్పినట్టు చెప్పాం మామయ్యా!.... అయినా రామం తనపట్టు విడవడంలేదు.... వ్యక్తిత్వం వచ్చిన ప్రతి మనిషికీ కొన్ని ఇష్టాయిష్టాలు వుంటాయి కద మామయ్యా!....'

"అందుకేనమ్మా నేను వాడికి గట్టిగా చెప్పలేక పోతున్నాను.... డబ్బు పిచ్చిలోపడి పార్వతి ఆ విషయం గుర్తించలేకపోతోంది! పూటకింత అన్నంలేక ఎంతో మంది అల్లాడి పోతుంటే అన్నీ వుండి తినడాని కష్టరిస్తూంది దీవిడ...." అని ఒక్క క్షణం ఆగి "లోపల రాజ్యలక్ష్మి ఏం చేస్తుందమ్మా?" అడిగారు పుండరీ కాక్షయ్య.

"ఏదో పత్రిక చదువుకుంటోంది మామయ్యా!"

"పుస్తకాలు తప్ప వేరే ధ్యాసుండదు దానికి.... నువ్వు శ్రమనుకోక దాన్ని కూడా పిల్చి; అన్నీ వడ్డించి పట్టుకెళ్ళి ఆవిడ్ని అన్నం తినమని చెప్పండమ్మా!" అన్నారు ఆ వేదనగా పుండరీకాక్షయ్య.

"అలాగే మామయ్యా!" అని లోపలి కెళ్ళింది శిరిష.

శిరిష అలా వెళ్ళగానే కాఫీ త్రాగి – పార్వతమ్మగారి మొండి పట్టుదలేమిటో అంతు బట్టని పుండరీ కాక్షయ్య ఆలోచనలో పడ్డారు....

తాలూకా ఆఫీసులో హెడ్‌క్లర్కుగా ఉద్యోగంచేసి ఈ మధ్యనే రిటైరయ్యారు పుండరీకాక్షయ్య. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒకే ఒక్క కూతురు. తను ఉద్యోగంలో వున్నప్పుడే పెద్ద కొడుకు బుచ్చిబాబును ఇంజనీరునుచేసి – రంగపట్నం సాంబశివం గారమ్మాయితో పెళ్ళిచేశారు. వారు డబ్బున్నవాళ్ళు కావడంతో అల్లుడికి నలభైవేలు కట్నం ఇవ్వడమేగాక శిరిషకు రెండువందల తులాల వెండి సామగ్రి, పదికాసుల బంగారం కూడా పెట్టారు.

ఆయన రిటైరయ్యేసరికి రెండో కొడుకు రామానికి చదువు పూర్తయి – పి. డబ్ల్యు.డి. లో సూపరువైజరుగా ఉద్యోగం రావడం.... కూతురు రాజ్యలక్ష్మి పెళ్ళి కెదగడం జరిగాయి. ఆయనరిటైరైనా జాగ్రత్త మనిషి కావడంవల్ల ఇప్పుడెలాంటి ఇబ్బంది లేదు. అంతకు ముందే తండ్రి కట్టిన పెంకుటింటిని నాలుగు వాటాల డాబా ఇల్లుగా మార్చారు. తమ కుటుంబం మూడు వాటాల్లో వున్నా – ఒక వాటా అద్దె కిచ్చుకుంటే ఆ అద్దె డబ్బూ, తనకొచ్చే పెన్షన్ డబ్బుతో ఆయన జీవితం సాఫీగా గడిచిపోతుంది. ఎటొచ్చి రాజ్యలక్ష్మికి, రామానికి పెళ్ళిళ్ళు చెయ్యడ మొక్కటే ఆయనకు మిగిలి వున్న బాధ్యత, కుదిరితే రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారిచేసి తనమీదున్న బరువు దించుకోవాలనుకుంటున్నారు.

ఆ వుద్దేశ్యంతోనే రిటైరైన వెంటనే సంబంధాలకోసం అన్వేషణ మొదలు పెట్టారు పుండరీ కాక్షయ్య. ఆయన ఆ ప్రయత్నంలోకి దిగిన కొద్ది రోజులకే కూతురు రాజ్యలక్ష్మికి – రంగపట్నంలో శిరిష బంధువులైన సర్వారాయుడు గారబ్బాయితో పదిహేను వేలు కట్నానికి సంబంధం కుదిరింది. అబ్బాయి సివిల్ డ్రాఫ్ట్‌మేన్. రానున్న శ్రావణమాసంలో పెళ్ళి చెయ్యడానికి వుభయులూ నిశ్చయించుకున్నారు.

ఈలోగా రామానిక్కూడా శంఖవరంలో ఎదో సంబంధం వుందంటే వెళ్ళి చూసొచ్చారు. వాళ్లంతగా వున్నవాళ్ళుకాదు.... పదివేలకు మించి కట్నం ఇవ్వలేమన్నారు. అయితే అమ్మాయి మటుకు అపరంజి బొమ్మలా వుంది. అమ్మాయిని చూడగానే కట్నమెంతయినా ఆ సంబంధం చేసుకోడానికి సిద్ధపడ్డాడు రామం!.... పార్వతమ్మగారికి అమ్మాయి తెచ్చుకునే కట్నం ఎంతమాత్రం నచ్చలేదు. పుండరీకాక్షయ్యగారు మాత్రం కొడుకు అభిప్రాయంతో ఏకీభవించి – భార్య కళ్లతో వద్దని వారిస్తున్నా పట్టించుకోకుండా – మంచిది చూసి తాంబూలాలు పుచ్చుకుందామని అమ్మాయి తండ్రి రామనాథానికి చెప్పి వచ్చేశారు.

వచ్చిన వెంటనే మొదలైంది ఇంట్లో తుఫాను!.... 'నేను వద్దంటూంటే మాటిచ్చేశారు. మీరు.... అంటే మీ కెవరికీ నామాట లెక్కలేదన్నమాట?.... బుచ్చిబాబు నలభైవేలు కట్నం తెచ్చుకున్నాడని నలుగురికీ గర్వంగా చెప్పుకున్నాం!.... వీడికేం తక్కువని పదివేల కట్నానికి ఒప్పుకుంటున్నారు? ఆ పిల్లకు మించిన అందగత్తెలీ ప్రపంచంలో లేరా? ఎవరితోనైనా చెప్పుకోడానికే సిగ్గుగా వుంది!'.... అంటూ ఒకటే సాధింపు మొదలుపెట్టారు పార్వతమ్మ.

రామం తనకు నచ్చిన పిల్లను చేసుకుంటానంటున్నప్పుడు డబ్బుతో పనేముంది?ఇందులో బాధపడాల్సింది.... సిగ్గుపడాల్సిం దేముంది?' అని కుటుంబ సభ్యులందరూ చెప్పినా ఆమె తలకెక్కలేదు.

పరిస్థితిలా వుండగానే నాలుగురోజుల క్రితం తణుకునుంచి రామానికి ముప్పైవేలు కట్నమిస్తామంటూ వచ్చిందో సంబంధం!.... వాళ్లామాటని పోయింది మొదలు పార్వతమ్మగారికి వున్న మతి కాస్తా పోయింది. 'వెళ్ళిచూసి ఆ సంబంధం ఖాయపర్చుకుందామని భర్తనూ – ఇప్పుడు కావాల్సింది డబ్బుగాని అందం కాదురా అయోమయం సన్నాసీ!' అని కొడుకునూ అదే పనిగా వేధించడం మొదలు పెట్టిందామె – ఎవరూ తనమాట ఖాతరు చెయ్యకపోవడంతో – తన పట్టుదల నెగ్గేవరకూ అన్నం ముట్టనని శపథంచేసి – ఆ మర్నాటినుండి అది ఆచరణలో పెట్టి; భర్తతోను, చిన్న కొడుకుతోను మాట్లాడ్డం

మానేసిందామె.

బుచ్చిబాబు, శిరిష, రాజ్యలక్ష్మి ఎంత నచ్చజెప్పినా; బ్రతిమలాడినా తన పట్టుదల విడిచి పెట్టలేదు పార్వతమ్మగారు. ఇది పని కాదని తన మీదున్న గౌరవాభిమానాల కొద్దీ రామూని కెన్నో విధాల చెప్పి చూసింది శిరిష. అతనూ – తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనడంతో సమస్య మరింత జటిలమై పోయింది. ఒకటి, రెండు రోజుల్లో తగ్గి పోతుందనుకున్న తుఫాను – పెనుతుఫానుగా మారి ఎవరికీ మనశ్శాంతి లేకుండా చేసింది.


పార్వతమ్మగారు మూడు రోజుల్నుంచి అన్నం ముట్టక పోవడంతో పుండరీకాక్షయ్యగారు రామూన్ని పిల్చి; 'పోనీ అమ్మ చెప్పినట్టు చెయ్యకూడదర్రా! ఎవరికీ మనశ్శాంతి లేకుండా ఏమిటిదంతా?' అని మందలింపుగా అంటే– 'కట్నం ఇవ్వగలిగిన వాళ్ళదగ్గర పుచ్చుకోవచ్చును. ఇవ్వలేని వాళ్లను పీడించటమేమిటి? నాకా అమ్మాయి నచ్చింది.... వాళ్ళయినా వూరికినే చేసుకోమనకుండా వున్నంతలో కట్నం ఇస్తామంటున్నారు కదా! అటువంటప్పుడు అమ్మకెందుకింత పట్టుదల?' అని తన నిశ్చయానికి తిరుగులేదన్నట్టు ఖచ్చితంగా చెప్పేశాడు.

ఇంట్లో పరిస్థితి ఇలావుంటే–శంఖవరం రామనాధంగారికి మాటిచ్చి వచ్చినందుకు బాధపడిపోతున్నారు పుండరీకాక్షయ్య. జీవితంలో ఇంతవరకూ ఏవరికీ మాటిచ్చి తప్పలేదాయన. మంచిరోజు చూసుకొని ఆ అమ్మాయికి పసుపుకుంకుమలిచ్చి– రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారి జరిపించొచ్చని అనుకుంటూ వుంటే తన భార్య ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తూందో పుండరీకాక్షయ్యగారి కర్థం కావడంలేదు.

ఆయనలా ఆలోచిస్తూండగానే– "రాజ్యలక్ష్మి.

వదినా! వదినా! వైఢూర్యమా!!

లక్ష్మి శ్రీనివాసన్



నేను ఎంత చెప్పినా అత్తయ్య భోజనం చెయ్యడంలేదు మామయ్యా!" అంది శిరీషవచ్చి.

పుండరీకాక్షయ్యగారు బరువుగా నిట్టూర్చి- పార్వతమ్మగారి దగ్గరకెళ్లారు. మూడు రోజుల్నుంచి తిండితిప్పలు లేకుండా మొండి పట్టుదలతో వున్న భార్యను చూస్తుంటే ఆయనకు కోపం, బాధ సమపాళ్లలో పుట్టుకొచ్చాయి- "పార్వతీ, ఇదేం బావుండలేదు! ఈ విషయం ఎవరికైనా తెలిస్తే నవ్వుకుంటారు... లేచి భోజనం చెయ్యి! నన్ను బాధపెట్టకు!!" అన్నారు.

పార్వతమ్మ మాట్లాడకుండా భర్తవైపు క్రోధంగా చూశారు.

"మన సమస్య నెమ్మదిమీద పరిష్కరించు కుందామని ఎన్నిసార్లు చెప్పినా నీకు అర్థం గాకుండా వుంధి... లక్ష్యం లేకుండా వుంది. ఇలా అన్నం తినడంమాని నన్నెందుకు హింసిస్తావు? నామీద ఏపాటి గౌరవంవున్నా లేచి భోజనంచెయ్యి!" అన్నారు అనునయంగా పుండరీకాక్షయ్య.

"అదే నేనూ అడుగుతున్నాను. నామాటమీదా... నా మీదా మీకేమాత్రమైనా ప్రేమ వుందా? ఇంతకాలంగా మీ కష్టసుఖాల్లో పాలువంచుకుంటున్న నాకు మీరిచ్చే గౌరవం ఇదేనా?? లేదండి. నామీద మీకు ప్రేమ, గౌరవం ఎంతమాత్రంలేదు... వుంటే నేను చెప్పినట్టూ వినివుండేవారు..."

వదినా! వదినా! వైఢూర్యమా!!

"ఎందుకలా నన్ను నీవు కించపర్చుతుంటావు పార్వతీ!.... ఆ అమ్మాయి వాడికెంతగానో నచ్చిందనీ, వాళ్లిద్దరికీ ఈడూ జోడూ బాగుంటుందనీ- అందుకే కట్నం తక్కువైనా వాళ్లకు మాటిచ్చానని ఇప్పటికెన్నోసార్లు చెప్పాను... మళ్లీ చెబుతున్నాను- అంతేతప్ప నీ మాట కాదనాలని కాదు. రామం ఇంకా చిన్నవాడుకాదు గనుక వాడి ఇష్టాన్నిబట్టి ప్రవర్తించడం మనవిధి!"

"మీరు లక్షసార్లు చెప్పండి... నాకా సంబంధం ఇష్టంలేదు. అల్లుడంటూ వెళ్తే పట్టుమని పది రోజులు ఆదరించలేని ఆ సంబంధం మనకొద్దు. వాడికేం తక్కువని ముష్టి పదివేలకా సంబంధం చేద్దామనుకుంటున్నారు?... వెనకా ముందూ లేనివాళ్లకు- ఏ ఉద్యోగం లేనివాళ్లకు వేలకు వేలు కట్నంతో పెళ్లిళ్లు జరుగుతుంటే- వాడేదో అన్నాడని మీరా మాటకు వంతపలకడానికి, విలువనివ్వడానికి నేనొప్పుకోను. కాదని ఆ సంబంధమే చేస్తారా నేను చావడం ఖాయం!"...

ఆమె మాటల్లో తీవ్రమైన పట్టుదల;డబ్బుపై వ్యామోహం; నా కొడుకింత కట్నం తెచ్చుకున్నాడని నలుగురికీ గొప్ప చెప్పుకోవాలన్న తహతహ సుస్పష్టంగా వ్యక్తమవుతున్నట్టు గ్రహించారు పుండరీకాక్షయ్య కట్నాలింతిలా విజృంభించడానికి ముఖ్యంగా తన భార్యలాంటి వాళ్లే కారణమని ఆయన కనిపించింది. తన తల్లి తండ్రులు కేవలం అయిదువందలు ఇచ్చి- తనతో పెళ్లి జరిపించిన విషయం ఆమె విస్మరించడం ఆయనకెంతో బాధ కలిగించింది.


"సరే, నన్నిప్పుడేం చెయ్యమంటావు పార్వతీ! ఏం చేస్తే నువ్వు భోజనం చెయ్యదల్చుకున్నావు?" కొన్ని క్షణాల తర్వాత అడిగారాయన.

"మా రామం ఇంతలో పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేడని ఆ రామనాథంగారికి ఉత్తరం వ్రాసెయ్యండి... మొన్నొచ్చిన సంబంధం మనం ఖాయం చేసుకుందాం!"

"అంటే నా మాట విలువపోయినా నీ పట్టుదల నెరవేరాలన్నమాట... నీకు డబ్బు కావాలన్నమాట... సరే, కాస్సేపట్లో రామం భోజనానికొస్తాడుగా- వాడితో ఒక్క మాట చెప్పి నీ కోరిక ప్రకారం చేద్దాం... నువ్వు భోజనం చెయ్యి!" అన్నారు మనసులోనే మథనపడుతూ పుండరీకాక్షయ్య.

"వాడికి చెప్పడమేమిటి... అసలు వాడిష్టమేమిటీ? అని? వాడి మంచి, చెడ్డలు మనకు తెలియవనా?... మాట మాట్లాడితే అందం.... అందం అంటాడు. వెధవ!... అందం కొరుక్కు





తింటాడో ఏమిటో? వాడొచ్చిందాకా ఆగాల్సిన పనిలేదు. ఇప్పుడే ఉత్తరం వ్రాసెయ్యండి మీరు!" అంత నీరసంలోనూ ఆవేశంతో ఎగిరి పడ్డారు పార్వతమ్మ.

ఏదో చెప్పాలనుకున్న రాజ్యలక్ష్మి, శిరిష ఆమె ఆవేశం చూసి- తమ మీద విరుచుకుపడుతుందని మౌనంగా వుండిపోయారు

"అమ్మా శిరిషా! నా డ్రాయరులో కవరుంటుందిలా తీసుకురా!" తను ఓడిపోయినట్టు తలదించుకొని అన్నారు పుండరీకాక్షయ్య.

శిరిష కవరు, పెన్నూ తీసుకొచ్చి పుండరీకాక్షయ్యగారి కిచ్చింది.

ఆయన ఉత్తరం వ్రాయడాని కుపక్రమిస్తుంటే- బయట నుంచి పోస్ట్‌మేన్ పిలుపు వినిపించింది. రాజ్యలక్ష్మి వెళ్ళి పోస్ట్‌మేన్ ఇచ్చిన కవరందుకొనివచ్చి-

"ఈ ఉత్తరం మీకేనాన్నా!" అంది పై అడ్రసు చూస్తూనే.

'ఎక్కడ్నుంచా!' అనుకుంటూ కవరు చించారాయన. అది రాజ్యలక్ష్మికి కాబోయే మామ- సర్వారాయుడుగారు రంగపట్నం నుంచి వ్రాశారు

"పుండరీకాక్షయ్యగార్కి నమస్కృతులు...

కొన్ని కారణాలవల్ల మావాడు మీ సంబంధంపట్ల అయిష్టత చూపుతున్నాడు. అదీగాక ఇంకా నాలుగైదు సంవత్సరాల వరకూ వాడు పెళ్ళి చేసుకోడట.. సంబంధం కుదిరాక ఇలా చెయ్యకూడదని ఎంత చెప్పినా వాడు వినిపించుకోవడంలేదు. ఇప్పటికే నచ్చజెప్పి విసిగిపోయాం గనక మీరిక రావడం అనవసరం జరిగినదానికి మిక్కిలి చింతిస్తున్నాం .

ఇట్లు-సర్వారాయుడు"

-ఉత్తరం చదవడం పూర్తి చేసిన పుండరీకాక్షయ్యగారికి మతిపోయినంత పనైంది. ఆయన విషయమేమిటో చెప్పకుండా మౌనంగా వుండిపోవడంతో- "ఎక్కడ్నుంచా ఉత్తరం?" అన్నారు వుండబట్టలేని పార్వతమ్మ.

"నువ్వే చదువు!" అని ఆ ఉత్తరాన్నామెకందించారు పుండరీకాక్షయ్య.

"ఏమండీ, ఏమిటిది? శ్రావణంలో పెళ్ళి చేయడానికి సిద్ధంగా మనముంటే ఈ ఉత్తరం ఏమిటి?" ఉత్తరం చదువుతూనే దిగ్భ్రాంతితో లేచికూర్చొని, అడిగారు పార్వతమ్మ, ఆమెకు దుఃఖం ఎగదన్నుకొస్తోంది.

పుండరీకాక్షయ్య మాట్లాడలేదు. ఆయనకేం పాలుపోవడంలేదు... అంతా అగమ్య గోచరమై పోయింది.

"శిరిషా ఏమిటమ్మా ఇది? ఈ సర్వారాయుడుగారు మీ బంధువని- వీళ్ళ సంబంధం చేసుకోడానికి సిద్ధపడితే అన్నీ అయ్యాక ఈ రాతలేమిటి?" అన్నారు పార్వతమ్మ.

శిరిష అత్తగారి చేతిలోని ఉత్తరం తీసుకొని చదివేటంతలో- బుచ్చిబాబు, ఆ వెనకే రామం వచ్చారు- "శిరిషా, నేను కేంపు కెళ్ళాలి తొందరగా భోజనం వడ్డించు!" లోపలికొస్తూనే అని- అక్కడంతా విచారవదనాలతో వుండటం గమనించి, "ఏమైంది?" అన్నాడు అనుమానంగా బుచ్చిబాబు. పరిస్థితేమిటో తెలియని రామం కూడా అందరి మొహాల్లోకి గుచ్చి గుచ్చి చూడసాగాడు.

సమాధానంగా వాళ్ళకు ఉత్తరం అందించింది. శిరిష. అది చదవగానే కోపోద్రిక్తుడైన బుచ్చిబాబు, "ఆడపిల్ల జీవితంతో ఆటలాడాలనుకుంటున్నారా? .. వీళ్ళకు తగిన శాస్తి చెయ్యాలి!" అన్నాడు.

"అదేదో శిరిషా, నువ్వూ వెళ్ళి తెలుసుకురండి. ఎంత పరువుతక్కువ?. . ఏ ఉరేసుకునే చావాలితప్ప మళ్ళీ వీధిలో తలెత్తుకోగలమా?" అన్నారు బాధగా పార్వతమ్మ.

"ఎందుకు తలెత్తుకోలేం పార్వతీ! మనం విసిరిన రాయి తిరిగొచ్చి మనకే తగిలినట్టు- ఇప్పుడు మనం చెయ్యాలనుకుంటున్నామో అది వాళ్ళు చేసి చూపించారు. ఇందులో తప్పేముంది? ఇక రాజ్యలక్ష్మికింతలో పెళ్ళి జరగడం కల్ల' నీ కోరిక ప్రకారం ఆ శంకవరం వాళ్ళకు ఉత్తరం వ్రాసేస్తున్నాను. ఇక ఏం చెయ్యదల్చుకున్నావో- వీళ్ళకు పెళ్ళిళ్ళు ఎలా చెయ్యదల్చుకున్నావో అంతా నీ ఇష్టం!"... అంటూ ఉత్తరం రాయడాని కుద్యుక్తులయ్యారు పుండరీకాక్షయ్య.

"ఒద్దండీ.. మీరా ఉత్తరం రాయొద్దు నేనొక ఆడపిల్లకు అపకారం తలపెట్టినందుకే దేవుడు నన్నిలా శిక్షించ దల్చుకున్నాడేమో!?... మీరా ప్రయత్నం మాని- మీ ఇష్ట ప్రకారం- రామం అభీష్టం ప్రకారమే చెయ్యండి... ముందీ సర్వారాయుడుగారి సంగతేమిటో తేల్చండి! రాజ్యానికి అన్యాయం జరక్కుండా చూడండి!" అన్నారు, కనులవెంట నీళ్ళు జలజల రాలుతూంటే పార్వతమ్మ

అసలు జరిగినదేమిటో అప్పటికి అర్థమైంది బుచ్చిబాబుకు, రామానికి.

"ఎలా నాన్నా! నేను కేంపు కెళ్ళడం తప్పనిసరి.. మీరు, శిరిష వెళ్ళి ఇదేమిటో తెలుసుకోండి. పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తే మర్యాద దక్కదని చెప్పండి!" అన్నాడు ఆవేశంగా బుచ్చిబాబు.

"నా కలాంటివాళ్ళతో మాట్లాడ్డమే అసహ్యం! శిరిషకు వాళ్ళు బాగా తెలుసు గనక ముందు శిరిషను, రామాన్ని పంపి; మీ మామగారిచేత; శిరిషచేత మర్యాదగా అడిగిద్దాం... వాళ్ళేమైనా అడ్డదిడ్డంగా మాట్లాడితే అప్పుడు నలుగురి పెద్దల్నీ తీసుకొని మనం వెళదాం!" అన్నారు పుండరీకాక్షయ్య.

"ఔనమ్మా శిరిషా! ఇప్పుడు రాజ్యలక్ష్మి బ్రతుకు నీ చేతుల్లో వుంది. రామాన్ని తీసుకొని నువ్విప్పుడే బయల్దేరు. వాళ్ళ కెలా గుణపాఠం చెప్పాలో చెప్పి ఈ ఘోరం జరక్కుండా ఆపు!.... మన పరువు మంట గలవకుండా చూడు!"

మెగ్నీషియమ్ లోపం వల్ల విష సంబంధమైన రోగ లక్షణాలు!

అమెరికాలో 1970 వ సంవత్సర తుది రోజులలో భయాందోళనలు కలిగించే విష సంబంధమైన రోగ లక్షణాలు (టాక్సిక్ షాక్ సింద్రోమ్) కనిపించాయి. 1980 లో ఈ జబ్బు తీవ్ర రూపం దాల్చింది. 890 మందికి ఈ రోగం సోకినట్లు తెలుస్తున్నది. వీరిలో ఎక్కువ మంది ఋతుస్రావం అయ్యే స్త్రీలైనప్పటికీ బాలలు, పురుషులు కూడా ఉన్నారు. ఈ జబ్బు కొన్ని గంటల్లోనే విజృంభిస్తుంది. మొదట జ్వరం, తల తిరగటం లక్షణాలతో ప్రారంభమై విరాకు, వంటిపై దద్దుర్లతో రక్తపుపోటు బాగా పడిపోయి ఆఖరికి రోగిని స్పృహ కోల్పోయే స్థితికి తెస్తుంది. ఈ రోగుల్లో 4 శాతం మందికి మరణం సంభవించినట్లు ఋజువైంది. ఋతుస్రావ సమయంలో స్త్రీలు వాడేటటువంటి వస్త్ర సంబంధమైన సాధనాలే (టేంపన్స్) ఈ రోగానికి కారణం అని శాస్త్రవేత్తలు అన్నారు కానీ ఇందుకు గల కారణాలు నిగూఢంగానే ఉన్నాయి. గతవారం హార్వర్డ్ విజ్ఞానవేత్తలు ఆఖరికి ఒక వివరణ ఇచ్చారు.

సాధారణంగా హానికరం కానటువంటి స్టెఫిలో కొకస్ ఆరియస్ అనే ఒక బాక్టీరియా ఉత్పత్తి చేసే విషప్రభావం వల్ల ఈ టాక్సిక్ షాక్ సింద్రోమ్ (టి. ఎస్. ఎస్.) జబ్బు వస్తోందని అనేక సంవత్సరాల నుంచి పరిశోధకులకు తెలుసు. పాలిస్టర్ ఫోమ్, పాలీ అక్రిలేట్ రేయాన్ దారాలతో తయారయిన టేంపన్లు వాడే సమయంలో ఈ బాక్టీరియా ఇరవై రెట్లు అధికంగా విష ప్రభావం గల పదార్థాన్ని ఉత్పత్తి చేస్తాయని అంటురోగ చికిత్సా నిపుణుడైన ఎడ్వార్డ్ కాస్ ఆధ్వర్యంలో పరిశోధనాశాలలో పరిశోధిస్తున్న హార్వర్డ్ బృందం కనుగొన్నారు. ఎందుకంటే స్త్రీ యోని స్నాయువులలో, ద్రవాలలో ఉండే మెగ్నీషియమ్‌ని ఈ పాలిస్టర్ రేయాన్ దారాలు ఎక్కువగా పీల్చి వేస్తాయి. ఎప్పుడైతే మెగ్నీషియం వేరు చేయబడిందో అప్పుడే ఈ సూక్ష్మజీవులు ఎక్కువ మోతాదులో విష సంబంధమైన పదార్థాన్ని వెలువరిస్తాయి. కాస్ అంతకు ముందు డిఫ్తీరియా పై చేసిన పరిశోధనలో కూడా మెగ్నీషియంకు సంబంధించిన ఒక ముఖ్యమైన ఆధారం దొరికింది. అది కూడా బాక్టీరియా వెలువరించే విషపదార్థానికి సంబంధించినదే. ఇనుము ధాతు హీనత ఏర్పడినప్పుడు డిఫ్తీరియా వ్యాధిని కలుగజేసే క్రిములు విషపదార్థాన్ని అధిక పాళ్లలో ఉత్పత్తి చేస్తాయని ఆయన అన్నారు. మీ మెదడుకి కొంచం పదును పెడితే అసలు విషయం బోధ పడుతుందన్నారాయన. కాస్, అతని బృందం స్టాఫ్ ఆరియస్‌తో సమానంగా మెగ్నీషియం పాత్ర వహిస్తుందని కనుగొన్నారు.

మహిళలలో ఋతుస్రావం అయిన నాలుగవ రోజే అనగా ఋతుస్రావం నిలిచిపోయిన తరువాత ఈ టి. ఎస్. ఎస్. వ్యాధి ఎందుకు సోకుతోంది అన్నదానికి ఈ మెగ్నీషియం సంబంధం చక్కగా విశదీకరించడానికి ఉపయోగపడుతుంది. ఋతుస్రావం అయిన మొదటి రోజులలో అధిక స్రావం ఉండటం వల్ల కొంత టేంపన్లు పీల్చుకున్నప్పటికీ కొంత మెగ్నీషియం టేంపన్లచే పీల్చుకొనకుండా ఉన్నందు వల్ల విష ప్రభావం గల పదార్థ ఉత్పత్తి అదుపులో ఉంటుందని ఎడ్వర్డ్ కాస్ అభిప్రాయ పడ్డారు.

ఈ టి. ఎస్. ఎస్. అమితంగా భయాందోళనలు కలుగజేసినప్పటికీ దీనివల్ల దెబ్బతిన్న వాళ్ళు కొద్ది మంది మాత్రమే. అమెరికాలో ఇరవై ఏళ్ళు వచ్చేటప్పటికి 95 శాతం మంది స్టెఫి ఆరియస్ విష ప్రభావానికి గురికాబడి తట్టుకోగల శక్తిని సంపాదించుకుంటారని, మిగిలిన 5 శాతం జన్యుశాస్త్ర రీత్యా తట్టుకోగల శక్తిని వృద్ధి చేసుకోవడంలో విఫలులవుతారని డాక్టర్లు అంచనా వేశారు. ఈ 5 శాతం స్త్రీ, పురుషులు, టి. ఎస్. ఎస్. వచ్చిన వారి కన్నా ఎక్కువ బాధ పడతారు. దీనిని యాంటి బయాటిక్స్‌తో నివారణ చేయవచ్చు.

పాలిక్రియలేట్ రేయాన్ దారాలతో తయారు చేసే టేంపన్ల స్థానంలో తక్కువగా పీల్చుకునే పద్ధతిలో హానికరం కానటువంటి టేంపన్ల ఉత్పత్తి చేయాలని హార్వర్డ్ పరిశోధనలు ఇప్పటికే ప్లేటెక్స్ టేంపెక్స్ టేంపన్ల తయారీదారులకు సూచించాయి.

పాలిస్టర్‌తో టేంపన్ల తయారు చేసే ఒకే ఒక సంస్థ ప్రోక్టర్ అండ్ గాంబెల్స్ 1980 లో నిలిపివేయబడిన తరువాత టి. ఎస్. ఎస్. జబ్బు రేటు పడిపోయింది. టేంపెక్స్ తయారీ దారుడైన టాంబ్రాండ్స్ ఆధ్వర్యంలో జరుపుతున్న తన పరిశోధన సురక్షితమైన టేంపన్ల ఉత్పత్తికి తయారీదారులకు సహాయపడుతుందని 'కాస్' ఆశాభావంతో ఉన్నారు.

(టైమ్ ఆధారంగా)

వదినా! వదినా! వైఢూర్యమా!!

అన్నారు వణుకుతున్న కంఠంతో పార్వతమ్మ.

"వదినా, నువ్వేం చేసుకొస్తావో?.... ఈ ఉత్తరమే వాళ్ళ నిర్ణయమైతే నేను బ్రతకడం అనవసరం!" అంది మనసులోనే కుమిలిపోతూ రాజ్యలక్ష్మి.

ఇంటిల్లిపాదీ భారమంతా శిరీషమీదనే వేశారు. బుచ్చిబాబు భోజనం చేసి, చెల్లెలి పెళ్ళి విషయమై శిరీషనోమారు హెచ్చరించి, కేంపు కెళ్ళడం తప్పని సరవడంవల్ల బాధ పడుతూ వెళ్ళిపోయాడు.

మరో అరగంట తర్వాత రామంతో బాటు రంగపట్నం వెళ్ళడానికి బస్‌స్టాండ్ కొచ్చింది శిరీష - బస్సు ఇంకా ప్లాట్‌ఫామ్ మీదకి రాలేదు.

"వదినా! మనం రంగపట్నం వెళ్ళొచ్చాక ఏం చెబుదామని నీ ఉద్దేశ్యం?" శిరీష నడిగాడు రామం.

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావు?" తిరిగి అడిగింది శిరీష.

"ఏమో వదినా! నాకేం తెలియడం లేదు...."

"అందంగా వుంది. ఆ శంఖవరం రామనాథంగా రమ్మాయే నా క్కావాలి వదినా అని నన్ను చంపడం తెలుసు కాబోలు...." అని చిన్నగా నవ్వి- "అసలు వాళ్ళా ఉత్తరమే వ్రాయలేదట. కిట్టని వాళ్ళెవరైనా అలా కల్పించి వ్రాశారేమోనని సర్వారాయుడుగా రన్నారని చెబుదాం!" అంది శిరీష.

"నువ్వు వాళ్ళకు ఇలా ఉత్తరం వ్రాయమని వ్రాశావు - బాగానే వుంది. ఈ ఉత్తరంచూసి మనం కాకుండా అన్నయ్యో - నాన్నో వెళ్ళారనుకో అక్కడికి. అప్పుడేమంటావ్ వదినా?"

"ఏమవుతుంది - ఏమీ కాదు. ఎవరొచ్చి అడిగినా ఆ ఉత్తరం తాము వ్రాయలేదని, తమ కెలాంటి దురుద్దేశ్యంలేదని చెప్పమని నేను వాళ్ళకు ముందే వ్రాశానుగా!" అంది నవ్వుతూ శిరీష.

"మంచి పథకం వేసి, అమ్మను మార్చి, నేను కోరుకున్న అమ్మాయిని పొందగలిగేలా చేసిన వదినా! నా వదినా! నిజంగా నువ్వు వైఢూర్యానివి!!" అన్నాడు ఆనందాతిరేకంతో రామం.

"వైఢూర్యాన్నో - వజ్రాన్నో గాని రామం - నువ్వు కోరుకున్న అమ్మాయి కోసం.... అత్తయ్యలో మార్పుకోసం; సర్వారాయుడుగారి చేతిలా ఉత్తరం వ్రాయించి అందరికీ మనస్తాపం కలిగించినందుకు నాకెంతో బాధగా వుంది..." అని శిరీష అంటూండగానే ప్లాట్‌ఫామ్ మీదికి బసొచ్చింది.

(ఈ కథ పేరుతో ఓ కథ వ్రాయమన్న చిన్నికి, ప్రియమిత్రులు శ్రీకంఠస్ఫూర్తికి కృతజ్ఞతలు) □

మీ పాప, పుట్టిన 6 గంటల తర్వాత మీ నుంచి 'నివారక ఆహారం' పొందుతుంది. దాన్ని యిచ్చేది మీరే యుగయుగాలుగా తల్లి యొక్క స్వాభావిక సంస్కారం యిది.



తల్లి పాలు ప్రకృతి యిచ్చే మహత్వపూర్ణమైన వరం!

ఎందుకంటే పాప పుట్టకతోనే తల్లి స్తనాలలో పాలు వస్తాయి. మరి వాటిలో ప్రాకృతికమైన రూపంలో "రోగ నిరోధక ద్రవ్యాలు" ఉంటాయి. దాంతో, అప్పుడే పుట్టిన పాపయొక్క అమాశయం, పేగుల్లోనివీ, యితర వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. అందుకే స్తన్యపానానికి అంత ప్రాముఖ్యత యివ్వబడింది.

స్వాభావికమైన పోషణ

శరీర నిర్మాణంకోసం ప్రకృతిలోని ప్రోటీన్లు, శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లూ, ఆరోగ్యాన్ని కాపాడే విటమిన్లూ సరియైన మోతాదులో ఉంది. తల్లి పాలను సరిగ్గా సంతులితంగా కూడా తయారుచేస్తాయి— అప్పుడే పుట్టిన పాపకది సరియైన పోషణనిచ్చే ఆదర్శమైన ఆహారం అవడంకోసం (ఉదాహరణకి, స్తన్యపానం చేసే పాపలకు విటమిన్ సి లోపంవల్ల వచ్చే స్కర్వీ వ్యాధి రాదు సాధారణంగా) మరి తల్లి పాలు తాగిన పాప ఎలా పెరిగి, సెరుగుతాదో చూడండి! ఇక మీరు మీ పాపను గుండెలకి హత్తుకుని పాలిస్తూంటే ఎంత ఆనందాన్ని పొందుతారని! మరి ఆ పసికందు యింత పెద్ద లోకంలో కేవలం మీ మమతను పొంది ఎంత సురక్షితంగా వున్నట్టి అనుభవాన్ని పొందుతారని!

ప్రపంచమంతా ప్రచలితం

ఇప్పుడు రోజుకి రోజూ, ప్రపంచమంతటా ఎక్కువ మంది తల్లులు, అంటే పశ్చిమ దేశాలలో సహితం, తల్లులు తమ పాలే యివ్వడం మొదలెట్టారు. ఎందుకంటే, తల్లి పాలలోని అమూల్య పోషక తత్వాల మహత్తర లక్షణాన్ని మళ్ళా అవగాహన చేసుకోవడం మొదలెట్టారు.

తప్పకపోతే

మరి మీరేగనక యిక ఏ కారణం వల్లనైనా తప్పకపోతే, మీ పాపకు మీ పాలు యివ్వలేకపోతే— అంటే మీ ఆరోగ్యం సరిగా లేకనో, లేదా మీలో, సరిపడినన్ని పాలు పడకో, అలా జరిగినప్పుడేం చెయ్యాలి మీరు? అటువంటి సందర్భంలో మీరు ఎంతో ఆలోచించిన మీదట, ఎటువంటి ఎటువంటి ఆహారం యివ్వాలంటే, ఆ యిచ్చేది తల్లి పాల తర్వాత అన్నింటికన్న ఉత్తమమైనదిగా ఎంచుకునేదాన్ని.

స్ప్రే డ్రయిడ్ అమూల్ స్ప్రే

అమూల్‌స్ప్రే. పుష్టినిచ్చే దృష్టితో చూస్తే మహత్తరంగా సంతులితమైన ఆహారం. ఎందుకంటే దీనో చాలా ఎక్కువైన తీరులో ప్రోటీన్లు, దాంతోబాటే, తేలికగా అరగగలిగే కార్బోహైడ్రేట్లు, సరియైన సంతులిత రూపంలో ఆవశ్యకమైన విటమిన్లూ, ఖనిజ పదార్థాలు ఉన్నాయి. ఇది అంతకు ముందే మరగబెట్టిన నీటిలో టక్కున కరిగిపోతుంది. మొదటిగానే పేస్ట్‌లా తయారు చేయవలసిన అవసరం ఉండదు.

పొదుపు

అమూల్‌స్ప్రే. దబ్బాలలో దొరికే శిశుఆహారాన్నిటికన్న పొదుపైనది. ఎందుకంటే యిది ఆధునికమైన పాల సంఘం యొక్క ఉత్పాదన— "శ్వేత విప్లవం" తీసుకురావడంలో అందరికన్న ముందడుగు వేసారు.

జాగ్రత్త పడటం

పాప ఆహారానికి ఉపయోగించే అన్ని వస్తువుల్ని, సీసాని, ఎప్పుడూ ఆరోగ్యరీత్యా బాగా శుభ్రంగా కడిగి నీటిలో మరగబెట్టాలి. పాప ఆహారాన్ని తయారు చేయడానికి కూడా మరిగిన నీటినే వాడండి. పాప సరియైన పోషణకోసం, దబ్బాపైన యివ్వబడిన అమూల్‌స్ప్రే మోతాదుం ప్రకారమే ఖచ్చితంగా పాప ఆహారాన్ని తయారు చెయ్యండి.

ఉచితం! ఉపయోగకరమైన విషయాలు యీ అధ్యాయాల్లో ఉన్నాయి అవి- గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త, ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు, మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట, పిల్లవాని దిన చర్య, పిల్లవాని అభివృద్ధి, టీకాలు అరికట్టుట, ప్రథమ చికిత్స, సాధారణ రోగములు, జబ్బుతోనున్న పిల్లవాని సంరక్షణ, జ్ఞాపక ముంచుకోవలసిన విషయములు. ఈ పుస్తకం తెలుగు, ఇంగ్లీషు, హిందీ తమిళం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషల్లో దొరుకుతుంది. దాదిగోనం పోస్ట్ బాక్స్ 10124, బొంబాయి 400 001 అడ్రసుకు మీ పేరూ, పూర్తి అడ్రసు యిస్తూ రు. 1.25 స్టాంపుల్ని జతపర్చండి.



అమూల్‌స్ప్రే


తల్లిపాల తరవాతనే ఇది

అమ్మకం చేయించువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్,
పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001, గుజరాత్.

ASP/AS-TEL5/83

గేటు తీసుకుని లోపలికి అడుగెట్టిన మాధవ్ కాళ్ళు వణకసాగాయి శబ్దమవకుండా గేటు గడియవేసి పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటు తలుపుదాకా వచ్చాడు. బెల్ నొక్కాలని ఎత్తిన చేతివేళ్ళు స్వాధీనం తప్పి వణకసాగాయి. ఎంత కూడదీసుకున్నా ధైర్యం చాలటం లేదు

"నువ్వు చేసింది చాలా తప్పు. నిన్ను ఎవ్వరు క్షమించరు!" అని అతని మనస్సే అతన్ని భయపెడుతోంది. దాంతో ఇంతదాకా వున్న ధైర్యం కూడా ఎగిరి పోయింది. గుండె దడ, దడ లాడింది. మనోనిబ్బరం సడలి తలుపు బైటే నిలబడి పోయాడు మనస్సు వ్యాకులమై పోయింది. వేదనా జ్వాలలు ప్రజ్వరిల్లాయి అంతరంగ సాగర మధనం ప్రారంభమయింది. గతంలో జరిగిన వాటికి జవాబుగా జరగబోయేవి తల్చుకున్నాడు.



"నాలో మార్పొచ్చింది. కన్ను తెరుచుకున్నాను, నాకు బుద్ధొచ్చింది" అనుకుంటూ మళ్ళీ బెల్ నొక్కబోయాడు.

"ఏయ్! అబద్ధం! దెబ్బ తిన్నాకా మార్పొచ్చింది, తన్ని తరిమేకా కన్ను తెరుచుకున్నావు. నిర్లక్ష్యంతో నిన్ను చిదరించుకున్నాకా బుద్ధి తెచ్చుకున్నావు. సిగ్గు లేదూ? మళ్ళీ క్షమార్పణ అడగడానికి స్వార్థంతో వెతుక్కుంటూ వచ్చావు. అహంతో ఆనాడు నువ్వు తూలనాడిన వ్యక్తి వద్దకే వచ్చావు. అవమాన పర్చి, కొట్టి, తరిమేసిన మనికి కాళ్ళు పట్టుకోడానికే స్వార్థంతో వచ్చావు. పాపం!అందుకు ఏమన్నా పడడానికి సిద్ధంగా వుందు. తిట్టినా, దూషించినా, ఆఖరికి కొట్టినా కూడా నోరెత్తకుండా పడు. ఇప్పుడు,ఆ అహాన్ని చంపుకుని మళ్ళీ ఆ ఇంటి గుమ్మంలోకే అర్థించడానికి వచ్చావు. ఇన్నేళ్ళూ లేని ప్రేమ ఈనాడు ఒక్కసారిగా పొంగు కొచ్చిందా? నీ ఇల్లు దాటేకా ఎన్నిపాట్లు పడుంటుందో! అని ఆలోచించావా? పౌరుషంతో నిన్ను లెక్క చెయ్యకుండా వచ్చేసి తన బ్రతుకు తాను బ్రతుకుతోంది. నీలో చీమూ, రక్తం వుంటే వెనక్కి ఫో- లేదా, ఏమన్నా సహించి నోరుమూసుకో. ఇంకా సమర్థించుకోకు '

"మనస్సు అంటున్నది రైటే'

ఆనాడు. "అయితే నన్నెందుకు మోసగించారు? నా బ్రతుకెందు కిలా గంగపాలు చెసారు? నన్ను మిరు చేసుకోకపోతె నాకు పెళ్ళే అవదను కున్నారా?" జవాబుగా వర్ధని చెంప ఛెళ్ళుమంది

చేత్తో చెంపని రాసుకుంటు నీళ్ళు నిండిన కళ్ళతో మాధవ్ వైపు చూసింది ఆ చూపులో బాధకన్నా అసహ్యం, చీత్కారం కొట్టొచ్చినట్టు కనపడింది

ఈనాడు: తలుపు తెరిచి "ఎందు కొచ్చావ్ మళ్ళీ ఈ గుమ్మంలోకి? నీకు సిగ్గూ, లజ్జా లేదు! ఛో బైటికి- మళ్ళీ వచ్చావంటే చూస్కో-

"వర్ధనీ! ప్లీజ్ ఒక్క మాట '

బదులుగా చెంప చెళ్ళు మం(టుం)ది.

చెంప తడుముకున్నాడు

"వర్ధనీ! ఒక్కమాట వినవూ?" అంటు లోని కడుగెట్టబోయిన తన్ని 'గెటవుట్ రాస్కెల్! ఆనాడు నన్నిలాగే గౌరవించావు. మళ్ళీ నీది నీకు అప్పగించే అవకాశం యిచ్చావు." అంటూ నుదుటికి తగిలేలా తలుపు లేసుకుని వెళ్ళిపోతుంది.

"నిజమే! ఇప్పుడు తలుపు తట్టితే తప్పకుండా వర్ధని ఇంతే చేస్తుంది. చేసినా తప్పేముంది?"

ఫారిన్‌లో వున్న ఇంజినీర్ కొడుకుని పెళ్ళిళ్ళ మార్కెట్‌లో పెట్టి కొన్ని వేలకి అమ్మి ఆనందించారు మాధవ్ తల్లి తండ్రి. తనేం చేసాడు? అంతకు ముందే ఇంకో అమెరికన్ లేడీని పెళ్ళాడి ఓ బిడ్డకి తండ్రి అయ్యాడు ఆ మోజు తీరకముందే, తల్లి తండ్రుల మోజు, ముచ్చట్లకోసం బుద్ధిగా వర్ధని మెడలో పుస్తె కట్టేడు

వర్ధని అందగత్తె కాదు. తనకామె అందంతో నిమిత్తం లేదు. అందుకే మీకు నచ్చితే నాకేం అభ్యంతరం లే"దని వ్రాసిన ఉత్తరం చూసి కొడుకు బుద్ధికి పొంగిపోతూ తమకి కట్నం నచ్చిన వర్ధనిని కుదిర్చి వివాహం జరిపించారు తల్లిలేని వర్ధని బాధ్యతని తండ్రి ఓ యాభై వేలతో వదుల్చుకుని తన రెండో భార్యతో ఆనందంగా గడపసాగాడు.

అమెరికాకి తీసికెళ్ళిన వర్ధనిని తిన్నగా తన ఫ్లేట్‌కే తీసుకెళ్ళాడు ఆ యింట్లోనే పక్క గదిలో కొడుకుతో వుంటున్న ఒకామెని "నా ఫ్రెండ్ రీటా" అని పరిచయం చేసాడు. దిగిన దగ్గర నుంచి ఆమె తన భర్తతో అతి చనువుగా వుండడం, తన వంటింట్లోనే అన్ని పన్లు చెసుకోడం వర్ధనికి కొంచెం అనుమానంగానే వుంది. విదేశీయుల పద్ధతంతేనేమో! అని సరిపెట్టుకోజూసింది.

అర్ధరాత్రి ఏవో మాటలు వినపడటంతో వర్ధని లేచి కూర్చుంది. పక్కన భర్త లేడు. ఆ మాటలు రీటా గదిలోంచి లేచి వెళ్ళింది. తలుపులు ఓరగా వేసి వున్నాయి సభ్యతని మర్చిపోయి వెళ్ళి చూసింది. చూడకూడని దృశ్యమే కళ్ళబడింది "అయితే తన అనుమానం నిజమేనన్న మాట! వీళ్ళిద్దరి మధ్య ఈ సంబంధం ఎన్నాళ్ళ నుంచి వుందో? మరి నన్నెందుకు పెళ్ళి చేసుకున్నాడు?" వేదనా జ్వాలలు శరీరమంతా రగుల్కొన్నాయి శరీరంలోని రక్తం వుడకసాగింది. ఇక ఆలోచించ లేకపోయింది కళ్ళు తిరిగిపోతున్నాయి ఆవేశం తన్నుకొచ్చింది కోపం పట్టలేకపోతోంది విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయి భళ్ళున తలుపుల్ని తోసింది. అనుకోని ఈ సంఘటనకి కంగారుగా ఇద్దరూ సర్దుకుని లేచారు. వర్ధని చీత్కారంగా వారిని చూసింది. మాధవ్ కళ్ళు చింతనిప్పులయ్యాయి తలుపు దగ్గరున్న వర్ధని దగ్గరకొచ్చాడు. "ఎందుకొచ్చావిక్కడికి?" అన్నాడు అరిచినట్టుగానే.

ఎవర్తిది?" అంది అసహ్యంగా వారి వైపు చూస్తు.

"నా మొదటి పెళ్ళాం – అదిగో వాడు నా కొడుకు! తెలిసిందా? ఇక బైటికి నడు." అన్నాడు.

"అయితే నన్నెందుకు పెళ్ళాడి ఇలా మోసగించారు? నా బ్రతుకిలా గంగపాలెందుకు చేసారు? మీరు చేసుకోకపోతే నాకు భర్తే దొరకడా?" అంది.

జవాబుగా వర్ధని చెంప ఛెళ్ళుమంది. వర్ధని రెక్క పుచ్చుకుని గదిలోకి ఈడ్చుకొచ్చి –"ఇదిగో వర్ధనీ అది నా పెళ్ళాం! నిన్నెందుకు చేసుకున్నానో చెప్తా విను – నా వాళ్ళు నన్నింతడి వాడిని చెయ్యడానికే చాలా అప్పు చేసారు అవి తీర్చడానికి. తరవాత ఇక్కడ పనివాళ్ళు చాలా కాస్ట్లీ కాబట్టి ఇంట్లో మాకు చాకిరి చెయ్యడానికి! లేకపోతె నీలాంటి కురూపిని పెళ్ళెవరు చేసుకుంటారనుకున్నావు?నో–

ఎదురు దెబ్బ

కందుకూరి వెంకట మహాలక్ష్మి



నీకూ పెళ్ళయిందని సంతోషించి, వెర్రివేషాలెయ్యక నోరు మూసుకుని పడుండు. అసలు ఈ విషయం ఎలా నీకు చెప్పడమా? అని ఆలోచిస్తున్నాను. ఆ శ్రమ లేకుండా నువ్వే తెలుసుకున్నావు. చాలా సంతోషం రేపటి నుంచి నీ పని మా ఇద్దరికి వంట చెయ్యడం, ఇల్లు చూసుకోవడం, ఆ పిల్లాడిని చూసుకోవడం – అంతే. నిన్ను తీసుకు రావడానికి ఇదే కారణం. తెలిసిందా? ఇంక పెద్దవ్వాగుడు వాగక, నోరెత్తకుండా చెప్పిట్లు చేస్తూ పడుండు. లేదా ఇండియాకి టిక్కట్టు కొనిస్తాను ఫో మీ ఇంటికి. నీ సవితి తల్లితో కులుకుతున్న నీ బాబు నిన్ను నెత్తి మీదెట్టుకుని పోషిస్తాడు" అంటూ ఒక్క తోపు తోసి, చెప్పుకాలితో ఒక్కతన్ను తన్ని బైట గడియపెట్టి మళ్ళీ రిటా గదిలోకి వెళ్ళిపోయాడు.

అదీ –వర్ధనికి అమెరికాలో దిగిన తొలిరాత్రి అనుభవం. "ఎంత ధైర్యం! ఎంత బరి తెగించాడు?" అనుకుంది.

గొప్ప సంబంధమని, పెద్ద వుద్యోగస్తుడని, అమెరికా కాపరమని అంతా తన అదృష్టాన్ని పొగిడేసారు. ఇదే ఆ అదృష్టం! ఇలాంటివి కథల్లో చదివింది, సినీమాల్లో చూసింది ఇప్పుడు తన నిజ జీవితంలో నే ఎదుర్కొటోంది.

రాత్రల్లా ఆలోచించింది ఒక నిర్ణయాని కొచ్చింది. మర్నాడు మామూలుగా లేచి తన పన్లు ముగించుకుంది. ఆఫీసు కెళ్తున్న మాధవ్ దగ్గర కొచ్చి నేను ఇండియాకి వెళ్ళిపోతాను టిక్కట్టు కావాలి" ముక్తసరిగ అంది.

"తప్పకుండా వెళ్ళు – బెదిరిస్తున్నావా? వెళ్ళు, వెళ్ళు! కానీ ఎన్నాళ్ళకేనా నేనే నీకు గతని మర్చిపోకు. నీ సవతి తల్లి దగ్గర నువ్వు చెయ్యవలసింది ఇదే చాకిరి. వాళ్ళు ఇంక భరించరు. వెళ్ళిన వెంటనే గెంటుతుంది అప్పుడు మళ్ళీ నా కాళ్ళ దగ్గరకే వస్తానని ఏడుస్తావు. బాగా పొగరెక్కి వున్నావు. ఆడదానికింత అహంభావం పనికిరాదు. నీ పొగరు అణిగ్గానే చచ్చినట్లు మళ్ళీ నా దగ్గరకే వస్తావు.

ఎదురుదెబ్బ

నన్ను ఎదిరించేది నా దగ్గరుండడానికి పనికి రాదు. నేను మగవాడిని నా ఇష్టం వచ్చినట్లు తిరుగుతాను. మళ్ళీ నా దగ్గరకి రాబోయే ముందు ఇవన్నీ ఆలోచించుకుని, చచ్చినట్లు పడుండే మాటైతేనే రా! తెలిసిందా? చూస్తాను నీ కెవరు దిక్కో!!వీలయినంత త్వరగా టిక్కట్టు తెప్పిస్తా" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చిన మాధవ్ వర్ధని ముందుకు ప్లేన్ టిక్కట్టు, ఓ చెక్కు విసిరాడు. "ఈ వెయ్యి రూపాయల చెక్కు ఢిల్లీ నుంచి మా ఊరు చెరడాని కనుకుంటా!" అనుకుని రెండూ తీసి జాగ్రత్త చేసుకుంది.


నెల్లాళ్ళ వివాహం జీవితాన్ని కూడా పొందకుండా తిరిగి భారత దేశానికి వెళ్ళిపోడానికి విమాన మెక్కిన వర్ధని మనస్సు బరువెక్కి, దుఃఖం పొంగు కొచ్చింది. "ఎంత మోసగాళ్ళీ మగవాళ్ళు!" అనుకుంది. "ఇక గతాన్ని తల్చుకుని బాధపడకోదదు. అవో శని రోజులు ముందు భవిష్యత్‌కి మంచి బాటేసుకోవాలి. అదో పిడకల– ఇకముందు పూలబాట' అనాదిగా ఆడవాళ్ళకి జరుగుతున్న అన్యాయమిదే. ఆడది మగవాడి చెప్పు కింద రాయి. తన చెప్పు చేతల్లో పడుండాలి. తాము ఎన్ని తప్పులు చేసినా ప్రశ్నించే హక్కు భార్యకి లేదు అనుకునే మదాంధుల మధ్య స్త్రీ జాతి నలిగిపోతోంది. దాంతో అనేక ఘోరాలు జరుగుతున్నాయి. పిరికిగా బ్రతికే ఆడవారి వల్లే ఈ అనర్థాలు జరుగుతున్నాయి. నాలాంటి ఓ పది మందైనా ఈ అన్యాయాన్ని ఎదుర్కొని, ఎదిరించి నిలబడాలి అటువంటి వ్యక్తులకి బుద్ధి చెప్పాలి" అనుకుంది.


ఢిల్లీ నుంచి వచ్చిన కవరు చింపి అందులో వున్న ఉత్తరాన్ని తీస్తూ ఫ్రం ఎడ్రసు చూసి గర్వంగా నవ్వుకుంటున్న మాధవ్ అందులోని విషయం చదివి నిర్విణ్ణుడయ్యాడు. అది వర్ధని వ్రాసిన ఉత్తరం "మాధవ్ గారికి" అని సంబోధిస్తూ వ్రాసి, అందులో ఆమె ప్రయాణానికి కొన్న టిక్కట్టు డబ్బు, చెక్కులోని వెయ్యి రూపాయలు ఢిల్లీలో అతనిపేర జమ చేసినట్లు వ్రాసి, బ్యాంకి వాళ్ళు డబ్బు జమ అయినట్లు ఇచ్చిన కౌంటర్ ఫాయిల్, వెనక జత చేసినట్లు వ్రాసి సంతకం పెట్టింది. ముక్తసరిగా వ్రాసిన ఆ ఉత్తరాన్ని పదే, పదే చదివాడు. వెనక బ్యాంకి ముద్దరతో డబ్బు జమ అయినట్లు కౌంటర్ ఫాయిల్ తప్ప మరే సంగతీ లేదు. ఆశ్చర్యంగా మళ్ళీ

కవులు

ప్రాచీన కవులు
ఆకాశాన వెలిగే
సూర్యుడు, చంద్రుడు
చుక్కల వంటివారు
సహజ స్వయం శక్తితో
ప్రయోజనం చేకూరుస్తున్నారు.
ఆధునిక కవులు
భూమి మీద వెలిగే
రక రకాల విద్యుత్
దీపాల వంటివారు
ఆన్ చేస్తే ప్రకాశిస్తారు
దారి వెంట నిలబడ్డ
మెర్కురీ దీపాల్లా
వెలుగు లిస్తుంటారు.

–కాణిపాకం లింగన్న.





చదివాడు. "ఇంత మొత్తాన్ని ఇంత త్వరగా ఎలా గడించింది!? అనుకుంటూ మళ్ళీ ఫ్రం ఎడ్రస్ చూసాడు. అమె ఇంటి ఎడ్రస్ అడుగున ఢిల్లీ అని వుంది. దాంతో మాధవ్ ఆశ్చర్యం రెట్టింపయింది. "ఢిల్లీలో నే వుందా? తండ్రి దగ్గరకి వెళ్ళలేదా? ఏం చేస్తోంది!?" అంటు ఆలోచించసాగాడు. "పౌరుషవంతురాలు, పొగరు కూడా" అనుకున్నాడు కసిగా.

దొరసాన్ల మోజులో పడ్డ మగవాళ్ళందరిలాగే మాధవ్ పడి వర్ధనిని దూరం చేసుకున్నాడు.

మోజు తీరిపోయిన ఫారిన్ భార్యల చేత గెంటించుకున్న భారతీయుల్లాగే మాధవ్ కూడా రిటా చేత వంచింపబడి గెంటించుకున్నాడు. అప్పుడు మళ్ళీ మనిషిగా మారాడు. తన తప్పిదాన్ని తెల్సుకున్నాడు. కన్ను తెరుచుకున్నాడు. వెంటనే ఇల్లంతా వెతికి వర్ధని డబ్బు జమ చేసినట్లు వ్రాసిన కవరు తీసాడు. దాని వెనక వ్రాసిన అమె ఎడ్రసు జాగ్రత్తగా నోట్ చేసుకున్నాడు. టిక్కట్టు కొనుక్కొని ఢిల్లీ కొచ్చాడు. సామాను హోటల్ రూంలో పడేసి తిన్నగా వర్ధని ఇంటికే వచ్చాడు.

గతాన్నంతా నెమరేసుకుంటూ నిలబడ్డ మాధవ్ మొండి ధైర్యాన్ని తెచ్చుకుని బెల్ నొక్కాడు.

"కౌన్?" అంటూ వచ్చి తలుపు తెరిచింది వర్ధని.

"నేను వర్ధనీ! మాధవ్‌ని" అన్నాడు కంపిత స్వరంతో.

ఆశ్చర్యంగా తననే చూస్తున్న వర్ధనిని చూసి రాని నవ్వు ముఖానికి పులుముకో జూచాడు.

నివ్వెరపోయి చూస్తున్న వర్ధని తేరుకుని అడ్డు తొలగి "రండి, రండి" అంది లోపలికి నడుస్తూ "ఎప్పుడొచ్చారు అమెరికా నుంచి?" అంటు గదిలో సోఫా చూపించి కూర్చోమంది.

అత నూహించినట్లు ఆమె కొట్ట లేదు, తిట్ట లేదు, దుమ్మెత్తి పొయ్యలేదు. ఎంతో మర్యాదగా ఆహ్వానించి. కూర్చొపెట్టి "మంచినీళ్ళు తెస్తా" నంటు లోపలి కెళ్ళింది.

పెద్ద హాలు. అధునికంగా, అందంగా, ఖరీదైన సామాన్లతో, అందమైన కర్టెన్లతో ఎంతో నీట్‌గా సర్ది వుంది. ఆ సామాన్లు మాధవ్ ఆశ్చర్యాన్ని మరింతెక్కువ చేసాయి "చదువు కున్నది కదా? ఎక్కడో మంచి ఉద్యోగమే చేస్తున్నట్లుంది. అందుకే అంత తొందర్లో అమె కొసం తను ఖర్చు చేసిన సొమ్ము ఇచ్చేసింది. పౌరషం ఓ పాలు ఎక్కువే" అనుకొన్నాడు

మంచినీళ్ళ గ్లాసుతో వచ్చిన వర్ధని అతని కిచ్చి ఎదురుగా కూర్చుంటు "మి ఆవిడా, బాబూ బాగున్నారా?" అంది.

దెబ్బతిన్న లేడిలా ముఖం దింపేసుకున్నాడు. "ఎంత మెత్తటి కత్తిపోటు' తనలా చెంపమీద కొట్ట లేదు. సూటిగా ఒక్క ప్రశ్నతో గుండెల్లో పొడిచింది. ఇంక ఇలాంటి పోట్లు సహించలేను. ఈ మాటల పోట్లు భరించేకంటే తిన్నగా కాళ్ళూ, చేతులూ పట్టుకుని బ్రతిమాలి క్షమార్పణ అడగటం మంచిది"అనుకుంటు– "వర్ధనీ! నన్ను క్షమించు వర్ధనీ! నీకు చాలా అన్యాయం చేసాను. నావల్ల నీకు చాలా అన్యాయం జరిగింది. పొగరెక్కి అనాడు చాలా నీచంగా ప్రవర్తించాను. ఈనాడు నా తప్పుల్ని తెలుసుకుని క్షమార్పణ అడగడానికి నీ దగ్గరకొచ్చాను నీకు నేను చేసిన అన్యాయానికి తగిన శిక్ష అనుభవించాను. రిటా నాకు తగిన సత్కారం చేసి బుద్ధి చెప్పింది. నా డబ్బంతా తినేసి నన్ను బికారిని చేసింది దానికి నా మీద మోజు తీరిపోయింది. దాంతో ఆది నా ఎదుటే పది మందితో తిరిగేది. నేను అభ్యంతర పెడితే ఇంట్లోంచి తరిమి కొట్టింది. దేముడు నాకు తగిన శిక్షే విధించాడు అక్కడ అప్పుచేసి స్వదేశానికి తిరిగి వచ్చాను. నువ్వు డబ్బు జమచేసి నాకు పంపిన కవరు మీద ఎడ్రస్ పట్టుకుని నిన్ను వెతుక్కుంటు వచ్చాను. నన్ను క్షమించమని అడగడానికైనా ధైర్యం చాలటం లేదు. కానీ తప్పకుండా క్షమిస్తావని నా మనస్సుచెపోంది. అందుకే సిగ్గు విడిచి వచ్చాను.


ఎన్నాళ్ళ కయినా నేనే దిక్కని, నా కాళ్ళ దగ్గరకే వస్తావని అనాడు నిన్ను తూలనాడాను. కానీ ఆ అవసరం నాకే వచ్చింది. నీ కాళ్ళ దగ్గరకి అర్థించడానికి వచ్చాను. నేనుఊహించినట్లే సానునయంగా పలకరించావు. ఆ కక్ష కడుపులో పెట్టుకోకుండా ఆదరించి మంచినీళ్ళిచ్చావు. దీని కొసమే పరితపిస్తున్నాను వర్ధనీ! నీ నోటితో క్షమించానని ఒక్కసారి అనవా?" అన్నాడు అమె పాదాల వద్ద కూర్చుంటు.

"ఛ–ఛ– అదేమిటి? లేవండి' అంత బాధపడతారేమిటి? కష్ట సుఖాలు మానవులకి కాక ఎవరికి ఎదురవుతాయి. ధైర్యంగా ఎదుర్కొని నిలదొక్కుకోవాలి" అంటూ అతన్ని లేవనెత్తి సోఫామీద కూర్చోపెట్టింది.

అలా లేవనెత్తుతున్నప్పుడు అమె పయటలోంచి మాంగల్యాలు బైటికి జారి మాధవ్ నుదుటికి కొట్టుకున్నాయి. ఆ మాంగల్యాలనే ఆశ్చర్యంగా చూస్తూ "ఇన్నేళ్ళు నాకు దూరంగా వున్నా నేను కట్టిన ఆ మాంగల్యాలని తీసెయ్యలేదా? నామీద అంత గౌరవముందా? ఎంత అవివేకిని, ఎంత దుర్మార్గుడిని" అనుకుంటూ ఆమెకేసి జాలిగా చూసాడు. "నిజంగా దేవతవు వర్ధని' నీ మనస్సంతలా నొప్పించి, అంత క్రూరంగా ప్రవర్తించినా నన్ను దూషించకుండా ఇంతలా గౌరవించి ఆదరిస్తున్నావు. నేనందు కర్హుడనికాను. నిన్ను నేను తిట్టినట్టే తిట్టి, కొట్టి, గెంటియ్యి. అప్పుడే నా మనస్సుకి శాంతి. ఇలా ఆదరిస్తుంటే నీ ఆదరణ నన్ను రంపపుకోతలా బాధిస్తోంది." అంటూ రుమాలు అడ్డుపెట్టుకుని రోదించ సాగాడు.

"కొంచెం టిఫిన్ తీసుకోండి" అంది వంట మనిషి తెచ్చిన ట్రేలోంచి ఉప్మా ప్లేటుని అందిస్తూ.

ప్లేటు నందుకుంటున్న మాధవ్ వర్ధనికేసి చూసాడు. ఎప్పటిలాగే నిర్మలంగా నవ్వుతూ అందిస్తోందా ప్లేటు. ఈ నవ్వు ఇలా నా జీవితంలో



జి. యస్. – రేణిగుంట

మా నాన్నగారి వయసు 42 సంవత్సరములు. ఉద్యోగరీత్యా నెలలో 20, 25 రోజులు ఎక్కువ నడవవలసి వస్తుంది. కొన్ని సంవత్సరాలుగా విపరీతమైన కాళ్లనొప్పితో బాధపడుతున్నారు. షుగర్ వుంటే కాళ్ళు నొప్పి వుంటుందని ఎవరో అన్నారు. యింతవరకు ఏవిధమైన పరీక్ష చేయించుకోలేదు.

★ ఇలా నెప్పులు రావటానికి రక్తనాళాలు ఉబ్బటం గాని, మధుమేహం, నరాల బలహీనత మొదలయినవి కారణాలవుతాయి. రక్తంలో గ్లూకోజ ప్రమాణం పరీక్షింప చేయండి. అలాగే మూత్ర పరీక్ష కూడా అవసరం అవుతుంది.

ఈ పరీక్షల ఫలితాలను బట్టి వైద్యులు చికిత్స చేస్తారు.

ఏ. ఆర్. జి. – ఒంగోలు

నాకు కుడి ముక్కు రంధ్రంలో కండ పెరిగి, రాత్రుళ్ళు గాలి పీల్చుకొనుటకు కష్టంగా వున్నది. ముక్కు దిబ్బడగా వుండి, ఎడమరంధ్రం ద్వారానే గాలి పీల్చవలసి వస్తున్నది. పగలు బాగానే శ్వాసిస్తున్నాను. ఇది తగ్గుటకు ఏమైనా మందులు వున్నాయా?

★ మీరు ఇ. ఎన్. టి. వైద్యులను సంప్రదించి చికిత్స పొందటం మంచిది. వారు ప్రత్యక్షంగా పరీక్షించి శస్త్రచికిత్స చెయ్య వలసింది లేనిది తీర్మానిస్తారు.

జి. వి. యన్. – తుని

బొల్లి వ్యాధి ఎందుకు వస్తుంది? ఈ వ్యాధికి మందులు లేవని ఒక డాక్టరు చెప్పగా విన్నాను. ఒక వేళ మందులు వుంటే ఏమందులు వాడాలో, ఎంతకాలం వాడాలో చెప్పండి.

★ బొల్లి వ్యాధి పుట్టుకతో జీన్స్‌లోని అవకతవకల వల్ల వస్తుంది. శరీరంలోని మెలనిన్ పిగ్‌మెంట్ ఉత్పత్తిలో ఏర్పడ గల అవరోధం వల్ల ఈ లక్షణం కనబడుతుంది. పుట్టుకతోనే ఈ లక్షణం ఉన్నా, మచ్చలు బహిర్గత మవటానికి చాలా కాలం పట్టవచ్చును. ఈ రోగానికి మందులు లేవనే చెప్పవలసి ఉంది. ఈ రోగం కొన్నాళ్ళ తర్వాత తనంతట తానే ఆగిపోవటం గాని, పాతచోట్ల మాని, క్రొత్త చోట్ల రావటంగాని జరుగవచ్చును.

పి. యల్. – పొన్నూరు

పిట్యూటరి గ్రంథుల వలన విపరీతంగా లావు అవుతారని ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధంలో చూచినాను. లావు తగ్గటానికి మందులు వున్నాయన్నారు. అవి తెలియ పరచవలసినది.

★ లావయిన వారందరూ పిట్యూటరి గ్రంధి పనితనం వల్లనే లావు అవటం జరగదు. మితిమీరి ఆహారం తినటం, శరీర వ్యాయామం లేక పోవటం వల్ల ఎక్కువగా శరీరం లావు అవుతూ ఉంటుంది. లావు తగ్గటానికి ఆహారం తగ్గించటం, క్రమ బద్ధంగా వ్యాయామం చెయ్యటమే మంచి మందులు. తినేటప్పుడు మారు వేయించుకోకపోవటమే తగిన మందు.

పి. ఆర్. సి. – విశాఖపట్నం

నాకు వ్యాయామం చెయ్యాలని వుంది. కానీ నాకు వరి బీజం వుంది. ఇది వుంటే వ్యాయామం చేయటం వలన ఏమైనా ప్రమాదమా?

★ వరి బీజం ఉండటానికి వ్యాయామానికి సంబంధం లేదు. అయినా చిన్న శస్త్ర చికిత్స చేసి ఆ లక్షణాన్ని సులభంగా తొలగింప చేసుకొని ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చును కదా! □

శాశ్వతంగా వుండిపోవాలి. ఇలా ఆప్యాయతతో కూడిన భోజనానికి ముఖం వాచిపోయాను. ఇకముందు జీవితాన్నంతా ఇలా హాయిగా, నిశ్చింతగా గడపాలి. తెల్లవాళ్ళ మోజులో పడి నల్లగా వున్న వర్ధనిని తూలనాడాను. ఎవరి మనసు గొప్పదో తెలుసుకోలేని అజ్ఞానిని" అనుకుంటు "వర్ధనీ!" అని పిల్చాడు.

"ఊఁ–" అంటూ అతని వైపు చూసింది ఉప్మా చెంచాని నోట్లోంచి తీస్తూ.

"మళ్ళీ నా జీవితాన్ని వికసింప జెయ్యగలవా? నా తప్పుల్ని మన్నించి, పాత విషయాలు ఓ పీడకలగా మర్చిపోయి నాతో వచ్చెయ్యి. ఇంక మనిద్దరం కలిసి హాయిగా జీవిద్దాం వర్ధనీ!" అని అంటుండగా గేటు తీసిన శబ్దమవడంతో వంగి చూసారు వర్ధని, మాధవ్‌లు.

వర్ధని నవ్వుతూ ఎదురెళ్ళి ఆహ్వానించింది. లోపలి కొచ్చిన వ్యక్తి మాధవ్‌ని చూసి "ఎవ"రన్నట్టు ప్రశ్నార్థకంగా వర్ధని వైపు చూసాడు.

"ఈయన పేరు మాధవ్‌గారండీ! మీకు చెప్పాను కదా? అమెరికాలో ...." అని అంటువుండగానే "ఓ, ఐసీ" అంటూ నవ్వుతు ముందుకెళ్ళి చెయ్యి


ఎదురుదెబ్బ

కలపుతూ "నా పేరు వినోద్ అంటారండి!" అంటూ పక్కనే కూర్చున్నాడు.

"అయ్యో నా తెలివి మండా– ఈయన్ని మీకు పరిచయమే చెయ్య లేదు– ఈయన మావారు. ఇంజనీరు. అమెరికా నుంచి వచ్చేసిన కొత్తలో నేను నడిపిన క్రెష్‌లో తల్లిని కోల్పోయిన ఈయన బాబుని వుంచేవారు. తరవాత కొన్నేళ్ళకి ఆ బాబుకే తల్లి నయ్యాను. భగవంతుడి దయవల్ల ఏపొరపొచ్చాయిలు లేకుండా మా జీవితం హాయిగా సాగిపోతోంది. అంటూ వినోద్ విప్పిన కోటు నందుకుని హెంగర్‌కి తగిలించడానికిలోపలి కెళ్ళిన వర్ధని వైపు వెర్రివాడిలా చూడసాగాడు మాధవ్. ఎవరో తన్ని అగాథంలోకి తోసేస్తున్నట్టుగా వుంది. శిలలా కూర్చుండి పోయాడు– తన పరిస్థితి తెలుసుకున్నాడు. చర్రున లేచి "వెళ్తున్నాను" అనయినా చెప్పకుండా బైటి కొచ్చేసాడు.

"వెర్రి వెధవని చేసి ఇంతసేపూ వాగించి, చావు కబురు చల్లగా చెప్పినట్టు చెప్తుందా?" అనుకున్నాడు. కోపం పట్టలేక పోతున్నాడు. ఆవేశం తన్ను కొస్తోంది. తన శరీరం మీద కిరసనాయిలు పోసి అంటించినట్టు మండుతోందతని మనస్సు. పళ్ళు కొరుక్కున్నాడు– కాని ఏం చెయ్యలేని నిస్సహాయుడు.

"నీకు బుద్ధొచ్చిందన్నావు ఏది? అందుకే నిన్ను స్వార్థపరుడి వన్నాను. నీకు తగిన శాస్తే జరిగింది. రీటాకన్నా వర్ధని కొట్టిన దెబ్బ గట్టిగా తగిలి బాధిస్తోంది కదూ? వర్ధనిని నువ్వు చెప్పు కాలితో కొట్టేవు. తిరిగి బంగారం చెప్పుతో జవాబిచ్చింది. బుద్ధొచ్చిన వాడివయితే అలా మళ్ళీ ఆవేశపడి ఆమె మీద మండిపడకు. మళ్ళీ మరోకసారి ఓడిపోయానని సిగ్గుపడు రోజులు మారేయని మర్చిపోయావు. భర్త ఎటువంటి వాడయినా నోరెత్తకుండా భార్యపడుండాలని ఇంకా నీ మనస్సులో వుండబట్టే యిలా ఉడుక్కుంటున్నావు. నీ అంచనా తప్పయింది. ఎదురు దెబ్బ తగిలింది. అంతా నీలాంటి మగవాళ్ళే వుంటే వర్ధని జీవితం ఎలా గుండేదో! దేశంలో ఎంత మంది వర్ధనను లుండేవారో!! వినోద్ వంటి మహోన్నతులు పుట్టబట్టే వర్ధని వంటివారి జీవితాలని వికసింప జేసి నీ వంటి అహంభావుల్ని అణిచి వేస్తున్నారు. ఇకనైనా పూర్తిగా మారు. స్వార్థంతో కాదు– నిస్వార్థంతో స్మీ!!– అంది మనసు. □



నాగార్జున సిమెంట్ తో ఈ జైలు కట్టుంటే దొంగ ఇలా పారిపోయేవాడు కాదండి
జైలు
SATYAMURTY-MAM.NC.

హైదరాబాదు నోట్‌బుక్




డాక్టర్ మహీధర నళినీ మోహన్:

విజ్ఞాన శాస్త్రవేత్తలకు సాహిత్యంపై అభిరుచి వుండదని ప్రతీతి. కాని, ప్రాచ్య పాశ్చాత్య శాస్త్రజ్ఞలను చూస్తే వారికున్నంత సాహిత్య పిపాస, అభినివేశం మరొకరికి లేదేమో అని అనిపిస్తుంది. పాత శాస్త్రజ్ఞలలో వరాహమిహిరుడు, వాగ్భటుడు, భాస్కరాచార్యులు చక్కని కవిత్వం కూడా చెప్పారు తమ గ్రంథాలలో ఆధునికులలో గూడ తెలుగువారిలో డాక్టర్ భగవంతం, విస్సా అప్పారావు, కాశీపట్నం కొండయ్య, వసంతరావు వెంకటరావు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గార్లు సాహిత్యంలోనూ ఉద్దండులే. ఆ కోవకు చెందినవారు యువమిత్రులు డాక్టర్ మహీధర నళినీమోహన్‌గారు. మహీధర వారిది పెద్ద పండిత వంశం. నళినీమోహన్ తండ్రి రామమోహన్‌గారు గొప్ప రచయిత, తండ్రి శక్తులు కుమారునికి అబ్బడం సహజం. ఇటీవల హైదరాబాదులో కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఆయన మాత్రా ఛందస్సులో అనువదించిన మేఘసందేశం వినిపించినప్పుడు పండితులు తలలూపారు. నళినీమోహన్ తూర్పు గోదావరి జిల్లా ముంగండలో 1933లో జన్మించారు. 1953లో రాజమండ్రిలో ఆర్ట్సు కాలేజిలో బి. ఎస్.సి. డిగ్రీ పుచ్చుకొని, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1955లో ఎం. ఎస్.సి. అయ్యారు. 1960–63లో మాస్కో విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రంలో పరిశోధన జరిపి, డాక్టరేట్ డిగ్రీ పుచ్చుకున్నారు. 1969–71లో స్వీడన్‌లో డిప్సిలా అయనో స్ఫెరిక్ అబ్జర్వేటరిలో రాకెట్ పేలోడ్ నిర్మాణంలో కృషి చేశారు. 1974–75లో బవేరియన్ అకాడమి ఆఫ్ సైన్సెస్‌కి అతిథిగా సోషియాలజీలోను, 1981–82లో ఇంగ్లాండులోని అబెరెస్ట్‌విత్‌లో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ వేల్స్‌లో అతిథిగాను రోదసీ పరిశోధన చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబరేటరిలో స్పేస్ ఫిజిక్స్ విభాగంలో రాకెట్, సెటిలైట్ ప్రయోగాలు చేస్తున్నారు. 1988లో ప్రయోగించబోయే రోహిణీ సెటిలైట్‌లోని మూడు ఎక్స్‌పెరిమెంటులలోను వీరు తయారుచేసిన "ఎనర్జెటిక్ పార్టికల్ స్పెక్ట్రో మీటర్" ఒకటి. ఇప్పటివరకు ఈయన 13 రాకెట్ ప్రయోగాలలో పాల్గొన్నారు.45 పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఈయన ఆచార్యత్వంలో కొందరు విద్యార్థులు డాక్టరేట్ అందుకున్నారు. 15వ ఏట నుంచే కవిత చెప్పగులుగుతున్న ఈయన ప్రజాసామాన్యం కోసం విజ్ఞానశాస్త్రం, పిల్లలకోసం కవితలు, విమర్శలు చేస్తూ వివిధరంగాలలో 45 పుస్తకాలు వ్రాశారు. ఈయన రచనలు 500 లకు పైగా వివిధ తెలుగు పత్రికలలో ప్రచురితమయాయి. ఈయన మరొక హాబీ హెూమియోపతి వైద్యం. ఈయన విజ్ఞానశాస్త్రం ప్రజాసామాన్యంలో ప్రచారం చేయడానికి వినోదం – విజ్ఞానం, ప్రపంచానికి ఆఖరు గడియలు, జీవోత్పత్తి, ఇతర లోకాలలో ప్రాణులు, మెదడుకు మేత, గణితంలో గారడీలు, సైన్సులో సరదాలు, చొప్పదంటు ప్రశ్నలు, మన మహర్షుల సర్వజ్ఞత్వం, వేమన్న బంగారం చేసిండా?, క్యాలెండర్ కథ, గ్రహణాల కథ, పిడుగు దేవర కథ, విద్యుత్తు కథ, రాకెట్టు కథ, ఆలోచించే యంత్రాలు, సుబ్బారాయుడి స్వప్నలోకం (సాపేక్ష సిద్ధాంతం మీద), కొలతలు, తూనికలు, సృష్టి ఎలా జరిగింది? సౌరశక్తికి సంకెళ్ళు, ఆకాశంలో ఆశ్చర్యార్థకం (తో.కచుక్క), జ్యోతిర్గోళాలు, (ఖగోళశాస్త్ర చరిత్ర), విచిత్ర సృష్టి, సజీవగణితం (అనువాదం), భారతదేశపు భౌతిక భూగోళం (అనువాదం) రచించారు. పిల్లలకోసం మౌల్వీ నసీరుద్దీన్ కథలు, వనసీమలలో (రష్యన్ నుంచి అనువాదం), పగ (అనువాదం), దీని భావమేమి?(పొడుపు కథల శతకం), కోతి తపస్సు, చదువుకొన్న కాకి, మూషిక సేనాపతి, ఉడుత ఉద్యోగం, మృగరాజు పెళ్ళి (గేయ కథలు), రుద్రాక్ష పిల్లి (గేయ నాటిక), హమేశా తమాషా, తరతరాల కథలు వ్రాశారు. వీటిలో భాష మూడు నాలుగు తరగతులవారికి కూడా సుబోధంగా ఉంటుంది. పెద్ద కావ్యాలలో భామినీ విలాసం (జగన్నాథ పండితుని వేయి శ్లోకాలకు అనువాదం), పండిత రాయల భావతరంగాలు (భామినీ విలాసంలోని అన్యాపదేశాలకు కథా కల్పనలు), మహీధరోక్తులు (వ్యంగ్య, హాస్య అధిక్షేపత్రి శతి), ప్రతి పద్య శిరః కంపం (అన్యాపదేశ కవిత), అక్షయ తూటీరం, సరాసరి స్వర్గం నుంచి, నవ్వుల పుట్ట, ప్రాచీన సాహిత్యంలో పకపకలు, లంబోదరా! వ్యంగ్య హాస్య అధిక్షేప శతకం), గీత మేఘసందేశం – ఇంకా ఎన్నో అముద్రితాలు ఉన్నాయి. నళినీమోహన్‌గారిది, ఏది వ్రాసినా చక్కని బాణీ, వక్తగాను ఆయనది మధురవాణి. నేటి యువకులలో ఆయన వంటి విజ్ఞానశాస్త్ర కవి అరుదు. ఆయన లేఖిని మరింత ముంగండ గండరగండ కావాలని, విజ్ఞాన శాస్త్రజ్ఞలకు కూడ మార్గదర్శకమైన గొప్ప పరిశోధనలు ఆయననుంచి జరిగి ఆంధ్రావళి అబ్బురపడాలని ఆశిస్తున్నారు. ముంగండ పండితులంతా దీర్ఘాయుష్మంతులు గనుక నళినీమోహన్ ఎలాగూ ఇంకా ఐదు పదుల యేళ్ళు వుంటారు.


ఉపశ్రుతి:–

భగవత్సాక్షాత్కారమయింది మీకు – అని అందరూ చెబుతుంటారే, ఆ ఆనందం మాకూ అందించండి! – అని ఒక స్వామిజీని కోరాను. బెల్లం తిన్న మూగవాడు దాని రుచి చెప్పలేనట్లు దానిని గురించి ఏమి చెప్పగలడు పాపం ఆయన! – అని పక్కన వున్న పెద్దమనిషి కబీరు దోహా ఉదాహరించాడు.


-తిరుమల రామచంద్ర



Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna, Phones: P. B. X.: 61247, 61248 & 75667.



'సిస్టమ్స్' లో మీరు దేన్నైనా ఎన్నిక
చేసుకోవచ్చు...
• నాన్-స్టాప్
• బెఫోర్-టైమ్
• డే-ఆఫ్టర్
• రోయల్ యాక్షన్
• క్రోవిన్-4850
®
SYSTEM
SUITINGS
MANSI/SY/3/85

శరీరములోని అన్ని నొప్పులకు
పూర్తి ప్రథమ చికిత్స



ఝండూ బామ్

తలనొప్పి, జలుబు, కండరాల నొప్పి, కీళ్ల నొప్పి, కండరాల బిగింపుక నుండి ఉపశమనం ఇస్తుంది. నొప్పి ఎలాంటిదైనా సరే మీరు విశ్వసించదగ్గది జండు బామ్.



ఝండూ బామ్ శరిరానికి మృదుత్వాన్నిడానికి, వేడి నీటి స్నానంలోను ఉపయోగించతగినది.

3 BROTHERS/ZB/10283 Tel.